
బుధవారం 3-4-2024



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 14+4 వెల: ₹ 5.50


సంపుటి: 17

సంచిక: 11

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL






'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 11

బుధవారం 3-4-2024



ఔత్సాహిక క్రికెటర్లకు పౌష్టికాహారం


దేశంలోనే తొలి అడుగు వేసిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ - 2లో



భారత నంబర్‌వన్‌గా అర్జున్

విశ్వనాథన్ ఆనంద్‌ను అధిగమించిన తెలంగాణ చెస్ గ్రాండ్ మాస్టర్ - 10లో


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అవినీతిపై ఉక్కుపాదమే

అవినీతిపరులు జైలుకు వెళ్లాల్సిందేనని.. మళ్లీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కఠిన చర్యలు తీసుకుంటామని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో పోలీసులు, మావోల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పది మంది మావోయిస్టులు మృతి చెందారు.

వివరాలు 6లో ▸



రామ్‌దేవ్‌పై సుప్రీం ఆగ్రహం

ఆధునిక వైద్యాన్ని తప్పబడుతూ చేసిన వాణిజ్య ప్రకటనల విషయంలో రామ్‌దేవ్ బాబాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

వివరాలు 6లో ▸



బీజేపీలో చేరకుంటే అరెస్టేనన్నారు

బీజేపీలో చేరకపోతే అరెస్టు కావడానికి సిద్ధంగా ఉండాలంటూ ఆ పార్టీ నేతలు బెదిరించారని ఢిల్లీ మంత్రి అతిశీ ఆరోపించారు.

వివరాలు 6లో ▸

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



పెన్షన్లు ఆపింది చంద్రబాబే

వలంటీర్ల వ్యవస్థపై మొదటి నుంచీ అక్కసే

మదనపల్లె సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్



"అరుంధతి సినిమాలో సమాధి నుంచి లేచి వచ్చే పశుపతి లాగా అధికారం కోసం ఐదేళ్ల తర్వాత 'పసుపు'పతి చంద్రబాబు వస్తున్నాడు. వదల బొమ్మాళి వదలా.. అంటూ పేదల రక్తం పీల్చేందుకు వస్తున్నాడు. కుర్చీ కోసం ఈ 'పసుపు'పతి నోటికి వచ్చిన అబద్ధాలు చెబుతాడు. పొరపాటున నమ్మారంటే సంక్షేమాభివృద్ధికి వ్యతిరేకంగా ఓటేసినట్టే. ఇప్పుడున్న సంక్షేమ పథకాల రద్దుకు అంగీకరించినట్టే. కుట్రలు, కుతంత్రాలతో జెండాలతో జత కట్టిన తోడేళ్లు ఒక్కటై వస్తున్నాయి. మోసపోకూడదని ఇంటింటా చెప్పాలి. - సీఎం జగన్"

- ఆయన మనిషి నిమ్మగడ్డతో ఫిర్యాదు చేయించారు
- ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇవ్వకుండా ఎన్నికల కమిషన్ ద్వారా ఆదేశాలిప్పించారు
- ముసలివాళ్లన్న కనికరమూ లేదు
- 99% మార్కులొచ్చే స్టూడెంట్‌కు పరీక్షలంటే భయం ఉండదు
- 10 శాతం మార్కులు సాధించిన టీడీపీకి భయం కాబట్టే అన్ని పార్టీలతో కలిసింది

7లో

- జెండాలు జత కట్టిన ఈ తోడేళ్ల మాటలు నమ్మొద్దు
- పొరపాటున నమ్మారంటే పసుపుపతికి సహకరించినట్టే
- చంద్రబాబుకు ఓటేస్తే మోసకారికి వేసినట్టే.. పేదల సంక్షేమ వ్యతిరేకికి ఓటేసినట్టే
- ఇప్పుడున్న సంక్షేమ పథకాల రద్దుకు అంగీకరించినట్లే...
- ఈ విషయాన్ని ప్రతి ఇంటికి వెళ్లి చెప్పండి

- 175 అసెంబ్లీ, 25 ఎంపీ సీట్లు.. మొత్తం 200 సీట్లు గెలవాలి
- 2014లో ఇదే పసుపుపతి ఇదే పార్టీలతో జత కట్టారు
- ఇప్పుడు చెబుతున్న సూపర్ 6, సూపర్ 7 తరహాలోనే హామీలు ఇచ్చారు
- అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టో కన్పించకుండా చేశారు
- ఇచ్చిన హామీలు అమలు చేశాం కాబట్టే ప్రజా తీర్పు కోరుతున్నాం

జన సంద్రం.. సర్వం జగనన్న మంత్రం

ఆరో రోజు 'మేమంతా సిద్ధం' సభకు బ్రహ్మరథం

మండుటెండను సైతం లెక్క చేయని ప్రజలు

అడుగడుగునా నీరా'జనాలు'

రోడ్లపై పూలు చల్లి హారతులిచ్చిన అక్కచెల్లెమ్మలు

జై జగన్ నినాదాలతో హోరెత్తిన రోడ్ షో

సీఎం జగన్‌ను కలిసేందుకు పోటీ పడ్డ జనం

8లో

ఫ్యాక్ట్‌చెక్

బూటకాల బాబుకు రామోజీ బాకా

మైనారిటీలకు ఎక్కువ మేలు చేసింది వైఎస్ జగనే

- వాస్తవాలను వక్రీకరించిన 'ఈనాడు'
- నవరత్నాల ద్వారా కలిగిన ప్రయోజనం కనిపించలేదా 'పచ్చ గురు'వింద!
- ఈ ఐదేళ్లలో రూ.24,304.37 కోట్ల మేర సంక్షేమం.. డీబీటీ పద్ధతిలో రూ.13,239.49 కోట్లు జమ
- నాన్ డీబీటీ విధానంలో రూ.11,064.88 కోట్లు లబ్ధి
- స్వయం ఉపాధికంటూ తన హయాంలో రూ.248.51కోట్లే ఖర్చుచేసిన బాబు

2లో



24 నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

- రాష్ట్రంలోని పాఠశాలలకు ఈ నెల 24వ తేదీ నుంచి వేసవి సెలవులను ప్రకటించారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు జారీచేసింది. జూన్ 12వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభమవుతాయని పేర్కొంది.

2లో



2 నెలలూ భగభగలే

- రాష్ట్రంలో గతేడాదికి మించి ఈ వేసవిలో అధిక ఎండలు, వడగాలులకు ఆస్కారం ఉందని వాతావరణ శాఖ అంచనాకు వచ్చింది. సాధారణంగా మే నెలలో ఎండలు మండుతాయి. కానీ.. ఈసారి మార్చి మూడో వారం నుంచే ఎండలు విజృంభిస్తున్నాయి.

12లో

మూడు జిల్లాల కలెక్టర్లు బదిలీ

ఐదు జిల్లాల ఎస్పీలతో పాటు గుంటూరు రేంజ్ ఐజీ కూడా..

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

2లో

కడప ఎంపీగా పోటీ చేస్తున్నా



- ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల వెల్లడి
- ఐదు లోక్‌సభ సహా 114 అసెంబ్లీ స్థానాలతో తొలి జాబితా విడుదల

12లో

'గురివింద' బండారం బట్టబయలు


లెక్కాపత్రం లేని డబ్బుతో అడ్డంగా దొరికిన 'మార్గదర్శి'

- మార్గదర్శి పేరుతో అక్రమంగా రూ.51,99,800 నగదు తరలింపు
- ద్వారకానగర్ వద్ద పోలీస్ తనిఖీల్లో పట్టుబడిన డబ్బు.. మరో రూ.36,88,675 విలువైన 51 చెక్కులూ లభ్యం
- స్కూటీపై ఇద్దరు వ్యక్తులు సూట్‌కేస్‌లో తీసుకెళుతుండగా పట్టివేత
- మార్గదర్శి డబ్బు అని, బ్యాంకులో జమ చేసేందుకు తీసుకెళుతున్నట్లు బుకాయింపు
- ఆధారాలు కోరితే పొంతన లేని సమాధానాలు
- టీడీపీ నేతలకు చేరవేసేందుకే నగదు తరలిస్తున్నారని అనుమానాలు

2లో



మార్గదర్శి పేరుతో తరలిస్తున్న నగదును విశాఖలోని ద్వారకానగర్‌లో స్వాధీనం చేసుకున్న పోలీసులు



చంద్రబాబు నిర్వాకం వల్ల పింఛన్ గురించి ఆందోళన చెందుతున్న విజయనగరం జిల్లా సోమన్నపేటకు చెందిన వృద్ధుడు ఎ.రామినాయుడు

సైంధవుడు చంద్రబాబే..

రెండు రోజులైనా పింఛన్ రాక పడిగాపులు

తల్లడిల్లిపోతున్న వృద్ధులు

9లో

పింఛన్‌దారుల్లో పెల్లుబుకుతున్న ఆక్రోశం

పాత రోజుల్ని గుర్తు చేసుకుంటూ ఆందోళన

బాబు తీరుపై దుమ్మెత్తిపోస్తున్న పింఛన్‌దారులు

అయినా తీరు మార్చుకోని పచ్చ పార్టీ నేతలు

వైఎస్సార్‌సీపీపై నెపాలు వేస్తూ ఎదురుదాడి

వృద్ధులకు అన్ని రంగాల ప్రజల నుంచి మద్దతు

పింఛన్ల పంపిణీ ఆపింది మేమే

రాజమహేంద్రవరం టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు కీలక వ్యాఖ్యలు

రాజమహేంద్రవరం సిటీ: అవ్వాతాతలకు, దివ్యాంగులకు వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకున్నది తామేనని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ టీడీపీ–జనసేన–బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు వెల్లడించారు. రాజమహేంద్రవరంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సమయంలో వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తే వారు వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలంటూ ప్రచారం చేస్తారని, అదే జరిగితే తాము అడ్డుకుంటామని..

మిగతా 9వ పేజీలో ▸



రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేత ఆదిరెడ్డి వాసు

పేదలపై పంతం..

ఐదేళ్లుగా ఇంటి వద్దే అందుతున్న సంక్షేమ పథకాలపై పెత్తందారుల అక్కసు

వలంటీర్ వ్యవస్థపై తొలి నుంచి విషం కక్కిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్



- గోనె సంచులు మోసే ఉద్యోగాలంటూ తూలనాడిన చంద్రబాబు
- ఇంట్లో మగాళ్లు లేనప్పుడు తలుపులు తడుతున్నారంటూ నీచమైన వ్యాఖ్యలు
- వలంటీర్లు సంఘ విద్రోహ శక్తులంటూ పవన్ విద్వేష ప్రసంగాలు
- తాము అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తామంటూ హూంకరింపులు
- ఎన్నికల వేళ కుట్రపూరితంగా వలంటీర్ల సేవలను అడ్డుకున్న వైనం
- లక్షలాది మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులపై తీవ్ర ప్రభావం
- ప్రజా వ్యతిరేకతతో ఎప్పటిలాగే బాబు యూటర్న్ డ్రామాలు
- ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయాలంటూ మొసలి కన్నీళ్లు

9లో

నేటి మధ్యాహ్నం నుంచి.. సచివాలయాల్లో పింఛన్లు



- ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు పంపిణీ
- 6వ తేదీ కల్లా పింఛన్ల పంపిణీ పూర్తి చేసేలా ఏర్పాట్లు
- దివ్యాంగులు, తీవ్ర అనారోగ్య బాధితులు, మంచానికే పరిమితమైన వారికి మాత్రం ఇంటి వద్దే..
- ఏప్రిల్, మే, జూన్ నెలల పింఛన్ల పంపిణీపై మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- ఈసీ సూచించిన అన్ని ప్రత్యామ్నాయ మార్గాలు, కలెక్టర్లతో చర్చించాకే నిర్ణయం

9లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

త్వరలో మా గృహ ప్రవేశం



రెక్కాడితేగాని డొక్కాడని మాకు గూడు కల్పించిన దేవుడు సీఎం జగన్. మాది పేద కుటుంబం. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల శ్రీనివాస కాలనీ తండాలో అద్దె ఇంట్లో ఉంటున్నాం. మేము కూలి పనులకు వెళ్తేనే పూట గడిచేది. కొన్నేళ్ల క్రితం నా భర్త స్వామినాయక్‌కు ప్రమాదం వల్ల రెండు కాళ్లు చచ్చుబడిపోవడంతో నడవలేని పరిస్థితి ఏర్పడి మంచానికే పరిమితమయ్యారు. ఈ స్థితిలో నా కూలి డబ్బులతోనే కుటుంబాన్ని నెట్టుకొచ్చా. ఒక రోజు పని ఉంటే రెండో రోజు దొరికేది కాదు. అటువంటప్పుడు ఒక పూట పస్తులతోనే పడుకునే వాళ్లం. గత ప్రభుత్వంలో నా భర్తకు దివ్యాంగ పింఛను కోసం దరఖాస్తు చేసినా మంజూరు చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే దివ్యాంగ పింఛను మంజూరు చేశారు. మా పెద్దబ్బాయి దత్త సాయి నాయక్ పిడుగురాళ్లలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం, రెండో అబ్బాయి పవన్‌నాయక్ మన్నెం పుల్లా రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 7వ తరగతి చదువుతున్నారు. అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.15 వేలు వస్తుండడంతో వారి చదువులకు ఎటువంటి ఇబ్బందులు లేవు. కూలి డబ్బుల్లో అధిక భాగం ఇంటి అద్దెకే సరిపోయేది. ఈ ప్రభుత్వం వచ్చాక నా పేరుతోనే ఆదర్శనగర్ జగనన్న కాలనీలో ఇంటి స్థలంతో పాలు ఇల్లు కూడా నిర్మించి మా సొంతింటి కల నెరవేర్చారు. త్వరలో గృహ ప్రవేశం చేయబోతున్నాం. నాకు ఆసరా, సున్నా వడ్డీ ద్వారా సాయం అందింది. మాలాంటి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం జగన్‌కు మేమంతా రుణపడి ఉంటాం.

– రామావత్ సరితాబాయి, పిడుగురాళ్ల
(షేక్ మస్తాన్‌వలి, విలేకరి, పిడుగురాళ్ల)

మా బతుకుల్లో ఎంతో మార్పు



మాది పేద కుటుంబం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మా బతుకులు మారాయి. మాది ఏలూరు జిల్లా మండవల్లి గ్రామం. నా వయసు 38 ఏళ్లు. నా కుమార్తె 9వ తరగతి చదువుతోంది. అమ్మ ఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు వస్తున్నాయి. దీంతో పాటు కావలసిన పుస్తకాలు, యూనిఫాం, స్కూలు బ్యాగు, షూస్ వంటివన్నీ ప్రభుత్వమే ఉచితంగా ఇస్తుండడంతో చదువు భారం పూర్తిగా తప్పింది. ఆసరా ద్వారా రూ.15 వేలు లబ్ధి చేకూరింది. నా భర్త కాలికి గాయం కావడంతో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యానికి రూ.80 వేలు ప్రభుత్వం అందించింది. మా అత్తకు ప్రతి నెలా ఒకటో తారీఖునే రూ.3 వేల వృద్ధాప్య పింఛన్ అందుతోంది. జగనన్న పాలన స్వర్ణయుగం. మాకు ఏ చీకూ చింతా లేదు. గత ప్రభుత్వం మాలాంటి వారికి ఎలాంటి సాయం అందించలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. మా కుటుంబాన్ని ఆదుకున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. మళ్లీ ఆయనే సీఎం అయితేనే మాలాంటి పేదలు హాయిగా బతుకుతారు.

– చిగురిపాటి ప్రశాంతి, మండవల్లి
(భోగాది వీరాంజనేయులు, విలేకరి, మండవల్లి)

పెద్దన్నలా ఆదుకున్నారు




మాది పేద కుటుంబం. పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుగొండ మా ఊరు. చాలా ఏళ్ల కిందటే నా భర్త మృతి చెందాడు. తల్లిదండ్రులు, సోదరులపై ఆధారపడి జీవిస్తున్నా. ఇద్దరు కుమార్తెలతో జీవిస్తున్న నన్ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దన్నలా ఆదుకున్నారు. మాకు ఇంటి స్థలం మంజూరైంది. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందించారు. మా సొంతింటి కల సాకారమైంది. వైఎస్సార్ ఆసరా కింద డ్వాక్రా రుణమాఫీ రూ.37,600 నా ఖాతాలో జమ చేశారు. నా కుమార్తెకు జగనన్న అమ్మఒడి ద్వారా ఏటా రూ.15 వేలు లబ్ధి చేకూరుతోంది. వితంతు పింఛను సొమ్ము రూ.3 వేల వంతున ప్రతి నెలా అందుతోంది. దీంతో కుటుంబ పోషణకు ఇబ్బంది లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– కొమ్మోజు అనంతలక్ష్మి, పెనుగొండ, పశ్చిమగోదావరి జిల్లా
(గుర్రాల శ్రీనివాసరావు, విలేకరి, పెనుగొండ)

బూటకాల బాబుకు రామోజీ బాకా

మైనారిటీలకు మేజర్ మేలు చేసింది జగనే



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మైనారిటీలకు మేజర్ మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని రామోజీ మరోసారి విషం చిమ్మారు. వైఎస్సార్‌సీపీకి ముస్లిం మైనారిటీలు అండగా ఉన్నారని గుర్తించిన దినకంత్రీ పత్రిక ఈనాడులో తప్పుడు కథనం వండివార్చారు. వాస్తవాలను వక్రీకరించి చంద్రబాబుకు బాకా ఊదారు. మైనారిటీలను మోసం చేసిన జగన్ అంటూ గగ్గోలు పెట్టారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో మైనారిటీలకు అందించిన సాయం, సీఎం వైఎస్ జగన్ సర్కార్ అందించిన ఆర్థిక లబ్ధి అధికారిక లెక్కలను గమనిస్తే నిజానికి మైనారిటీలకు ధోకా ఇచ్చింది ఎవరో ఇట్టే అర్థమవుతోంది. బాబు చేసిన అరకొర సాయాన్ని భూతద్దంలో చూపే యత్నం చేస్తున్న రామోజీ పచ్చకళ్లకు సీఎం వైఎస్ జగన్ నవరత్నాలతో మైనారిటీలకు కల్పించిన ఆర్థిక భరోసా కనిపించలేదు. వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో మైనారిటీలకు సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ పద్ధతిలో రూ.13,239.49 కోట్లు నేరుగా వారి ఖాతాలకే జమ చేశారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, జగనన్న తోడు వంటి కార్యక్రమాల ద్వారా (నాన్ డీబీటీ) మరో రూ.11,064.88 కోట్లు ప్రయోజనం చేకూర్చారు. ఐదేళ్లలో మొత్తం రూ.24,304.37 కోట్ల మేర మైనారిటీలకు లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోంది.

మైనారిటీలకు ధోకా ఇచ్చింది బాబే..

ముస్లిం మైనారిటీ ర్గాల సంక్షేమానికి 2014 మేనిఫెస్టోలో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏ ఒక్క వాగ్దానాన్నీ అమలు చేయలేదు. హజ్ యాత్రికుల సౌకర్యం కోసం విశాఖపట్నం, విజయవాడ, రేణిగుంటలో హజ్ హౌస్‌ల నిర్మాణం హామీ కార్యరూపం దాల్చలేదు. ముస్లిం జనాభా ప్రాతిపదికగా దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయిస్తానన్న హామీనీ బాబు అటకెక్కించారు. వక్ఫ్ ఆస్తుల రికార్డులను పక్కాగా తయారు చేసి వాటిని పరిరక్షిస్తామని చెప్పి మోసం చేశారు. నిరుద్యోగ ముస్లిం యువత స్వయం ఉపాధి కోసం రూ.5 లక్షలు, వ్యాపారం కోసం రూ.లక్ష వడ్డీలేని రుణాలు ఇస్తామని అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. వడ్డీలేని ఇస్లామిక్ బ్యాంకింగ్ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తామని ఇచ్చిన ప్రధాన హామీనీ అమలు చేయలేదు. అయినా అప్పుడు బాబు ఘన కార్యాలు రామోజీ పచ్చకళ్లకు కనిపించలేదు.

ఆరోపణ: ఇదీ వైకాపా ఘనకార్యం

వాస్తవం: స్వయం ఉపాధి రుణాల కోసం నిధులు కేటాయించి అమలు చేయలేదని ఈనాడు అడ్డగోలుగా రాసింది. వాస్తవానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాదిరిగా అరకొర సాయం చేసి చేతులు దులుపుకోకుండా వారికి స్వయం ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేలా, ఆర్థిక, సామాజిక, రాజకీయ చేయూతను అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు చేపట్టింది. నవరత్నాలతోపాటు అనేక కార్యక్రమాల ద్వారా వారి జీవనోపాధికి ఊతమిచ్చేలా చేయడంలో సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ వహించారు. వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేదోడు, జగనన్న తోడు, వైఎస్సార్ వాహన మిత్ర వంటి అనేక పథకాలతో మైనారిటీలకు పెద్ద మేలు చేశారు.

శాశ్వత జీవనోపాధి చూపేలా చేయూత, ఆసరా ద్వారా చేకూర్చిన లబ్ధి ఇలా..

పథకం	లబ్ధి(రూ.కోట్లలో)
వైఎస్సార్ చేయూత	1,613.25
వైఎస్సార్ ఆసరా	583.01

ప్రభుత్వం వచ్చాక మైనారిటీలకు శాశ్వత జీవనోపాధి చూపించేలా వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలను ప్రత్యేకంగా అందిస్తోంది. ఈ ఐదేళ్ల కాలంలో చేయూత ద్వారా 2,24,334 మంది మైనారిటీలకు రూ.1,613.25 కోట్లు అందించింది. ఆసరా పథకం ద్వారా 1,69,412 మందికి రూ.583.01 కోట్లు అందించి వారికి అండగా నిలిచింది.

ఆరోపణ: రాయితీ రుణాలకూ పాతర

వాస్తవం: 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 36.18 లక్షల మంది ముస్లింలు ఉన్నారు. వారిలో అత్యధిక శాతం మంది చిరు వ్యాపారులు, చేతివృత్తుల వారు ఉండటంతో వారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండదండలు అందిస్తోంది. గత ప్రభుత్వం మాదిరిగా అరకొర సాయం చేసి...

ఆరోపణ: ఇమామ్‌లు.. మౌజమ్‌లకు వెన్నుపోటే

వాస్తవం: రాష్ట్రంలో మసీదుల్లో పనిచేసే ఇమామ్‌లు, మౌజమ్‌లకు ఆర్థిక సాయం అందించే విషయంలో ఈనాడు చంద్రబాబు గొప్పలు ఘనంగా చెప్పే యత్నం చేసింది. వాస్తవానికి చంద్రబాబు ప్రభుత్వం అరకొరగా ఆర్థిక సాయం అందిస్తే దాన్ని పెంచి మరీ అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతోంది. గత ప్రభుత్వం మౌజమ్‌లకు రూ.3 వేలు, ఇమామ్‌లకు రూ.5 వేలు మాత్రమే అందించింది. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ మౌజమ్‌లకు రూ.5 వేలు, ఇమామ్‌లకు రూ.10 వేలు ఆర్థిక సాయం పెంచి జగన్ అందిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఇమామ్‌లు, మౌజన్‌లకు గౌరవ వేతనంగా రూ.300.68 కోట్లు అందించింది. దీనికి తోడు వారికి భరోసా ఇచ్చేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వన్‌టైమ్ ఫైనాన్షియల్ అసిస్టెన్సీ ఇచ్చింది. తెల్లకార్డుదారులకు స్పెషల్ కోవిడ్ అసిస్టెన్సీగా మైనార్టీలకు సుమారు రూ.100 కోట్లు అందించింది. షాదీతోఫా ద్వారానూ ఆర్థిక సాయాన్ని పెంచి అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కింది.

ఆరోపణ: తేదేపా హయాంలో రూ.248 కోట్ల రుణాలు

వాస్తవం: టీడీపీ ప్రభుత్వంలో గొప్పగా రుణాలు ఇచ్చినట్టు రామోజీరావు బాకాలు ఊదారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనారిటీల సామాజిక ఆర్థిక అభివృద్ధి, శిక్షణ, విద్యాభివృద్ధి కోసం బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చినట్టు గొప్పలు పోయారు. వాస్తవానికి 2014 నుంచి 2019 వరకు బ్యాంకుల ద్వారా ఇచ్చిన రుణాలకు టీడీపీ ప్రభుత్వం రూ.343.52 కోట్లు కేటాయించి రూ.248.51 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం శోచనీయం. ఐదేళ్లలో కేటాయించిన నిధులూ లబ్దిదారులకు ఖర్చు చేయలేని దారుణమైన పరిస్థితి గత ప్రభుత్వానిది. మరోవైపు మైనారిటీల శిక్షణ-ఉపాధి పథకంలో 2014 నుంచి 2019 వరకు కేవలం రూ.62 కేటాయించి అందులోనూ రూ.53.89 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం గమనార్హం. అదీ తొలి ఏడాది కేవలం రూ.4.30 కోట్లు కేటాయించి, ఎన్నికల ముందు మాత్రం గొప్పలు చెప్పుకొనేందుకు రూ.16.80 కోట్లు కేటాయించారు.

బాబుకు రామోజీ చేస్తున్న భజనను జనం నమ్మరు



చంద్రబాబు రాజకీయ ప్రయోజనం కోసం రామోజీ ఎంత బాజా వాయించినా జనం నమ్మే స్థితిలో లేరు. నవరత్నాల ద్వారా ఆర్థిక లబ్ధిని చేకూర్చే అనేక పథకాలను అందించడంతోపాటు మైనారిటీలకు శాశ్వత జీవనోపాధి కోసం సీఎం వైఎస్ జగన్ అనేక కార్యక్రమాలు చేపట్టారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ముస్లింలను సీఎం వైఎస్ జగన్ చేయి పట్టుకుని ముందుకు నడిపిస్తున్నారు. వైఎస్సార్ నాలుగు శాతం రిజర్వేషన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టడంతో ముస్లిం యువత వేలాది మంది బాగా చదువుకుని నేడు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా పలు రంగాలలో స్థిరపడి సామాజికంగా అభివృద్ధి చెందారు. అందుకే ఆ మహానేత వైఎస్సార్‌ని ముస్లిం సమాజం గుండెల్లో పెట్టుకుంది. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి కంటే పది అడుగులు ముందుకు వేసి ముస్లింలకు మేలు చేస్తున్నారు. 2019 ఎన్నికలలో ముస్లింలకు ఐదు సీట్లు ఇచ్చారు. నాలుగు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చి, శాసన మండలి డెప్యూటీ చైర్మన్‌గా అవకాశం కల్పించడమే కాకుండా నామినేటెడ్, స్థానిక సంస్థల పదవుల్లోనూ ప్రాధాన్యం ఇచ్చారు. ప్రస్తుత ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ సీట్లు ముస్లింలకు ఇచ్చి మరింత ఆదరణ చూపిన సీఎం వైఎస్ జగన్‌కు ముస్లిం సమాజం అండగా ఉంటుంది.

– డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్, చైర్మన్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్

24 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

జూన్ 12న పునఃప్రారంభం.. ఉత్తర్వులు జారీచేసిన కమిషనర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పాఠశాలలకు ఈ నెల 24వ తేదీ నుంచి వేసవి సెలవులను ప్రకటించారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఇటీవల పదో తరగతి పరీక్షలు ముగిశాయి. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు ఒంటిపూట బడులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కాగా, ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు వార్షిక పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం మరో రెండు రోజుల్లో మూల్యాంకనం పూర్తి చేసి ఏప్రిల్ 23న ఫలితాలను ప్రకటించడంతోపాటు విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తారు.

పాఠశాలల్లో 'వాటర్ బెల్'

వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా పాఠశాలల్లో విద్యార్థులు డీ హైడ్రేషన్, వడదెబ్బకు గురికాకుండా తగినంత నీరు తాగేలా పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 'వాటర్ బెల్' మోగించాలని కమిషనర్ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 8.45గంటలకు ఒకసారి, 10.05కి రెండోసారి, 11.50కి మూడోసారి ఈ బెల్ మోగించి పిల్లలకు తాగునీరు అందించాలని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మూడు జిల్లాల కలెక్టర్లు బదిలీ

- ఐదు జిల్లాల ఎస్పీలతో పాటు గుంటూరు రేంజ్ ఐజీ కూడా..
- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో పలువురు ఉన్నతాధికారులను కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ చేసింది. ముగ్గురు ఐఏఎస్ అధికారులను, ఆరుగురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన కేంద్ర ఎన్నికల సంఘం.. వీరి స్థానంలో కొత్త అధికారులను నియమించేందుకు ఒక్కో పోస్టుకు ముగ్గురి పేర్లు సూచిస్తూ వెంటనే జాబితా పంపించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి రాజాబాబు, అనంతపురం జిల్లా ఎన్నికల అధికారి గౌతమి, తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మీశాతో పాటు ప్రకాశం జిల్లా ఎస్పీ పరమేశ్వర్, పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి, చిత్తూరు జిల్లా ఎస్పీ పి.జాషువా, అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్, నెల్లూరు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్, గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజును కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ చేసింది. వీరికి ఎలాంటి ఎన్నికల విధులు అప్పగించవద్దని స్పష్టం చేసింది.

ఇళ్ల వద్దే పింఛన్ పంపిణీ చేయాలి

కేంద్ర ఎన్నికల సంఘానికి చంద్రబాబు లేఖ

సాక్షి, అమరావతి: సచివాలయ ఉద్యోగులు, ఇతర సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని టీడీపీ అధినేత చంద్రబాబు కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘానికి రాసిన లేఖను మీడియాకు విడుదల చేశారు. 'రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్ పంపిణీ జరగకూడదనే మీ ఆదేశాలను అడ్డం పెట్టుకొని సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డి కుట్ర చేస్తున్నారు. సెర్ప్ సీఈవో ఆదేశాలు ఇవ్వడం వెనుక కుట్ర దాగి ఉంది. ఇంటి వద్దే పింఛను అందించే ఏర్పాటు చేయాలి' అని కోరారు.

'గురివింద' బండారం బట్టబయలు

లెక్కాపత్రం లేని నగదుతో అడ్డంగా దొరికిన 'మార్గదర్శి'

విశాఖ సిటీ/సాక్షి, అమరావతి: రాజ గురివింద రామోజీ బరితెగించారు. ఎన్నికల వేళ పచ్చ పార్టీకి భారీ మొత్తంలో డబ్బు అక్రమ తరలింపునకు తెగబడ్డారు. రాజకీయంగా చంద్రబాబుకు కొమ్ముకాసే రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ లెక్కా పత్రం లేకుండా విశాఖ నగరంలో భారీగా నగదును తరలిస్తూ అడ్డంగా దొరికిపోయింది. రూ.51,99,800 నగదుతో పాటు రూ.36,88,675 విలువైన 51 చెక్కులను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీంతో రామోజీ ఆర్థిక అక్రమాల బండారం మరోసారి బట్టబయలైంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విశాఖ పోలీసు బృందాలు, కేంద్ర బలగాలు జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం విశాఖ నగరం ద్వారకానగర్ ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఏపీ31సీజీ 7825 నంబరు స్కూటీపై ఇద్దరు వ్యక్తులు సూట్‌కేస్‌తో వెళుతుండగా పోలీసులు వారిని ఆపారు. వారి వద్ద ఉన్న సూట్‌కేసును తనిఖీ చేయగా అందులో రూ.500 నోట్ల కట్టలు, చెక్కులు కనిపించాయి. వాటిని లెక్కించగా రూ.51,99,800 నగదు ఉన్నట్లు తేలింది. రూ.36,88,675 విలువైన 51 చెక్కులను గుర్తించారు. ఆ డబ్బు ఎవరిదని, ఎక్కడకు తీసుకువెళుతున్నారని పోలీసులు ప్రశ్నించారు. ఇందుకు వారు పొంతన లేని సమాధానాలు చెప్పారు. ఆ డబ్బు మార్గదర్శి చిట్స్‌కు సంబంధించినదని, ఎవరికీ ఇవ్వడానికి కాదని, బ్యాంకులో డిపాజిట్ చేయడానికి తీసుకెళుతున్నట్లు బుకాయించే ప్రయత్నం చేశారు. పోలీసులు ఆధారాలు చూపించాలని అడిగినప్పటికీ వారు చూపించలేదు. దీంతో పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారించారు. అందులో ఒకరు లక్ష్మణరావు మార్గదర్శి చిట్స్‌లో అకౌంట్స్ అసిస్టెంట్‌గా, మరొకరు శ్రీనివాస్ ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నట్లు చెప్పారు. వారు ఆ డబ్బుకు ఎటువంటి ఆధారాలు చూపించకపోవడంతో పోలీసులు నగదు, చెక్కులను ఎన్నికల అధికారులకు అందజేశారు. వారు ఆదాయ పన్ను శాఖ అధికారులకు అందజేశారు.

పక్కా మనీ లాండరింగే..

విశాఖలో అక్రమంగా తరలిస్తున్న డబ్బు పట్టుబడటంతో రామోజీరావు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులో భారీగా నల్లధనం దందా మరోసారి ఆధారాలతోసహా వెలుగులోకి వచ్చింది. ఈ డబ్బు ఎక్కడిదని మార్గదర్శి సిబ్బందిని పోలీసులు ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పి తప్పించుకునేందుకు యత్నించారు. చివరగా గత మూడు రోజుల్లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయంలో చందాదారుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. కానీ ఆ నగదు, చెక్కులకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలీసులు వాటిని జప్తు చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ మనీ లాండరింగ్‌కు పాల్పడుతోందని గతంలో స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ సోదాల్లో వెల్లడైన విషయం వాస్తవమేనని ఈ ఘటన మరోసారి రుజువుచేసింది. చిట్‌ఫండ్స్ చట్టం ప్రకారం ఒక బ్రాంచిలో వసూలు చేసే మొత్తాన్ని అదే బ్రాంచి పరిధిలో బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. ఇతర బ్యాంకుల్లోని ఖాతాల్లోకి మళ్లించకూడదు. రామోజీరావు ఈ నిబంధనలను ఏనాడూ పట్టించుకోలేదు. మార్గదర్శి చందాదారుల సొమ్మును హైదరాబాద్‌లోని తమ ప్రధాన కార్యాలయం ఖాతాకు మళ్లిస్తూ వచ్చారు. అదే రీతిలో చందాదారుల సొమ్మును సోమవారం విశాఖలో ఇతరత్రా అవసరాలకు మళ్లిస్తూ పోలీసులకు చిక్కినట్లు స్పష్టమైంది.

గత ఎన్నికల్లోనూ ఇదే విధంగా తరలింపు!

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పెద్ద మొత్తంలో నగదు తరలిస్తే అందుకు ఆధారాలు ఉండాలి. ఈ విషయం పత్రికాధిపతి రామోజీకి చెందిన సంస్థకు తెలియనిది కాదు. అయినా మార్గదర్శి ద్వారా లక్షలాది రూపాయలు ఎటువంటి ఆధారాలు లేకుండా తరలించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. తెలుగుదేశం పార్టీ నేతలకు డబ్బు చేరవేసేందుకే ఈ నగదును తీసుకువెళుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో పోలీసులు పకడ్బందీగా తనిఖీలు చేస్తుండటంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులో టీడీపీ అభ్యర్థులకు డబ్బు చేరవేస్తున్నట్లు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో కూడా విశాఖలో ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచిల నుంచి భారీ స్థాయిలో నగదు పంపిణీ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే భీమిలిలో ఉన్న ప్రైవేటు పరిశ్రమ నుంచి టీడీపీ నేతలకు రూ.కోట్లు ముట్టినట్లు వార్తలు వినిపించాయి. వాస్తవానికి మార్గదర్శి, ఆ పరిశ్రమ సిబ్బంది చేతుల మీదుగానే రూ.కోట్ల డబ్బు పంపిణీ జరిగిందన్నది బహిరంగ రహస్యమే. ఈ ఎన్నికల్లోనూ అదే పంథాలో డబ్బు పంపిణీకి పూనుకున్నట్లు ఈ వ్యవహారంతో తేటతెల్లమైంది.

డిజిటల్ చెల్లింపులేవి రామోజీ!

2022 డిసెంబర్ నుంచి మార్గదర్శి చిట్‌ఫండ్స్ కొత్త చిట్టీలు వేయడంలేదు. పాత చిట్టీలే కొనసాగుతున్నాయి. కాలపరిమితి ముగియడంతో చిట్టీలు మూసివేస్తున్నారు. దాంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచిల్లో చిట్టీ గ్రూపుల సంఖ్య సగానికంటే తగ్గిపోయింది. అయినప్పటికీ విశాఖపట్నం బ్రాంచిలో ఖాతాదారుల నుంచి 3 రోజుల్లోనే రూ.51 లక్షలు నగదు రూపంలో వసూలు చేసినట్లు చెబుతున్నారు. ఆ ప్రకారం నెలకు రూ.5.10 కోట్లు వసూలు చేస్తున్నట్టు. ఇక రాష్ట్రంలోని 37 బ్రాంచిల ద్వారా నెలకు సగటున రూ.188.70 కోట్లు వసూలు చేస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదంతా నగదు రూపంలోనే వసూలు చేస్తున్నట్లు కూడా స్పష్టమవుతోంది. ప్రస్తుతం కిళ్లీ దుకాణాలు, బజ్జీ దుకాణాల్లో కూడా డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు కాబట్టి నగదు లావాదేవీలు జరపకూడదని రామోజీ ఈనాడులో పదేపదే వార్తలు రాయిస్తున్నారు. కానీ ఆయన మాత్రం మార్గదర్శి చిట్‌ఫండ్స్ ద్వారా భారీగా నగదు లావాదేవీలే నిర్వహిస్తుండటం గమనార్హం. చందాదారుల నుంచి డిజిటల్/ఆన్‌లైన్ చెల్లింపులు ఎందుకు స్వీకరించడం లేదు? నగదు రూపంలోనే ఎందుకు తీసుకుంటున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. మార్గదర్శి పేరుతో ఎన్నికల్లో టీడీపీకి డబ్బు తరలింపు, భారీగా నల్లధనం చలామణిలోకి తేవడమే లక్ష్యంగా ఈ దందా సాగుతున్నట్లు స్పష్టమవుతోంది.

ఔత్సాహిక క్రికెటర్లకు పోషకాల డైట్



పోషకాహారం కోసం కోటిన్నర చెక్కును క్రీడాకారులకు అందిస్తున్న సౌరబ్ గంగూలీ, రికీ పాంటింగ్

- దేశంలోనే తొలి అడుగు వేసిన ఏసీఏ
- కార్యక్రమాన్ని ప్రారంభించిన క్రికెట్ దిగ్గజాలు గంగూలీ, పాంటింగ్

విశాఖ స్పోర్ట్స్: క్రీడల్లో రాణించేందుకు మంచి ఆరోగ్యకరమైన ఆహారం ఆటగాళ్ల పెరుగుదలతో పాటు మెరుగైన ఆట తీరు ప్రదర్శించడానికి తోడ్పడుతుంది. క్రీడాకారులుగా ఎదిగే క్రమంలో సరైన ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వులు, విటమిన్లు, మినరల్స్‌తో పాటు ఎలక్ట్రోలైట్స్‌తో కూడిన సమతుల ఆహారం అవసరం. అలాంటి పోషకాలతో కూడిన డైట్‌ను ఔత్సాహిక క్రికెటర్లకు అందించేందుకు ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) దేశంలోనే తొలి అడుగు వేసింది. రాష్ట్రంలో జోనల్ స్థాయిలో రాణిస్తున్న 400 మంది చిన్నారులకు రూ.కోటిన్నర వ్యయంతో ప్రతీనెల ఒక్కో ఆటగాడికి రూ.మూడు వేలతో పోషకాహారం అందించే కార్యక్రమం మంగళవారం ఢిల్లీ క్యాపిటల్స్ డైరెక్టర్ సౌరబ్ గంగూలీ, మూడుసార్లు వరల్డ్ క్రికెట్ కప్ అందుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ చీఫ్‌కోచ్ రికీ పాంటింగ్ చేతుల మీదుగా మంగళవారం విశాఖ వైఎస్సార్ స్టేడియంలో ప్రారంభమైంది. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రతిభను ప్రోత్సహించేందుకు జోన్‌కు ప్రాతినిధ్యం వహించిన ప్రతి ఆటగానికి అండర్-14, 15, 16లతో పాటు అండర్-19 బాలబాలికలకు ఇది అందిస్తారు.

జోనల్‌స్థాయి ఆటగాళ్లు అందిపుచ్చుకోవాలి

ఏసీఏ సైతం ఎందరో జూనియర్ స్థాయి ఆటగాళ్లతో పాటు సీనియర్ ఆటగాళ్ల ఎదుగుదలకు దోహదపడింది. ఆటలో చిరుప్రాయం నుంచే సరైన డైట్ తీసుకోవడం ఎంతైనా అవసరం. ఈ కార్యక్రమాన్ని జోనల్ స్థాయి ఆటగాళ్లు అందిపుచ్చుకోవాలి. ఈ పథకం ఎందరో ఔత్సాహికులకు ఉపయోగపడుతుంది. – సౌరబ్ గంగూలీ, జాతీయ జట్టు మాజీ కెప్టెన్

ఔత్సాహికులకు ఇదో చక్కటి అవకాశం

యంగ్‌స్టర్స్‌కు డైట్ అందించే ఇలాంటి ప్రోత్సాహక పథకం వారు మరింత ధృఢంగా తయారయ్యేందుకు దోహదపడుతుంది. బెస్ట్ క్రికెటర్లుగా ఎదిగేందుకు ఇలాంటి సంపూర్ణ డైట్ అవసరం. దీనిని అందిపుచ్చుకుని కలర్ జెర్సీ ధరించే స్థాయికి ఎదగాలి. – రికీ పాంటింగ్, డీసీ హెడ్ కోచ్

ఆటగాళ్ళు మెరుగ్గా రాణిస్తారు..

ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అకాడమీలు, సబ్ సెంటర్లు, జిల్లాల్లో ప్రొఫెషనల్ శిక్షణతో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటైన మౌలిక వసతులు మంచి ఫలితాలిచ్చాయి. చాలామంది ఆటగాళ్లకు మంచి పోషకాహారం అవసరమని ఏసీఏ గ్రహించింది. ఏసీఏ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి ప్రోత్సాహంతో ప్రారంభమైన ఈ పథకం ఆటగాళ్ల తదుపరి స్థాయికి వెళ్లేందుకు చక్కటి వేదిక కాగలదు. – ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి



...ఎందుకో మీ ముందు నడవడానికి అందరూ భయపడుతున్నార్సార్!

క్లుప్తంగా...

అభిమానం.. 'నవరత్న' భరితం



నవరత్నాలు లోగో ముద్రించిన చీరలు ధరించి ప్రచారంలో పాల్గొన్న మహిళలు

నంద్యాల టౌన్: ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ప్రజలు తమ అభిమాన నాయకులపై వినూత్న రీతిలో అభిమానం చాటుకుంటున్నారు. నంద్యాల పట్టణంలోని 17వ వార్డు విశ్వనగర్‌లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందనగర్‌కు చెందిన మహిళలు సీఎం వైఎస్ జగన్‌పై తమకున్న అభిమానాన్ని 'నవరత్నాల'తో ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన నవరత్నాలు మేనిఫెస్టో లోగో ముద్రించిన చీరలను ధరించి మేము సైతం జగన్ ప్రభుత్వం కోసం అంటూ ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో వీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

'మండలి' ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన



విగ్రహానికి పూలమాల వేసిన తరువాత ముసుగు వేసి వెనుతిరుగుతున్న బుద్ధప్రసాద్

అవనిగడ్డ: మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారు. సోమవారం జనసేన పార్టీలో చేరిన ఆయన రాత్రికి కృష్ణా జిల్లా అవనిగడ్డలోని వంతెన సెంటర్‌లో ఉన్న దివంగత మంత్రి, ఆయన తండ్రి మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విగ్రహానికి ఎన్నికల అధికారులు వేసిన ముసుగును తొలగించి నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు.

పొత్తుతో బీజేపీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయి

బీజేపీ సీనియర్ నేత అంబికా కృష్ణ



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలతో పొత్తు పెట్టుకోవడం బీజేపీ కార్యకర్తల మనోభావాలను దారుణంగా దెబ్బతీసిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు అంబికా కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో బీజేపీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగా పోటీ చేయాలని రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తలు కోరుకున్నారని తెలిపారు. ఒంటరిగా పోటీ చేయాలని అన్ని నియోజకవర్గాల నుంచి లక్షలాదిమంది కార్యకర్తలు సంతకాలు చేసి అధిష్టానానికి పంపినా వారి మనోభావాలను నాయకత్వం పట్టించుకోకపోవడం బాధించిందన్నారు. ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో గారపాటి సీతారామాంజనేయ చౌదరి గత కొన్నేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేశారని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో ఆయన పాత్ర విశేషమైనదని తెలిపారు. పొత్తు కారణంగా ఆయనకు సీటు దక్కలేదన్నారు. బీజేపీ అధిష్టానానికి, పార్టీ కేడర్‌కు మధ్య ఏదో స్వార్థపర అదృశ్య శక్తి పనిచేస్తుందని అంబికా కృష్ణ చెప్పారు.

వివేకా హత్య కేసులో తదుపరి చర్యలన్నీ నిలుపుదల

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి, సీబీఐ అధికారి రాంసింగ్‌లపై వివేకా పీఏ కృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నమోదు చేసిన కేసులో పులివెందుల కోర్టు జరుపుతున్న విచారణకు సంబంధించిన తదుపరి చర్యలన్నింటినీ తాత్కాలికంగా నిలిపేస్తూ హైకోర్టు మంగళవారం ఉత్తర్వులిచ్చింది. 4 వారాల పాటు తదుపరి చర్యలను నిలిపేస్తున్నట్లు హైకోర్టు తెలిపింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మధ్యంతర ఉత్తర్వులిచ్చారు.

చెప్పినట్లు వినకుంటే అంతు చూస్తామని బెదిరించారు..

వివేకా హత్య విషయంలో తాము చెప్పినట్లు వినకుంటే అంతు చూస్తామంటూ బెదిరించడమే కాకుండా తనను శారీరకంగా, మానసికంగా వేధించారంటూ వివేకా పీఏ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టులో ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఆ ఆదేశాల మేరకు పులివెందుల పోలీసులు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నర్రెడ్డి సునీత, సీబీఐ అధికారి రాంసింగ్‌లపై కేసు నమోదు చేసి పులివెందుల కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ నర్రెడ్డి సునీత, రాజశేఖరరెడ్డి, సీబీఐ అధికారి రాంసింగ్‌లు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

కూటమి.. నిప్పుల కొలిమి

టీడీపీ, బీజేపీ, జనసేనల్లో పొత్తు రగడ / టికెట్ల కేటాయింపుపై నిరసన సెగలు

- తిరువూరులో కొలికపూడి శ్రీనివాసరావుపై నేతల కన్నెర్ర
- అభ్యర్థి మార్పు యోచనలో టీడీపీ అధిష్టానం!
- అవనిగడ్డ గ్లాస్ పార్టీలో ఆగ్రహజ్వాల
- మండలికి వ్యతిరేకంగా ప్రదర్శన
- విశాఖ ఎంపీ సీటు జీవీఎల్‌కు ఇవ్వాలని బీజేపీ శ్రేణుల నిరసన
- తలలు పట్టుకుంటున్న అధిష్టాన వర్గాలు

అహర్నిశం ప్రజాహితం కోరే ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'పొత్తు'గట్టిన దుష్టగ్రహ కూటమి నిప్పుల కొలిమై రగులుతోంది. మండుతున్న ఎండలకు దీటుగా అసమ్మతి జ్వాలతో ఎగసిపడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తల ప్రకోపానికి గడగడలాడుతోంది. ఫలితంగా ఏం చేయాలో పాలుపోక టీడీపీ, బీజేపీ, జనసేన త్రయం తలలు పట్టుకుంటోంది.



విశాఖ బీజేపీ కార్యాలయం ఆవరణంలో నినాదాలు చేస్తున్న బీజేపీ శ్రేణులు



అవనిగడ్డలో నిరసన ర్యాలీ చేస్తున్న జనసేన నేతలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ/అవనిగడ్డ/ఎంవీపీ కాలనీ (విశాఖజిల్లా): తిరువూరు టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావుకు సొంత పార్టీలోనే నిరసన ఎదురవుతోంది. ఆది నుంచి ఆయన వివాదాస్పద తీరు పార్టీ కార్యకర్తలకు, ఆయనకు మధ్య అంతరం పెంచుతోంది. ఆయన ఏకపక్ష ధోరణి ఇప్పుడు సీటుకే ఎసరు తెచ్చేలా ఉంది. అసలు ఈ నియోజకవర్గంతో ఏమాత్రం సంబంధం లేని కొలికపూడి అమరావతి జేఏసీ కన్వీనర్ ముసుగులో పచ్చ పార్టీకి అనుకూలంగా పని చేయడంతో పారాచ్యూట్ నేతగా ఊడిపడ్డారు. స్థానిక ముఖ్యనేతలకూ సమాచారం ఇవ్వకుండానే ఆయనను అధిష్టానం అభ్యర్థిగా ప్రకటించడం స్థానిక నేతలకు మింగుడు పడడం లేదు. టీడీపీ అధినేత సొంత సామాజికవర్గ నేతలే కొలికపూడి తీరుపై చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. మరో అభ్యర్థిని పరిశీలించాలని విన్నవించారు. లేకుంటే ఓటమి తప్పదని కరాఖండిగా చెప్పారు. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన నేతలూ మాజీ మంత్రి జవహర్‌కు టికెట్ ఇవ్వాలని విన్నవించారు. దీంతో అభ్యర్థిత్వం మార్పుపై అధిష్టానం యోచిస్తున్నట్లు సమాచారం. ప్రజల నుంచీ కొలికపూడికి నిరసన వ్యక్తమవుతోంది. ఇటీవల గంపలగూడెం మండలం మంచిరాలపాడులో ప్రచారానికి వెళ్లిన ఆయన సైకిల్ రావాలి..సైతాన్ పోవాలి అని అనడంతో మహిళలు గట్టిగా ప్రతిస్పందించారు. ఫ్యాన్ గుర్తుకే మా ఓటు అంటూ చేతులూపుతూ కౌంటర్ ఇచ్చారు.

అవనిగడ్డ నియోజకవర్గంలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పార్టీలో చేరడాన్ని జనసేన నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయనకు సీటిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని అధిష్టానాన్ని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. జనసేన నేత విక్కుర్తి శ్రీను ఇంటి నుంచి బయలుదేరిన ర్యాలీ మండలి కార్యాలయం ముందు నుంచి జనసేన పార్టీ కార్యాలయం వరకూ సాగింది. అనంతరం జరిగిన ప్రత్యేక సమావేశంలో జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు మాట్లాడుతూ పార్టీ కోసం తొలి నుంచీ కష్టపడి పనిచేసిన వారికి టికెట్ ఇవ్వాలని కోరారు. డబ్బులే పరమావధిగా సాగుతున్న ఎన్నికల్లో తాను పోటీ చేయలేనని చెప్పిన బుద్ధప్రసాద్ వారంలోనే రూ.50 కోట్లు ఎక్కడి నుంచి తెచ్చారని విక్కుర్తి శ్రీను ప్రశ్నించారు. మండలి స్వగ్రామమైన భావదేవరపల్లికి చెందిన జనసేన నాయకుడు భోగాది భానుప్రకాష్ మాట్లాడుతూ ఆయనకు సీటిస్తే 150 కుటుంబాలు వైఎస్సార్ సీపీలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించారు. బచ్చు వెంకటనాథ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో విక్కుర్తి శ్రీనుకు టికెటిస్తే గెలిపించుకుంటామని నాయకులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కండువాలు మార్చే బుద్ధి తనకు లేదంటూ మండలి గతంలో చేసిన వ్యాఖ్యల వీడియోను జనసేన నేతలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు. సీటు కోసం రాత్రికి రాత్రే ఆయన పార్టీ మారడంపై నెటిజన్లు మండిపడుతున్నారు.

విశాఖపట్నం ఎంపీ సీటును టీడీపీకి కేటాయించడాన్ని బీజేపీ నేతలు తప్పుబడుతున్నారు. ఈమేరకు మంగళవారం విశాఖ లాసన్స్ బే కాలనీలోని ఆ పార్టీ నగర కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. విశాఖలో తొలి నుంచి బీజేపీకి పట్టుందని, సీటును టీడీపీకి కేటాయించడం తగదని పేర్కొన్నారు. అనంతరం విలేకరులతో బీజేపీ గాజువాక సమన్వయకర్త కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు విశాఖ అభివృద్ధికి కృషి చేశారని, ఆయనకు ఎంపీ సీటు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రకు అందించారు. ఈ పత్రాన్ని జాతీయ అధ్యక్షుడు నడ్డాకు పంపిస్తున్నట్లు వివరించారు. వీలులేకుంటే బీజేపీ విడిగా స్నేహపూర్వక వాతావరణంలో పోటీ చేసేలా అధిష్టానం నిర్ణయం తీసుకోవాలని కోరారు. పలువురు నేతలు మాట్లాడుతూ పురందేశ్వరి బీజేపీని టీడీపీకి అమ్మేశారని దుయ్యబట్టారు.

యనమల కోటలో నిట్టనిలువునా చీలిపోయిన టీడీపీ



యనమల రామకృష్ణుడు



కృష్ణుడు



దివ్య

సాక్షి ప్రతినిధి, కాకినాడ: యనమల రామకృష్ణుడు, కృష్ణుడు ఇద్దరూ అన్నదమ్ముల బిడ్డలు. అయినా ఒక తల్లి కన్న బిడ్డల కంటే ఎక్కువగానే కలసిమెలిసి ఉన్నారు. ఏకంగా 40 ఏళ్ల పాటు కలసి నడిచారు. రాష్ట్రమంతా వారిద్దరూ సొంత అన్నదమ్ములనే అనుకునేంతగా పేరుపొందారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లూ చంద్రబాబు తరువాత పెద్దన్న పాత్ర పోషించిన రామకృష్ణుడు రాష్ట్రంలో.. తునిలో కృష్ణుడు చక్రం తిప్పారు. అటువంటి వారిద్దరి మధ్య ఇన్నేళ్ల తరువాత తొలిసారి తలెత్తిన ఆధిపత్య పోరు వల్ల తునిలో టీడీపీ తునాతునకలైంది. తునిలో ప్రజాగ్రహాన్ని తట్టుకోలేక రామకృష్ణుడు స్వచ్ఛందంగా ప్రత్యక్ష ఎన్నికలకు దూరమయ్యారు. ఆయన స్థానంలో కృష్ణుడు పదేళ్లుగా పోటీ చేస్తున్నా.. వైఎస్సార్ సీపీ హవా ముందు నిలబడలేకపోయారు. ఈ నేపథ్యంలో ఉనికి కోసం పాకులాడుతున్న రామకృష్ణుడు ఈసారి తన కుమార్తె దివ్యను బరిలోకి దింపారు. దశాబ్ద కాలంగా తునిలో టీడీపీని నడిపించిన కృష్ణుడిని దూరం పెట్టారు. టీడీపీ అభ్యర్థి దివ్య ప్రచారంలోనూ పాల్గొనవద్దని కృష్ణుడికి తెగేసి చెప్పేశారనే చర్చ జరుగుతోంది. తునిలో టీడీపీ అంటే కృష్ణుడు అని భావించిన ఆ పార్టీ శ్రేణులు ఈ పరిణామాలతో కంగుతిన్నాయి. దీంతో పార్టీ రెండువర్గాలుగా నిట్టనిలువునా చీలిపోయింది. ఫలితంగా ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలు చెల్లాచెదురైపోతున్నారు. కొందరు ఎవరిపక్షాన నిలవాలో అర్థంకాక స్తబ్దుగా ఉండిపోతున్నారు. రామకృష్ణుడి ఎదుగుదల కోసం ఎంతో కృషి చేశానని, ఇప్పుడు తననే ఆయన దూరం పెట్టారని కృష్ణుడు సన్నిహితుల వద్ద మథనపడుతున్నట్లు సమాచారం. ఇంత అవమానం భరిస్తూ టీడీపీలో కొనసాగలేమనే నిర్ణయానికి ఆయన వచ్చినట్లు చెబుతున్నారు. ప్రత్యామ్నాయం చూసుకుందామని అనుచరుల నుంచి కృష్ణుడిపై ఒత్తిడి తీవ్రంగా ఉంది. అన్నదమ్ముల తగవు చంద్రబాబు దృష్టికి వెళ్లినా ఆయన కిమ్మనకుండా ఉండడంపైనా కార్యకర్తలు పెదవివిరుస్తున్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే కేంద్రంతో సఖ్యత

అధికార దాహంతోనే బీజేపీతో టీడీపీ పొత్తు • నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

ఆత్మకూరు: కేవలం రాష్ట్ర ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వంతో సఖ్యతగా వ్యవహరించామని రాజ్యసభ సభ్యుడు, నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో మంగళవారం నిర్వహించిన పార్టీ నాయకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో బీజేపీని విమర్శించిన చంద్రబాబు అధికార దాహంతోనే తిరిగి ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రతిపక్ష స్థానానికే పరిమితం అవుతుందని, భవిష్యత్‌లో టీడీపీతో పాటు జనసేన సైతం బీజేపీలో విలీనం అవుతాయని జోస్యం చెప్పారు. కార్యకర్తలను ఎప్పటికీ వైఎస్సార్‌సీపీ విస్మరించదని, వారే పార్టీకి స్తంభాలు లాంటి వారని, వారికి తప్పక న్యాయం జరుగుతుందన్నారు. కేంద్రంలో న్యాయపరమైన బిల్లులకు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపిందన్నారు. ట్రిపుల్ తలాక్, సీఏఏ బిల్లులకు లోక్‌సభలో పార్టీ ప్రతినిధి మిధున్‌రెడ్డిగానీ, రాజ్యసభలో తాను గానీ ఎలాంటి మద్దతు తెలపలేదన్నారు. తొలుత సంగం నుంచి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికి మోటారు బైక్‌లతో ఆత్మకూరు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేసిన 75 అడుగుల పార్టీ జెండాను, స్థూపాన్ని విజయసాయిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

సామాజిక న్యాయంపై మాట్లాడే అర్హత బాబుకు లేదు

- రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ చేసింది సామాజిక అన్యాయం
- సామాజిక న్యాయవేదిక బహిరంగ లేఖ

సాక్షి, అమరావతి: కమ్మ న్యాయం మాత్రమే తెలిసిన చంద్రబాబుకు సామాజిక న్యాయం గురించి మాట్లాడే నైతిక హక్కులేదని, కూటమి పేరుతో టీడీపీ, బీజేపీ కూటమి రాష్ట్రంలో సామాజిక అన్యాయం చేశాయని సామాజిక న్యాయ వేదిక (ఎస్‌జేఎఫ్) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఎస్‌జేఎఫ్ రాష్ట్ర చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్, కన్వీనర్లు పంచాది రంగారావు, పెద్దిరెడ్డి మహేష్, వర్కింగ్ చైర్మన్ కోటిపల్లి అయ్యప్ప మంగళవారం బహిరంగ లేఖను విడుదల చేశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఇరువురు కలిసి కుట్ర పూరితంగా రాష్ట్రంలో కాపు, బీసీ, బ్రాహ్మణ సామాజిక వర్గాలకు చేసిన సామాజిక అన్యాయాన్ని ప్రజలంతా నిశితంగా గమనించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ పోటీ చేస్తున్న 17 ఎంపీ స్థానాల్లో ఒక్కటి కూడా కాపు, బలిజ, తెలగా, ఒంటరి సామాజిక వర్గాలకు కేటాయించలేదన్నారు. టీడీపీ పోటీ చేస్తున్న 144 ఎమ్మెల్యే స్థానాల్లో కేవలం 11 సీట్లు మాత్రమే కాపు, బలిజ, తెలగా, ఒంటరి సామాజిక వర్గాల వారికి కేటాయించారని తెలిపారు. బీజేపీకి కేటాయించిన ఆరు ఎంపీ, పది ఎమ్మెల్యే సీట్లలో ఒక్కటి కూడా కాపులకు కేటాయించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కాపులకు టీడీపీ, బీజేపీలు తీరని అన్యాయం చేశాయన్నారు. ఎమ్మెల్యే సీట్లలో టీడీపీ 32, బీజేపీ మూడు, జనసేన ఒక సీటును కమ్మలకు కేటాయించడం ద్వారా వారి కమ్మ న్యాయం అర్థమవుతోందన్నారు. అంతే కాకుండా టీడీపీ నాలుగు, బీజేపీ ఒకటి మొత్తం ఐదు ఎంపీ సీట్లను కమ్మవారికి కేటాయించి కులాభిమానాన్ని ఘనంగా చాటుకున్నారని ఆరోపించారు.

అను'మతి' లేని పర్యటన

- అనుమతులు తీసుకోకుండానే పవన్‌కళ్యాణ్ కార్యక్రమాలు
- అధికారులు అడ్డుకుంటే సింపతీ కోసం ప్రభుత్వంపై నెట్టేందుకు విఫల యత్నం
- చర్చిలో కార్యక్రమానికి జనం కరువు



నిబంధనలకు విరుద్ధంగా కొత్తపల్లిలో సమావేశం నిర్వహిస్తున్న పవన్

పిఠాపురం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో చిన్న సమావేశం పెట్టుకోవాలన్నా ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరి. అలాంటిది జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోకుండా పర్యటిస్తూ.. అధికారులు అడ్డుకుంటే ప్రభుత్వంపై నెపాన్ని నెడుతూ సానుభూతి పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలు చర్చనీయాంశమయ్యాయి. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఆయన పర్యటన నాలుగో రోజు మంగళవారం నిబంధనలకు విరుద్ధంగా సాగడంతో ఎన్నికల అధికారులు అడుగడుగునా అడ్డుకున్నారు. పవన్ తొలుత పిఠాపురం ఏబీసీ చర్చిలో ప్రార్థనలకు వచ్చారు. ఆ చర్చి పాస్టర్లు తప్ప ఎవరూ హాజరు కాలేదు. దీంతో మొక్కుబడిగా ప్రార్థనలు పూర్తిచేసుకున్న పవన్ అక్కడి నుంచి కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు బషీర్‌బీబీ దర్గాకు చేరుకుని ప్రార్థనలు చేశారు. అనంతరం రోడ్డు షోగా బయలుదేరి యు.కొత్తపల్లిలోని ఒక ఫంక్షన్ హాలులో మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఇంతలోనే అక్కడికి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది చేరుకొని సమావేశం నిర్వహణకు అనుమతి పత్రాలు చూపించాలని కోరారు. దీంతో జనసేన నేతలు నీళ్లు నమిలారు. అధికారులు అడ్డుకోవడంతో చేసేదేమీ లేక త్వరలోనే మళ్లీ వచ్చి కలుస్తానని చెప్పి అక్కడి నుంచి పవన్ వెళ్లిపోయారు.

తోసేస్తున్నది బౌన్సర్లే

తన పైన, తన సెక్యూరిటీ పైన కొందరు అల్లరి మూకలు బ్లేడ్లతో దాడి చేస్తున్నారని, అందరూ అప్రమత్తంగా ఉండాలని పవన్ సోమవారం వ్యాఖ్యానించారు. అయితే పవన్ పర్యటనలో అడుగడుగునా ఆయన అనుచరులు, బౌన్సర్లు జనంతో తీవ్ర ప్రతిఘటనకు దిగుతూ బలవంతంగా తోసేస్తున్నారు. దీంతో పలువురు గాయపడిన సంఘటనలు కూడా ఉన్నాయి. కాగా, పవన్ మంగళవారం పర్యటన వివరాలు అంటూ జనసేన అధికారికంగా షెడ్యూల్ ప్రకటించింది. దీని ప్రకారం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే గంటగంటకూ మార్పులు చేసుకుంటూ అసలు ఆయన ఎక్కడ ఆగుతారో.. ఎక్కడకు వెళతారో తెలియని అయోమయ పరిస్థితులు సృష్టించారు. దీంతో పోలీసులు అవస్థలుపడ్డారు.

పగలు పిఠాపురం.. రాత్రి హైదరాబాద్

పవన్ నాలుగు రోజుల పర్యటన పగలు పిఠాపురం.. రాత్రి హైదరాబాద్ అన్నట్టుగా కొనసాగడం చర్చనీయాంశమైంది. ప్రతి రోజూ మధ్యాహ్నం వరకూ మాత్రమే పిఠాపురంలో ఉండి, రాత్రికి హైదరాబాద్‌కు స్పెషల్ ఫ్లైట్‌లో వెళ్లి వస్తున్నారు. కాగా, పవన్‌కళ్యాణ్‌ను సుజనా చౌదరి, కామినేని శ్రీనివాసరావు, డ్యాన్స్ మాస్టర్ జానీ తదితరులు పిఠాపురంలో కలుసుకున్నారు. వారితో కలసి ఆయన మళ్లీ హైదరాబాద్ వెళ్లిపోయారు.

ప్లాన్ ప్రకారమే..

సమావేశం ఉన్నట్టు జనసేన పార్టీ ముందు రోజే అధికారికంగా ప్రకటించింది. అటువంటప్పుడు దీనికి అనుమతి కోసం ఎందుకు దరఖాస్తు చేయలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కావాలనే అనుమతి తీసుకోకుండా సమావేశం ఉన్నట్లు ప్రచారం చేసుకుని.. తీరా జనం ఉండగా సమావేశం ఆగిపోతే ఆ నెపం ప్రభుత్వం మీదకు నెట్టి సానుభూతి పొందేందుకు ప్రణాళిక ప్రకారమే ఇలా చేస్తున్నట్లు తెలిసింది. ఏదైనా ఎన్నికల ప్రచార సభ నిర్వహించాలనుకుంటే 24 గంటలు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని, కానీ ఈ సమావేశం కోసం జనసేన నేతలెవరూ తమకు దరఖాస్తు చేయలేదని పిఠాపురం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వరప్రసాద్, వేణుగోపాల్ స్పష్టం చేశారు.

'సాక్షి' టీవీ విలేకరిపై దాడికి యత్నం


పవన్ పర్యటనలో ఆయన బౌన్సర్లు జనసేన నేతలకు చుక్కలు చూపిస్తున్నారు. పిఠాపురం చర్చిలో ప్రార్థనలకు పవన్ హాజరు కాగా, అక్కడకు వచ్చిన జనసేన ఉభయ గోదావరి జిల్లాల నాయకురాలు చల్లా లక్ష్మిని బౌన్సర్లు అడ్డుకుని తోసేశారు. దీంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెనక్కి వెళ్లిపోయారు. ఈ సంఘటనను చిత్రీకరిస్తున్న సాక్షి టీవీ రిపోర్టర్ భూషణంపై దాడి చేయడానికి బౌన్సర్లు ప్రయత్నించగా.. స్థానిక మీడియా ప్రతినిధులు అడ్డుకుని, ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని బౌన్సర్లను అక్కడి నుంచి పంపించేశారు.

పవన్‌కళ్యాణ్ పర్యటనకు వర్మ డుమ్మా

'నా గెలుపు బాధ్యత అంతా వర్మదే. అన్నీ ఆయనే చూసుకుంటారు. ఆయన అడుగు జాడల్లోనే అందరూ నడుచుకోండి..' అంటూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చెప్పి ఒక్క రోజు కూడా కాలేదు. రెండో రోజే పవన్ పిఠాపురం పర్యటనకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ డుమ్మా కొట్టారు. పవన్ పిఠాపురం, కొత్తపల్లి పర్యటనల్లో వర్మతో పాటు టీడీపీ నేతలెవరూ పాల్గొన లేదు. దీంతో ఇక్కడ పొత్తు మళ్లీ చిత్తయిందని పలువురు పేర్కొంటున్నారు. అయితే పవన్ పర్యటన వివరాలు, సమాచారం తనకు తెలియజేయకపోవడం వల్లే తాను రాలేదని పిఠాపురం జనసేన ఇన్‌చార్జి, ఆ పార్టీ కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌పై వర్మ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై ఉదయ్‌శ్రీనివాస్ తన అనుచరులకు క్లాస్ పీకి ఇలాంటి పొరపాటు ఎప్పుడూ జరగకుండా చూసుకుంటామని వర్మను బతిమలాడుకున్నట్లు చెబుతున్నారు.

బల్క్ ఎస్‌ఎంఎస్‌ల ద్వారా టీడీపీ అసత్య ప్రచారం

- ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘిస్తున్న టీడీపీ నేతలు
- ఈసీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు
- టీడీపీ నేతలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు డిమాండ్



సీఈవో మీనాకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే విష్ణు తదితరులు

సాక్షి, అమరావతి : టీడీపీ నేతలు బల్క్ ఎస్‌ఎంఎస్‌ల ద్వారా వైఎస్సార్‌సీపీపై అసత్య ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనాను కలిసి టీడీపీ నేతలపై ఫిర్యాదు చేసింది. అందుకు సంబంధించిన ఆధారాలను ఈసీకి అందజేసింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ప్రతిరోజూ అడుగడుగునా టీడీపీ నేతలు ఎన్నికల ప్రవర్తన నియామవళిని ఉల్లంఘిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం వద్ద ఉన్న డబ్బుని సీఎం జగన్ తన బినామీ కాంట్రాక్టర్లకు బిల్లుల రూపంలో చెల్లించి, రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి, 66 లక్షల మందికి పింఛన్ల పంపిణీకి డబ్బులు లేకుండా చేశారని, పింఛన్లు పంపిణీ జరగకుండా చేశారని వాయిస్ మేసేజ్ ద్వారా ప్రజల ఫోన్ నంబర్లకు బల్క్ మేసేజ్‌లు పంపిస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. టీడీపీ ముఖ్యనేతలు అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు సోషల్ మీడియా ద్వారా సీఎం జగన్‌పై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని, అందుకు సంబంధించిన ఆధారాలను ఈసీకి అందజేశామన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్ ఆర్యవైశ్యుల ద్రోహి అని టీడీపీ నేత బొండా ఉమా కరపత్రాలు ముద్రించి విజయవాడ నగరంలో ఇంటింటా ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా కులాల మధ్య చిచ్చుపెడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో 2.60 లక్షల మంది వలంటీర్లు, ప్రతినెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే 66 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేసేవారన్నారు. నిమ్మగడ్డ రమేష్‌కుమార్, ఓ ఐదుగురు కలిసి ఏర్పాటు చేసిన సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అనే సంస్థ ద్వారా చంద్రబాబు కోర్టుల్లో కేసులు వేయించి ఈసీకి ఫిర్యాదు చేయించడం వల్లే వలంటీర్లు పింఛన్లు పంచడానికి వీల్లేకుండా పోయిందని చెప్పారు. దీంతో అభాసుపాలయిన చంద్రబాబు కోసం పచ్చ పత్రికలు పడరాని పాట్లు పడుతూ, రాయకూడని రాతలు రాస్తున్నాయని మండిపడ్డారు. బాబు తన కుట్ర బుద్ధిని మరోసారి బయట పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి, న్యాయవాది శ్రీనివాసరెడ్డి, నారాయణమూర్తి పాల్గొన్నారు.



కోరుకున్నది ఫలిస్తే అది మరింత పెద్ద కోరికను కలిగిస్తుంది. కోరిక నెరవేరకపోతే ఏదో ఒక పద్ధతిలో దాన్ని నెరవేర్చుకోవాలని పెనుగులాడుతాం. చర్య–ఫలితం–చర్య వీటినిలా కొనసాగిస్తూ పోయే విషవలయమే సంసారచక్రం.

– థానిస్సరో భిక్ఖు (బౌద్ధ ధర్మం)

ఫోకస్

సాక్షి

బుధవారం, 3 ఏప్రిల్ 2024

చిరుదీవిలో ఎన్నికల చేపలవేట

ఎన్నికలంటే సాధారణంగా ఉద్యోగాలు, ద్రవ్యోల్బణం లాంటివి ప్రస్తావనకొస్తాయి. కానీ, మూడు రోజులుగా ఓ విదేశాంగ విధానం ప్రధానాంశమై కూర్చుంది. లోక్‌సభ ఎన్నికల తొలి దశలోనే తమిళనాట పోలింగ్ జరగనున్న వేళ ఆ రాష్ట్రానికి అతి సమీపంగా భారత – శ్రీలంకల మధ్యనున్న చిరుద్వీపం కచ్చతీవు ఇప్పుడు వార్తల్లో నిలిచింది. స్టాలిన్ సారథ్యంలోని స్థానిక డీఎంకె ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రధాని, విదేశాంగ మంత్రి సహా సమస్త శక్తులనూ బీజేపీ కేంద్రీకరించినట్టు కనిపిస్తోంది. ఎన్నికల మాట అటుంచితే, భారత సర్కారే ఒకప్పుడు శ్రీలంకకు అప్పగించిన ఓ ద్వీపప్రాంత ప్రాదేశిక హక్కులపై ఇప్పుడు రగడ చేయడం సబబేనా? ప్రభుత్వాలు మారినప్పుడల్లా సముద్ర జలాల సరిహద్దులు మార్చేసే ప్రయత్నాలు ఎక్కడికి దారి తీస్తాయి?

భారత్ – శ్రీలంకల మధ్య పాక్ జలసంధిలో 1.6 కిలోమీటర్ల పొడవు, 300 మీటర్ల వెడల్పున్న చిన్న ప్రాంతం కచ్చతీవు. భారత్‌లోని రామేశ్వరానికి ఉత్తరాన 30 కి.మీ.ల దూరంలో, శ్రీలంకలోని జాఫ్నాకు దక్షిణాన 60 కి.మీ.ల దూరంలో ఉన్న ఈ ద్వీపం వ్యూహాత్మకంగా కీలకమైనది. కచ్చతీవు చారిత్రకంగా జాఫ్నా రాజ్యంలో, ఆపైన రామ్‌నాడ్ సహా పలువురు రాజుల ఏలుబడిలో, బ్రిటీష్ వారి హయాంలో మద్రాస్ ప్రెసిడెన్సీలో భాగంగా ఉండేది. తాగునీటితో సహా ప్రాథమిక వసతులేవీ లేని ఈ ప్రాంతంలో ఒకే ఒక్క చర్చి మినహా నివాసాలే లేవు. ఈ ద్వీపం తాలూకు ప్రాదేశిక హోదాపై భారత్, శ్రీలంకల మధ్య దీర్ఘకాలం వివాదం నెలకొంది. అయితే, 1974లో ఇరుదేశాలూ ఓ ఒప్పందానికి వచ్చి, సంతకాలు చేశాయి. శ్రీలంకతో పటిష్ఠ బంధానికై కేంద్రంలో ఇందిరా గాంధీ సారథ్యంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చిరుద్వీపాన్ని శ్రీలంకకు అప్పగించింది. ఇప్పుడు యాభై ఏళ్ళ తర్వాత మోదీ నేతృత్వంలోని బీజేపీ భారత సమైక్యతకు విఘాతం కలిగిస్తూ కాంగ్రెస్, డీఎంకెలు 'నిర్లక్ష్యంగా' ఆ ద్వీపాన్ని శ్రీలంకకు ధారాదత్తం చేసేశాయంటూ దాడికి దిగింది.


తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఇటీవల 'సమాచార హక్కు' పిటిషన్ ద్వారా ఇప్పటి దాకా బయటపడని ఈ ద్వీపం అప్పగింత వివరాలను తీసుకున్నారు. అవన్నీ మీడియాలో వచ్చాయి. దక్షిణాదిన, అందునా తమిళనాట బీజేపీ జెండా ఎగరేయాలని తరచూ పర్యటిస్తున్న ప్రధాని మోదీ దాన్ని అందిపుచ్చుకొన్నారు. ద్వీపం అప్పగింత తప్పుడు నిర్ణయమంటూ కాంగ్రెస్‌ను దుయ్యబట్టారు. విదేశాంగ మంత్రి జైశంకర్ స్వరం కలిపారు. సమీప శ్రీలంక జలాల్లో భారతీయ జాలర్లను పదే పదే అరెస్టు చేస్తున్నారంటే, అదంతా అప్పటి తప్పుడు నిర్ణయం ఫలితమేనని ఆయన ఆరోపణ. ఈ చిరుద్వీపానికి తన దృష్టిలో పెద్దగా ప్రాధాన్యం లేదని 1961 మేలోనే ప్రధాని నెహ్రూ అన్నారట. ద్వీపాన్ని అప్పగించినా చేపలు పట్టుకొనేందుకు భారతీయులకున్న హక్కుల్ని 1974 ఒప్పందంలో పరిరక్షిస్తున్నామంటూ పార్లమెంట్‌కు హామీ ఇచ్చిన నాటి సర్కార్ తీరా ఆ ప్రాంతంలో చేపలు పట్టే హక్కులను సైతం 1976లో వదులుకుందని జైశంకర్ నిందిస్తున్నారు. గత ప్రధానులు ఈ అంశంపై ఉదాసీనంగా ఉన్నా, భారత – శ్రీలంక సముద్రజలాల సరిహద్దు చట్టం అమలు, భారతీయ జాలర్ల హక్కులపై తమ సర్కార్ శ్రీలంకతో చర్చలు జరుపుతుందని ఆయన చెబుతున్నారు.

గమ్మత్తేమిటంటే, కేంద్రంలో అధికారంలో ఉన్న కమలనాథులు గత పదేళ్ళుగా ఆ పని ఎందుకు చేయలేదో తెలీదు. అలాగే, ఆ ద్వీపాన్ని తిరిగి స్వాధీనం చేసుకొనే పనిలో మోదీ సర్కార్ ఉన్నట్టు తమిళనాడు బీజేపీ చెబుతోంది కానీ, అసలు ఇప్పటి దాకా ఆ అంశంపై మోదీ సర్కార్ నుంచి అధికారిక సమాచారమే లేదని శ్రీలంక మంత్రి ఒకరు తేల్చేశారు. మరి, కచ్చతీవు అంశాన్ని బీజేపీ ఉన్నట్టుండి ఎందుకు లేవదీసినట్టు? లోక్‌సభ ఎన్నికల తొలి దశలో భాగంగా ఈ నెల 19న తమిళనాట పోలింగ్ జరగనుంది. ప్రాంతీయ, భాషాభిమానాలు మెండుగా ఉండే తమిళనాట చొచ్చుకుపోవడానికి తంటాలు పడుతున్న బీజేపీ దీన్ని ఓ అస్త్రంగా భావించింది. కేంద్రంలోని కాంగ్రెస్ సర్కార్ ఆ ద్వీపాన్ని ఇచ్చేస్తుంటే, అడ్డుకోని కరుణానిధి సారథ్యంలోని డీఎంకె సర్కార్‌దీ తప్పుందని బీజేపీ నిందిస్తోంది. తమిళ ఓటర్లలో సెంటిమెంట్ రగిల్చి లబ్ధి పొందడమే దాని అజెండాగా కనిపిస్తోంది.

నిజానికి, ఎవరు సలహా ఇచ్చారో కానీ ఆ దీవిని శ్రీలంకకు ఇచ్చేశాం. దీవి అప్పగింత విషయం అంతర్జాతీయ వ్యవహారం గనక అప్పట్లో కేంద్రం తమిళ సర్కార్‌కు సమాచారమిచ్చి ఉంటుందే తప్ప, సరేనన్న అనుమతి తీసుకొని ఉంటుందనుకోలేం. స్థానిక అనివార్యతల రీత్యా అప్పటి కరుణానిధి సర్కార్ నుంచి ఇప్పటి స్టాలిన్ సర్కార్ దాకా డీఎంకె ప్రభుత్వాలు శ్రీలంకతో ఒప్పందాన్ని నిరసిస్తూనే వచ్చాయి. చేపల వేటకు వెళ్ళే తమిళ జాలర్లు పదే పదే లంకేయుల చేతిలో అరెస్టవుతున్నారని చెబుతూనే ఉన్నాయి. ఆ మధ్య భారత – శ్రీలంక ప్రధానుల భేటీ ముందూ స్టాలిన్ ఈ సంగతి మోదీ దృష్టికి తెచ్చారు. అవేవీ పట్టించుకోని బీజేపీ ఎన్నికల ముందు ఈ అంశం పట్టుకోవడమే విడ్డూరం. ద్వైపాక్షిక బంధాలపై ప్రభావం చూపే సున్నితమైన అంశాన్ని ఎన్నికల లబ్ధి కోసం తలకెత్తుకోవడం ప్రమాదకరం. నేపాల్ లాంటి పొరుగుదేశాలతోనూ అపరిష్కృత ప్రాదేశిక వివాదాలున్న భారత్ గతాన్ని తవ్వితే తలనొప్పులే. శ్రీలంకలో జాతుల యుద్ధం ముగిశాక వాణిజ్యం, ఇంధన, రవాణా రంగాల్లో ఇరు దేశాలూ ముందుకు సాగుతున్నాయి. పాత చరిత్రను ఆశ్రయిస్తే కొత్త దౌత్య యత్నాలకు చిక్కులు తప్పవు. హిందూ మహాసముద్రంలో వ్యూహాత్మక ప్రాంతంలో లంగరేయడానికి చైనా సిద్ధంగా ఉన్నవేళ కచ్చతీవు వివాదం అభిలషణీయం కానే కాదు. అయినా, మనమే వదులుకున్న ఈ దక్షిణాగ్ర ద్వీపంపై ఇంత ప్రేమ ప్రదర్శిస్తున్న పాలకులు ఉత్తరాన వేలాది చదరపు కిలోమీటర్లు చైనా ఆక్రమించుకున్నట్టు వార్తలున్నా ఉలకరేం? పలకరేం?

నూతన విద్యా విప్లవం వర్ధిల్లాలంటే...

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

గత ఐదేండ్లలో దేశంలో ఎక్కడా లేని విద్యా విధానం ఆంధ్రప్రదేశ్‌లో అమలైంది. కానీ తమ పిల్లల్ని ఖరీదైన ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో చదివించిన వారు... పేదలు తమ పిల్లలకు ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ స్కూళ్లలో కావాలని కోరుకుంటే వ్యతిరేకించారు. ఇది విచిత్ర చారిత్రక సన్నివేశం. దేశంలో ప్రయివేట్ విద్య ఎంత ఖర్చుతో కూడుకున్నదో, ఏ భాషలో సాగుతున్నదో తెలియదా? ప్రజా మేధావులకు తెలివి కన్నా, బీద ప్రజల పక్షాన నిలబడే హృదయం ఉండాలి కదా! దేశ చరిత్రలో మొదటిసారి విద్యా సమానత్వ ప్రయోగాన్ని జగన్ ప్రభుత్వం చేస్తోంది. ఆ ప్రక్రియను వ్యతిరేకించే మూడు పార్టీల కూటమిని సమర్థించే మేధావులను ప్రజలు వ్యతిరేకించాల్సింది... తమ పిల్లల భవిష్యత్తు కోసం!

2024 ఆంధ్ర ఎన్నికలు గత రెండు ఎన్నికల కంటే పూర్తిగా భిన్నమైనవి. 2014లో ఒకవైపు మూడు పార్టీల కూటమికీ, వైసీపీకీ రాష్ట్ర విభజన నేపథ్యంలో జరిగాయి. అప్పుడు కేంద్రంలో రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఆనాడు కొత్త రాష్ట్ర రాజధాని, ప్రత్యేక ప్యాకేజీ ప్రధాన అంశాలు. 2019 ఎన్నికల్లో అన్ని పార్టీలు విడివిడిగా కొట్లాడాయి. వైసీపీ తన కొత్త విద్యా విధానం, గ్రామాల అభివృద్ధి అంశాలతో 151 సీట్లు గెలిచింది. విడిగా పోరాడిన మూడు పార్టీలు మట్టికరిచాయి. చంద్రబాబుకు 23 సీట్లు, పవన్ కల్యాణ్‌కి 1 సీటు వచ్చాయి.

గత ఐదేండ్లలో ఆ పార్టీలు ఊహించని విధంగా దేశంలో ఎక్కడా లేని విద్యా విధానం ఆంధ్రప్రదేశ్‌లో అమలైంది. దీన్ని ఏపీ నాయకులు చంద్రబాబు నాయుడు, వెంకయ్య నాయుడు, జయప్రకాశ్ నారాయణ తీవ్రంగా వ్యతిరేకించారు. వీరేకాక దేశ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన ఎం.వి. రమణ కూడా వ్యతిరేకించారు. సమస్య కోర్టుకు పోయింది. అక్కడ కేంద్ర ప్రభుత్వం కూడా వ్యతిరేకించింది. సుప్రీంకోర్టు జడ్జిగా రమణకు ఇంగ్లిష్ భాష పాత్ర ఎంతో తెలుసు. అయినా వ్యతిరేకించారు. వీరుకాక మీడియా రంగంలో ఈనాడు గ్రూపు, ఆంధ్రజ్యోతి గ్రూపు, టీవీ 5 నెట్‌వర్క్ అధిపతులు తమ పిల్లల్ని మంచి, మంచి ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో చదివించి... రైతులు, కూలీలు, దళితులు, బీసీలు, ఆదివాసులు తమ పిల్లలకు ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ స్కూళ్లలో కావాలని కోరుకుంటే వ్యతిరేకించారు. ఇది విచిత్ర చారిత్రక సన్నివేశం.

ఈ ఎన్నికల్లో మళ్ళీ 2014 నాటి ప్రతిపక్ష గుంపు జత కట్టింది. జగన్‌ను ఓడించాలని వీళ్ళు రాత్రింబవళ్లు పనిచేసేది ఎందుకోసం? ముఖ్యంగా గ్రామీణ పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువు ఆపెయ్యడం కోసం. ఈ క్రమంలో జయప్రకాశ్ నారాయణ గురించి కొంత చర్చించాలి. ఈయన మాజీ ఐఏఎస్ అధికారి. ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో కొంతకాలం ఆయన పర్సనల్ సెక్రటరీగా పని చేశారు. ఆ దశలో తెలంగాణలో నక్సలైట్లకూ, తెలుగుదేశం పార్టీకీ తీవ్ర సంఘర్షణ జరుగుతున్నది. ఎన్టీఆర్ సన్నిహిత సోషలిస్టు నాయకుడొకరు కేజీ కన్నాభిరన్ (అప్పటి పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు)కు కబురుపెట్టి, ముఖ్యమంత్రితో హక్కుల నాయకులతో మీటింగ్ ఏర్పాటు చేశారు. ఆ మీటింగుకు నేను, కన్నాభిరన్, బాలగోపాల్, ఎం.టి. ఖాన్ వెళ్లాం. మేం వెయిటింగ్ రూంలో ఉండగా జయప్రకాశ్ నారాయణ ఆ మీటింగ్‌ను జరగకుండా చూడాలని చాలా ప్రయత్నం చేశాడు. కానీ ఎన్టీఆర్ వినలేదు. మీటింగ్ జరిగింది.

నక్సలైట్లను అణచివెయ్యాలి గానీ వారితో చర్చలేమిటని జేపీ ఆలోచన. ఆ విభాగాన్ని చూసే పోలీస్ ఆఫీసర్ అరవిందరావుది కూడా



చారిత్రక సన్నివేశం: ఏపీలో విద్యా సమానతా ప్రయోగం

అదే ఆలోచన. మా పౌరహక్కుల టీమ్ ఇరుపక్షాల హత్యలు, కిడ్నాప్‌లు, ఎన్‌కౌంటర్లు ఆపించాలని తీవ్రంగా ప్రయత్నం చేస్తున్న రోజులవి. అప్పుడు ఎన్‌కౌంటర్లు, టీడీపీ కార్యకర్తల కిడ్నాపులు చాలా జరిగాయి. ఆ తరువాత జయప్రకాశ్ నారాయణ ఈనాడు పేపర్, ఈటీవీ ద్వారా మేధావి అవతారమెత్తాడు. అక్కడి నుండి ఒక ఎన్జీవో పెట్టి, 'లోక్‌సత్తా' (అంటే ఇంగ్లిష్‌లో గ్లోబల్ పవర్) అనే రాజకీయ పార్టీ రూపందాల్చి, దానికి అలుపెరుగని, ఎన్నడూ దిగిపోని ఏకో ముఖ (అంటే ఆ పార్టీలో మరో ముఖమే కనపడదు) అధ్యక్షుడుగా ఉన్నాడు. ఇప్పుడు ఈ గ్లోబల్ పవర్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డిని ఓడించాలని ఉన్న మూడు పార్టీల కూటమి చాలనట్లు నాలుగో పార్టీగా అందులో చేరాడు. ఇప్పుడు జేపీ లక్ష్యమంతా ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం చదువు ఆపి, మళ్లీ తెలుగు మీడియం పెట్టేంత వరకూ పోరాటం చెయ్యడం!

ఆయన మరో లక్ష్యం గ్రామాలలో స్కూళ్ల నిర్మాణం, సెక్రటేరియట్ నిర్మాణాలను ఆపి అభివృద్ధికి మార్గంగా అమరావతిని సింగపూర్‌లా చూపడం! అభివృద్ధిపై ప్రపంచ యూనివర్సిటీలు చదివే గొప్ప పుస్తకం ఆయన రాసినట్లు, డెవలప్‌మెంటల్ ఎకనామిక్స్‌లో తాను అథారిటీ అయినట్లు నిరంతర యూట్యూబ్ ఉపన్యాసాలు ఇస్తున్నారు. గ్లోబల్ పవర్ ఈనాడు నుండి ఇప్పుడు యూట్యూబ్‌కు మారింది. విద్యా వ్యవస్థ మీద కూడా జాన్‌డ్యూయి (కొలంబియా యూనివర్సిటీలో అంబేడ్కర్ గురువు) కంటే తానే మంచి ఎక్స్‌ఫర్ట్ అన్న రీతిలో ఉపన్యాసాలు ఇస్తారు. జేపీ ప్రపంచ మార్పు మీద ఇంగ్లిష్‌లోనో, తెలుగులోనో రాసిన మంచి పుస్తకం మార్కెట్‌లో ఉంటే చదవాలని ఉంది. కానీ ఇంతవరకు ఒక్కటీ కనిపించలేదు.

30,000 ఎకరాల భూమిని చంద్రబాబు నాయుడు తీసుకున్నప్పుడు వెంకయ్యనాయుడు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖమంత్రి. ఆయన సలహా, సహకారం లేకుండా చంద్రబాబు ఆ పని చెయ్యడు. ఇప్పుడు గ్రామీణ బడుల నిర్మాణం, ఇంగ్లిష్ మీడియం చదువు, అమ్మ ఒడి పథకం ఆపి, అమరావతి పట్టణం వచ్చే ఐదేండ్లలో కడితే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధితో పాటు దేశానికే ఒక మోడల్ సిటీ వస్తుందని బహుశా జేపీగారి నమ్మకం. కానీ ఒక ఎనిమిదో తరగతి విద్యార్థి మా తల్లిదండ్రులు జగన్‌కు ఓటేసి గెలిపించకపోతే, ఇంగ్లిష్ మీడియం ఆగిపోతే, నాకొచ్చే బట్టలు, బూట్లు ఆగిపోతే నేను ఉన్న బట్టలు సర్దుకుని ఇంట్లోనుండి పారిపోతాను అన్నాడు. ఆ పిల్లోడి ఆశను ఏం చెయ్యాలని ఈ నాయకులు అనుకుంటున్నారు?

ప్రజా మేధావికి తెలివి కన్నా, వాగ్ధాటి కన్నా బీద ప్రజల పక్షాన నిలబడే హృదయం ఉండాలి కదా! దేశంలో ప్రయివేట్ విద్య ఎంత ఖర్చుతో కూడుకున్నదో, ఏ భాషలో సాగుతుందో వీరందరికీ తెలువదా?

2024–25 ఎకనమిక్ సంవత్సరానికి ధీరూభాయి అంబానీ కొడుకు, కోడలు నడిపే స్కూలు ఫీజు చూడండి: సంవత్సరానికి ఎల్‌కేజీ విద్యార్థి ఫీజు: 1,70,000. 8–10వ తరగతి పిల్లల ఫీజు: 5,90,000. 11–12వ తరగతి పిల్లల ఫీజు: 9,65,000. ఇటువంటి స్కూళ్లు దేశంలో చాలా ఉన్నాయి. ఇవన్నీ ఏ మాతృభాషలో నడుస్తున్నాయి? ఇంతింత ఫీజులలో ఇంగ్లిష్ మీడియంలో, విదేశీ సిలబస్‌తో చదివే పిల్లల్ని జగన్ మోడల్ విద్యా విధానం ద్వారా కాక ఎలా ఎదుర్కొంటారు?

ఏపీలో ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడుతారు అన్నది కాదు సమస్య. ఈ ఎన్నికల పోరాటంలో అక్కడ ప్రభుత్వ రంగంలో ప్రారంభమైన ఇంగ్లిష్ క్వాలిటీ విద్యా ఎక్స్‌పెరిమెంట్ ఏమైతది అనేది కీలకమైన సమస్య. నేనొక సొంత పార్టీ పెట్టుకొని జగన్‌తో పొత్తు పెట్టుకొని ఈ వ్యాసం రాయడం లేదు. జగన్ ఇచ్చిన ఎమ్మెల్యే పదవో, రాజ్యసభ ఎంపీ పదవో తీసుకుని రాయడం లేదు. ఈ దేశ ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లల భవిష్యత్తు మీద భయంతో రాస్తున్నాను. ఒక పబ్లిక్ ఇంటలెక్చువల్‌కు దోపిడీకి, అణచివేతకు గురౌతున్న ప్రజల జీవనం మారడం ముఖ్యం. రాజకీయ నాయకులకు రాజకీయాలలో తమ ఉనికి ముఖ్యం. తమ ఉనికి కోసమైనా రాజకీయ నాయకులు ప్రజల మార్పు కోసం, సమానత్వం సాధించడం కోసం చర్యలు చేపట్టినప్పుడు వాటిని సమర్థించడం ప్రజా మేధావి ప్రధాన కర్తవ్యం. ఈ క్రమంలోని దేశ చరిత్రలో మొదటిసారి విద్యా సమానత్వ ఎక్స్‌పెరిమెంట్ జగన్ ప్రభుత్వం చేస్తున్నందున నేనీ విద్యా విధానాన్ని సమర్థిస్తున్నాను. ఆ ప్రక్రియను వ్యతిరేకించే మూడు పార్టీల కూటమిని సమర్థించే మేధావులను ప్రజలు వ్యతిరేకించాల్సింది... తమ పిల్లల భవిష్యత్తు కోసం!

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అనవసర రాజకీయం



స్థానిక రాజకీయాల కోసం 'కచ్చతీవు' అంశాన్ని లేపడమంటే, అది దౌత్యాన్నీ, శ్రీలంకతో సంబంధాలనూ దెబ్బ తీయడమే. ఆఖరికి అనుభవజ్ఞుడైన జైశంకర్ లాంటి దౌత్యవేత్త కూడా దీనితో మాట కలపడం ఆయన ఇమేజ్‌కు నష్టం కలిగిస్తుంది. దీనివల్ల మాల్దీవుల లాగా శ్రీలంకను చైనా వైపు నెట్టడమే తప్ప, దక్షిణాదిలో బీజేపీకి పెద్దగా ఒరిగేదేమీ ఉండదు.

– కె.సి. సింగ్, మాజీ దౌత్యవేత్త

పెంచాల్సిన ఓటింగ్



భారత జనాభాలో పస్మాందా ముస్లింల సంఖ్య గణనీయమైనది. అయినప్పటికీ చారిత్రకంగా వాళ్లలో ఓట్లువేసేవాళ్లు తక్కువ. ఈ కమ్యూనిటీని ఆ దిశగా చైతన్యవంతులను చేయడం ద్వారా, సామూహికంగా ఓటు వేసేలా ప్రోత్సహించడం ద్వారా ఓటు శాతం పెంచవచ్చు.

– అద్‌నాన్ కమర్, ముస్లిం నాయకుడు

వాళ్లనూ పట్టించుకోవాలి!



రిజర్వేషన్లు ఎప్పటికంటే ఎక్కువగా ఉన్నాయి. సామాజిక న్యాయం ఎప్పటికంటే ఎక్కువగా ఉంది. అగ్ర కులాల మీద దూషణలు కూడా ఎప్పటికంటే ఎక్కువగా ఉన్నాయి. జనరల్ కేటగిరీని దెబ్బ కొట్టేలా ఏ రాజకీయ పార్టీ బుజ్జగింపులూ ఉండకూడదు. వాళ్లు కష్టపడతారు. 50 శాతం కంటే ఎక్కువ పన్ను చెల్లిస్తారు. వాళ్లకు కూడా సమాన హక్కులు ఉండాలి.

– అనురాధా తివారీ, రిజర్వేషన్ల వ్యతిరేక కార్యకర్త

రక్తంలోకి ఇంకుతుందా?



చదవడంలో ఉండే విరోధాభాస: మనం ఏం చదివామో చాలావరకు మరిచిపోయినప్పటికీ, మనం చదివే పుస్తకాలు మనల్ని లోలోతుల నుంచి మార్చుతాయి.

– డేవిడ్ పెరెల్, రచయిత

ఉండాల్సిన నియంత్రణ



పిచ్చిగా కార్లు నడిపేవారి వల్ల, మన ఇంటి బయట కూర్చున్నా సురక్షితంగా ఉండేట్టు లేము. డిజైన్‌తో గానీ, బలవంతంగా గానీ వేగం మీద నియంత్రణ విధించాలి.

– కుమార్ మనీశ్, కంటెంట్ క్రియేటర్

ఇన్ బాక్స్

వట్టి అవగాహనా లోపం!

ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్లుగా అమలులో ఉన్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థల వలన, ప్రజలు పొందుతున్న సేవలను అర్థం చేసుకోవడంలో ప్రధాన ప్రతిపక్షాలు తీవ్రంగా విఫలం చెందాయనడం అతిశయోక్తి కాదు. తాజాగా పూర్వ 'సీబీఐ జేడీ' వీవీ లక్ష్మీనారాయణ ప్రకటన మరింత హాస్యాస్పదంగా, అమానవీయంగా ఉంది. వృత్తి రాజకీయవేత్తలు చంద్రబాబునాయుడు లాంటి వారు ఇలాంటి విమర్శలు చేశారంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. అలాగే దురదృష్టవశాత్తూ రాజకీయాలంటే కవిత్వం, సినిమా సంభాషణలుగా భావించే పవన్ కల్యాణ్ లాంటి వారిని ఏ రీతిలో ఆలోచించినా పట్టించుకోనక్కర లేదు.

కానీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా పనిచేసినవారు కూడా అనాలోచిత ప్రకటనలు, విమర్శలు చేయడం విషాదం. జేడీ లక్ష్మీనారాయణ తన తాజా ప్రకటన ద్వారా వలంటీర్లపై బాగా ఉదారత చాటానని భావించారేమో? వలంటీర్లను సస్పెండ్ చేయకుండా, బదిలీలు చేయాలట! అదీ ఉత్తరాంధ్ర నుండి రాయలసీమకు, రాయలసీమ వారిని ఉత్తరాంధ్రకు బదిలీ చేస్తే చాలు... వలంటీర్ల రాజకీయ సమస్య పరిష్కారమై పోతుందని ఉచిత సలహా ఇచ్చారు. ఇది అత్యంత దారుణమైన ప్రకటన. పేద, మధ్యతరగతి, బలహీన వర్గాలకు చెందిన యువతీ, యువకులు వేన్నీళ్ళకు చన్నీళ్ళు తోడుగా వలంటీర్లుగా సేవలందిస్తున్నారు. అలాంటి ఆర్థిక స్థితిలో ఉన్న వారిని పరిహసించడమే ఇటువంటి ప్రకటనలు చేయడమంటే!

విశాఖ స్టీలు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయకుండా, జేడీ చేసిన ప్రతిపాదన నవ్వులపాలైంది. ఆయన పట్ల ప్రజలకున్న సదభిప్రాయం పటాపంచలు అయ్యింది. ఇలాంటి వారిని చూసినప్పుడు కొన్నేళ్ళ క్రితం, ప్రజల మనిషిగా, పరిపాలనాదక్షునిగా కీర్తి పొందిన ఐఏఎస్ అధికారి స్వర్గీయ ఏవీఎస్ రెడ్డి చెప్పిన ఒక సంఘటన గుర్తొస్తుంది. ఏవీఎస్ రెడ్డి ఉత్తరప్రదేశ్ కేడర్‌లో పనిచేస్తూన్న కాలంలో ఒక జిల్లా కలెక్టరుగా ఉండేవారు. ఆ సమయంలో ఆ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అయిన ఒక అధికారి, వేరుసెనగ ఎక్కువగా పండే, ఏవీఎస్ రెడ్డి కలెక్టరుగా ఉన్న జిల్లాకు పర్యటనకు వెళ్ళారు. ఆ అధికారిని వేరుశెనగ వ్యవసాయ క్షేత్రానికి తీసుకు వెళ్ళారు ఏవీఎస్. ఆ అధికారి 'వేరుసెనగ కాయలు ఎక్కడ?' అని అడిగారట. ఆ అధికారి అవగాహనా లోపానికి నవ్వుకున్న ఏవీఎస్ 'సార్, వేరుసెనగ కాయలు భూమి పైన దొరకవు. భూమి లోపల పండుతాయి' అంటూ, ఒక వేరుసెనగ మొక్కను పీకి ఆ అధికారికి చూపించారట. సిగ్గుపడిన ఆ అధికారి క్షమాపణలు కోరారట.

అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో సచివాలయాలు, వలంటీర్లు ప్రజలకు ముఖ్యమైన సేవలందిస్తుంటే, అవగాహన చేసుకొనే ఓపిక, తీరిక లేని ప్రధాన ప్రతిపక్షాలు ఇష్టమొచ్చిన రీతిగా వ్యవహరిస్తున్నాయి. ఈ వ్యవహార శైలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఆశీస్సులుగా మారుతుంది. ఆ యా వ్యవస్థల ఉద్యోగులు, సిబ్బంది, వలంటీర్లు, వారి సేవలు పొందుతున్న ప్రజల మద్దతు జగన్‌కే నూరు శాతం లభిస్తుందనడంలో సందేహం లేదు.

– జాబాలి

శిలాజ ఇంధనాలకు రాయితీలు తగ్గితేనే...

విశ్లేషణ



డా॥ దొంతి నరసింహా రెడ్డి

శిలాజ ఇంధనాల వినియోగం నానాటికీ పెరుగుతున్నందు వల్ల కాలుష్యం మరింత పెరుగుతోంది. అందుకే ప్రపంచ దేశాలు ఆ ఇంధనాలపై ఇస్తున్న సబ్సిడీలను తగ్గించాలని వివిధ అంతర్జాతీయ సంస్థలూ, సదస్సులూ దశాబ్దాలుగా పిలుపునిచ్చాయి. ఉదాహరణకు కాప్–21 సదస్సులో 40 కంటే ఎక్కువ దేశాలు శిలాజ ఇంధన సబ్సిడీలను తొలగించడానికి ఒక ఉమ్మడి ప్రకటన చేశాయి. అయినా కూడా పారిశ్రామిక దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు శిలాజ ఇంధనాల ఉత్పత్తి, వినియోగానికి బడ్జెట్ బదిలీలు, పన్ను మినహాయింపులు, ఆర్థిక హామీలు అందజేస్తూనే ఉన్నాయి. ఈ సబ్సిడీల వలన వాతావరణానికి ప్రాథమికంగా హాని చేస్తున్న శిలాజ ఇంధనాల ఉపయోగం పెరుగుతూనే ఉన్నది. అభివృద్ధి చెందిన దేశాల నుంచి తగిన చర్యలు లేకపోవడంతో వర్ధమాన దేశాలు కూడా ముందడుగు వేయడానికి సిద్ధంగా లేవు.

2023లో భారతదేశంలో మొత్తం ఇంధన సబ్సిడీలు రూ. 3.2 లక్షల కోట్లకు చేరుకున్నాయి. 'ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్' చేసిన కొత్త పరిశోధన ప్రకారం ఇవి గత తొమ్మిదేళ్లలో గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. దేశంలో ఇంధన వనరుల డిమాండ్ పెరగడంతో పాటు, 2022లో ప్రపంచ ఇంధన సంక్షోభం నేపథ్యంలో, ప్రభుత్వం 2023లో అన్ని రకాల ఇంధన వనరుల లభ్యతను విస్తరిస్తూ హైబ్రిడ్ విధానాన్ని అవలంబించింది.

పెరుగుతున్న ఇంధన వినియోగం, ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసిన తరువాత అంతర్జాతీయ ఇంధన ధరల సంక్షోభం ప్రభావం, అనేక దేశాలు అనుకున్న లక్ష్యాలకు వ్యతిరేకంగా శిలాజ ఇంధనాలకు మద్దతును గణనీయంగా పెంచాయి. భారతదేశం కూడా ఈ దిశగానే అనేక చర్యలు అమలులోకి తెచ్చింది. 2022–2023లో గరిష్ఠ స్థాయికి చేరుకున్న శిలాజ ఇంధన ధరల ప్రభావం నుంచి పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆదుకోవడానికి భారత ప్రభుత్వం పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ రిటైల్ ధరలను పరిమితం చేసింది. పన్నులను తగ్గించింది. వ్యాపారులు, వినియోగదారులకు ప్రత్యక్ష నగదు బదిలీలు చేసింది. ఆయా చర్యల ఫలితంగా చమురు, గ్యాస్ సబ్సిడీలు 2022తో పోలిస్తే 2023లో 63 శాతం పెరిగాయి. అయితే, 2023లో మొత్తం ఇంధన సబ్సిడీలలో బొగ్గు, చమురు, గ్యాస్ సబ్సిడీలు దాదాపు 40 శాతం కాగా, కాలుష్య రహిత ఇంధన వనరుల (క్లీన్ ఎనర్జీ)కు సబ్సిడీలు 10



శాతం కంటే తక్కువగా ఉన్నాయి. మిగిలిన సబ్సిడీలలో ఎక్కువ భాగం విద్యుత్ వినియోగానికీ, ముఖ్యంగా వ్యవసాయానికి సంబంధించినవీ ఉన్నాయి. ఇదే కాలంలో బొగ్గు సబ్సిడీలు కూడా 17 శాతం పెరిగాయి. మొత్తంగా క్లీన్ ఎనర్జీ సబ్సిడీల కంటే శిలాజ ఇంధన సబ్సిడీలు ఐదు రెట్లు ఎక్కువ.

కేంద్ర ప్రభుత్వం 2023లో ప్రభుత్వ ఆధీనంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలకు ప్రత్యక్ష బడ్జెట్ బదిలీల ద్వారా చమురు, గ్యాస్ రంగానికి గణనీయమైన మద్దతును అందించింది. ఈ కాలంలో, మొత్తం చమురు – గ్యాస్ సబ్సిడీలు కనీసం రూ.70,692 కోట్లకు పెరిగాయి. ఇటీవల కాలంలో ప్రభుత్వ సబ్సిడీల కారణంగా వరి, గోధుమలు, మక్కలు, చెరుకు వంటి ఆహార సంబంధిత ఉత్పత్తుల నుంచి ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి చాలా మంది మొగ్గుచూపుతున్నారు. ఒకవైపు ఆహార భద్రత సాధించటానికీ, ఆకలి తగ్గించడానికీ వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం... ఇంకొక వైపు సబ్సిడీలు ఇచ్చి అదే ఆహార పంటలను ఇతరత్రా ఉపయోగాలకు మళ్ళిస్తోంది. ఇందువల్ల కలిగే దీర్ఘకాలిక దుష్ప్రభావం ఊహించలేని విధంగా ఉండవచ్చు.

2020 ఆర్థిక సంవత్సరంలో, కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కలిపి మొత్తం ఇంధన ఆదాయం రూ. 6,99,565 కోట్లుగా అంచనా. ఇది మొత్తం ప్రభుత్వ ఆదాయంలో దాదాపు 17 శాతం. ఇంధన వనరుల నుంచి వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగం (83 శాతం) చమురు, గ్యాస్ నుండి వస్తోంది. పునరుత్పాదక ఇంధనం నుంచి 1 శాతం కంటే తక్కువే వస్తోంది. ఈ ఆదాయం కూడా ఎక్కువగా కేవలం రెండు పన్నుల నుండి వస్తోంది: కేంద్ర ఇంధన ఎక్సైజ్, రాష్ట్ర స్థాయి వ్యాట్. శిలాజ ఇంధన శక్తి వనరుల వల్ల ఆదాయం 2030 నాటికి అదనంగా రూ. 30 వేల కోట్ల నుంచి రూ. 3,40,000 కోట్లకు పెరగవచ్చు అని అంచనా వేస్తున్నారు. ఈ ఆదాయం కోల్పోవటానికి ప్రభుత్వాలు సిద్ధంగా లేవు. క్రమంగా ఈ ఆదాయం మీద ఆధార పడటం తగ్గించడానికి కూడా సుముఖంగా లేవు.

అయితే శిలాజ ఇంధనాల వల్ల ఆదాయం మాత్రమే కాదు భారం కూడా ఉంటుంది. ఇంధనాల ధరలో ప్రతిబింబించని ఖర్చుల భారం చాల ఎక్కువ. ఒక అంచనా ప్రకారం ఈ భారం ప్రభుత్వ ఆదాయానికి ఐదు రెట్లు ఎక్కువ. ఈ భారం రకరకాలుగా ఉంటుంది. ప్రధానంగా నీరు, గాలి, ఇతర ప్రకృతి వనరుల కాలుష్యం వల్ల కలిగే మరణాలు, అనారోగ్య సమస్యలు, వాటిని అధిగమించడానికి కల్పించవలసిన మౌలిక సదుపాయాల రూపంలో ఈ భారాన్ని చూడవచ్చు.

అందుకే కాలుష్య రహిత ఇంధన (క్లీన్ ఎనర్జీ) ఉత్పత్తులు పెంచడానికి చర్యలు తీసుకోవాలని అనేక అంతర్జాతీయ సంస్థలు అంటున్నాయి. ప్రపంచ వాతావరణ సదస్సులలో కాలుష్య రహిత ఇంధనాల వైపు ఉత్పత్తి, వినియోగ రంగాలు మారాలని ఎప్పటి నుంచో ఒత్తిడి ఉంది. 'గ్లాస్గో కాప్ 26' సదస్సులో బొగ్గు ఆధారిత విద్యుత్, ఇతర ఇంధన ఉపయోగాలను క్రమంగా తగ్గించాలని పెట్టిన ముసాయిదా తీర్మానాన్ని భారత ప్రభుత్వం వ్యతిరేకించింది. కేవలం బొగ్గు కాకుండా అన్ని రకాల శిలాజ ఇంధనాల ఉపయోగం క్రమంగా తగ్గించాలని వాదించింది. దుబాయి కాప్ 28 సదస్సులో ఈ దిశగా అన్ని రకాల శిలాజ ఇంధనాలను దశలవారీగా తగ్గించాలనే తీర్మానం దాదాపు ఖరారు అయినా సర్వామోదం పొందలేదు.

పెరుగుతున్న కర్బన కాలుష్యం కారణంగా భూమి ఉష్ణోగ్రతలు పెరిగి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదకర శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించే దిశగా వాటికి రాయితీలు తగ్గించాలి. అది సాధ్యం కావాలంటే సమూల ఆర్థిక పరివర్తనం అవసరం. ఈ దిశగా చర్యలు తీసుకోవాలి. క్లీన్ ఎనర్జీ అందుబాటులోకి వస్తే ఆర్థిక వృద్ధి సుస్థిరం అవుతుంది. శిలాజ ఇంధన దిగుమతుల మీద ఆధారపడిన ఆర్థిక అభివృద్ధి సుస్థిరం ఎప్పటికీ కాలేదు. ప్రకృతిని కలుషితం చేస్తూ అభివృద్ధి దిశగా పయనించడం దుర్భరంగా ఉంటుంది. అందుకే కర్బన కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా అవసరమైన వాతావరణ లక్ష్యాలను చేరుకోవడం కోసం ఒక ఆచరణాత్మక దృష్టి అవసరం. ప్రభుత్వం శిలాజ ఇంధన పన్ను ఆదాయంలో కొంత భాగాన్ని కొత్త కాలుష్య రహిత శక్తి వనరుల వైపు మళ్ళించాలి. సుస్థిర అభివృద్ధికీ, సమాన ఫలాలు అందరికీ అందించే ఆర్థిక వ్యవస్థకూ ఇంధనాల కూర్పు చాల కీలకం.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.నవమి ప.1.53 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ సా.5.42 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** రా.9.31 నుండి 10.59 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.39 నుండి 12.27 వరకు, **అమృత ఘడియలు:** ప.11.31 నుండి 1.04 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.58, **సూర్యాస్తమయం:** 6.09.

క్లుప్తంగా...

తాను కన్నుమూసినా.. మరో నలుగురికి ప్రాణదానం

- బ్రెయిన్ డెడ్ అయిన మండపేట యువకుడి అవయవాలు దానం


రాజు (ఫైల్)

మండపేట/అక్కిరెడ్డిపాలెం: తాను చని పోతూ మరో నలుగురికి ప్రాణదానం చేశాడు ఓ యువకుడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన అతని అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణంలోని మారేడుబాక రోడ్డులో ఫైర్ స్టేషన్ సమీపాన నివాసం ఉంటున్న వ్యవసాయ కూలీ కాద రాజు (38) గత నెల 28వ తేదీన సైకిల్‌పై వెళుతూ కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. ఆయన్ను వెంటనే కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరానికి, ఆ తర్వాత విశాఖపట్నంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. రాజుకు బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించిన వైద్యులు.. అవయవదానం గురించి అతని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు రాజు అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. దీంతో అతడి గుండె, లివర్‌ను సేకరించి రాత్రి 9.30 గంటలకు ప్రత్యేక విమానంలో తిరుపతిలోని పద్మావతి చిల్డ్రన్ హార్ట్ సెంటర్‌కు తరలించారు. రాజు మృతదేహాన్ని మారేడుబాకకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. రాజుకు భార్య మణి, కుమారుడు అవినాష్, కుమార్తె భార్గవ్ ప్రవీణ ఉన్నారు.

ఆరుగురు మత్స్యకారులు గల్లంతు

మహారాణిపేట (విశాఖ దక్షిణ): విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలోకి వేటకు వెళ్లిన ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారు. వీరంతా విశాఖలోని జాలారిపేట, విజయనగరం జిల్లా ముక్కం గ్రామానికి చెందిన మత్స్యకారులు. సోమవారం రాత్రి నుంచి వి1–ఎంవో 2736 నంబర్ బోటుకు సంబంధించిన నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో బోటు ఏమైందని గల్లంతైన మత్స్యకార కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ బోటు కోసం గాలింపు చర్యలు చేపట్టాలని జిల్లా మత్స్యశాఖ అధికారులు కోస్ట్, నేవీ హెలికాప్టర్ కోసం లేఖ రాశారు. ఈ మత్స్యకార కుటుంబ సభ్యులు మంగళవారం హార్బర్‌లో ఉన్న మత్స్యశాఖ జేడీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. విశాఖపట్నం ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ హార్బర్‌కు వెళ్లి మత్స్యకారులతో మాట్లాడారు. కారి చిన్నారావు, వాసుపల్లి అప్పన్న, కారి చిన్న సత్తయ్య, కారి నరేంద్ర, వాసుపల్లి పొడుగు అప్పన్న, మైలపల్లి మహేశ్ గల్లంతైనట్లు ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వాసుపల్లి జానకిరామ్ తెలిపారు.

రేక్స్, కార్గో నిర్వహణలో 'గంగవరం' సరికొత్త రికార్డు



పెదగంట్యాడ(విశాఖపట్నం): అదానీ గంగవరం పోర్టు 2024లో 7,473 రేక్‌లను నిర్వహించడంతో పాటు ఇయర్ ఆన్ ఇయర్ 20 శాతం వృద్ధిని సాధించడం ద్వారా సరికొత్త రికార్డును సృష్టించింది. పోర్టు 2023–2024 ఆర్థిక సంవత్సరంలో తమ అత్యధిక వార్షిక కార్గో 37.24 ఎంఎంటీని, ఇయర్ ఆన్ ఇయర్ 15 శాతం వృద్ధిని సాధించేందుకు సిద్ధంగా ఉంది. పోర్టు కంటెయినర్ ట్రేడులో అత్యుత్తమ సేవలను అందించడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా బుధవారం అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ స్కానర్ సౌకర్యాన్ని ప్రారంభించనుంది.

హత్యాయత్నం కేసులో టీడీపీ నేత 'కప్పిర' అరెస్ట్

నెల్లూరు (క్రైమ్): హత్యకేసులో సాక్షిగా ఉన్న వ్యక్తిపై హత్యాయత్నం చేసిన కేసులో టీడీపీ నేత కప్పిర శ్రీనివాసులును చిన్నబజారు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... సంతపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, న్యాయవాది అల్లం నరేంద్ర 2014 డిసెంబర్ 30న దారుణ హత్యకు గురయ్యారు. ఆ హత్య కేసులో కప్పిర శ్రీనివాసులు ప్రధాన నిందితుడు. ఆ కేసు ప్రస్తుతం కోర్టులో ట్రయల్‌కు వచ్చింది. నరేంద్ర సతీమణి అనుపమ ప్రస్తుతం ఫత్తేఖాన్‌పేటలో నివాసం ఉంటున్నారు. ఆమె తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెబితే శిక్ష పడుతుందని భావించిన శ్రీనివాసులు చంపేస్తానని బెదిరింపులకు పాల్పడసాగాడు. ఈ క్రమంలో సోమవారం ఫత్తేఖాన్‌పేట రైతుబజారు వద్ద శ్రీనివాసులు ఆమెపై కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితునిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బి.అశోక్‌కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐలు, సిబ్బంది మంగళవారం కప్పిర శ్రీనివాసులును సంతపేటలోని అతని ఇంటి వద్ద అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. నిందితుడి భార్య రేవతి తన అనుచరులతో పోలీసుస్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ప్రత్యేక భద్రత నడుమ పోలీసులు శ్రీనివాసులును కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి నిందితునికి రిమాండ్ విధించారు. అనంతరం శ్రీనివాసులును పోలీసులు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

ప్రత్యేక పరిశీలకుల నియామకం

ఎన్నికల్లో ధనబలం, అక్రమ మద్యం, ఉచితాల పంపిణీపై పకడ్బందీగా నిఘా

రాష్ట్రానికి సాధారణ ప్రత్యేక పరిశీలకునిగా రిటైర్డ్ ఐఏఎస్ రామ్మోహన్ మిశ్రా..	రాష్ట్ర వ్యయ పరిశీలకునిగా రిటైర్డ్ ఐఆర్ఎస్ నిగమ్
పోలీస్ ప్రత్యేక పరిశీలకునిగా దీపక్ మిశ్రా	కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ

సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): వచ్చే నెలలో లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలకులను నియమించింది. ఎన్నికల్లో డబ్బు, కండ బలం, అక్రమ మద్యం, ఉచితాల పంపిణీపై పకడ్బందీగా నిఘా పెట్టేందుకు ఏపీ సహా బిహార్, మహారాష్ట్ర, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌కు ఈ ప్రత్యేక పరిశీలకులు నియమితులయ్యారు. మంచి ట్రాక్ రికార్డు కలిగిన రిటైర్డ్ సివిల్ సర్వీసు అధికారులను నియమించడమే కాక ఆయా రాష్ట్రాల్లో పర్యవేక్షించాల్సిన అంశాలను సీఈసీ వివరించింది. ఆంధ్రప్రదేశ్‌కు సాధారణ ప్రత్యేక పరిశీలకునిగా రిటైర్డ్ ఐఏఎస్ రామ్మోహన్ మిశ్రా, పోలీసు ప్రత్యేక పరిశీలకునిగా దీపక్ మిశ్రా, వ్యయ పరిశీలకునిగా రిటైర్డ్ ఐఆర్ఎస్ నిగమ్‌ను నియమించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న తీరుపై వీరు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ నిఘా ఉంచుతారని పేర్కొంది. అలాగే..

- పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జిల్లాల్లో నియమించిన ఇతర ఎన్నికల పరిశీలకుల పనికి ఇబ్బంది కలిగించకుండా ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారాన్ని పొందవచ్చు. సమన్వయ విధానంలో ఉమ్మడి లక్ష్యాల కోసం పనిచేయాల్సి ఉంటుంది.
- ప్రాంతీయ అధిపతులు, పర్యవేక్షణ కార్యకలాపాల్లో పాల్గొన్న వివిధ ఏజెన్సీలు, నోడల్ అధికారులతో సమన్వయం చేసుకుని అవసరమైన సమాచారాన్ని పొందే అధికారం కలిగి ఉంటారు.
- ఎన్నికల సందర్భంగా సరిహద్దు ప్రాంతాలు ఎదుర్కొనే సున్నితమైన సమస్యలు, ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలి.
- ఎన్నికల ప్రక్రియలో కమిషన్ మార్గదర్శకాల అమలు, ఇంటర్ ఏజెన్సీ సమన్వయం, తప్పుడు సమాచారంపై అధికారుల ప్రతిస్పందన కోసం వెచ్చిస్తున్న సమయం, ఎన్నికలకు 72 గంటల ముందు చేయకూడని.. చేయాల్సిన పనులను పర్యవేక్షించడం, స్వేచ్ఛగా.. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూడాలి.
- ఇక ఎన్నికల సంఘం లేదా జోనల్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్లు, డీసీఈఓలు, ఎస్పీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు నిర్వహించే సమావేశాల్లో కూడా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తంచేస్తారు.
- ఎన్నికలు నిష్పాక్షికత, విశ్వసనీయతను నిర్ధారించడానికి కీలకమైన పూర్తి బాధ్యతలను, అధికారాలను ఈ పరిశీలకులకు అప్పగించారు.


కమాండ్ కంట్రోల్ రూంలో సౌకర్యాలను పరిశీలిస్తున్న జనరల్ అబ్జర్వర్ రామ్ మోహన్ మిశ్రా

జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు భేష్

ఇక సాధారణ ఎన్నికల నిర్వహణకు జిల్లా ఎన్నికల అధికారి, పోలీస్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు సమన్వయంతో చేపట్టిన ఏర్పాట్లు భేషుగ్గా ఉన్నాయని రామ్మోహన్ మిశ్రా అభినందించారు. ఇదే పంథాను చివరివరకు కొనసాగించాలని సూచించారు. విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని ఎన్నికల ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూంను, ఎంసీఎంసీ, సోషల్ మీడియా విభాగాలను మంగళవారం ఆయన పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లోని సీ–విజిల్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఐటీ, బ్యాంకింగ్, కమర్షియల్ టాక్స్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎస్ఎంఎస్), కస్టమ్స్ తదితర విభాగాల కార్యకలాపాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ఎన్నికల నిర్వహణకు చేపట్టిన చర్యలను జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ టీకే రాణా వివరించారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఓటర్ల వివరాలు, గత ఎన్నికల్లో పోలింగ్ శాతం వంటి వివరాలను చెప్పారు. ఈ ఎన్నికల్లో జిల్లాలో 85 శాతం ఓటింగ్ లక్ష్యంగా విస్తృత ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 13, 14 తేదీల్లో ఈ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లుచేసినట్లు తెలిపారు. అదేవిధంగా పోలీస్ కమిషనర్ టీకే రాణా జిల్లాలో ఎలక్షన్ సీజర్లను, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకున్న చర్యలను వివరించారు. కంట్రోల్ రూమ్ పనితీరుపట్ల కూడా రామ్మోహన్ సంతృప్తి వ్యక్తంచేశారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చే డేటాను సరైన విధంగా విశ్లేషించి సరైన కార్యాచరణ దిశగా అడుగులేయాలన్నారు. అనంతరం గూడవల్లి ఇంటర్ డిస్ట్రిక్ట్ బోర్డర్ చెక్ పోస్టును ఆయన సందర్శించి సిబ్బందికి సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్‌కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీఓ బీహెచ్ భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


ఆలయంలో ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుమల: ఏప్రిల్ 9న ఉగాదిని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని టీటీడీ మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించింది. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయం 6 నుంచి 11 గంటల వరకు శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. ఆనంద నిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ప్రసాదాల పోటు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పుతోపాటు పూజాసామగ్రిని శుద్ధి చేశారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి వేశారు. శుద్ధి పూర్తయిన అనంతరం సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తరువాత భక్తులను దర్శనానికి అనుమతించారు. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల సొమ్ము యానిమేటర్ స్వాహా

- గ్రూపు సభ్యుల సంతకాలు లేకుండానే రూ.కోటి లూటీ
- టీడీపీ కార్యకర్త అయిన యానిమేటర్ చేతివాటం
- యూనియన్ బ్యాంక్ వద్ద బాధిత మహిళల ఆందోళన
- బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని మంత్రి కారుమూరి ఆదేశం


దువ్వలో బ్యాంక్ వద్ద ఆందోళన చేస్తున్న డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: పొదుపు సంఘాల సొమ్మును టీడీపీ కార్యకర్త అయిన ఓ డ్వాక్రా యానిమేటర్ స్వాహా చేశారు. పొదుపు సంఘాల సభ్యుల సంతకాలు లేకుండానే ఆమె రూ.కోటి వరకు లూటీ చేశారు. ఈ విషయం తెలిసిన బాధిత మహిళలు రెండు రోజులుగా బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు... పశ్చిమ గోదావరి జిల్లా తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామానికి చెందిన డ్వాక్రా యానిమేటర్, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీవోఏ)గా పనిచేస్తున్న వీరమళ్ల భాగ్యలక్ష్మి పరిధిలో మొత్తం 45 డ్వాక్రా సంఘాలకు చెందిన 450 మంది సభ్యుల పొదుపు, రుణ ఖాతాల వివరాలు ఉంటాయి. ఆ వివరాల ఆధారంగా తమకు తెలియకుండానే తమ పేరుతో భాగ్యలక్ష్మి రూ.కోటి వరకు రుణాలు తీసుకుని తన బ్యాంక్ ఖాతాలకు బదిలీ చేసుకున్నారు. ఈ విషయం తెలిసి రెండు రోజులుగా దువ్వ గ్రామంలోని యూనియన్ బ్యాంకు వద్ద పొదుపు సంఘాల మహిళలు ఆందోళన చేస్తున్నారు. ఈ వ్యవహారం గురించి బ్యాంక్ సిబ్బందిని అడిగితే స్పందించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పూర్తి వివరాలు సేకరించిన తర్వాత చెబుతామంటున్నారని మండిపడుతున్నారు. గ్రూపు సభ్యుల తీర్మానాల పుస్తకంలో కూడా సభ్యుల సంతకాలు లేకుండానే భాగ్యలక్ష్మి రుణాలు తీసుకున్నట్లుగా రికార్డుల్లో ఉందని మహిళలు చెబుతున్నారు. బాధిత మహిళల వద్దకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. అక్కడి నుంచే కలెక్టర్ సుమిత్‌కుమార్‌తోపాటు జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే బాధితులకు ప్రతి పైసా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్‌తో మంత్రి మాట్లాడుతూ బుధవారం సాయంత్రంలోగా బాధిత మహిళలకు న్యాయం చేయాలని చెప్పారు. నిందితుల ఆస్తులను జప్తు చేసైనా బాధితులకు సొమ్ము చెల్లించాలని మంత్రి ఆదేశించారు.

జస్టిస్ శేషసాయిని కలిసిన బీబీఏ కొత్త కార్యవర్గం


జస్టిస్ వెంకట శేషసాయిని సత్కరిస్తున్న బెజవాడ బార్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం

సాక్షి, అమరావతి: హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, కృష్ణా జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయిని బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) నూతన కార్యవర్గం మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసింది. హైకోర్టులోని జస్టిస్ శేషసాయి చాంబర్‌లో కలిసి ఆయనను శాలువాలతో సన్మానించింది. కొత్త కార్యవర్గానికి జస్టిస్ శేషసాయి అభినందనలు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. జస్టిస్ శేషసాయిని కలిసిన వారిలో బీబీఏ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు జి.వెంకట రామశర్మ, ప్రధాన కార్యదర్శి అరిగల శివరామ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి కలతోటి క్రాంతి కుమార్, లైబ్రేరియన్ రవికుమార్, కోశాధికారి నిడుమోలు సుబ్రహ్మణ్యం, క్రీడల కార్యదర్శి షేక్ అజ్గర్, మహిళా కార్యదర్శి ఎస్.రాజ్యలక్ష్మి ఉన్నారు.

ఉచితంగా ఇంగ్లిష్ నైపుణ్యాలు

- ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు
- 'మేధా ఇన్‌స్టిట్యూట్' ఫౌండర్ చిరంజీవి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఉపాధికి తప్పనిసరి అర్హతగా మారుతున్న ఇంగ్లిషులో మరింత మంది నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఉందని 'మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్' వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ఏ రంగంలోనైనా ఇంగ్లిష్‌పై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచీ ఇంగ్లిషు మీడియాన్ని అందుబాటులోకి తేవటం చాలా ప్రశంసనీయమన్నారు. రేపటి తరం పిల్లలంతా ఇంగ్లిషు విద్యను అభ్యసిస్తున్నారు కనక... వారితో మ్యాచ్ కావాల్సిన నిన్నటితరం పెద్దలు, ఇంగ్లిషు భాషా నైపుణ్య లోపాల కారణంగా మెరుగైన అవకాశాలు అందుకోలేని యువత... వీరందరి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లిషు స్పీకింగ్ కోర్సును అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. ''ఇంగ్లిషు నేర్చుకోవాలన్న ఆసక్తి ఉన్నవారికోసం 'మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్' సంస్థ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లిష్ కార్యక్రమాన్ని తలపెట్టాం. ఆన్‌లైన్లో ఉచితంగా అందజేస్తాం'' అని చిరంజీవి తెలియజేశారు. ఈజీ ఇంగ్లిష్ ద్వారా రాష్ట్రంలోని యువతకు కేవలం స్పోకెన్ ఇంగ్లిష్ మాత్రమే కాకుండా దాదాపు 9 రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు.ఈ నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభించాలని భావిస్తున్నామన్నారు.

ఉచితంగా... అందరికీ

''మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్‌ను 1994లో ప్రారంభించాం. విశాఖపట్నంలో ఆరంభించి తెలుగు రాష్ట్రాల్లో 18 శాఖలుగా విస్తరించాం. ప్రస్తుతం ఆన్‌లైన్ మాడ్యూల్స్‌పై ఎక్కువగా ఫోకస్ పెడుతున్నాం. మా సంస్థకు 30 ఏళ్లయిన సందర్భంగా అందిస్తున్న ఉచిత ఇంగ్లిష్ నైపుణ్య కోర్సుకు ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం దిగువ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే చాలు. వారి మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింకు వస్తుంది. లేనిపక్షంలో 9866006662 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపినా వారి మొబైల్ ఫోన్‌కు లింకును పంపిస్తాం.

పది అంశాల్లో శిక్షణ..

ఈజీ ఇంగ్లిష్ ద్వారా స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులే కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, గోల్ సెట్టింగ్, పాజిటివ్ మెంటల్ ఆటిట్యూడ్, పబ్లిక్ రిలేషన్స్, స్ట్రెస్ మేనేజ్మెంట్, టైమ్ మేనేజ్మెంట్, మైండ్ మేనేజ్మెంట్, లీడర్‌షిప్ క్వాలిటీస్‌పై శిక్షణ ఇస్తాం. ప్రతి రోజు శిక్షణ ముగిసిన తర్వాత పరీక్ష పెట్టడంతో పాటు స్టడీ మెటీరియల్‌నూ ఇస్తాం. ఈ కార్యక్రమాలను ఆన్‌లైన్ పద్ధతిలో లైవ్‌లో అందిస్తాం. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 10వ తేదీ వరకు కొనసాగుతుంది. ఆ తర్వాత తరగతులు ప్రారంభిస్తాం. ఈ శిక్షణ కోసం మేధా ఇన్‌స్టిట్యూట్ తరఫున 30 మంది నిపుణుల బృందం పనిచేస్తుంది. లైవ్‌లో నిర్వహించే ఈ తరగతులపై ఏవైనా సందేహాలుంటే చాట్ ద్వారా జవాబులిస్తాం''. అని చిరంజీవి తెలిపారు.

'చైతన్య' విద్యార్థిని ఆత్మహత్య కేసులో ఐదుగురు అరెస్ట్

- ల్యాబ్ టెక్నీషియన్ శంకరరావు లైంగిక వేధింపుల వల్లే రూపశ్రీ ఆత్మహత్య
- మేనేజ్‌మెంట్, ప్రిన్సిపాల్, వార్డెన్, ఆమె భర్తపైనా కేసు నమోదు
- విశాఖ డీసీపీ–1 మణికంత

విశాఖ సిటీ: కొమ్మాదిలోని చైతన్య కాలేజీ మైనర్ విద్యార్థిని ఆత్మహత్య కేసులో పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. కాలేజీ ల్యాబ్ టెక్నీషియన్ లైంగిక వేధింపుల కారణంగానే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ వ్యవహారంలో కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యం ఉన్నట్లు నిర్ధారణ య్యింది. దీంతో కెమిస్ట్రీ ల్యాబ్ టెక్నీషియన్ నూనెల శంకరరావుతో పాటు కాలేజ్ మేనేజ్‌మెంట్ శంకర్ వర్మ, ప్రిన్సిపాల్ గుల్లిపల్లి భాను ప్రవీణ్, వార్డెన్ వంటపతి ఉషారాణి, వార్డెన్ భర్త వంటపతి ప్రదీప్ కుమార్‌ను అరెస్టు చేసినట్లు విశాఖ డీసీపీ–1 మణికంత తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన వివరాలు వెల్లడించారు. కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కాలేజీలో అనకాపల్లి జిల్లా నాతవరం మండలానికి చెందిన విద్యార్థిని రూపశ్రీ (16) హాస్టల్‌లో ఉంటూ డిప్లమో మొదటి సంవత్సరం చదువుతున్నది. ఈ నెల 28వ తేదీన కాలేజీలో లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయని తన తండ్రి, సోదరికి వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపించి.. రాత్రి ఒంటి గంట సమయంలో హాస్టల్ బిల్డింగ్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఘటన జరిగిన అనంతరం తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఇందులో కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యం ఉన్నట్లు వెల్లడైంది. నాలుగు అంతస్తుల హాస్టల్‌లో ప్రతి ఫ్లోర్‌కు ఒక వార్డెన్ ఉండాల్సి ఉండగా, అన్నింటికీ కలిపి ఒకరే ఉన్నారు. మహిళా వార్డెన్‌తో పాటు ఆమె భర్త కూడా మహిళా హాస్టల్ లోనే ఉంటున్నాడు. కాగా, విద్యార్థిని మెసేజ్‌లో రాసిన విధంగా కాలేజీ ఫ్యాకల్టీలో లైంగిక వేధింపులకు ఎవరు పాల్పడుతున్నారన్న విషయంపై పోలీసులు విద్యార్థినులను విచారించారు. కెమిస్ట్రీ ల్యాబ్ టెక్నీషియన్ నూనెల శంకరరావుపైనే వారంతా ఫిర్యాదు చేశారు. ల్యాబ్‌కు వచ్చే విద్యార్థినుల గోళ్లు తనిఖీ చేసే ముసుగులో వాళ్ల చేతులు పట్టుకుంటూ.. విద్యార్థినులకు దగ్గరగా వెళుతూ శరీరాన్ని తాకుతూ, వారి భుజాలపై చేతులు వేస్తుండడంతో పాటు లైంగికంగా వేధించేవాడని తెలిపారు. దీంతో పోలీసులు ల్యాబ్ టెక్నీషియన్ శంకరరావుతో పాటు కాలేజీ యాజమాన్యం శంకర్ వర్మ, ప్రిన్సిపాల్ గుల్లిపల్లి భాను ప్రవీణ్, వార్డెన్ వంటపతి ఉషారాణి, వార్డెన్ భర్త వంటపతి ప్రదీప్‌కుమార్‌ను అరెస్టు చేశారు.

మెట్టూరులో ఎలుగుబంటి

వజ్రపుకొత్తూరు రూరల్: శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో మరో ఎలుగుబంటి కలకలం సృష్టించింది. మెట్టూరు గ్రామంలో ఓ ఎలుగు ఆహారం కోసం వెతుకుతూ సోమవారం అర్ధరాత్రి పాడుబడిన ఇంటిలోకి ప్రవేశించింది. ఈ విషయాన్ని స్థానికులు అటవీ శాఖాధికారులకు తెలియజేశారు. దీంతో అధికారులు మంగళవారం జిల్లా అటవీశాఖాధికారి నిషాకుమారి సమక్షంలో ఆపరేషన్ భల్లూకం చేపట్టారు. సుమారు 10 గంటల పాటు శ్రమించి ఎట్టకేలకు భల్లూకాన్ని బోనులో బంధించారు.

వలంటీర్లను సంఘ విద్రోహులుగా చూసింది బాబు కాదా..?

రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ఆగ్రహం



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానకర్తలుగా ఉన్న వలంటీర్లను చంద్రబాబు సంఘ విద్రోహులుగా చూడటం సరికాదని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మండిపడ్డారు. వలంటీర్లను తొలగించాలని ఒకసారి, పింఛన్లు ఇవ్వకూడదని మరోసారి మాట్లాడుతూ మళ్లీ తాను అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తామంటున్న బాబు కల్లబొల్లిమాటలను ప్రజలు నమ్మరన్నారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు హాల్‌లో మంగళవారం నిర్వహించిన రజకుల ఆత్మీయ సమావేశంలో మంత్రి ధర్మాన పాల్గొని మాట్లాడారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు పణంగా పెట్టి పనిచేసిన వలంటీర్ల సేవలను ప్రజలెవరూ మర్చిపోలేరన్నారు. అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో వారే కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. పక్క రాష్ట్రాల్లో నివసిస్తూ చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్న పవన్, చంద్రబాబులకు వలంటీర్ల సేవల గురించి ఏం తెలుసని ప్రశ్నించారు. సంక్షేమం అమలు చేయడమంటే సినిమాల్లో నటించినంత సులువు కాదని ఆయన పవన్ కళ్యాణ్‌కు చురకలు అంటించారు. చిన్న కులాలను తక్కువ చేసి మాట్లాడేవారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రజలకు, రాష్ట్రానికి మంచి భవిష్యత్ కావాలంటే మళ్లీ జగన్‌నే గెలిపించుకోవాలని ధర్మాన పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, నాయకులు నగవరపు రాజు, కంచెర్ల అరుణ, గండేపల్లి విజయబాబు పాల్గొన్నారు.

మాదిగలను దగా చేసిన మోదీ ప్రభుత్వం

- నయవంచకుడు చంద్రబాబు
- ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ



తిరుపతి కల్చరల్: అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తానని 2014లో తిరుపతి వెంకన్న సాక్షిగా హామీ ఇచ్చి దాన్ని అమలు చేయకుండా మోదీ ప్రభుత్వం దగా చేసిందని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ధ్వజమెత్తారు. మంగళవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. వర్గీకరణ చేపడతానని హామీ ఇచ్చి మేనిఫెస్టోలో పెట్టి పూర్తిగా విస్మరించి మోసగించిన మనువాద ఎన్డీఏ కూటమికి మందకృష్ణ మాదిగ మద్దతివ్వడం సిగ్గుచేటన్నారు. ఇక 2014లో డప్పుకొట్టి, చెప్పుకుట్టినేనే వర్గీకరణ చేసి పెద్ద మాదిగ అవుతానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వర్గీకరణ ఊసే లేకుండా చేసి ఎంఆర్‌పీఎస్ ఉద్యమాన్ని అణచివేతకు గురి చేసిన నయవంచకుడని దుయ్యబట్టారు. మాదిగలను సభలు, సమావేశాలు పెట్టనివ్వకుండా నిర్బంధానికి గురి చేసి అమరావతికి మాదిగల్ని అంటరాని వారిగా చేసిన చంద్రబాబుకు మంద కృష్ణ మాదిగ మద్దతివ్వడం మాదిగ జాతి ఆత్మ గౌరవాన్ని అవహేళన చేయడమేనన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: వంశీ


టీడీపీ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వల్లభనేని వంశీ

రామవరప్పాడు: కృష్ణాజిల్లా, గన్నవరం నియోజకవర్గం, ఉంగుటూరు మండలం వెల్దిపాడు గ్రామ సర్పంచ్ లాం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 50 మంది టీడీపీ నాయకులు మంగళవారం గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రసాదంపాడు ఎన్నికల ప్రచారంలో ఉన్న వంశీ మోహన్ వీరిని సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువా కప్పారు. నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతమయ్యేలా కృషి చేయాలని సూచించారు.

యూటీలు ఎటో?

2019లో బీజేపీదే హవా | 12 సీట్లలో ఐదింట గెలుపు | ఈసారి 8 ఖాయం: సర్వేలు

కేంద్రపాలిత ప్రాంతాల్లో (యూటీ) మొదటి నుంచీ జాతీయ పార్టీలదే ఆధిపత్యం! గత ఎన్నికల్లో యూటీల్లో మెజారిటీ సీట్లు దక్కించుకున్న బీజేపీ ఈసారి మరిన్ని సీట్లపై కన్నేయగా, వాటిల్లో ఈసారి ఎలాగైనా సత్తా చాటాలని కాంగ్రెస్ భావిస్తోంది...



2019 లోక్‌సభ ఎన్నికల్లో యూటీలను బీజేపీ కొల్లగొట్టింది. ఢిల్లీలో మొత్తం 7 సీట్లనూ చేజిక్కించుకుంది. జమ్మూ కశ్మీర్, లద్దాఖ్‌ల్లో 3 సీట్లు నెగ్గింది. చండీగఢ్ ఎంపీ సీటును కాషాయ పార్టీ తరఫున ప్రముఖ నటి కిరణ్ అనుపమ్ ఖేర్ వరుసగా రెండోసారి గెలిచారు. అంతక్రితం ఈ సీటు కాంగ్రెస్ గుప్పిట్లో ఉండేది. డామన్ డయ్యు స్థానమూ బీజేపీ హస్తగతమైంది. 1987లో ఏర్పాటైన ఈ యూటీలో కాంగ్రెస్ 5 సార్లు, బీజేపీ 6 సార్లు నెగ్గాయి. అయితే 2009 నుంచీ ఇక్కడ కాషాయ జెండానే ఎగురుతోంది. అండమాన్ నికోబార్‌లో మాత్రం బీజేపీ సీటును కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది! 2009, 2014ల్లో బీజేపీ గెలిచిన ఈ స్థానం 2019లో కాంగ్రెస్ పరమైంది. దాద్రానగర్ హవేలీ సీటును 2021 ఉప ఎన్నికల్లో శివసేన గెలుచుకుంది. ఇక్కడ పలు పార్టీల తరఫున ఏకంగా ఏడుసార్లు నెగ్గిన మోహన్‌భాయ్ సంజీభాయ్ దేల్కర్ 2019లో స్వతంత్రునిగా నెగ్గారు. 2021లో అనుమానాస్పద రీతిలో ఆత్మహత్య చేసుకున్నారు. దాంతో ఆయన భార్య కాలాబెన్ మోహన్‌భాయ్ దేల్కర్ శివసేన తరఫున పోటీ చేసి నెగ్గారు. ఇక లక్షద్వీప్‌లో కాంగ్రెస్ హవాకు 2019లో ఎన్సీపీ అడ్డుకట్ట వేసింది. ఇటీవల మాల్దీవులతో వివాదం నేపథ్యంలో లక్షద్వీప్ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. మోదీ పర్యటన తర్వాత టూరిస్టుల తాకిడి కూడా పెరిగింది.



నోట్: కేంద్రపాలిత ప్రాంతాల్లో 7 లోక్‌సభ స్థానాలున్న ఢిల్లీపై విడిగా కథనం అందిస్తాం

2019లో ఏ పార్టీకి ఎన్ని?

(మొత్తం సీట్లు 12)

అండమాన్ నికోబార్ - 1 (కాంగ్రెస్ 1)
చండీగఢ్ - 1 (బీజేపీ 1)
దాద్రానగర్ హవేలీ - 1 (శివసేన 1)
డామన్ డయ్యూ 1 (బీజేపీ 1)
జమ్మూకశ్మీర్ - 5 (బీజేపీ 2, జేకేఎన్సీ 3)
లద్దాఖ్ - 1 (బీజేపీ 1)
లక్షద్వీప్ - 1 (ఎన్సీపీ 1)
పుదుచ్చేరి - 1 (కాంగ్రెస్ 1)

పుదుచ్చేరిపై పార్టీల గురి

పుదుచ్చేరిలో ప్రాంతీయ పార్టీలైన ఎన్ఆర్ కాంగ్రెస్ (ఎన్ఆర్సీ), డీఎంకేతో పాటు కాంగ్రెస్ కూడా చక్రం తిప్పుతున్నాయి. ఈ ఎంపీ సీటును 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్ఆర్సీ గెలుచుకుంది. 2019లో దీన్ని కాంగ్రెస్ చేజిక్కించుకుని బీజేపీ, ఎన్ఆర్సీలతో కూడిన ఎన్డీఏ కూటమికి షాకిచ్చింది. ఎన్.రంగస్వామి కాంగ్రెస్ నుండి విడిపోయి ఎన్ఆర్ కాంగ్రెస్ పేరుతో సొంత కుంపటి పెట్టుకున్నారు. నాటినుంచి ఇక్కడ కాంగ్రెస్ తేరుకోలేకపోతోంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 30 సీట్లలో ఎన్ఆర్సీ 10 చోట్ల గెలిచింది. బీజేపీకి 6 సీట్లు రావడంతో రంగస్వామి మళ్లీ సీఎంగా ఎన్డీఏ సర్కారు కొలువుదీరింది. పుదుచ్చేరి అసెంబ్లీలోని నియోజకవర్గాల్లో ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉన్న యానాం కూడా ఉండటం విశేషం!

కశ్మీర్.. బీజేపీ బ్రహ్మాస్త్రం

2019లో బంపర్ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన నాటినుంచీ జమ్మూ కశ్మీర్‌పై మోదీ సర్కారు ఫోకస్ చేసింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తున్న ఆర్టికల్ 370ను 2019 ఆగస్ట్ 5న రద్దు చేసింది. రాష్ట్రాన్ని జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా విడగొట్టింది. ఉమ్మడి రాష్ట్రంలో 6 లోక్‌సభ స్థానాలున్నాయి. 2019లో జమ్మూ, లద్దాఖ్‌లోని 3 సీట్లను బీజేపీ గెలుచుకుంది. కశ్మీర్ లోయలోని 3 సీట్లను జమ్మూ కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ (జేకేఎన్సీ) చేజిక్కించుకుంది. 2014లో కూడా బీజేపీకి 3 సీట్లు రాగా పీడీపీకి 3 దక్కాయి. 2014 చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పీడీపీ 28 సీట్లు, బీజేపీ 25 సీట్లలో గెలిచి ముఫ్తీ మహమ్మద్ సయీద్ సీఎంగా సంకీర్ణ సర్కారును ఏర్పాటు చేశాయి. 2016లో ఆయన మరణించడంతో కుమార్తె మెహబూబా ముఫ్తీ సీఎం అయ్యారు. 2018లో బీజేపీ మద్దతు ఉపసంహరించడంతో ప్రభుత్వం కూలిపోయింది. ఈ ఏడాది సెప్టెంబర్ లోపు అక్కడ జమ్మూ కశ్మీర్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత దానికి మళ్లీ రాష్ట్ర హోదా దక్కే అవకాశాలున్నాయి. గతంలో ఇక్కడ చక్రం తిప్పిన కాంగ్రెస్ గులాంనబీ ఆజాద్ రాజీనామాతో గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. సొంత పార్టీ పెట్టుకున్న ఆజాద్ చిన్న పార్టీలతో కలిసి పోటీ చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇండియా కూటమి పక్షాలు కాంగ్రెస్, ఎన్సీ, పీడీపీ సీట్ల సర్దుబాటు ఇంకా కొలిక్కి రాలేదు. జమ్మూలోని 2 సీట్లలో కాంగ్రెస్‌కు ఎన్సీ, పీడీపీ మద్దతివ్వనున్నాయి. కశ్మీర్ లోయలోని 3 సీట్లపై మాత్రం పీటముడి పడింది. మూడింట్లోనూ పోటీ చేస్తామని ఎన్సీ ప్రకటించింది. పీడీపీ కూడా వెనక్కి తగ్గడం లేదు.

పోలింగ్ తేదీలు...

అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరి - ఏప్రిల్ 19 (1వ విడత)
దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూ - మే 7 (3వ విడత)
లద్దాఖ్ - మే 20 (5వ విడత)
చండీగఢ్ - జూన్ 1 (7వ విడత)
జమ్మూ కశ్మీర్ - ఏప్రిల్ 19, 26, మే 7, 13, 20 (5 విడతలు)

సర్వేల అంచనాలు ఇలా...

ఈసారి కేంద్రపాలిత ప్రాంతాల్లో బీజేపీ బలం మరింత పెరుగుతుందని సర్వేలు చెబుతున్నాయి. ఢిల్లీలో మళ్లీ క్లీన్‌స్వీప్‌తో పాటు పుదుచ్చేరి, లద్దాఖ్, చండీగఢ్ ఆ పార్టీ పరం అవుతాయంటున్నాయి. జమ్మూ కశ్మీర్‌లో 2, దాద్రానగర్, డామన్ డయ్యు, అండమాన్ సీటు కూడా బీజేపీ వేసన్నది వాటి అంచనా. కాంగ్రెస్ లక్షద్వీప్‌లో మాత్రం నెగ్గవచ్చని, కశ్మీర్‌లోని 3 సీట్లలో ఎన్సీ గెలుస్తుందని అన్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్



ఎన్నికల విచిత్రం

కాదేదీ ప్రచారానికి అనర్హం అంటున్నారు అభ్యర్థులు. చివరికిలా మొండిగోడలను కూడా వదలడం లేదు. కేరళలో అలత్తూర్ లోక్‌సభ స్థానం పరిధిలో వాటిపై ఇలా కాంగ్రెస్ అభ్యర్థి పోస్టర్లు అంటించారు!

ఎలక్షన్ బీట్

మహిళా సిబ్బందితో 'మహే' పోలింగ్

పుదుచ్చేరి: పుదుచ్చేరిలోని మహే లోక్‌సభ నియోజకవర్గంలో పోలింగ్‌ను పూర్తిగా మహిళలే నిర్వహించనున్నారు. మహే ప్రాంతంలో మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉన్నందున.. మొత్తం 31 పోలింగ్ స్టేషన్లలో మహిళలనే విధుల్లో ఉంచనున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి.జవహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు ఎన్నికలను మెరుగైన పద్ధతిలో నిర్వహించగలరని, 'మోడల్ పోలింగ్ స్టేషన్లు' ఏర్పాటు ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఇక ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఒక పోలింగ్ కేంద్రంలో పూర్తిగా దివ్యాంగులైన ప్రభుత్వ సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. శిశువులతో పోలింగ్ బూత్‌కు వచ్చే మహిళల పిల్లల సంరక్షణ కోసం క్రెచ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నామన్నారు.

ఒడిశాలో ఎన్నికల 'శంఖా'రాగం..!

ఒడిశా: శంఖారావం... హిందువులు ఏవైనా శుభకార్యాలు ప్రారంభించేప్పుడు, ప్రత్యేకించి జాతరలు, పండుగల సమయాల్లో చేసేది. ఈ ఎన్నికల వేళ ఒడిశా మొత్తం శంఖారావం చేస్తోంది. రాష్ట్రంలో లోక్‌సభతో పాటు శాసనసభకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడి అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ) పార్టీ గుర్తు 'శంఖం'. ఎన్నికల ప్రచారం కోసం ప్రారంభించేందుకు ఆ పార్టీ అభ్యర్థులంతా శంఖం ఊదేవారిని సంప్రదిస్తున్నారు. దీంతో శంఖం ఊదేవారికి డిమాండ్ పెరిగింది.

అనంత్‌నాగ్ -రాజౌరీ నుంచి ఆజాద్

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్ అనంత్‌నాగ్-రాజౌరీ నియోజకవర్గం నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తారని డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డీపీఏపీ) తెలిపింది. పార్టీ కోర్ కమిటీ సమావేశమై, ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీపీఏపీ నేత తాజ్ మొహియుద్దీన్ తెలిపారు. కాశ్మీర్‌లోని ఇతర లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను తగిన సమయంలో నిర్ణయిస్తామని మొహియుద్దీన్ చెప్పారు. కాంగ్రెస్‌తో ఐదు దశాబ్దాల అనుబంధానికి ముగింపు పలికిన ఆజాద్.. 2022లో సొంత పార్టీ డీపీఏపీని ప్రారంభించారు. 2014లో ఉధంపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, బీజేపీ నేత జితేంద్ర సింగ్ చేతిలో ఓడిపోయిన తర్వాత ఆజాద్‌కు ఇదే తొలి లోక్‌సభ ఎన్నికలు.

17 మందితో కాంగ్రెస్ మరో జాబితా

న్యూఢిల్లీ: మరో 17 మంది లోక్‌సభ అభ్యర్థుల పేర్లతో తాజా జాబితాను కాంగ్రెస్ పార్టీ మంగళవారం విడుదలచేసింది. ఈ జాబితా ప్రకారం బిహార్‌లోని కృష్ణగంజ్ నుంచి మొహమ్మద్ జావెద్ పోటీ చేయనున్నారు. కతిహార్ నుంచి తారిఖ్ అన్వర్, భాగల్పూర్ నుంచి ఎమ్మెల్యే అజీత్ శర్మ బరిలో నిలుస్తున్నారు. మొత్తంగా ఒడిశాలో ఎనిమిది, ఆంధ్రప్రదేశ్‌లో ఐదు, బిహార్‌లో మూడు, పశ్చిమ బెంగాల్‌లో ఒక్క స్థానానికి అభ్యర్థులను కాంగ్రెస్ తాజాగా ఎంపికచేసింది. పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ నుంచి మునీశ్ తమాంగ్ పోటీచేస్తారు. మంగళవారం విడుదలైన జాబితాతో కలిపి పార్టీ ఇప్పటిదాకా దేశవ్యాప్తంగా 228 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది.

సరన్ నా కర్మభూమి: రోహిణి

సరన్: సరన్ తన కర్మభూమి అని ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కూతురు రోహిణీ ఆచార్య అన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో సరన్ నియోజకవర్గం నుంచి ఆర్జేడీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న ఆమె మంగళవారం తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. సోనేపూర్ చేరుకున్న ఆమెకు పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కొడుకులనే గాక కూతురిని కూడా లాలూ రాజకీయాల్లోకి తేవడం వారసత్వ రాజకీయాలకు మరో ఉదాహరణ అని బీజేపీ ఎద్దేవా చేసింది.

మోదీతో రాహుల్‌కు పోలికా: షా

బెంగళూరు: ''ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి పదవుల్లో ఏకధాటిగా 23 ఏళ్లపాటు కొనసాగిన నరేంద్ర మోదీ ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు. కాంగ్రెస్ నేత రాహుల్ బాబా మాత్రం వేసవి వస్తుందంటే విదేశీ యాత్రలకు వెళ్లిపోతారు. ఆయన ఎక్కడున్నారోనని ప్రతి ఆరు నెలలకు కాంగ్రెస్ వెతుక్కుంటుంది'' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం ఎద్దేవా చేశారు. ''23 ఏళ్ల పదవీ కాలంలో మోదీ కనీసం 25 పైసల అవినీతికి పాల్పడినట్లు కూడా ప్రతిపక్షాలు ఆయన్ను వేలెత్తి చూపలేదు. యూపీఏ పదేళ్ల పాలనలోనేమో ఏకంగా రూ.12 లక్షల కోట్ల కుంభకోణాలు జరిగాయి. మోదీ వంటి నేత ప్రపంచంలోనే మరొకరు ఉండరేమో! వాళ్లు, వీళ్లని తేడా లేకుండా ప్రపంచమంతా మోదీని ఆరాధిస్తోంది. ఆయనకు, రాహుల్‌కు పోలికే లేదు'' అని అమిత్ షా అభిప్రాయపడ్డారు.

అమరావతి బరిలో అంబేడ్కర్ మనవడు

ముంబై: బీఆర్ అంబేడ్కర్ మనవడు, రిపబ్లికన్ సేన నేత ఆనంద్‌రాజ్ అంబేడ్కర్ మహారాష్ట్రలోని అమరావతి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. అమరావతిలో బహుముఖ పోటీ నెలకొంది. బీజేపీ సిట్టింగ్ ఎంపీ నవనీత్ రానా, కాంగ్రెస్ బల్వంత్ వాంఖడే, వంచిత్ బహుజన్ అఘాడీ నుంచి ప్రజక్త పిల్లెవన్, ప్రహార్ జనశక్తి పార్టీ నేత దినేశ్ బుబ్ రంగంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆనంద్‌రాజ్ తమ మద్దతు కోరారని ఎంఐఎం నేత, ఔరంగాబాద్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ మంగళవారం వెల్లడించారు.

నైట్ క్లబ్‌లో అగ్ని ప్రమాదం.. 29 మంది దుర్మరణం

ఇస్తాంబుల్: తుర్కియేలోని అతిపెద్ద నగరం ఇస్తాంబుల్‌లోని ఓ నైట్ క్లబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 29 మందిని బలి తీసుకుంది. క్లబ్‌లో పునరుద్ధరణ పనుల సందర్భంగా ఈ దర్ఘటన జరిగింది. బాధితులంతా పునరుద్ధరణ పనుల్లో పాల్గొన్న వారేనని అధికారులన్నారు. ఇస్తాంబుల్‌లో యూరప్ ఖండం పరిధిలోకి వచ్చే బెసిక్టాస్ జిల్లాలోని ఓ భవనంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

బాబా రామ్‌దేవ్‌పై సుప్రీం ఆగ్రహం

మాట తప్పారని మొట్టికాయ ● క్షమాపణలు తిరస్కరించిన కోర్టు

న్యూఢిల్లీ: ఆధునిక వైద్య శాస్త్రాలను తప్పుబడుతూ మరోసారి వాణిజ్య ప్రకటనలు ఇవ్వబోమని సుప్రీంకోర్టుకు చెప్పి కూడా అదే తప్పును పునరావృతం చేశారంటూ యోగా గురు రామ్‌దేవ్, పతంజలి ఆయుర్వేద ఎండీ బాలకృష్ణలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. వారు మంగళవారం వారు వ్యక్తిగతంగా హాజరై క్షమాపణలు చెప్పినా తిరస్కరించింది. మనస్ఫూర్తిగా చెప్పలేదంటూ మండిపడింది. ''కోవిడ్ విజృంభణ సమయంలో అలోపతిని తక్కువ చేసి చూపుతూ, తమ ఉత్పత్తులే రోగాలను నయం చేస్తాయని పతంజలి ప్రకటనలిచ్చింది. అయినా కేంద్రం చర్యలు తీసుకోకుండా కళ్లు మూసుకుంది'' అంటూ జస్టిస్ హిమా కోహ్లి నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేసింది. తప్పుడు ప్రకటనలు ఇవ్వబోమంటూ కోర్టు సంతృప్తి చెందేలా మరోసారి అఫిడవిట్లు సమర్పించాలని వారిని ఆదేశించింది. ఉత్పత్తుల వాణిజ్య ప్రకటనల విషయంలో చట్టాన్ని ఇకపై ఉల్లంఘించబోమని పతంజలి ఆయుర్వేద లిమిటెడ్ నవంబర్ 21న సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. తర్వాత ఉల్లంఘనకు పాల్పడటంపై కోర్టు షోకాజ్ నోటీసులిచ్చినా వాటికి పతంజలి స్పందించలేదు.

స్కూల్‌లో 12 ఏళ్ల బాలుడు కాల్పులు.. ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

హెల్సింకీ: ఫిన్లాండ్‌లోని ఓ పాఠశాల వద్ద 12 ఏళ్ల విద్యార్థి జరిపిన కాల్పుల్లో ఒకరు చనిపోగా మరో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. రాజధాని హెల్సింకీ శివారులో వంటా నగరంలోని వియెర్టోలా పాఠశాలలో మంగళవారం ఉదయం ఘటన చోటుచేసుకుంది. బాలుడు తన బంధువుకు చెందిన లైసెన్స్‌డ్ హ్యాండ్‌గన్‌తో జరిపిన కాల్పుల్లో ఒక విద్యార్థి అక్కడికక్కడే చనిపోగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు.

బీజేపీలో చేరకుంటే అరెస్టేనన్నారు

త్వరలో నాతోసహా నలుగురిని అరెస్టు చేస్తారు ● ఢిల్లీ మంత్రి, ఆప్ నేత అతిశి

న్యూఢిల్లీ: బీజేపీలో చేరాలని, లేకపోతే నెల రోజుల్లోగా అరెస్టు కావడానికి సిద్ధంగా ఉండాలంటూ ఓ సన్నిహితుడి ద్వారా ఆ పార్టీ నేతలు తనకు వర్తమానం పంపించారని ఢిల్లీ మంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత అతిశి ఆరోపించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ద్వారా అరెస్టు చేయిస్తామంటూ హెచ్చరికలు పంపారని అన్నారు. తనతో సహా నలుగురిని త్వరలో అరెస్టు అవకాశం ఉందని చెప్పారు. ఆమె మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్, ఎమ్మెల్యే దుర్గేశ్ పాఠక్, రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దాతోపాటు తనను త్వరలో అరెస్టు చేయబోతున్నారని తెలిపారు. కేజ్రీవాల్‌ను జైలుకు పంపించినా ఆమ్ ఆద్మీ పార్టీని విచ్ఛిన్నం చేయలేమన్న నిజాన్ని బీజేపీ గుర్తించిందని, అందుకే తమ నలుగురిని టార్గెట్ చేసిందని విమర్శించారు. తనకు అందిన సమాచారం ప్రకారం.. తొలుత తన ఇంట్లో, బంధువుల ఇళ్లల్లో సోదాలు జరుగుతాయని, తర్వాత తనకు సమన్లు ఇస్తారని, అనంతరం అరెస్టు చేస్తారని పేర్కొన్నారు. మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నిందితుడు కాదని, చార్జిషీట్‌లో ఆయన పేరు లేదని గుర్తుచేశారు. అందుకే ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే అవకాశం లేదని అతిశీ స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఆయన పూర్తిస్థాయి మెజార్టీ ఉందని వివరించారు. మరోవైపు మంత్రి అతిశీ ఆరోపణలను బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ ఖండించారు. ''ఆరోపణలకు ఆమె ఆధారాలు చూపాలి. లేదంటే చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలి'' అన్నారు.



సంజయ్ సింగ్‌కు బెయిల్

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఆప్ ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్‌కు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. సంజయ్ కస్టడీ పొడిగింపు అవసరం లేదని ఈడీ పేర్కొనడంతో ఈ నిర్ణయం తీసుకుంది. వైద్య పరీక్షల అనంతరం ఆయన్ను బుధవారం విడుదల చేస్తారని సమాచారం. సంజయ్‌ని గతేడాది అక్టోబర్ 4న ఈడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రజాస్వామ్యంలో ఇదొక గొప్ప రోజని ఆప్ నేత, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ అన్నారు. సాక్షులను, అప్రూవర్లను బెదిరించి తీసుకున్న స్టేట్‌మెంట్ల ఆధారంగా లిక్కర్ కుంభకోణం కేసును సృష్టించినట్లు సుప్రీంకోర్టు ఉత్తర్వును బట్టి తేటతెల్లం అవుతోందని పేర్కొన్నారు. విపక్షాలపై దర్యాప్తు సంస్థలు కక్షపూరితంగా వ్యవహరించడం లేదని బీజేపీ పేర్కొంది. బెయిల్‌కు ఈడీ అభ్యంతరం చెప్పకపోవడమే నిదర్శనమంది.

జైలులో కేజ్రీవాల్ ధ్యానం

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తిహార్ జైలులో ఇతర ఖైదీల తరహాలోనే సాధారణ జీవనం గడుపుతున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కోర్టు ఆయనను 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీ విధించిన సంగతి తెలిసిందే. సోమవారం సాయంత్రం 4 గంటలకు జైలుకు చేరుకున్న కేజ్రీవాల్ రాత్రంతా సరిగ్గా నిద్రపోలేదు. మంగళవారం తెల్లవారుజామున లేచారు. తన గదిలోనే తొలుత గంటకుపైగా ధ్యానం, యోగా చేశారు. ఉదయం 6.40 గంటలకు అల్పాహారం స్వీకరించారు. బ్రెడ్, టీ తీసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భోజనం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు అధికారులు ఆయనకు రాత్రి భోజనం అందించారు. జైలులో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు టీవీ చూసే అవకాశం కేజ్రీవాల్‌కు కల్పించారు. దోమల బెడద లేకుండా బ్యారక్‌లో తెర అమర్చారు. మధుమేహంతో బాధపడుతున్న కేజ్రీవాల్‌కు జైలు అధికారులు కుర్చీ, టేబుల్‌తో పాటు ప్రత్యేక మంచాన్ని ఏర్పాటు చేశారు. ఆయన రక్తంలో చక్కెర స్థాయిలను తెలుసుకోవడానికిషుగర్ సెన్సార్, గ్లూకోమీటర్‌ను అందుబాటులో ఉంచారు. మంగళవారం ఉదయం పరీక్షించగా, చక్కెర స్థాయి కొంత పడిపోయినట్లు వెల్లడయ్యింది.

పక్కనే ఉగ్రవాది, డాన్, గ్యాంగ్‌స్టర్

తిహార్ జైలు ప్రాంగణంలోని నెంబర్ 2 జైలులో ఉన్న కేజ్రీవాల్ సమీపంలోనే అండర్‌వరల్డ్ డాన్ చోటా రాజన్, గ్యాంగ్‌స్టర్ నీరజ్ బవానా, ఉగ్రవాది జియాఉర్ రెహ్మాన్ తదితర నేరగాళ్లు ఉన్నారు. ఒకప్పుడు దావూద్ ఇబ్రహీంకు సన్నిహితుడైన చోటా రాజన్ తర్వాత అతడికే ప్రత్యర్థిగా మారాడు. నీరజ్ బవానాపై 40కిపైగా కేసులున్నాయి. ఇక జియాఉర్ రెహ్మాన్ ఉగ్రవాద సంస్థ ఇండియన్ ముజాహిదీన్‌లో సభ్యుడిగా చేరి, దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నాడు.

అవినీతిపై ఉక్కుపాదమే

ఇది నా గ్యారంటీ: మోదీ
- మూడో టర్మ్‌లో కఠిన చర్యలు
- కాంగ్రెస్‌ను తుడిచిపెట్టాలి
- అవినీతిపరులు జైలుకేనని వ్యాఖ్య

రుద్రపూర్/జైపూర్: అవినీతిలో కూరుకుపోయిన కొందరు నాయకులు తనను బెదిరించేలా మాట్లాడుతున్నారని, నిస్సిగ్గుగా దూషిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. అలాంటి వారికి భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో నెగ్గి, మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అవినీతిపై మరింత కఠిన చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. అవినీతిపై ఇక ఉక్కుపాదమేనని, ఇది తన గ్యారంటీ అని స్పష్టం చేశారు. అవినీతికి వ్యతిరేకంగా దేశం గొంతు విప్పుతోందని అన్నారు. ప్రతి ఒక్క అవినీతిపరుడిపై చర్యలు ఉంటాయని, ఎవరినీ వదిలిపెట్టబోమని పేర్కొన్నారు. తప్పుడు పనులు చేసినవారు జైలుకు వెళ్లాల్సిందేనని పేర్కొన్నారు. తనను తిట్టొచ్చు, బెదిరించవచ్చు గానీ అవినీతిపై చర్యల విషయంలో మాత్రం ఎవరూ అడ్డుకోలేరని తెలిపారు. మోదీ మూడోసారి ప్రధాని అయితే దేశమంతటా మంటలు తప్పవంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్‌ను దేశం నుంచి తుడిచిపెట్టేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. మంగళవారం ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో తొలి బహిరంగ సభలో ప్రసంగించారు. కాంగ్రెస్, 'ఇండియా' కూటమి ఉద్దేశాలు బయటపడుతున్నాయని చెప్పారు. అధికారం కోల్పోయి నిరాశలో ఉన్న కాంగ్రెస్ రాజకుటుంబ వారసుడు దేశంలో మంటలు సృష్టించడం గురించి మాట్లాడుతున్నాడని, అలాంటివి మీరు అనుమతిస్తారా? అని ప్రజలను ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ విధమైన అనుచిత భాష మాట్లాడవచ్చా? వారిని మీరు శిక్షిస్తారా? లేదా? అని అడిగారు.



బుజ్జగింపు రాజకీయాలే కాంగ్రెస్ నైజం 'ఎమర్జెన్సీ' ఆలోచనా ధోరణి ఉన్న కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్యంపై ఏమాత్రం విశ్వాసం లేదని ప్రధానమంత్రి ఆరోపించారు. ఎన్నికల్లో రాబోయే ఫలితాలపై ప్రజలను రెచ్చగొట్టాలని కుట్ర పన్నిందని ధ్వజమెత్తారు. దేశాన్ని అస్థిరత, అరాచకం వైపు మళ్లించాలన్నదే కాంగ్రెస్ ధ్యేయమని ఆక్షేపించారు. ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. దేశాన్ని విడగొట్టాలన్న కాంగ్రెస్ నాయకుడిని శిక్షించాల్సింది పోయి లోక్‌సభ బరిలో దింపుతోందని ఆక్షేపించారు.

ఆ అగ్నిని పదేళ్లుగా ఆర్పేస్తున్నా...

విపక్ష 'ఇండియా' కూటమిపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. ''అవినీతిపై చర్యలను అడ్డుకోవడానికి అవినీతిపరులంతా చేతులు కలిపిన తొలి లోక్‌సభ ఎన్నికలివి. సొంత కుటుంబాలను కాపాడుకోవడానికి కుటుంబ పార్టీలు ర్యాలీల మీద ర్యాలీలు వరుసగా నిర్వహిస్తున్న తొలి ఎన్నికలు కూడా ఇవే'' అన్నారు. రాజస్తాన్‌లోని కోట్‌పుత్లీలో ఆయన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ మళ్లీ గెలిస్తే దేశం అగ్నిగుండం అవుతుందంటూ కాంగ్రెస్ నేతలు బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. అలాంటి అగ్నిని గత పదేళ్లుగా తాను ఆర్పేస్తూనే ఉన్నానని స్పష్టం చేశారు.

మహువాపై ఈడీ మనీ లాండరింగ్ కేసు

న్యూఢిల్లీ: డబ్బులు తీసుకుని పార్లమెంట్‌లో ప్రశ్నలడిగిన కేసులో టీఎంసీ నేత మహువా మొయిత్రా, వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీలపై ఈడీ మనీ లాండరింగ్ కేసు నమోదు చేసింది. ''సీబీఐ ఫిర్యాదు ఆధారంగా ఈ చర్య తీసుకున్నాం. ఫెమా నిబంధనల కింద దర్యాప్తు చేస్తున్నాం'' అని ఈడీ వర్గాలు తెలిపాయి. విచారణకు రావాలంటూ సమన్లు పంపగా అధికార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నావని వారు బదులిచ్చారని వెల్లడించాయి.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

పది మంది మావోయిస్టుల మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బీజాపూర్ జిల్లాలో మంగళవారం పోలీసుల బలగాలు, మావోల నడుమ జరిగిన ఎదురుకాల్పుల్లో పది మంది మావోయిస్టులు మృతి చెందారు. గంగులూరు పోలీస్‌స్టేషన్ పరిధి కొర్చోలి, లేంద్ర గ్రామాల సమీపాన అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశమయ్యారనే నిఘా వర్గాల సమాచారంతో సోమవారం రాత్రి జిల్లా రిజర్వ్ గార్డ్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా కమాండో , బస్తర్ ఫైటర్స్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం కొర్చోలి, లేంద్ర మధ్య అటవీ ప్రాంతంలో బలగాలకు మావోయిస్టులు తారసపడి కాల్పులు మొదలుపెట్టారు. దీంతో పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. సుమారు రెండు గంటలపాటు హోరాహోరీగా జరిగిన కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. దీంతో మావోయిస్టులు అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేస్తుండగా 11 గంటల సమయాన మళ్లీ వారికి మావోలు తారసపడి కాల్పులకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్‌లో మరో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. మొత్తంగా పది మంది మావోయిస్టులు మృతి చెందారని, ఇందులో ఒక మహిళ ఉన్నారని బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందర్ రాజు వెల్లడించారు. మృతులు మావోల పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ రెండో కంపెనీ సభ్యులుగా పోలీసులు అనుమానిస్తున్నారు. కాల్పుల ఘటనలో సుమారు 30 మంది మావోలు పాల్గొని ఉంటారని భావిస్తున్నారు. పలువురు గాయాలపాలై తప్పించుకున్నట్లు భావించి పోలీసులు కూంబింగ్ ముమ్మరం చేశారు. ఘటనాస్థలి నుంచి పెద్ద మొత్తంలో లైట్ మెషీన్ గన్స్, ఏకే 47 తుపాకులు, బ్యారెల్ గ్రనేడ్ లాంచర్లు, మందుపాతరలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు ఐజీ తెలిపారు.

మధ్యప్రదేశ్‌లో మరో ఇద్దరు

బాలాఘాట్: మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఘటనలో ఇద్దరు కరడుగట్టిన మావోయిస్టులు మృతి చెందారు. వారిని సాజంతి అలియాస్ క్రాంతి(38), రఘు అలియాస్ షేర్ సింగ్(52)గా గుర్తించారు. ఘటనా స్థలిలో ఆయుధాలు దొరికాయి. సాజంతిపై రూ.29 లక్షలు, రఘుపై రూ.14 లక్షల రివార్డులున్నాయి.

రూ.1,460 కోట్ల బాండ్ సమర్పించిన ట్రంప్

న్యూయార్క్: ఆస్తులను ఎక్కువ చేసి చూసి రుణాలు, బీమాలు పొంది బ్యాంక్‌లు, బీమా సంస్థలను మోసం చేశారన్న కేసులో కోర్టు ఆదేశాల మేరకు అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకంగా రూ.1,460(17.5 కోట్ల డాలర్లు) విలువైన ష్యూరిటీ బాండ్‌ను న్యూయార్క్ కోర్టుకు సమర్పించారు. ఈ కేసులో గతంలో రూ.3,785 కోట్ల జరిమానా చెల్లించాలని కోర్టు గతంలో ట్రంప్‌కు సూచించింది. దీనిపై ట్రంప్ పై కోర్టులో సవాల్ చేస్తామని చెప్పారు. అయితే ఆలోపు ఆస్తుల జప్తు ఆగాలంటే కనీసం 17.5 కోట్ల డాలర్ల బాండ్‌ను తమకు సమర్పించాలంటూ ట్రంప్‌కు న్యూయార్క్ అప్పీలేట్ కోర్టు 10 రోజుల గడువు ఇచ్చిన తెల్సిందే. దీంతో ట్రంప్ ఎట్టకేలకు అంతటి భారీ మొత్తానికి బాండ్ సమర్పించారు. దీంతో ట్రంప్ ఆస్తుల జప్తు తాత్కాలికంగా ఆగింది. 45.4 కోట్ల డాలర్ల(రూ.3,785 కోట్ల) జరిమానా సంబంధిత ఈ కేసులో ట్రంప్ ఒక వేళ గెలిస్తేనే ఈ రూ.1,460 కోట్ల బాండ్‌ను ఆయనకు తిరిగి ఇస్తారు. ఓడితే ట్రంప్ మొత్తం 45.4 కోట్ల డాలర్ల జరిమానాను రోజువారీ వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుంది.

పెన్షన్లు ఆపింది చంద్రబాబే

మదనపల్లె సభలో సీఎం వైఎస్ జగన్

> గత ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసిన వారికి కూడా మన ప్రభుత్వం మంచి చేసింది. ఏం మంచి చేశామో వాళ్లకు చూపించి, వారి మనసు తట్టి, వారి గుండెను గెలిచి, ఫ్యానుకు ఓటు వేస్తేనే.. మళ్లీ జగన్ సీఎంగా ఉంటేనే ఈ మంచి కొనసాగుతుందని చెప్పే నైతికత మనకు మాత్రమే ఉంది. మన అక్కచెల్లెమ్మలను ఈ ఐదేళ్ల మాదిరిగానే వచ్చే ఐదేళ్లు కూడా ఆర్థికంగా మరింత బలోపేతం చేయడానికే మళ్లీ మనందరి ప్రభుత్వం రావాలి. కుటుంబానికి ఆ అక్కచెల్లెమ్మలను బలమైన శక్తిగా నిలబెట్టే ప్రక్రియ కొనసాగించాలనే లక్ష్యంతోనే మళ్లీ అధికారం అడుగుతున్నాం.
>
> \- సీఎం వైఎస్ జగన్





సీఎం జగన్ పిలుపు మేరకు సెల్‌ఫోన్‌లోని టార్చ్‌లైట్లను ఆన్ చేసి మేమంతా సిద్ధం అని నినదిస్తున్న ప్రజలు

సాక్షి ప్రతినిధి, కడప : 'చంద్రబాబుకు పేదలంటే గిట్టదు. వారికి మేలు చేస్తున్న మన వలంటీర్ల వ్యవస్థ అంటే అసలే గిట్టదు. మొదటి నుంచీ ఈ వ్యవస్థపై ఏడుపే. ఈ ఏడుపులో భాగంగా మూడు రోజుల క్రితం ఏం జరిగిందో మీరందరూ చూశారు. లక్షల మంది అవ్వాతాతలకు, వికలాంగులకు, వితంతు అక్కచెల్లెమ్మలకు, ఇంకా తమను తాము పోషించుకోలేని అభాగ్యుల ఇంటికి వలంటీర్లు వెళ్లి పింఛన్ ఇవ్వడాన్ని అడ్డుకున్నారు. ఈ పెన్షన్ డబ్బులు అందితే తప్ప జీవితాలు గడవని వారికి నెలనెలా 1వ తారీఖున ఇంటికే వచ్చి, సూర్యోదయానికంటే మునుపే చిక్కటి చిరునవ్వులతో పెన్షన్ ఇచ్చిపోతున్న వలంటీర్లపై తన మనిషి నిమ్మగడ్డ రమేష్ చేత ఫిర్యాదు చేయించాడు. వారు ఏప్రిల్ 1వ తారీఖు నుంచి పెన్షన్ ఇవ్వటానికి వీల్లేదని ఎన్నికల కమిషన్ ద్వారా ఆదేశాలు ఇప్పించారు. జగన్‌ను నేరుగా దెబ్బ కొట్టలేక ముసలి వాళ్లపై కక్ష తీర్చుకుంటున్నారు. ఇలాంటి మనిషిని ఏమనాలి?' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా 6వ రోజు మంగళవారం సాయంత్రం అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 66 లక్షల మంది పేదలకు నష్టం కలిగిస్తున్నానన్న కనీస ఇంగిత జ్ఞానం కూడా లేకుండా చంద్రబాబు వ్యవహరించారని మండిపడ్డారు. నడవలేని వయసులో ఉన్న అవ్వాతాతలు, వికలాంగులకు తోడుగా నిలిచిన వలంటీర్ వ్యవస్థను ప్రశంసించాల్సింది పోయి.. ఏకంగా ఆ వ్యవస్థను రద్దు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో ఈ పెద్దమనిషి గవర్నమెంట్ బడుల్లో ఇంగ్లిష్ మీడియంను కూడా ఇలానే వ్యతిరేకించాడని, పేద పిల్లలకు ట్యాబులిస్తుంటే కూడా వ్యతిరేకించారని చెప్పారు. పేదలకు మీ బిడ్డ ఇళ్ల స్థలాలు ఇస్తుంటే కోర్టుల్లో కేసులు వేయించిన చంద్రబాబుది పెత్తందారీ భావజాలం కాదా? అని ప్రశ్నించారు. ఇలాంటి పెత్తందార్లకు, ఇలాంటి పేదల వ్యతిరేకులకు పొరపాటున ఓటు వేస్తే.. తమ పెన్షన్లు, తమకు అందే స్కీములు, ఇంటింటికీ వచ్చి సేవలందించే వలంటీర్ వ్యవస్థను రద్దు చేసేందుకు మనమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లవుతుందని ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..



ర్యాంప్‌పై విద్యార్థినితో అభివాదం చేయిస్తున్న సీఎం జగన్

మెరిట్ విద్యార్థి పరీక్షలకు భయపడతాడా?

- ఇవాళ ఎన్నికలు వస్తున్నాయంటే ప్రతిపక్షంలో ఉన్న వారంతా విడివిడిగా రాలేకపోతున్నారు. ఒంటరిగా పోటీ చేసే ధైర్యం ఏ ఒక్కరికీ లేదు.అధికారం కోసం గుంపులుగా, తోడేళ్లగా జెండాలు జత కట్టి.. అబద్ధాలతో వస్తున్నారు. జెండాలు జత కట్టడమే వారి పని. ఇంత మంచి జరిగింది కాబట్టే మీ జగన్ ప్రజల గుండెల్లో గుడి కట్టాడు. అందుకే ఈరోజున ఒక్కడి మీద ఇంత మంది దాడి చేస్తున్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, చంద్రబాబు, ఒక దత్తపుత్రుడు, ఒక బీజేపీ, ఒక కాంగ్రెస్.. వీళ్లందరూ కుట్రలు, కుతంత్రాలతో ఏకమవుతున్నారు.
- ఇంత మంది జతకట్టి వచ్చినా వాళ్లందరికీ తెలియని విషయం ఒకటి ఉంది. 99 మార్కులు తెచ్చుకున్న మెరిట్ స్టూడెంట్ పరీక్షలకు భయపడతాడా? అటువైపు గతంలో వాళ్ల పరీక్షలు రాసినప్పుడు 10 మార్కులు కూడా తెచ్చుకోని స్టూడెంట్.. పరీక్ష పాసవుతాడా? ఎన్నికల మేనిఫెస్టోను ఒక బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావిస్తూ ఏకంగా 99 శాతం వాగ్దానాలు నెరవేర్చిన మన విశ్వసనీయత ముందు 10 శాతం వాగ్దానాలు కూడా తన హయాంలో నెరవేర్చకుండా మోసం చేసిన చంద్రబాబు, ఆయన కూటమి నిలబడగలుగుతుందా?
- విలువలు, విశ్వసనీయత లేని ఇలాంటి వారితో 30 పార్టీలు కలిసి వచ్చినా మన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, పేద వర్గాలు భయపడరు. పైగా పెత్తందారులతో సమరానికి మేమంతా సిద్ధం.. అని చెబుతున్నారు.
- '175 అసెంబ్లీ స్థానాలకు 175, 25 ఎంపీ సీట్లుకు 25 మొత్తం రెండు వందల సీట్లు.. ఎక్కడా తగ్గేందుకు వీల్లేదు. డబుల్ సెంచరీ కొట్టేందుకు నేను సిద్ధం.. మీరంతా సిద్ధమేనా.. మళ్లీ మనందరి ప్రభుత్వమే ఉండాలన్న ఆకాంక్షతో పేదల వ్యతిరేకులను, పెత్తందార్లను ప్రతిపక్ష కూటమిని ఓడించాలన్న సంకల్పంతో తరలి వచ్చిన సమరయోధుల సముద్రంలా మదనపల్లె కనిపిస్తోంది.

టీడీపీకి ఓటు వేసిన వారికీ మంచి చేశాం

- ఈ ఐదేళ్లలో రూ.2.70 లక్షల కోట్లు ఎలాంటి లంచాలు, వివక్ష లేకుండా నేరుగా నా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లో జమ చేశాం. ఇందులో 75 శాతం నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారున్నారు. నాన్ డీబీటీ కూడా కలిపితే, అంటే నా అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన ఇంటి స్థలాలు, వారి పిల్లలకు పెట్టే గోరుముద్ద, ట్యాబులు, విద్యా కానుక లాంటివి కలుపుకొంటే అది రూ.లక్ష కోట్లు అదనం. మొత్తంగా రూ.3.70 లక్షల కోట్లు పైచిలుకు పంపించాం. ఇదీ మన ట్రాక్ రికార్డు.
- చంద్రబాబు పేరు చెబితే.. ఆయన చేసిన ఏ మంచీ గుర్తుకు రాదు. అదే మీ జగన్ పేరు చెబితే గ్రామ, వార్డు సచివాలయాలు, అందులో 10 మంది శాశ్వత ఉద్యోగులు, ఇంటికే వచ్చి పింఛన్ ఇచ్చే, ఇతర సేవలు అందించే వలంటీర్లు, విలేజ్ క్లినిక్, మీ ఇంటి వద్దకే వైద్య సేవలు, ఉచితంగా మందులు, ట్యాబ్లెట్లు, ఉచితంగా టెస్టులు.. ఇంగ్లిష్ మీడియం, ట్యాబులు, డిజిటల్ బోధన, ఆర్బీకేలు, రైతన్నలకు సున్నా వడ్డీ, పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్, ఉచిత పంటల బీమా, సమయానికే రైతన్నకు ఇన్‌పుట్ సబ్సిడీ గుర్తుకొస్తాయి.
- 35 లక్షల ఎకరాల మీద శాశ్వత హక్కులు ఇచ్చాం. మనం వచ్చేటప్పటికి 4 లక్షల ఉద్యోగాలుంటే, ఏకంగా మరో 2.31 లక్షల ఉద్యోగాలు ఇచ్చింది మీ జగనే. ఇందులో 80 శాతం ఉద్యోగాలు నేను నా.. నా.. నా.. నా.. అని పిలుచుకునే వర్గాల వారే ఉన్నారు.
- అక్కచెల్లెమ్మల పేరిట ఏకంగా 31 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చాం. అందులో 22 లక్షల ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతోంది. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, సున్నా వడ్డీ, ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, కళ్యాణమస్తు, షాదీ తోఫా.. ఈ పథకాలంటే గుర్తుకొచ్చేది మీ జగన్. మహిళా సాధికారత, దిశ యాప్, ప్రతి గ్రామంలో మహిళా పోలీసు ఉందంటే.. గుర్తుకొచ్చేది మీ జగనే. 17 కొత్త మెడికల్ కాలేజీలు ప్రతి జిల్లాలోనూ వేగంగా నిర్మాణం జరుగుతున్నాయి.
- కొత్తగా 4 సీ పోర్టులు కడుతున్నాం. మరో 10 ఫిషింగ్ హార్బర్లు కడుతున్నాం. ఎయిర్ పోర్టులు, వాటి విస్తరణ వేగంగా జరుగుతోంది. పారిశ్రామిక కారిడార్లలో ఎప్పుడూ ఎవరూ వినని కంపెనీలు ఈరోజు రాష్ట్రంలోకి అడుగులు వేస్తున్నాయి.

నిజమైన సామాజిక న్యాయానికి జైకొడదాం

- నిజమైన సామాజిక న్యాయానికి జై కొట్టండి. రాబోయే రోజుల్లో పేదలకు, పెత్తందార్లకు మధ్య జరగబోయే ఎన్నికల కురుక్షేత్ర యుద్ధంలో జరగబోయేదేమిటో తెలుసా? ప్రజలకు మంచి చేసిన ఫ్యాను.. మీ ఇంట్లోనే ఉంటుంది. అంటే అధికారంలోనే ఉంటుంది. ప్రజలను పదే పదే మోసం చేసిన సైకిల్ ఇంటి బయటే ఉంటుంది. బాబు ప్యాకేజీని గటగటా తాగేసి తన వారిని తాకట్టుపెట్టిన గ్లాసు సింక్‌లోనే ఉంటుంది. ఇది ప్రజల మాట.
- ఆ పొత్తుల, ఎత్తుల, జిత్తుల ముఠా ఎన్ని చేసినా, ఏమిచెప్పినా ఎంత ప్రయత్నించినా మన ప్రజలకు మనం చెప్పాల్సింది ఒక్కటే. మనం వేసే ఈ ఓటు కేవలం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకునేందుకు మాత్రమే కాదు. మన భవిష్యత్తు, మన తల రాతలు ఈ ఓటు మీద ఆధారపడి ఉన్నాయని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పండి. మళ్లీ అన్నను తెచ్చుకుందాం.. అన్నే రావాలి. ఈ ఐదేళ్లుగా జరిగిన మంచిని కొనసాగించేందుకు, పేదవాడి భవిష్యత్ బాగు పడటానికి, మనందరి ప్రభుత్వానికి తోడుగా నిలబడటానికి, మళ్లీ అన్నే రావాలని ప్రతి ఒక్కరికీ, ప్రతి గడపకూ వెళ్లి చెప్పండి.

పేదల రక్తం పీల్చే పసుపుపతి చంద్రబాబు



- మోసాలే అలవాటుగా, అబద్ధాలే పునాదులుగా చేసుకున్న ఓ జిత్తుల మారి పొత్తుల ముఠాతో యుద్ధం చేస్తున్నాం. ఆ ముఠా నాయకుడు నారా చంద్రబాబునాయుడు. నోటికి వచ్చిన అబద్ధాలు చెబుతున్న ఈ పసుపుపతి 2014లోనూ ఇదే మాదిరి పొత్తులు పెట్టుకున్నాడు. ఈ మూడు పార్టీలూ కలిసి ఇంటింటికీ ముఖ్యమైన హామీలు అంటూ పాంప్లెట్ పంపించారు. చంద్రబాబు, దత్తపుత్రుడు, మోదీ ఫొటోలు.. కింద చంద్రబాబు నాయుడు సంతకంతో ఈ పాంప్లెట్ (చూపిస్తూ) పంపించాడు.
- ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5లో అడ్వర్టైజ్‌మెంట్లతో హోరెత్తించారు. రైతులకు రుణ మాఫీపై మొదటి సంతకం చేస్తా అన్నాడు. రూ.87,612 కోట్లు రుణ మాఫీ చేశాడా? పొదుపు సంఘాల ద్వారా రుణాలు రూ.14,205 కోట్లు మాఫీ చేశాడా? ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకు అకౌంట్లో డిపాజిట్ చేశాడా? ఇంటింటికీ ఉద్యోగం.. లేదా నెలనెలా రూ.2 వేల నిరుద్యోగభృతి ఇస్తామన్నాడు. ఐదేళ్లు.. అంటే 60 నెలలకు నెలకు రూ.2000 చొప్పున లెక్కిస్తే.. ప్రతి ఇంటికీ రూ.1.20 లక్షలు ఇచ్చారా? అర్హులైన వాళ్లందరికీ 3 సెంట్ల స్థలం ఇచ్చారా? రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత, పవర్ లూమ్స్ రుణాలన్నీ మాఫీ అన్నాడు.. చేశాడా?
- మహిళల రక్షణకు ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు జరిగిందా? రాష్ట్రాన్ని సింగపూర్‌ను మించి అభివృద్ధి చేస్తానన్నాడు. ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మరి మన మదనపల్లెలో ఏమన్నా కనిపించిందా? ఇలా 650 హామీలు ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ అదే మోసం. అవే పొత్తులు. ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ మళ్లీ మోసం చేయడానికి వస్తున్నాడు. ఈ ముగ్గురూ కలిసి ఇంటింటికీ కేజీ బంగారం అంటున్నారు. ఇంటింటికీ బెంజ్ కారు కొనిస్తామంటున్నారు.
- గవర్నమెంట్ బడిలో ఇంగ్లిష్ మీడియం వద్దన్న వారికి బుద్ధి చెప్పాలా వద్దా? పేదలకు ఇళ్ల స్థలాలిస్తుంటే కులాల మధ్య సమతుల్యం దెబ్బ తింటుందని ఏకంగా కోర్టుకు వెళ్లి కేసులు వేసిన పార్టీలకు సమాధి కట్టాలా.. వద్దా? ఎస్సీలుగా పుట్టాలని ఎవరనుకుంటారని ఆ పుట్టుకనే అవమానించిన వారి రాజకీయాలకు చరమగీతం పాడుదాం. బీసీల తోకలు కత్తిరిస్తానన్న చంద్రబాబు తోకను, ఆ బాబును వెనకేసుకొస్తున్న తోకలను.. కత్తిరించే కార్యక్రమానికి శ్రీకారం చుడదామని కోరుతున్నా. నాన్న గారు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్‌తో, మైనార్టీల మనోభావాలతో గత 30 ఏళ్లుగా చెలగాటం ఆడుతున్న ఈ చంద్రబాబుకు, కూటమికి ఈసారి ఎన్నికల్లో 30 చెరువుల నీళ్లు తాగించండి.

మన అభ్యర్థులకు దీవెనలు అందించండి

మన పార్టీ తరఫున ఎన్నికల బరిలో నిలుచున్న అభ్యర్థులపై మీ అందరి చల్లని దీవెనలు, మీ అందరి చల్లని ఆశీస్సులు ఉండాలి. రాజంపేట ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి, రైల్వేకోడూరు నుంచి కొరుముట్ల శ్రీనివాసులు, రాయచోటి నుంచి శ్రీకాంత్‌రెడ్డి, రాజంపేట నుంచి అమర్‌నాథ్‌రెడ్డి, తంబళ్లపల్లె నుంచి ద్వారకనాథ్‌రెడ్డి, మదనపల్లె నుంచి నిస్సార్ అహ్మద్, పీలేరు నుంచి రామచంద్రారెడ్డి, పుంగనూరు నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలను గెలిపించాలి. మన గుర్తు ఫ్యాను అని అందరూ గుర్తుపెట్టుకోవాలి. చాలా కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయి. వాటన్నింటినీ తిప్పికొట్టాలి.

రెండు బటన్లు నొక్కాలి..



- పేదలకు అందాల్సిన ప్రతి రూపాయి ఆగకూడదంటే, మీ పెన్షన్ మీకు హక్కుగా నేరుగా మీ ఇంటికే రావాలి అంటే బాబు లాంటి సైంధవులు ఎప్పటికీ అడ్డు పడే అవకాశం ఇవ్వకూడదు. అది జరగాలి అంటే ప్రతి పేదవాడు మరో 40 రోజుల్లో రెండు బటన్లు నొక్కాలి. ఆ పేదవాళ్ల కోసం, నా అక్కచెల్లెమ్మల కుటుంబాల కోసం మీ బిడ్డ 130 సార్లు బటన్లు నొక్కాడు. ఆ పేదవాళ్లందరూ, అక్కచెల్లెమ్మలందరూ ఏకమై కేవలం రెండే రెండు బటన్లు ఫ్యాను మీద నొక్కాలి. అప్పుడు ఈ వదల బొమ్మాళీ ఇక మన రక్తం పీల్చడానికి ముందుకు రాని పరిస్థితి ఉంటుంది.
- జగనన్నను మళ్లీ తెచ్చుకుందాం. అన్న మళ్లీ భారీ మెజార్టీతో వస్తే, జరుగుతున్న ఈ మంచి అంతా మళ్లీ కొనసాగుతుంది. మళ్లీ వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి నేరుగా ఆత్మగౌరవాన్ని కాపాడుతూ అక్కచెల్లెమ్మల కుటుంబాలకు తోడుగా ఉంటానని ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పండి. ఎన్నికల సంగ్రామంలో అబద్ధాన్ని, మోసాన్ని మట్టి కరిపించడానికి నేను సిద్ధం. మరి మీరంతా కూడా సిద్ధమా.. (సిద్ధమే అని కేకలు). అలాగైతే సెల్ ఫోన్లు బయటకు తీసి.. టార్చ్ లైట్ బటన్ ఆన్ చేయండి. (ప్రజలందరూ సెల్‌లో టార్చ్ లైట్ ఆన్ చేసి పైకి ఎత్తి చూపించారు).
- ఓటు అడిగే నైతికత ఇంటింటికీ మంచి చేసిన మనకు మాత్రమే ఉందన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని.. ఒక బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావిస్తూ ఏకంగా 99 శాతం హామీలను నెరవేర్చాకే ప్రజల ముందుకు వచ్చి ఓటు అడుగుతున్నాం. ఈ 58 నెలల్లో ఇంటింటికీ మేలు జరిగి ఉంటే మీ జగన్‌కు, మీ బిడ్డకు, మీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తోడుగా నిలవాలి.



సభాస్థలి పూర్తిగా నిండిపోవడంతో బయటే వేచి ఉండి సీఎం జగన్ ప్రసంగాన్ని వింటున్న ప్రజలు

చంద్రబాబు ఏ స్థాయికి దిగజారిపోయాడో ఆలోచించండి

- దత్తపుత్రుడు, మోదీతో కలిసి చంద్రబాబు మరో డ్రామా
- ఎక్స్‌లో సీఎం వైఎస్ జగన్ ట్వీట్

సాక్షి, అమరావతి: చంద్రబాబు డ్రామాలు.. దిగజారుడుతనంపై ప్రజలు ఆలోచన చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోరారు. ''2014లో చంద్రబాబు సంతకం చేసి ఇంటింటికీ పంపిన మేనిఫెస్టోలో ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. కానీ ఇప్పుడు మరోసారి మోసం చేసేందుకు రంగురంగుల మేనిఫెస్టోతో దత్తపుత్రుడు, మోదీ గారితో కలిసి చంద్రబాబు మరో డ్రామాకి తెరదీస్తున్నాడు'' అని ఎక్స్ వేదికగా సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.అదే ఎక్స్ లో మరో ట్వీట్ చేసిన జగన్.. ''లక్షల మంది అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులకి ప్రతి నెలా ఒకటో తారీఖున చేతికి పెన్షన్ ఇచ్చే వలంటీర్లు.. ఏప్రిల్ 1 నుంచి ఇవ్వడానికి వీల్లేదని చంద్రబాబు ఆయన మనుషుల చేత ఈసీకి ఫిర్యాదు చేయించి ఆదేశాలిప్పించాడు. చంద్రబాబు ఏ స్థాయికి దిగజారిపోయాడో ఆలోచించండి'' అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గెలుపు కోసం నేను సిద్ధం..

మరి మీరంతా సిద్ధమేనా?

'మనందరి ప్రభుత్వం ఈ ఐదేళ్లలో ఇంటింటికీ చేసిన మంచికి మద్దతు తెలుపుతూ తరలివచ్చిన సమరయోధుల సముద్రం మదనపల్లెలో నాకు కనిపించింది' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మరో 6 వారాల్లో పేదల పక్షాన, పేదల భవిష్యత్తు కోసం జరగబోయే యుద్ధంలో గెలుపు కోసం నేను సిద్ధం.. మరి మీరంతా సిద్ధమేనా? అంటూ మంగళవారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

\- సీఎం వైఎస్ జగన్

-సాక్షి,అమరావతి

నేడు మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఇలా..



- అమ్మగారిపల్లె ప్రాంతం నుంచి ఉదయం 9 గంటలకు యాత్ర ప్రారంభం
- సాయంత్రం పూతలపట్టు బైపాస్ వద్ద బహిరంగ సభ
- గురువరాజుపల్లె సమీపంలో రాత్రి బస

సాక్షి, అమరావతి : మేమంతా సిద్ధం 7వ రోజు బుధవారం (ఏప్రిల్ 3) షెడ్యూల్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం మంగళవారం విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ మంగళవారం రాత్రి బస చేసిన అమ్మగారిపల్లె ప్రాంతం నుంచి బుధవారం ఉదయం 9 గంటలకు బయలుదేరుతారు. సదుం, కల్లూరు, దామలచెరువు, తలుపులపల్లి మీదుగా తేనెపల్లి చేరుకొని భోజన విరామం తీసుకుంటారు. అనంతరం రంగంపేట క్రాస్ మీదుగా మధ్యాహ్నం 3 గంటలకు పూతలపట్టు బైపాస్‌కు చేరుకుంటారు. అనంతరం అక్కడ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఆ తర్వాత పి.కొత్తకోట, పాకాల క్రాస్, గదంకి, పనపాకం, ముంగిలిపట్టు, మామండూరు, ఐతేపల్లి క్రాస్, చంద్రగిరి క్రాస్, రేణిగుంట మీదుగా గురువరాజుపల్లె రాత్రి బసకు చేరుకుంటారు.

అన్నమయ్య జిల్లా సిద్ధమా?

మేమంతా సిద్ధమంటూ బస్సుయాత్రకి ఆరవ రోజు అన్నమయ్య జిల్లా సిద్ధమా? అంటూ మంగళవారం సీఎం జగన్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మేమంతా సిద్ధమంటూ బస్సుయాత్రలో ముఖ్యమంత్రితో పాటు జనప్రభం జనం కదం తొక్కి ముందుకు సాగింది.

-సాక్షి,అమరావతి

వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ నేత సుబ్బారెడ్డి

సాక్షి, అమరావతి: సీఎం జగన్ నిర్వహిస్తున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో వివిధ రాజకీయ పార్టీల నేతలు భారీగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. బస్సు యాత్రలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా చీకటిమానిపల్లె వద్ద ఏర్పాటు చేసిన బస కేంద్రంలో మంగళవారం జగన్ సమక్షంలో బీజేపీ సీనియర్ నేత, రాజంపేట పార్లమెంటరీ జిల్లా మాజీ అధ్యక్షుడు, ఏపీ ప్రైవేట్ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (ఆప్నా) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి వైఎస్సార్ సీపీలో చేరారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం గాండ్లపెంట మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నేత ఎం.గంగాధర్, మదనపల్లె టీడీపీ మైనార్టీ నేత మొబసిర్ అహ్మద్ వైఎస్సార్ సీపీలో చేరారు. కాగా, మంగళవారం బస కేంద్రంలో శ్రీ సత్యసాయి, అన్నమయ్య జిల్లాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు సీఎం జగన్‌ను కలిశారు. వీరిని సీఎం జగన్ పేరుపేరునా పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.



సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ నేత డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి



టీడీపీ సీనియర్ నేత గంగాధర్‌ను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్



సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ మైనార్టీ నేత మొబసిర్ అహ్మద్

6 వ రోజు
స్టార్ క్యాంపెయినర్‌లతో సీఎం వైఎస్ జగన్

'మేమంతా సిద్ధం యాత్ర 6వ రోజులో నా స్టార్ క్యాంపెయినర్‌లతో నేను' అంటూ సీఎం జగన్ కొన్ని ఫొటోలను మంగళవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. యాత్రలో భాగంగా అవ్వాతాతలతో సీఎం జగన్ మమేకమై వారికి నేనున్నానంటూ భరోసా కల్పించారు. అక్కచెల్లెమ్మలకు తాను అండగా ఉంటానని పేర్కొన్నారు. చిన్నారులకు మామయ్యగా తాను ఉంటానని చిరునవ్వులు చిందించారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

- సాక్షి, అమరావతి

















చాడేపల్లి: రాత్రి వేళ సీఎం జగన్‌పై పూలవర్షం కురిపించి ఘన స్వాగతం



మదనపల్లె: మేమంతా సిద్ధం బస్సుయాత్రలో భాగంగా రోడ్‌షోకు హాజరైన అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



మదనపల్లె: రోడ్‌షోలో సీఎం జగన్‌ను చూసిన సంతోషంలో అభిమాని..



మదనపల్లె: సభలో సీఎం జగన్ ప్రసంగిస్తున్న సమయంలో ఓ మహిళ ఉత్సాహం



బోయకొండ క్రాస్: సీఎం జగన్‌కు హారతిస్తున్న మహిళలు





అంగళ్లు: ముస్లిం మైనారిటీ మహిళ, దివ్యాంగురాలి సమస్యలు తెలుసుకుంటూ..



సీఎం జగన్‌కు బొట్టుపెట్టి స్వాగతం పలుకుతున్న అక్కచెల్లెమ్మలు



అంగళ్లు: సీఎం వైఎస్ జగన్‌తో అక్కచెల్లెమ్మల కరచాలనం

జనసంద్రం.. సర్వం జగనన్న మంత్రం

ఆ సామిని ఓసారి చూద్దామని..

ఉదయం 11:30 గంటలు.. దాదాపు 40 డిగ్రీల ఉష్ణోగ్రత.. పైన భానుడి భగభగ, కింద రోడ్డు సెగ.. వీటన్నింటినీ లెక్క చేయకుండా ఇద్దరు అవ్వలు అనంతపురం – చెన్నై జాతీయ రహదారిపై మొలకలచెరువు నుంచి మదనపల్లెకు వచ్చే వాహనాలను ఆపి.. 'మా పెద్ద కొడుకు ఎంత వరకు వచ్చారు?' అంటూ ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో 'ఏం అవ్వా.. ఎవరి కోసం ఎదురు చూస్తున్నారు' అని అడగ్గా.. 'మాది ఇక్కడికి కిలోమీటర్ దూరంలో ఉండే ఆవులవారిపల్లె. ఈ రోడ్డులో సీఎం వైఎస్ జగన్ వస్తున్నారని ఉదయం తొమ్మిది గంటల నుంచి ఎదురు చూస్తున్నాం' అని బదులిచ్చారు. ఇంత ఎండలో మీరెందుకు ఎదురు చూస్తున్నారని ప్రశ్నించగా.. 'రూ. మూడు వేల పెన్షన్ ఒకటో తేదీ ఉదయాన్నే మా గుమ్మం దగ్గరకు పంపాడు. కడుపున పుట్టిన బిడ్డలే తల్లిదండ్రుల యోగక్షేమాలు పట్టించుకోని ఈ రోజుల్లో మాలాంటి పండుటాకుల కష్టాలను గుర్తెరిగి వలంటీర్‌ల ద్వారా పెన్షన్ ఇంటికి పంపి అండగా ఉన్నాడు. కంటివెలుగు పథకంతో మా కళ్లకు మసకలు తొలగించాడు. మా ఆరోగ్యానికి అండగా నిలుస్తున్నాడు. ఇంత చేసిన ఆ సామిని ఓ సారి చూద్దామని ఎదురు చూస్తున్నాం' అని బదులిచ్చారు.



అన్నమయ్య జిల్లా ఆవులవారిపల్లెకి చెందిన శాంతమ్మ, సిద్ధమ్మ

(మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

సీఎం వైఎస్ జగన్ ద్వారా లబ్ధి పొందిన వారితో అనంతపురం – చెన్నై జాతీయ రహదారి మంగళవారం కిక్కిరిసింది. తమకు మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌ను ఓ సారి చూద్దామని.. వీలైతే ఆయనను కలుద్దామని.. కుదిరితే మాట్లాడదామని ఆరో రోజు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో అన్నమయ్య జిల్లా ప్రజలు పోటెత్తారు. మదనపల్లె జనసంద్రాన్ని తలపించింది. తంబళ్లపల్లి నియోజకవర్గం ప్రజలు వైఎస్ జగన్‌కు జై కొట్టారు. శ్రీ సత్యసాయి జిల్లా చీకటిమానిపల్లెలో ఏర్పాటు చేసిన బస కేంద్రం నుంచి ఉదయం 10:25 గంటలకు సీఎం జగన్ రోడ్‌షో ప్రారంభించారు. కూత వేటు దూరంలోనే అన్నమయ్య జిల్లాలోకి ప్రవేశిస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ములకలచెరువులో భారీ గజమాలతో సీఎంను ప్రజలు సత్కరించారు. రోడ్డుకు ఇరువైపులా బారులు తీరిన జనానికి అభివాదం చేస్తూ సీఎం ముందుకు కదిలారు. పెద్దపాళ్యం గ్రామంలో హారతులు పట్టి మహిళలు స్వాగతం పలికారు. బస్సు దిగి సీఎం జగన్ మహిళలు, వృద్ధులను పలుకరించి, వారికి ఏమైనా సమస్యలున్నాయోమోనని ఆరా తీశారు. మదనపల్లెకు వెళ్లే మార్గమధ్యలో వేపూరికోట, తుమ్మనంగుట్టల్లో రోడ్డుకు ఇరువైపులా బారులు తీరిన జనంతో బస్సు దిగి మరీ సీఎం మాట్లాడారు. పెద్దపల్లి క్రాస్ వద్ద రోడ్డంతా బంతిపూలు చల్లి ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు.

అక్కున చేర్చుకున్న 'అంగళ్లు'

58 నెలల పాలనలో తాము ఆర్థికంగా నిలదొక్కుకుని, ఆత్మ గౌరవంతో జీవించడానికి చేదోడుగా నిలిచిన సీఎం జగన్‌ను ఒక్కసారైనా చూడాలన్న ప్రజల కోరిక ముందు భగభగమండే సూరీడు సైతం చిన్నబోయాడు. మిట్ట మధ్యాహ్నం 35 డిగ్రీలకు పైగా ఎండను లెక్క చేయకుండా అంగళ్లలో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, చంటిబిడ్డ తల్లులు రోడ్లపై బారులు తీరి జననేతను చూడటానికి పోటీపడ్డారు. అంగళ్లు గ్రామంలోకి ప్రవేశిస్తున్న సీఎం జగన్‌కు హారతులు పట్టి పూల వర్షం కురిపించారు. భారీ గజమాలతో సత్కరించారు. భారీ జనసందోహం మధ్య అంగళ్లలో బస్సుపైకి ఎక్కి సీఎం రోడ్‌షో నిర్వహించారు. మధ్యాహ్నం 1.40 గంటల నుంచి అరగంటకుపైగానే సీఎం అంగళ్లలో రోడ్‌షో నిర్వహించారు. అనంతరం అంగళ్లు శివారులోని విశ్వం కాలేజీ వద్ద భోజన విరామ శిబిరానికి చేరుకున్నారు. భోజన విరామ శిబిరం నుంచి సాయంత్రం 4.10 గంటలకు సీఎం జగన్ మదనపల్లె వైపు బయలుదేరారు. అమ్మచెరువుమిట్ట వద్ద మదనపల్లె నాయకులు సీఎం జగన్‌కు ఎదురేగి ఘనస్వాగతం పలికారు. పోటెత్తిన జన సందోహం మధ్య అక్కడి నుంచి రోడ్‌షో మదనపల్లె వైపునకు సాగింది. పెద్ద ఎత్తున కదలివచ్చిన జనం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతుగా చేసిన నినాదాలు హోరెత్తించాయి. టిప్పు సుల్తాన్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వద్దకు 5 కి.మీ మేర దూరంలో రోడ్‌షో ముగియడానికి 1.30 గంటలకు పైగా సమయం పట్టింది.

ఆరో రోజు 'మేమంతా సిద్ధం' సభకు బ్రహ్మరథం



మదనపల్లె: మేమంతా సిద్ధం బస్సుయాత్రకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

మదనపల్లె టిప్పు సుల్తాన్ మైదానంలో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభ సూపర్ సక్సెస్ అయింది. మధ్యాహ్నం 3.30 గంటలకు సభ ప్రారంభం అవ్వాల్సి ఉండగా, మధ్యాహ్నం 12 గంటల నుంచే ప్రజలు గ్యాలరీల్లోకి చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం సీఎం సభ ప్రాంగణానికి చేరుకునే లోపే మైదానం మొత్తం నిండి పోయి, బయట రోడ్డుపైనా జనాలు పోటెత్తారు.

చిత్తూరు జిల్లాలో ఆత్మీయ స్వాగతం

మంగళవారం రాత్రి అన్నమయ్య జిల్లాలో బస్సు యాత్ర ముగించుకుని పుంగనూరు మండలం కృష్ణాపురం వద్ద చిత్తూరు జిల్లాలోకి సీఎం జగన్ ప్రవేశించారు. ఈ క్రమంలో జిల్లా ప్రజలు, నాయకులు సీఎంకు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి బోయకొండ క్రాస్‌కు వెళ్లే మార్గంలో ప్రజలు చీకట్లో కూడా రహదారిపైకి చేరుకుని సీఎంను కలిశారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు పూలు చల్లుతూ అపూర్వ స్వాగతం పలికారు. ఇక్కడ బస్ పైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం ముందుకు సాగారు. అనంతరం చౌడేపల్లిలో సీఎం రోడ్ షో నిర్వహించారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో సోమాల మండలం అమ్మగారిపల్లె శివారులో ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి చేరుకున్నారు.



చౌడేపల్లి: రాత్రి వేళ తన కోసం వేచిఉన్న అభిమానులు, నాయకులు, కార్యకర్తలకు సీఎం జగన్ అభివాదం



మదనపల్లె: బహిరంగ సభలో అభిమానుల సందడి



అంగళ్లు: మహిళను ఆప్యాయంగా పలకరిస్తూ..





ములకలచెరువు: మహిళా వ్యవసాయ కూలీ, ముస్లిం సోదరుడి సమస్యలు తెలుసుకుంటూ..





వేపూరికోట: జగనన్నను చూసిన సంతోషంలో..







అభిమాన నేతను చూసిన ఆనందంలో..



మదనపల్లె: బస్సుయాత్రకు హాజరైన జనసందోహానికి సీఎం వైఎస్ జగన్ అభివాదం

పేదలపై పంతం

ఐదేళ్లుగా ఇంటి వద్దే అందుతున్న సంక్షేమ పథకాలపై పెత్తందారుల అక్కసు

సాక్షి, అమరావతి: చరిత్రను సమాజం ఎన్నటికీ మరువదు! మానవత్వం లేని మనిషిని నాయకుడిగా ఎన్నడూ అంగీకరించదు! దేశంలోనే తొలిసారిగా సంక్షేమ ఫలాలను ఇంటింటికీ చేరవేసి ప్రజాభిమానం పొందిన వలంటీర్ వ్యవస్థపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అక్కసు అంతాఇంతా కాదు. ఆవిర్భావం నుంచి దీనిపై చంద్రబాబు అండ్ కో విషం చిమ్ముతూనే ఉంది. ఇక జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులుగా, మహిళలను అక్రమ రవాణా చేసే కిరాతకులుగా చిత్రీకరించి ఆ వ్యవస్థను విచ్ఛిన్నం చేసే కుట్రకు తెరదీశారు. ప్రభుత్వానికి మంచి పేరు రావడంతో వలంటీర్లను టార్గెట్ చేశారు. ఈ క్రమంలో ఎన్నికల వేళ వలంటీర్ల సేవలు నిలిచిపోయేలా చంద్రబాబు కుట్ర రాజకీయాలకు తెగబడ్డారు. తన సన్నిహితుడు, మాజీ ఎస్‌ఈసీ నిమ్మగడ్డ రమేశ్ సంస్థ ద్వారా వలంటీర్లపై కేంద్ర ఎన్నికల సంఘానికి పదేపదే ఫిర్యాదు చేయించారు. వలంటీర్లను విధుల నుంచి తప్పించడంతో నాలుగున్నరేళ్లకు పైగా సజావుగా సాగిన ఇంటింటికీ పింఛన్ల పంపిణీ ఆగిపోయింది. దీంతో లక్షల మంది అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతు అక్కచెల్లెమ్మలు మండుటెండల్లో రోడ్లపై నిలబడాల్సి వచ్చింది. ఈ ఉదంతంతో పేదలంటే చంద్రబాబుకు ఎంత వ్యతిరేకత ఉందో మరోసారి స్పష్టమైంది. కోవిడ్ సంక్షోభంలోనూ ఆగని పింఛన్ల పంపిణీ చంద్రబాబు కారణంగా నిలిచిపోవడం తీవ్ర ప్రజా వ్యతిరేకతకు దారితీస్తోంది. దీంతో ఉలిక్కిపడ్డ చంద్రబాబు తన రివర్స్ డ్రామా మొదలెట్టారు. వలంటీర్ల సేవలను తానే అడ్డుకుని.. మళ్లీ ఇంటింటికీ పింఛన్లు పంచాలంటూ ఎన్నికల కమిషన్‌కు, ప్రభుత్వానికి దొంగ లేఖలు రాస్తూ డ్రామాను రక్తి కట్టిస్తున్నారు. యూటర్న్ తీసుకోవడంలో చంద్రబాబుకు ఏమాత్రం మొహమాటాలు ఉండవని అనేకసార్లు రుజువైంది. వాటిల్లో కొన్ని మచ్చుతునకలు ఇవే..!

- 2019 సెప్టెంబర్ 27: టీడీపీ కేంద్ర కార్యాలయం వేదికగా చంద్రబాబు వలంటీర్లను అత్యంత దారుణంగా కించపరిస్తూ వ్యాఖ్యలు చేశారు. 'వలంటీర్లతో ఏంటి లాభం? 5 వేల రూపాయలతో ఏం ఉద్యోగం అది..? గోనె సంచులు మోసే ఉద్యోగమా? బియ్యం సంచులు మోస్తూ ఎప్పుడంటే అప్పుడు ఇళ్లకు వెళ్లడం డిస్టర్బ్ చేయడం. డే టైం మగవాళ్లు ఉండరు.. వీళ్లు (వలంటీర్లు)పోయి తలుపులు కొట్టడం... ఎంత నీచం...' అంటూ వలంటీర్లపై తన అక్కసు వెళ్లగక్కారు.
- 2021, అక్టోబర్ 30న కుప్పం రోడ్‌షోలోనూ చంద్రబాబు వలంటీర్లనే టార్గెట్ చేశారు. 'ఊర్లలో వలంటీర్లు పెద్ద న్యూసెన్స్ అయ్యారు. బ్రిటీష్ వాళ్లకు ఏజెంట్లులా వీరు ప్రభుత్వానికి ఏజెంట్లుగా మారారు. ప్రజలను బెదిరిస్తూ అవినీతికి పాల్పడుతున్నారు. రేపు ఎన్నికలకు కూడా వీరే వస్తారు' అంటూ వలంటీర్ల సేవలను నిలిపివేసేలా కుట్రలకు అప్పుడే బీజం వేశారు. ఉత్తమ వలంటీర్లను గుర్తించి ప్రభుత్వం ప్రోత్సహిస్తే కూడా ఓర్వలేకపోయారు. 2022 ఏప్రిల్ 07న 'వలంటీర్లు సాధించింది ఏంటి? సన్మానం పేరుతో కోట్లు తగలేస్తున్నారు' అంటూ పెత్తందారీ కుళ్లను వెళ్లగక్కారు.

ఇప్పుడు గుర్తొచ్చిందా?

చంద్రబాబు ఒక్క వలంటీర్ వ్యవస్థపైనే కాదు.. దానికి కీలకమైన, గ్రామ స్వరాజ్యానికి ప్రతీకగా నిలిచిన సచివాలయ వ్యవస్థపైనా ముప్పేట దాడి చేశారు. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగాలు ఊడతాయంటూ గద్దించారు. అదే చంద్రబాబు ఇప్పుడు వలంటీర్లకు బదులు.. సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయాలంటూ ఉచిత సలహాలు ఇవ్వడం గమనార్హం. స్వతంత్ర భారతంలో ఇంటింటికీ ప్రభుత్వ సేవలను తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. పంచాయతీరాజ్, రెవెన్యూ, కలెక్టర్ల వ్యవస్థలు దశాబ్దాలుగా పని చేస్తున్నా చిట్టచివరి వ్యక్తికి లబ్ధి చేకూర్చడంలో తీవ్ర జాప్యం జరిగేది. ఇది గమనించిన సీఎం జగన్ సచివాలయ వ్యవస్థతో పాటు అనుబంధంగా వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారు. దాదాపు నాలుగు లక్షల మంది యువతకు సొంత గ్రామాల్లోనే ప్రభుత్వ సేవకులుగా ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించారు. అందుకే సమర్థవంతంగా, అవినీతికి తావులేకుండా పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

- టీడీపీ మహిళా నాయకులు వలంటీర్లను ఇష్టానుసారంగా తూలనాడారు. 2023, జూలై 14న టీడీపీ మహిళా సదస్సులో 'వలంటీర్లు కొంపలు కూల్చే పనులు చేస్తున్నారు. ఇంటి లోపలికి వస్తున్నారు. వీళ్లు ఎవరండీ ఇళ్లలోకి రావడానికి? వచ్చి మీ వివరాలు కనుక్కొంటున్నారు. మీ ఆయనకు ఏమైనా వేరే సంబంధాలు ఉన్నాయా? ఏమైనా అనుమానం ఉందా? అని ప్రశ్నిస్తున్నారు. అంటే కొంపల్ని కూల్చే మార్గం ఇది. మగవాళ్ల దగ్గరకు వెళ్లి మీ ఆడబిడ్డలు ఏమైనా బయట తిరుగుతున్నారా? అని అడుగుతున్నారు. చెప్పుతో కొట్టేవారు లేకపోతే సరి. ఈ వివరాలతో వలంటీర్లకేంటి సంబంధం' అంటూ నోటికొచ్చిన అబద్ధాలను ఆపాదించి పైశాచిక ఆనందాన్ని పొందారు.

సేవకులపై ఉన్మాదం..

వలంటీర్లను అవమానించడంతో పాటు వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు అన్నీఇన్నీ కావు. 2023, అక్టోబర్ 7న వారాహి యాత్రలో భాగంగా ఏలూరు పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన రోడ్ షోలో మహిళల అదృశ్యానికి వలంటీర్లే కారణం అంటూ హేయంగా మాట్లాడారు. 'వలంటీర్లు ఒంటరి అతివల సమాచారాన్ని సంఘ విద్రోహ శక్తులకు ఇస్తున్నారు. ప్రతి గ్రామంలో వలంటీర్లు కుటుంబంలో ఎంత మంది ఉన్నారు? వారిలో మహిళలు ఎందరు? వితంతువులున్నారా? అని ఆరా తీస్తున్నారు. మహిళల అదృశ్యం వెనుక వలంటీర్ల హస్తం ఉంది' అంటూ ఉన్మాదాన్ని ప్రదర్శించారు.

- 2023 జూలై 11న ఏలూరులో పార్టీ నాయకులతో సమావేశంలోనూ వలంటీర్లే అజెండాగా పవన్ బురద రాజకీయం చేశారు. 'ప్రజాసేవ కోసం పంచాయతీరాజ్, రెవెన్యూతో పాటు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, తహసీల్దార్లు ఉన్నప్పటికీ.. వలంటీర్లు అనే మరో సమాంతర వ్యవస్థ ఎందుకు? ప్రజలను నియంత్రించడం.. ఎవరైనా ఎదురు తిరిగితే భయపెట్టడానికి, సోషల్ మీడియాలో టీడీపీ వాళ్లు విమర్శిస్తే ఇబ్బందులు పెట్టడానికి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. జనసైనికులు, నాయకులు వలంటీర్లపై ఓకన్నేసి ఉంచండి. ఆడబిడ్డలున్న తల్లిదండ్రులు, ఒంటరి, వితంతువులు అప్రమత్తంగా ఉండండి. వలంటీర్లకు సమాచారం ఇవ్వకండి' అని వలంటీర్ వ్యవస్థను ఉగ్రవాద చర్యలతో పోల్చారు.
- సినిమా డైలాగులతో రాజకీయ ప్రసంగాలు చేసే పవన్‌కళ్యాణ్ వలంటీర్ల నడుం విరగొట్టి తీరుతాం అంటూ 2023, జూలై 12న వారాహి రెండో విడత యాత్రలో ఊగిపోయారు. 'వలంటీర్ వ్యవస్థ లేనప్పుడు దేశం ఆగిందా? ఇప్పుడు ప్రజల వ్యక్తిగత సమాచారమంతా వారి వద్దే ఉంది. ఓ ప్రభుత్వ ఉద్యోగి వల్ల సమాచారం దుర్వినియోగమైతే నిలదీయవచ్చు. వలంటీర్ వ్యవస్థ తొండ ముదిరి ఊసరవెల్లిలా మారింది. బ్రిటీష్ వాళ్లు మన దేశాన్ని ఆక్రమిస్తే ఆరు కోట్ల మందిని వలంటీర్లు నియంత్రిస్తున్నారు. సేవ చేయడానికి వచ్చిన వలంటీర్లకు దాడి చేసే హక్కు ఉందా? వలంటీర్లు బాలికలపై అఘాయిత్యాలు చేస్తున్నారు' అంటూ వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. ఆదేరోజు తన ట్విట్టర్‌లోనూ 'వలంటీర్లు జగన్ అధికారిక పెగాసస్. ప్రభుత్వ నిధులను వలంటీర్ల కోసం దుబారాగా ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వ యాప్‌లో ప్రజల సమాచారాన్ని తీసుకుని వారి భద్రతకు భంగం కలిగిస్తున్నారు' అంటూ దారుణమైన వ్యాఖ్యలు చేశారు.



బెదిరించి.. నాలుక మడత

2021 మార్చి 29న తిరుపతిలో టీడీపీ ఆవిర్భావ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు వలంటీర్ల కథ చూస్తామని బెదిరింపులకు దిగారు. 'వలంటీర్ల వ్యవస్థ దండగ. వలంటీర్ల లోపాలను గుర్తించి టీడీపీ కార్యకర్తలు సమాచారం ఇస్తే వారి కథ చూసుకుంటాం. రూ.10వేల పారితోషికం ఇస్తాం' అంటూ ప్రకటించారు. ఎల్లో మీడియాలో వలంటీర్లను దుర్మార్గులుగా చిత్రీకరిస్తూ కథనాలు వండి వర్చేశారు. కానీ ప్రజల్లో వలంటీర్లపై, ప్రభుత్వంపై బలంగా నాటుకుపోయిన నమ్మకాన్ని చూసి చంద్రబాబు అండ్ కో కంగుతిన్నారు. వలంటీర్ వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ ఉంటే.. ఆ ఇంటి సభ్యుల్లోని వ్యక్తే వలంటీర్‌గా సేవలందిస్తున్నారు. నిత్యం తమ కళ్లముందు తిరిగే తమ బిడ్డలనే చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు నోటికొచ్చినట్టు తూలనాడుతుంటే ప్రజలు ఆగ్రహంతో రగిలిపోయారు. ఇది గ్రహించిన బాబు అండ్‌కో తమకు రాజకీయంగా పుట్టగతులు ఉండవని భావించి వలంటీర్ల సేవలు గొప్పవంటూ కొత్త పల్లవి అందుకున్నారు. వలంటీర్ ఉద్యోగం దండగ అన్న చంద్రబాబే ఇప్పుడు మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతామంటూ కపట హామీలు గుప్పిస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ ఎందుకని ప్రశ్నించిన పవన్‌కళ్యాణ్ వారి పొట్ట కొట్టాలని అనుకోవట్లేదని నాలిక మడతేశారు.

ఆ దుస్థితిని తొలగించి..

వలంటీర్ వ్యవస్థ రాకమునుపు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు కాళ్లు అరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి అరకొర పింఛన్ తెచ్చుకునేవారు. ప్రభుత్వ పథకాలు వాల్‌పోస్టర్ల రూపంలో గోడలపై కనిపించేవి కానీ అర్హులైన లబ్ధిదారులకు అందేవి కాదు. నాడు ప్రభుత్వ సాయం అందాలంటే జన్మభూమి కమిటీలను దేహీ అనాల్సిన దుస్థితి. సచివాలయాలు, వలంటీర్లు వచ్చిన తర్వాత ప్రభుత్వ పథకాలే పేదల ఇళ్లకు నడుచుకుంటూ వెళ్తున్నాయి. అలాంటిది నాలుగున్నరేళ్ల తర్వాత వలంటీర్ల సేవలు నిలిచిపోవడంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. మళ్లీ మండుటెండల్లో రోడ్లపై నిలబడి పింఛన్ తీసుకోవాల్సి రావడం చంద్రబాబు దుర్మార్గ చర్యలకు ప్రతీకగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు

స్వతంత్ర సంస్థ ముసుగులో..

మాజీ ఎన్నికల ప్రధాన అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ స్వతంత్ర సంస్థ ముసుగులో చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసం పని చేస్తున్నారన్నది స్పష్టమైంది. 'సిటిజన్ ఫర్ డెమోక్రసీ' సంస్థ ముసుగులో కుహనా మేధావులతో టీడీపీకి అనుంగు సంస్థగా వ్యవహరిస్తూ వలంటీర్ల వ్యవస్థను అడ్డుకుని పేదలను పరోక్షంగా దెబ్బకొట్టారు. నిమ్మగడ్డ సంస్థ ఈ ఏడాది ఫిబ్రవరి 23, 25న వలంటీర్లను పింఛన్ల పంపిణీ నుంచి తప్పించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి రెండుసార్లు ఫిర్యాదు చేసింది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సైతం వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయకూడదంటూ ఫిబ్రవరి ఒకటిన కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ప్రత్యక్షంగా ఇంత దారుణానికి ఒడిగట్టిన చంద్రబాబు ఇప్పుడు తమకేమీ సంబంధం లేదని, ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంచాల్సిందేనంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారు. గతంలోనూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కోర్టుల్లో ఆయన కేసులు వేయించడంతోపాటు సెంటు స్థలం సమాధికి కూడా సరిపోదంటూ అనుచిత వ్యాఖ్యలతో తన పెత్తందారీ అహంకారాన్ని చాటుకున్నారు.

నేటి మధ్యాహ్నం నుంచి.. సచివాలయాల్లో పింఛన్లు

ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు కొనసాగనున్న పంపిణీ

సాక్షి, అమరావతి: ఎండలు కారణంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ బుధవారం మధ్యాహ్నం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. విభిన్న దివ్యాంగ లబ్ధిదారులతోపాటు తీవ్ర అనారోగ్యాల పాలైనవారు, మంచం లేదా వీల్ చైర్లకే పరిమితమైనవారు, సైనిక సంక్షేమ పింఛన్లు పొందుతున్న వృద్ధ వితంతువులకు మాత్రం తప్పనిసరిగా వారి ఇంటి వద్దే పెన్షన్ల పంపిణీని కొనసాగించాలని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 65,69,904 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసేందుకు రూ.1,951.69 కోట్ల మొత్తాన్ని ఆయా గ్రామ, వార్డు సచివాలయాలవారీగా బ్యాంకులలో మంగళవారం రాత్రి నిధులు జమ చేసినట్లు అధికారులు తెలిపారు. నాలుగున్నరేళ్లుగా ప్రతి నెలా 1నే వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దే అందిస్తున్న పింఛన్లపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో పాటు బాబుతో సన్నిహితంగా వ్యవహరించే మాజీ ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల కోడ్ కారణంగా వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేపట్టవద్దని ఎన్నికల సంఘం ఆదేశించడంతో ఏప్రిల్, మే, జూన్‌లో పింఛన్ల పంపిణీకి సంబంధించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ మంగళవారం కొత్త మార్గదర్శకాలతో ఉత్తర్వులిచ్చారు.

- తప్పనిసరిగా ఇంటివద్దే పంపిణీ చేయాలని ప్రత్యేకంగా నిర్ధారించిన వర్గాలు మినహా మిగిలిన కేటగిరీ పింఛనుదారులందరికీ ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే పింఛన్ల పంపిణీ చేపడతారు.
- ఒక గ్రామ సచివాలయం పరిధిలో వివిధ గ్రామాలు ఉన్నచోట్ల ప్రత్యేక సిబ్బందిని నియమించి పంపిణీ చేస్తారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక్కో సచివాలయం పరిధిలో ఎక్కువ సంఖ్యలో గిరిజన తండాలు ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు.
- వేగంగా పింఛన్ల పంపిణీని పూర్తి చేసేందుకు ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు సిబ్బంది సచివాలయాల్లోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సచివాలయంలో పనిచేసే సిబ్బందిలో పంపిణీకి సరిపడినంత మందిని ఇందుకోసం కేటాయించుకోవాలని సూచించారు.



- సచివాలయాల వద్దకు వచ్చే పింఛనుదారులకు ఎండల కారణంగా ఇబ్బందులు తలెత్తకుండా నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు మంచి నీటి సదుపాయం కల్పించే బాధ్యతలను ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగిస్తున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు. పంపిణీ సమాచారాన్ని గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.
- పింఛన్ల పంపిణీ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా కలెక్టర్లు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
- సిబ్బంది బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా చేసిన అనంతరం బుధవారం మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీని ప్రారంభించి 6వతేదీ కల్లా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.
- ప్రత్యేకంగా నిర్ధారించిన వర్గాలకు ఇంటి వద్దే పంపిణీ సందర్భంగా సచివాలయాల సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లే సమయంలో ప్రభుత్వం జారీ చేసిన ధ్రువపత్రాలను వెంట తీసుకెళ్లాలి.
- పింఛన్ల పంపిణీని సచివాలయాల వద్ద లబ్ధిదారుల ఆధార్ అనుసంధానంతో కూడిన బయోమెట్రిక్ లేదా ఐరిస్, ముఖ గుర్తింపు విధానంలో చేపట్టాలి. ఎవరైనా లబ్ధిదారుడి విషయంలో ఆధార్‌తో ఇబ్బందులు తలెత్తితే వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లేదా వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీ ఆధర్యంలో రియల్ టైం బెనిఫిషియర్స్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఆర్‌బీఐఎస్) విధానంలో పింఛన్ల పంపిణీ చేపట్టాలి.
- పింఛన్లు పంపిణీ చేసే సమయంలో ప్రచారాలు, ఫొటోలు, వీడియోలు నిషిద్ధం. తప్పనిసరిగా ఎన్నికల కోడ్‌ను పాటించాలి.
- సచివాలయాల సిబ్బంది అందరికీ కొత్తగా పింఛన్ల పంపిణీకి సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ లాగిన్‌లు అందుబాటులో ఉంటాయి. సిబ్బంది తమ మొబైల్ ఫోన్లలో పింఛన్ల పంపిణీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- పింఛన్ల పంపిణీ కోసం సచివాలయ సిబ్బంది వద్ద అదనంగా ఫ్రింగర్ ప్రింటర్లు అందుబాటులో ఉంటాయి.

కలెక్టర్లతో చర్చించాకే నిర్ణయాలు

పింఛన్ల పంపిణీలో వలంటీర్ల ప్రమేయాన్ని పూర్తిగా తొలగిస్తూ ఈసీ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించి ప్రత్యామ్నాయ మార్గాలపై అభిప్రాయాలు సేకరించినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి శశిభూషణకుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల ప్రకారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు డీబీటీ విధానంలో పింఛన్లు అందించేందుకు అందరికీ బ్యాంకు ఖాతాలు లేవని గుర్తించామన్నారు. వారందరికీ అప్పటికప్పుడు కొత్తగా బ్యాంకు ఖాతాలు తెరవడంలో చాలా సమస్యలున్నట్లు తేలిందన్నారు. పింఛన్ల డబ్బులు బ్యాంకులో జమ చేసినా వాటిని తీసుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుందని గుర్తించామన్నారు. మరో ప్రత్యామ్నాయంగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటింటికీ పంపిణీ చేయడంలోనూ ఇబ్బందులున్నట్లు వెల్లడైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లు 2.66 లక్షల మంది ఉండగా సచివాలయాల ఉద్యోగులు కేవలం 1.27 లక్షల మంది మాత్రమే ఉన్నారన్నారు. 12,770 మంది ఏఎన్ఎంలు, 14,232 మంది వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్, వెటర్నరీ, ఫిషరీష్ అసిస్టెంట్లు, 6,754 మంది ఎనర్జీ అసిస్టెంట్లను వారి విధులకు ఆటంకం కల్పిస్తూ పింఛన్లు పంపిణీ చేయించే పరిస్థితి లేదని తమ చర్చల్లో గుర్తించామన్నారు. మిగిలిన సచివాలయాల ఉద్యోగులలోనూ చాలా మంది ఎన్నికలకు సంబంధించి బీఎల్‌వో విధుల్లో కొనసాగుతున్నారని తెలిపారు. వారందరినీ మినహాయిస్తే లబ్ధిదారుల ఇళ్ల వద్ద పింఛన్ల పంపిణీకి వినియోగించుకునేందుకు సచివాలయాల ఉద్యోగుల సంఖ్య చాలా తక్కువగా ఉంటుందన్నారు. మరోవైపు లబ్ధిదారుల చిరునామాలు కచ్చితంగా తెలిసే అవకాశం కూడా తక్కువగా ఉంటుందని, అందువల్ల పంపిణీలో జాప్యం జరిగే అవకాశం ఉందని నిర్ధారించుకున్నారు.

సైంధవుడు చంద్రబాబే..!

రెండు రోజులైనా పింఛన్ రాక పడిగాపులు

సాక్షి, నెట్‌వర్క్: పింఛన్‌కోసం సోమవారం సాయంత్రం వరకూ ఎదురు చూసిన వృద్ధులకు నిరాశ తప్పలేదు. కనీసం మంగళవారం అయినా ఇస్తారని ఆశగా చూసి చివరికి ఎప్పుడిస్తారో తెలియక తల్లడిల్లిపోతున్నారు. ఆ సొమ్ముతోనే అత్యవసర మందులు కొనుగోలు, ఇతర నిత్యావసరాల కోసం వినియోగించాల్సి ఉండగా చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోక దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వాటిపైనే ఆధారపడి జీవిస్తున్న వారికి చంద్రబాబు పన్నాగం అవరోధంగా మారింది. దీంతో ఆయన వ్యవహారశైలిపై రాష్ట్రవ్యాప్తంగా పెన్షనర్లు దుమ్మెత్తిపోస్తున్నారు. నోటికాడ కూడును లాగేసుకున్న చంద్రబాబు విధానంపై ప్రజలు ఆక్రోశం చెందుతున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అన్ని రంగాల ప్రజల నుంచి పూర్తి మద్దతు లభిస్తోంది. ప్రతి నెలా ఇంటివద్దకే వచ్చి వలంటీర్ కుశలప్రశ్నలు అడిగి సొమ్ము చేతిలో పెట్టే సమయంలో వృద్ధులు తడారని కళ్లతో వాటిని సంతోషంగా తీసుకునేవారు. ఇప్పుడు మళ్లీ పాత రోజులు గుర్తుకొస్తున్నాయని వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలో దూర ప్రాంతానికి వెళ్లి ఎలా తెచ్చుకోవాలని ఆందోళన చెందుతున్నారు.

సచివాలయానికి ఎలా వెళ్లాలి ?



నా వయస్సు 72ఏళ్లు. అనారోగ్యంతో పాటు లేవలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యాను. ఇంట్లో వాళ్ల సహాయంతో ఊపిరి పట్టుకుని ఉన్నాను. పింఛన్ ప్రతి నెల ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్ మా ఇంటికి తెచ్చి నా చేతిలో పెట్టేది. ఈ నెల ఇంకా రాలేదు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వలంటీర్ల మీద ఫిర్యాదు చేశారని తెలిసింది. వలంటీరు లేకుంటే నా లాంటి ఎంతోమంది వృద్ధులు ప్రాణాలు కోల్పోయేవారు. కరోనాలో ఆపద్బాంధవులుగా ఆదుకున్నారు. ముసలి వారితో రాజకీయ క్రీడలు ఆడడం ఎంతవరకు సమంజసం. ఈ ఎండలో సచివాలయానికి ఏ విధంగా వెళ్లాలి. మానవత్వం లేని టీడీపీ, జనసేన నాయకులు ప్రజలకు ఏం మేలు చేస్తారు?

– ఎస్.గోపాల్, కొర్లగుంట, తిరుపతి జిల్లా

చంద్రబాబు చూపు పడితే కష్టాలే



నాకు 90 ఏళ్ల పైనే ఉంటాయి. అనారోగ్యంతో కొన్నేళ్లుగా మంచంలోనే ఉంటున్నా. ఎక్కడికీ పోలేను. ప్రతినెలా వలంటీరు ఇంటి వద్దకే వచ్చి జీతం ఇచ్చినట్లు పింఛను ఇచ్చేవారు. వేలి గుర్తులు పడకపోయినా ఓపిక పట్టి ఇచ్చేవారు. ఆ డబ్బులు మందులకు, ఖర్చులకు సరిపోయేవి. ఇప్పుడు వలంటీరును రాకుండా చేసినారు ఎక్కడికో పోయి తెచ్చుకోవాలంట. ఇన్ని ఇబ్బందులు పెట్టిన చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది. ఆయన చూపు పడితే అన్నీ కష్టాలే.

– బోయ బతుకమ్మ, సోమలగూడ, నందవరం మండలం, కర్నూలు జిల్లా.

ఆ రోజులు తలచుకుంటే భయమేస్తుంది



నా వయస్సు 70 సంవత్సరాలు. ప్రభుత్వం ఇచ్చే పింఛనే నాకు జీవనాధారం. జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక ఒకటో తేదీన ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేకుండా ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తుంటే చాలా ఆనందంగా ఉండేది. ఇప్పుడు పింఛన్ సొమ్ముల కోసం గతంలోలా పంచాయతీ కార్యాలయానికి వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడతాం. అప్పటి ఇబ్బంది తలచుకుంటేనే చాలా భయమేస్తోంది. ఇంటి దగ్గరకి వచ్చి పింఛన్ ఇచ్చే ఏర్పాటు చేయాలి.

– మాముడూరి సూరమ్మ, పెనుగొండ, పశ్చిమగోదావరి జిల్లా

మా ఉసురు తగులుతుంది



రోడ్డు ప్రమాదంలో కాలుకు దెబ్బతగలడం వల్ల చేతికర్ర ఉంటే తప్ప నడవలేను. రెండేళ్లుగా పింఛన్ అందుకుంటున్నాను. ప్రతి నెల 1న 6 గంటలకు నా తలుపు తట్టి రూ. 3000లు పింఛన్ అందజేసేవాడు. నాకు షుగర్, బీపీ ఉండడం వలన ఎక్కువ సేపు నిలబడలేను. పింఛన్ డబ్బులు అందితేనే నాకు పూట గడిచేది. టీడీపీ వలంటీర్లపై కోర్టులో కేసు వేసింది. ఈనెల పింఛన్ ఇప్పటికి ఇవ్వలేదు. మాలాంటి వికలాంగుల ఉసురు తెలుగుదేశం పార్టీకి తగులుతుంది. ఇప్పటి వరకు పింఛన్ ఇంటికే వస్తుందనే ధైర్యంతో ఉన్నాను.

– దియ్యా రాంబాబు, రాజుపాలెం గ్రామం, రాజుపాలెం మండలం, పల్నాడు జిల్లా.

ఈ దుస్థితి ఎవరికీ రాకూడదు



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఆమె పేరు మంజుల. భర్త వెంకటేష్ చిరువ్యాపారి. చిత్తూరు నగరంలోని తేనెబండ కాలనీలో నివాసముంటారు. వీరికి 23 సంవత్సరాల వయస్సు ఉన్న భరత్ (విభిన్న ప్రతిభావంతుడు) ఉన్నాడు. 11 సంవత్సరాల క్రితం ఇంటి దగ్గర ఆడుకుంటూ మెట్ల మీద నుంచి పడడంతో కాలుకు తీవ్ర గాయమైంది. అప్పటి నుంచి నడవడానికి వీలుకాని పరిస్థితి. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ప్రయోజనం లేదు. తల్లి తోడు ఉంటేనే కాలకృత్యాలు తీర్చుకునే పరిస్థితి. బయట ప్రపంచమే తెలియని భరత్ ఇంటికే పరిమితమయ్యాడు. గత పాలనలో పింఛను కూడా వచ్చేది కాదు. వైఎస్ ఆర్‌సీపీ వచ్చాక గత ఐదు సంవత్సరాలుగా పింఛను అందుకుంటున్నాడు. ప్రతి నెలా ఒకటవ తేదీన వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి పింఛను అందజేసేవారు. ప్రతి నెలా వచ్చే రూ.3 వేలు పింఛను డబ్బును భరత్ చికిత్సకు ఉపయోగపడేవి. టీడీపీ చేసిన కుట్రతో వలంటీర్లు పింఛను ఇవ్వరనే వార్త తెలియగానే భరత్ తల్లి తల్లడిల్లిపోయింది. భరత్‌ను వార్డు సచివాలయానికి ఎలా తీసుకెళ్లాలని ఆవేదన చెందుతోంది. ఇటువంటి నీచమైన పనులు చేయడం చంద్రబాబుకు సబబు కాదని ఆ తల్లి ఆవేదన వ్యక్తం చేస్తోంది.

– కుమారుడు భరత్‌తో తల్లి మంజుల, తేనెబండ, చిత్తూరు జిల్లా

నిస్సహాయులను శిక్షించడమేమిటి?



ఈ ఫోటోలో కనిపిస్తున్న అభాగ్యుడి పేరు పిప్పళ్ల రామలక్ష్మయ్య. కృష్ణాజిల్లా బందరు మండలం పోతేపల్లి గ్రామం. వ్యవసాయ కూలీ. 15 ఏళ్ల క్రితం పక్షవాతం వచ్చి మంచానపడ్డాడు. ఇంటి పెద్ద దిక్కు మూలన పడిపోవడంతో కుటుంబం ఆర్థికంగా నలిగిపోయింది. గత ప్రభుత్వంలోనూ పింఛను అందుకున్నప్పటికీ దయనీయ స్థితిలో దూర ప్రాంతానికి వెళ్లి డబ్బులు అందుకోవాల్సి వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతినెలా ఒకటో తేదీన వలంటీర్ తలుపు తట్టి పింఛను అందించేవారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు వలంటీర్ వ్యవస్థపై కక్షగట్టి కోర్టు ద్వారా ఆంక్షలు విధించడంతో ఈనెల లేవలేని స్థితిలో మంచాన ఉన్న అభాగ్యుడికి పెన్షన్ అందలేదు. పెన్షన్ అందితే తప్ప అతనికి జీవనాధారం లేదు. ప్రభుత్వం నుంచి అందుకునే నగదుతోనే మందులు వాడేది. అడుగు తీసివేయలేని తనకు అన్ని విధాల అండగా ఉన్న వలంటీర్‌ను విధుల నుంచి తొలగించాలని కోర్టు నిర్ణయించడం తన లాంటి నిస్సహాయులను శిక్షించడమేనని ఆవేదన చెందుతున్నాడు.

– పిప్పళ్ల రామలక్ష్మయ్య, పోతేపల్లి, బందరు మండలం, కృష్ణా జిల్లా.

కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులను రద్దు చేయండి

- వలంటీర్లతో పెన్షన్ల పంపిణీపై నిషేధాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించండి
- హైకోర్టులో ముగ్గురు మహిళల పిల్.. నేడు విచారించనున్న ధర్మాసనం

సాక్షి, అమరావతి : పింఛన్లు పంపిణీ చేయకుండా వలంటీర్లపై నిషేధం విధిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) గత నెల 30న జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఎన్నికల సంఘం ఉత్తర్వులను చట్ట విరుద్ధంగా ప్రకటించి, వాటిని రద్దు చేయాలని కోరుతూ గుంటూరు జిల్లా కుంచనపల్లి, మున్నంగికి చెందిన వంగా వరలక్ష్మీ, వంగా బిందు, అల్లు సునీత ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్, సిటిజన్ ఫర్ డెమొక్రసీ కార్యదర్శిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యం గురించి పిటిషనర్ల తరఫు న్యాయవాది గుండాల శివప్రసాదరెడ్డి ప్రధాన న్యాయమూర్తి (సీజే) నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రస్తావించారు. అత్యవసర విచారణకు అభ్యర్థించారు. బుధవారం ఈ వ్యాజ్యంపై విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. తాము ముగ్గురం వృద్ధాప్య, వికలాంగ, వితంతు పింఛన్లు పొందుతున్నామని, ప్రతి నెలా 1వ తేదీనే వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పెన్షన్ పొందేవారమని పిటిషనర్లు తమ వ్యాజ్యంలో పేర్కొన్నారు. అయితే ఎన్నికల నియమావళి ముగిసేంత వరకు వలంటీర్లను పింఛన్ల పంపిణీ నుంచి నిషేధిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వుల వల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వృద్ధులు, వికలాంగులు సచివాలయాలకు వెళ్లి పింఛను తీసుకోవడం చాలా కష్టంగా మారిందన్నారు. రాజకీయ ప్రయోజనాలను ఆశించి సిటిజన్ ఫర్ డెమొక్రసీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వలంటీర్లపై నిషేధం విధిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వులు ఏకపక్షమని, ఎలాంటి విచారణ జరపకుండానే ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ ఉత్తర్వులు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఉత్తర్వుల వల్ల తాము బాధితులుగా మారామన్నారు. ఉత్తర్వులను ఉపసంహరించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని, లేని పక్షంలో ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని వారు కోర్టును అభ్యర్థించారు.

పింఛన్ల పంపిణీ ఆపింది మేమే

▶ మొదటి పేజీ తరువాయి

దీనివలన శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందంటూ తమ పార్టీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి రిటర్నింగ్ అధికారికి చెప్పారని, డీఎస్పీ కూడా అది వాస్తవమని అన్నారని వాసు తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే అధికారం రిటర్నింగ్ అధికారికి లేనందున ఈ విషయాన్ని తమ అధినేత చంద్రబాబు, లోకేశ్ దృష్టికి తీసుకుని వెళ్లానని ఆయన చెప్పారు. అందువల్లే ఎన్నికల కోడ్ ముగిసే వరకూ వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేయొద్దంటూ ఎన్నికల కమిషన్ ఆదేశించిందన్నారు.

వాసు వ్యాఖ్యలతో దుమారం..

ఇక ఆదిరెడ్డి వాసు చేసిన ఈ వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి. పింఛన్ల పంపిణీ నుంచి వలంటీర్లను తప్పించింది తామేనని టీడీపీ నేతలు గర్వంగా చెప్పుకుంటూనే.. పింఛన్లు ఆగిపోవడంతో తమకేమీ సంబంధంలేదని, అది ఎలక్షన్ కమిషన్ నిర్ణయమని మరోవైపు కవర్ చేసుకోవడం వారి రెండు నాల్కల ధోరణికి అద్దంపడుతోందని అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది టీడీపీ దుర్బుద్ధిని బయటపెట్టిందంటున్నారు. ఇక ఎండ తీవ్రత పెరుగుతున్న సమయంలో టీడీపీ నాయకులు ఈ కుట్రలకు తెగబడడంపై వృద్ధులు, దివ్యాంగులు తెలుగుదేశాన్ని దుమ్మెత్తి పోస్తున్నారు. వారివల్లే ప్రతినెలా ఒకటో తేదీ వేకువనే వలంటీర్ల ద్వారా అందే పింఛను ఈ నెలలో తమకు అందకుండాపోయిందని పింఛనుదారులు వారిని శాపనార్థాలు పెడుతున్నారు.



క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్‌-విజయ్ జోడీ

యూఎస్ క్లే కోర్టు చాంపియన్‌షిప్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన అనిరుధ్ చంద్రశేఖర్ డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. హ్యూస్టన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో అనిరుధ్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) ద్వయం 6-3, 6-4తో మైకేల్ మో-ఫ్రాన్సెస్ టియాఫో (అమెరికా) జంటను ఓడించింది. 79 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్ జోడీ మూడు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది.

సుమిత్ నగాల్ శుభారంభం



గ్రాండ్‌ప్రి హసన్-2 ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. మొరాకోలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సుమిత్ 4-6, 6-3, 6-2తో కొరెంటిన్ ముటెట్ (ఫ్రాన్స్)పై గెలిచాడు. 2 గంటల 10 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ ఆరు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో 61వ ర్యాంకర్ లొరెంజో సొనెగో (ఇటలీ)తో సుమిత్ ఆడతాడు.

మయాంక్ మెరుపు బౌలింగ్

- హడలెత్తించిన లక్నో పేస్ బౌలర్
- సూపర్ జెయింట్స్‌కు రెండో విజయం
- రాణించిన డికాక్, పూరన్
- 28 పరుగులతో ఓడిన బెంగళూరు



మయాంక్ యాదవ్

బెంగళూరు: అందివచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా నిప్పులు చెరిగే బంతులతో మరోసారి లక్నో పేస్ బౌలర్ మయాంక్ యాదవ్ హడలెత్తించాడు. వేగానికి తోడు కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేసి ఐపీఎల్ టోర్నీలో లక్నో జట్టుకు వరుసగా రెండో విజయాన్ని అందించాడు. మయాంక్ (3/14) దెబ్బకు సొంతగడ్డపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుకు మళ్లీ నిరాశే ఎదురైంది. మయాంక్‌తోపాటు డికాక్, నికోలస్ పూరన్ రాణించడంతో... మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 28 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా లక్నో 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. ఓపెనర్ డికాక్ (56 బంతుల్లో 81; 8 ఫోర్లు, 5 సిక్స్‌లు), పూరన్ (21 బంతుల్లో 40 నాటౌట్; 1 ఫోర్, 5 సిక్స్‌లు) చెలరేగారు. అనంతరం బెంగళూరు 19.4 ఓవర్లలో 153 పరుగులకే ఆలౌటైంది. మహిపాల్ లామ్రోర్ (13 బంతుల్లో 33; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ ఆట ఆడగా... పటిదార్, గ్రీన్, మ్యాక్స్‌వెల్ వికెట్లను తీసి లక్నో విజయంలో కీలకపాత్ర పోషించిన మయాంక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లోనూ మయాంక్ మూడు వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పురస్కారం అందుకున్నాడు.

డికాక్, పూరన్ మెరుపులతో...

లక్నో జట్టు ఓపెనర్ డికాక్ ఆరంభం నుంచే ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. టాప్లీ ఇన్నింగ్స్ తొలి ఓవర్లో అతను 3 బౌండరీలు, సిరాజ్ మూడో ఓవర్లో 2 సిక్స్‌లు బాదాడు. దీంతో కెప్టెన్ కేఎల్ రాహుల్ (20; 2 సిక్స్‌లు) తక్కువే చేసినా... దేవదత్ పడిక్కల్ (6) విఫలమైనా... లక్నో ఇన్నింగ్స్‌పై ఏమాత్రం ప్రభావం పడలేదు. 36 బంతుల్లో డికాక్ ఫిఫ్టీ పూర్తవగా జట్టు స్కోరు 12వ ఓవర్లోనే వందకు చేరింది. స్టొయినిస్ (15 బంతుల్లో 24; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిని ప్రదర్శించగా, ఆఖర్లో పూరన్ మెరుపులతో లక్నో భారీస్కోరు చేయగలిగింది. 19, 20వ ఓవర్లను పూర్తిగా ఆడిన పూరన్ 5 సిక్స్‌లతో 33 పరుగులు పిండుకున్నాడు.



కోహ్లి

కోహ్లి అవుటవడంతోనే...

బెంగళూరు ఇన్నింగ్స్ ఆరంభంలో కొద్దిసేపే బాగుంది. కెప్టెన్ డు ప్లెసిస్ బౌండరీలతో వేగం పెంచగా, నవీనుల్ నాలుగో ఓవర్లో కోహ్లి సిక్స్‌తో టచ్‌లోకి వచ్చాడు. మరుసటి ఓవర్ తొలి బంతికి కోహ్లి ఫోర్ కొట్టడంతో స్కోరు 40/0 వద్ద బాగానే ఉంది. అక్కడే కోహ్లి నిష్క్రమించగా, మరుసటి ఓవర్లో డుప్లెసిస్ (19; 3 ఫోర్లు) రనౌటయ్యాడు. చెత్త షాట్ ఆడిన మ్యాక్స్‌వెల్ (0) పూరన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అంతే 43 పరుగులకే ముగ్గురు హిట్టర్లను కోల్పోయిన బెంగళూరు కష్టాల్లో పడింది. మయాంక్ అద్భుత బంతికి గ్రీన్ (9) బౌల్డ్ కాగా.. అనూజ్ (11) కూడా జట్టును ఆదుకోలేకపోయాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన లామ్రోర్ సిక్స్‌లు, ఫోర్లతో రెచ్చిపోయాడు. 20 బంతుల్లో 46 పరుగుల సమీకరణం ఆర్‌సీబీలో కొత్త ఆశలు రేపగా... మరుసటి బంతికి కార్తీక్ (4) అవుట్ కావడంతోనే బెంగళూరు ఖేల్ ఖతమైంది.

ఐపీఎల్‌లో నేడు

ఢిల్లీ × కోల్‌కతా
వేదిక: విశాఖపట్నం
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	3	3	0	6	1.249
కోల్‌కతా	2	2	0	4	1.047
చెన్నై	3	2	1	4	0.976
లక్నో	3	2	1	4	0.483
గుజరాత్	3	2	1	4	-0.738
హైదరాబాద్	3	1	2	2	0.204
ఢిల్లీ	3	1	2	2	-0.016
పంజాబ్	3	1	2	2	-0.337
బెంగళూరు	4	1	3	2	-0.876
ముంబై	3	0	3	0	-1.423

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి) డాగర్ (బి) టాప్లీ 81; కేఎల్ రాహుల్ (సి) డాగర్ (బి) మ్యాక్స్‌వెల్ 20; పడిక్కల్ (సి) అనూజ్ (బి) సిరాజ్ 6; స్టొయినిస్ (సి) డాగర్ (బి) మ్యాక్స్‌వెల్ 24; పూరన్ (నాటౌట్) 40; బదోని (సి) డుప్లెసిస్ (బి) యశ్ దయాళ్ 0; కృనాల్ పాండ్యా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 181. వికెట్ల పతనం:** 1-53, 2-73, 3-129, 4-143, 5-148. **బౌలింగ్:** రీస్ టాప్లీ 4-0-39-1, యశ్ దయాళ్ 4-0-24-1, సిరాజ్ 4-0-47-1, మ్యాక్స్‌వెల్ 4-0-23-2, మయాంక్ డాగర్ 2-0-23-0, గ్రీన్ 2-0-25-0.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) పడిక్కల్ (బి) సిద్ధార్థ్ 22; డుప్లెసిస్ (రనౌట్) 19; పటిదార్ (సి) పడిక్కల్ (బి) మయాంక్ యాదవ్ 29; మ్యాక్స్‌వెల్ (సి) పూరన్ (బి) మయాంక్ యాదవ్ 0; గ్రీన్ (బి) మయాంక్ యాదవ్ 9; అనూజ్ (సి) పడిక్కల్ (బి) స్టొయినిస్ 11; మహిపాల్ (సి) పూరన్ (బి) యశ్ ఠాకూర్ 33; దినేశ్ కార్తీక్ (సి) రాహుల్ (బి) నవీనుల్ 4; మయాంక్ డాగర్ (రనౌట్) 0; టాప్లీ (నాటౌట్) 3; సిరాజ్ (సి) పూరన్ (బి) నవీనుల్ 12; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (19.4 ఓవర్లలో ఆలౌట్) 153. వికెట్ల పతనం:** 1-40, 2-42, 3-43, 4-58, 5-94, 6-103, 7-136, 8-137, 9-138, 10-153. **బౌలింగ్:** సిద్ధార్థ్ 3-0-21-1, కృనాల్ పాండ్యా 1-0-10-0, నవీనుల్ 3.4-0-25-2, మయాంక్ యాదవ్ 4-0-14-3, రవి బిష్ణోయ్ 3-0-33-0, యశ్ ఠాకూర్ 4-0-38-1, స్టొయినిస్ 1-0-9-1.

భారత నంబర్‌వన్‌గా అర్జున్

విశ్వనాథన్ ఆనంద్‌ను అధిగమించిన తెలంగాణ చెస్ గ్రాండ్‌మాస్టర్



సాక్షి, హైదరాబాద్: కొన్నాళ్లుగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్న తెలంగాణ చెస్ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ తన కెరీర్‌లో మరో మైలురాయిని అందుకున్నాడు. ఓపెన్ విభాగం క్లాసికల్ ఫార్మాట్‌లో అధికారికంగా భారత నంబర్‌వన్ ప్లేయర్‌గా అర్జున్ అవతరించాడు. ఏప్రిల్ నెలకు సంబంధించి అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) విడుదల చేసిన క్లాసికల్ ఫార్మాట్ రేటింగ్స్‌లో 20 ఏళ్ల అర్జున్ 2756 పాయింట్లతో ప్రపంచ 9వ ర్యాంక్‌ను అందుకున్నాడు. ఈ క్రమంలో భారత చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌ను అధిగమించి భారత టాప్ ర్యాంకర్‌గా వరంగల్ జిల్లాకు చెందిన అర్జున్ నిలిచాడు. విశ్వనాథన్ ఆనంద్ 2751 పాయింట్లతో ప్రపంచ 11వ ర్యాంక్‌లో ఉన్నాడు. గత ఏడాది సెప్టెంబర్ 1న తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ తొలిసారి అధికారికంగా విశ్వనాథన్ ఆనంద్‌ను దాటి భారత కొత్త నంబర్‌వన్‌గా నిలిచాడు. ఆ తర్వాత ఆనంద్ మళ్లీ టాప్ ర్యాంక్‌కు చేరుకోగా... ఏడు నెలల తర్వాత అర్జున్ ప్రదర్శనకు ఆనంద్ మరోసారి భారత నంబర్‌వన్ స్థానాన్ని చేజార్చుకున్నాడు. ఆనంద్, పెంటేల హరికృష్ణ, గుకేశ్ తర్వాత ప్రపంచ టాప్-10 ర్యాంకింగ్స్‌లో చోటు సంపాదించిన నాలుగో భారతీయ చెస్ ప్లేయర్‌గా అర్జున్ గుర్తింపు పొందాడు. తాజా రేటింగ్స్‌లో మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే; 2830 పాయింట్లు), ఫాబియానో కరువానా (అమెరికా; 2803 పాయింట్లు), నకమురా (అమెరికా; 2789 పాయింట్లు) వరుసగా తొలి మూడు ర్యాంక్‌ల్లో నిలిచారు. భారత్ నుంచి టాప్-100లో 10 మంది గ్రాండ్‌మాస్టర్లు (అర్జున్-9, ఆనంద్-11, ప్రజ్ఞానంద-14, గుకేశ్-16, విదిత్-25, హరికృష్ణ-37, నిహాల్ సరీన్-39, నారాయణన్-41, అరవింద్ చిదంబరం-72, రౌనక్ సాధ్వాని-81) ఉన్నారు.

ప్రజ్ఞానంద, హంపిలపైనే దృష్టి



ప్రజ్ఞానంద



కోనేరు హంపి



గుకేశ్



విదిత్



వైశాలి

నేటి నుంచి క్యాండిడేట్స్ చెస్ టోర్నీ

టొరంటో: ఓపెన్, మహిళల విభాగాల్లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్స్‌కు ప్రత్యర్థులను నిర్ణయించే క్యాండిడేట్స్ చెస్ టోర్నీకి రంగం సిద్ధమైంది. టొరంటోలో నేడు మొదలయ్యే ఈ టోర్నీలో భారత్ నుంచి ఏకంగా ఐదుగురు గ్రాండ్‌మాస్టర్లు బరిలో ఉన్నారు. ఓపెన్ విభాగంలో ప్రజ్ఞానంద, గుకేశ్ (తమిళనాడు), విదిత్ (మహారాష్ట్ర)... మహిళల విభాగంలో కోనేరు హంపి (ఆంధ్రప్రదేశ్), ప్రజ్ఞానంద సోదరి వైశాలి (తమిళనాడు) తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. భారత్ నుంచి ప్రజ్ఞానంద, హంపి ఫేవరెట్స్‌గా కనిపిస్తున్నారు. ఓపెన్ విభాగంలో 8 మంది... మహిళల విభాగంలో 8 మంది మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో మొత్తం 14 రౌండ్ల చొప్పున టోర్నీని నిర్వహిస్తారు. అత్యధిక పాయింట్లు గెలిచిన ప్లేయర్లు విజేతగా నిలుస్తారు. క్యాండిడేట్స్ టోర్నీ ఓపెన్ విభాగం విజేత ప్రస్తుత విశ్వవిజేత డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగం విజేత ప్రస్తుత ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ టైటిల్ కోసం తలపడతారు. బుధవారం కేవలం ప్రారంభోత్సవం ఉంది. గురువారం తొలి రౌండ్ గేమ్‌లు జరుగుతాయి. ఈ టోర్నీలో పోటీపడనున్న క్రీడాకారుల వివరాలు...

ఓపెన్ విభాగం: ప్రజ్ఞానంద, గుకేశ్, విదిత్ (భారత్), నెపోమ్నిషి (రష్యా), కరువానా, నకమురా (అమెరికా), అబసోవ్ (అజర్‌బైజాన్), అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్). **మహిళల విభాగం:** హంపి, వైశాలి (భారత్), టింగ్‌జీ లె, టాన్ జోంగి (చైనా), కాటరీనా లాగ్నో, గొర్యాక్‌చినా (రష్యా), సలీమోవా (బల్గేరియా), అనా ముజిచుక్ (ఉక్రెయిన్).

సినిమా





హాలీవుడ్‌లో సీక్వెల్ అనగానే దాదాపు అందరి దృష్టి 'అవతార్' మీద ఉంటుంది. దర్శకుడు జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' తొలి భాగం 2009లో రాగా, రెండో భాగం రావడానికి పదమూడేళ్లు (2022) పట్టింది. మూడు, నాలుగు, ఐదు భాగాలను ప్రకటించారు కామెరూన్. మూడో భాగం ఈ ఏడాది విడుదల కావాల్సి ఉండగా వచ్చే ఏడాదికి వాయిదా పడింది. 'అవతార్' అభిమానులను ఇది నిరాశపరిచే విషయమే. అయితే ఈ ఏడాది దాదాపు పది సీక్వెల్స్ రానున్నాయి. పలు హిట్ చిత్రాలకు కొనసాగింపుగా రానున్న ఆ సీక్వెల్స్ గురించి తెలుసుకుందాం.

హాలీవుడ్‌లో సీక్వెల్ జోరు





సమ్మర్‌లో సైన్స్ ఫిక్షన్

ఈ వేసవికి రానున్న సైన్స్ ఫిక్షన్ చిత్రం 'కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్'. 'వార్ ఫర్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' (2017)కి సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందింది. 'ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్' ఫ్రాంచైజీలో ఇది నాలుగో భాగం. మూడు భాగాలూ సూపర్ హిట్టయిన నేపథ్యంలో తాజా చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. వెస్ బాల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విలియమ్ టీగ్, ఫ్రెయా అలన్ తదితరులు నటించారు. మే 10న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

ఫుల్ యాక్షన్‌తో బ్యాడ్ బాయ్స్

జూన్‌లో బ్యాడ్ బాయ్స్ తెరపైకి రానున్నారు. బడ్డీ కాప్ యాక్షన్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'బ్యాడ్ బాయ్స్: రైడ్ ఆర్ డై'. 2003లో వచ్చిన 'బ్యాడ్ బాయ్స్'కి నాలుగో భాగం ఇది. మూడో భాగం 'బ్యాడ్ బాయ్స్ ఫర్ లైఫ్' (2020) విడుదలైన నాలుగేళ్లకు వస్తోన్న సీక్వెల్ ఇది. ఈ చిత్రంలో డిటెక్టివ్ ల్యూటినెంట్ మైఖేల్‌గా లీడ్ రోల్‌ని విల్ స్మిత్ చేశారు. రెండో, మూడో భాగానికి దర్శకత్వం వహించిన ఆదిల్, బిలాల్ ద్వయం తాజా చిత్రాన్ని కూడా తెరకెక్కించారు. నాలుగు భాగాల్లోనూ మైఖేల్ పాత్రను విల్ స్మిత్‌నే చేశారు. యాక్షన్, కామెడీతో రూపొందిన ఈ చిత్రం జూన్ 7న రిలీజ్ కానుంది.

ఆరేళ్లకు డెడ్‌పూల్

ఈ ఏడాది అత్యంత భారీ అంచనాలు ఏర్పడ్డ సీక్వెల్ చిత్రాల్లో 'డెడ్‌పూల్ 3'ది ప్రముఖ స్థానం. ర్యాన్ రేనాల్డ్స్ టైటిల్ రోల్‌లో షానీ లెవీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఇది. మార్వెల్ కామిక్ బుక్స్‌లోని డెడ్‌పూల్ క్యారెక్టర్ ఆధారంగా రూపొందిన తొలి చిత్రం 'డెడ్‌పూల్' (2016). టిమ్ మిల్లర్ దర్శకత్వం వహించిన ఈ సూపర్ హీరో ఫిల్మ్ సూపర్ హిట్టయింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా షానీ లెవీ దర్శకత్వంలో రూపొందిన 'డెడ్‌పూల్ 2' (2018) కూడా బంపర్ హిట్. ఆరేళ్లకు మూడో భాగం 'డెడ్‌పూల్ అండ్ వుల్వరిన్' వస్తోంది. మూడు భాగాల్లోనూ డెడ్‌పూల్ పాత్రను ర్యాన్ రేనాల్డ్స్ చేశారు. జూలై 26న ఈ చిత్రం రిలీజ్ కానుంది.







హారర్ జూయిస్

దాదాపు మూడు దశాబ్దాల క్రితం వచ్చిన ఫ్యాంటసీ హారర్ కామెడీ మూవీ 'బీటిల్ జూయిస్' (1988) సంచలన విజయం సాధించింది. టిమ్ బర్టన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో బీటిల్ జూయిస్ పాత్రను మైఖేల్ కీటన్ పోషించారు. దాదాపు 35 ఏళ్లకు ఈ చిత్రానికి సీక్వెల్‌గా టిమ్ బర్టన్ దర్శకత్వంలోనే 'బీటిల్ జూయిస్ 2' రూపొందింది. సీక్వెల్‌లోనూ బీటిల్ జూయిస్ పాత్రను మైఖేల్ కీటన్ చేశారు. సెప్టెంబర్ 6న ఈ చిత్రం విడుదల కానుంది.

అక్టోబర్‌లో జోకర్

అక్టోబర్ నెల రెండు సీక్వెల్స్‌ని చూపించనుంది. ఒకటి 'జోకర్' సీక్వెల్... మరోటి 'వెనమ్' సీక్వెల్. అమెరికన్ కామిక్స్ ఆధారంగా మ్యూజికల్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'జోకర్' (2019). టాడ్ ఫిలిప్స్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో జోకర్ అనే ఆర్థర్ ఫ్లెక్స్ పాత్రను జోక్విన్ ఫీనిక్స్ పోషించారు. ఇప్పుడు ఇదే కాంబినేషన్‌లో 'జోకర్'కి సీక్వెల్‌గా 'జోకర్: ఫోలీ ఎ డ్యూక్స్' చిత్రం రూపొందింది. అక్టోబర్ 4న ఈ జోకర్ తెరపైకి రానున్నాడు.

ఇదే ఆఖరి వెనమ్

కొలంబియా పిక్చర్స్ నిర్మించిన స్పైడర్‌మేన్ యూనివర్స్‌లో ఆరో చిత్రం 'వెనమ్: ది లాస్ట్ డ్యాన్స్. 'వెనమ్' (2018), 'వెనమ్: లెట్ దేర్ బీ కార్నేజ్' (2021) చిత్రాలకు సీక్వెల్ ఇది. ఈ మూడో భాగంతో 'వెనమ్' సీక్వెల్ ముగుస్తుందని టాక్. కెల్లీ మార్సెల్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ వెనమ్ పాత్రను టామ్ హార్డీ పోషించారు. ఈ చిత్రం జూలైలోనే రిలీజ్ కావాల్సింది. అయితే వేతనాల పెంపుకి రచయితలు చేపట్టిన సమ్మె వల్ల వాయిదా పడింది. అక్టోబర్ 25న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

రెండు దశాబ్దాలకు గ్లాడియేటర్

రెండు దశాబ్దాల క్రితం వచ్చిన హిస్టారికల్ డ్రామా 'గ్లాడియేటర్' (2000) అనూహ్యమైన విజయం సాధించింది. రిడ్లీ స్కాట్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రొసెల్ క్రో, జోక్విన్ ఫీనిక్స్ తదితరులు నటించారు. పెట్టిన పెట్టుబడికి నాలుగింతలు వసూలు చేసింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా రిడ్లీ స్కాట్ దర్శకత్వంలోనే రూపొందిన 'గ్లాడియేటర్ 2' నవంబర్ 22న రిలీజ్ కానుంది. పాల్ మెస్కల్, డెంజల్ వాషింగ్టన్ తదితరులు నటించారు.

ఈ చిత్రాలతో పాటు యాక్షన్ అడ్వెంచర్ కామెడీ మూవీ 'సోనిక్ ది హెడ్‌హాగ్ 3' డిసెంబర్ 20న, అదే రోజున యానిమేటెడ్ మూవీ 'హూ ఫ్రేమ్డ్ రాగర్ రాబిట్ 2', 'ది కరాటే కిడ్' ఆరో భాగం డిసెంబర్ 13న... ఇంకా వీటితో పాటు ఈ ఏడాది మరికొన్ని సీక్వెల్స్ వచ్చే చాన్స్ ఉంది.

సావిత్రిగారిని చూడగానే నోట మాట రాలేదు - చిరంజీవి



● 'సావిత్రి క్లాసిక్స్' పుస్తకావిష్కరణలో ఓ దృశ్యం

''మహానటి సావిత్రిగారిపై రాసిన 'సావిత్రి క్లాసిక్స్' పుస్తకాన్ని ఆవిష్కరించడంతో నా జన్మ సార్థకం అయిందని భావిస్తున్నాను'' అన్నారు హీరో చిరంజీవి. దివంగత నటి సావిత్రిపై సంజయ్ కిశోర్ రచించిన 'సావిత్రి క్లాసిక్స్' బుక్ లాంచ్ వేడుక మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి మాట్లాడుతూ – ''నా తొలి సినిమా 'పునాదిరాళ్లు'లోనే సావిత్రిగారితో నటిస్తున్నానని తెలియగానే ఒళ్లు జలదరించింది. రాజమండ్రిలోని పంచవటి హోటల్‌లో ఉన్న సావిత్రిగారిని పరిచయం చేసేందుకు నన్ను తీసుకెళ్లారు. ఆమెను చూడగానే నోట మాట రాలేదు. 'నీ పేరేంటి బాబు' అని అడిగారామె. చిరంజీవి అన్నాను. 'శుభం బాగుంది' అన్నారు. మరుసటి రోజు వర్షం వల్ల 'పునాదిరాళ్లు' షూటింగ్ క్యాన్సిల్ అయింది. నేను సరదాగా డ్యాన్స్ చేస్తూ జారిపడ్డాను. అయినా ఆగకుండా నాగుపాములా డ్యాన్స్ చేయడంతో అందరూ క్లాప్స్ కొట్టారు. అప్పుడు సావిత్రిగారు 'భవిష్యత్‌లో మంచి నటుడు అవుతావు' అని చెప్పిన మాట నాకు వెయ్యి ఏనుగుల బలం అనిపించింది. 'ప్రేమ తరంగాలు'లో సావిత్రిగారి కొడుకుగా నటించాను. ఆ తర్వాత ఆమెతో నటించే, ఆమెను చూసే చాన్స్ రాలేదు. కేవలం కళ్లతోనే నటించగల, హావభావాలు పలికించగల అలాంటి గొప్ప నటి ప్రపంచంలో మరెవరూ లేరు'' అన్నారు. ఈ వేడుకలో సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి, కుమారుడు సతీశ్ కుమార్, నటీనటులు జయసుధ, బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, మురళీ మోహన్, రచయిత పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడారు.


విభిన్నమైన ప్రేమకథ



● నవదీప్

నవదీప్ హీరోగా నటించిన చిత్రం 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పంఖురి గిద్వానీ, భావన సాగి, మిర్చి హేమంత్, మిర్చి కిరణ్ ఇతర పాత్రల్లో నటించారు. నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్‌పై సిస్పేస్ సంస్థ నిర్మించిన 'లవ్ మౌళి' ఈ నెల 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అవనీంద్ర మాట్లాడుతూ– ''నా జీవితంలో జరిగిన ప్రేమకథలకు తెరరూపమే ఈ సినిమా. విభిన్నమైన ప్రేమకథలు కోరుకునే ప్రేక్షకుల మనసులకు మా చిత్రం హత్తుకుంటుంది. ఈ చిత్రంలో నవదీప్ కొత్తగా కనిపిస్తారు'' అన్నారు.

హాస్య నటుడు విశ్వేశ్వర రావు కన్నుమూత



ప్రముఖ హాస్య నటుడు గరిమెళ్ల విశ్వేశ్వర రావు (64) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నై సిరుచ్చేరిలోని తన నివాసంలో సోమవారం తుది శ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో పుట్టారు విశ్వేశ్వర రావు. ఆరేళ్ల వయసులో 'పొట్టి ప్లీడరు' సినిమాతో నటుడిగా కెరీర్ ఆరంభించారాయన. ఆ తర్వాత 'భక్త పోతన, బాలమిత్రుల కథ, ఓ సీత కథ, మా నాన్న నిర్దోషి, పట్టిందల్లా బంగారం, అందాల రాముడు, సిసింద్రీ చిట్టిబాబు'.. ఇలా బాలనటుడిగా 150కి పైగా సినిమాలు చేశారు. అనంతరం కామెడీ, సహాయక పాత్రల్లో నటించి ప్రత్యేక గుర్తింపు పొందారు. 'ముఠా మేస్త్రి, ప్రెసిడెంట్‌గారి పెళ్లాం, ఆమె కథ, ఆయనకు ఇద్దరు, అక్కడ అమ్మాయి– ఇక్కడ అబ్బాయి, మెకానిక్ అల్లుడు, శివాజీ, అవును.. వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు'.. ఇలా దాదాపు రెండొందల సినిమాల్లో తనదైన నటనను కనబరిచారు. తెలుగు, తమిళ, కన్నడంలో 300కిపైగా చిత్రాల్లో నటించారు విశ్వేశ్వర రావు. 150కి పైగా సీరియల్స్‌లో నటించారు. 'విస్సు టాకీస్' పేరుతో యూ ట్యూబ్ చానల్‌ని ప్రారంభించారు. అందులో సెలబ్రిటీలను ఇంటర్వ్యూ చేయడంతో పాటు చిత్ర సీమలో తన అనుభవాలు, జ్ఞాపకాలను పంచుకునేవారు. విశ్వేశ్వర రావు నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగానూ వ్యవహరించారు. ఆయన మృతిపట్ల పలువురు తెలుగు, తమిళ, కన్నడ చిత్రరంగ ప్రముఖులు సంతాపం తెలిపారు. విశ్వేశ్వర రావుకి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు భార్గవి, పూజ ఉన్నారు. మంగళవారం ఆయన అంత్యక్రియలు జరిగాయి.

నిర్మాతగా కొనసాగుతాను



● పాయల్

''నాకు చిన్నప్పటి నుంచే గ్లామర్ ఇండస్ట్రీ అంటే ఆసక్తి. అయితే నిర్మాత అవుతానని అనుకోలేదు. అనుకోకుండా 'భరతనాట్యం' వంటి మంచి సినిమా నిర్మించే అవకాశం వచ్చింది. నా పేరు, మా బాబు రుషాంత్ పేరు వచ్చేలా పీఆర్ ఫిలింస్ బ్యానర్ పెట్టాను'' అన్నారు పాయల్ సరాఫ్. సూర్యతేజ ఏలే, మీనాక్షీ గోస్వామి జంటగా కేవీఆర్ మహేంద్ర దర్శకత్వం వహించిన సినిమా 'భరతనాట్యం'. పాయల్ సరాఫ్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 5న రిలీజవుతోంది. పాయల్ మాట్లాడుతూ– ''నా భర్త హితేష్‌కి సూర్యతేజ చెప్పిన నచ్చింది. దర్శకుడు కావాలనుకునే ఓ కుర్రాడు నేర ప్రపంచంలో చిక్కుకుంటాడు. అక్కడి నుంచి ఎలా బయటపడ్డాడు? అనేది ఈ చిత్రకథ. ఇక నిర్మాతగా కొనసాగుతాను. నటిగా చాన్స్ వస్తే చేస్తాను'' అన్నారు.

సైకలాజికల్ థ్రిల్లర్



● హర్షివ్ కార్తీక్

హర్షివ్ కార్తీక్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'బహుముఖం'. ఈ నెల 5న ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా హర్షివ్ కార్తీక్ మాట్లాడుతూ– ''అమెరికాలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా చేశాను. జాబ్ నుంచి ఇంటికి వచ్చిన తర్వాత నటన, రచన, డైరెక్షన్, ప్రొడక్షన్.. ఇలా అన్నీ ఆన్ లైన్‌లో నేర్చుకున్నా. మానసిక అనారోగ్యం ఉన్న ఓ వ్యక్తి ఆడిషన్‌కు వెళతాడు. అక్కడ అవమానం జరగడంతో అతను ఎంతవరకూ వెళ్లాడు? అనేది 'బహుముఖం' కథ. సస్పెన్స్, సైకలాజికల్ థ్రిల్లర్స్‌ని ఇష్టపడేవారు మా సినిమాని ఎంజాయ్ చేస్తారు. నా తర్వాతి సినిమా కోసం ఒక యాక్షన్ డ్రామా కథ రాసుకున్నాను'' అన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
3-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
111	9
73,904	22,453

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,211	▽ 187
డోజోన్స్	39,074	▽ 492
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,935	▽ 18
డాక్స్	18,283	▽ 209
షాంఘై	3,075	▽ 2
నికాయ్	39,838	▽ 33

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	68,961 △	298
బంగారం (99.5 స్వచ్ఛత)	68,685 △	297
వెండి (కేజీ)	76,127 △	1,016

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భారమకంలో	82.97	83.99
£	బ్రిటన్ పౌండ్	భారమకంలో	103.44	105.98
€	యూరో	భారమకంలో	88.42	90.77
¥	జపాన్ ఎన్ (100)	భారమకంలో	54.41	55.63
AUS$	ఆస్ట్రేలియా డాలర్	భారమకంలో	53.25	55.16
S$	సింగపూర్ డాలర్	భారమకంలో	59.34	64.02
SAR	సౌదీ రియాల్	భారమకంలో	21.34	22.90
UAE D	యూఏఈ దిర్హామ్	భారమకంలో	21.82	23.60
¥	చైనా యువాన్	భారమకంలో	10.41	12.48

హ్యాపీ మొబైల్స్ ఆరో వార్షికోత్సవ ఆఫర్లు



హైదరాబాద్: మొబైల్ విక్రయాల సంస్థ హ్యాపీ మొబైల్స్ ఆరో వార్షికోత్సవం సందర్భంగా 'హ్యాపీ డేస్' పేరుతో ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ప్రతి కొనుగోలుపై ఆరు కచ్చితమైన బహుమతులు అందించనుంది. మొబైల్స్, ఎల్‌ఈడీ స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్స్‌ల కొనుగోలుపై అత్యధికంగా 7.5% వరకు తక్షణ డిస్కౌంట్, క్యాష్‌బ్యాక్ ఇవ్వనుంది. మొబైల్ ఉపకరణాలపై గరిష్టంగా 65% వరకు తగ్గింపు ఆఫర్ ఇస్తుంది. వీటికి తోడు ఎక్స్ఛేంజీ ఆఫర్లు, ఒకసారి స్క్రీన్ మార్చుకునే సదుపాయం కల్పిస్తుంది. ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల కొనుగోలుపై ప్రతి కస్టమర్‌కి అత్యుత్తమ ఆఫర్లు అందించనుంది.

నీల్‌కమల్ బ్రాండ్ అంబాసిడర్‌గా రణ్‌బీర్ కపూర్



హైదరాబాద్: ప్రముఖ ఫర్నిచర్ సంస్థ నీల్‌కమల్ స్లీప్ తమ ప్రచారకర్తగా బాలీవుడ్ నటుడు రణబీర్ కపూర్‌ను ఎంపిక చేసుకుంది. ''మా బ్రాండ్ అంబాసిడర్‌గా రణబీర్ కపూర్‌ని నియమించుకోవడం సంతోషంగా ఉంది. సంస్థ ఉత్పత్తులను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రణ్‌బీర్‌కున్న ప్రజాదరణ తోడ్పడుతుంది'' అని నీల్‌కమల్ స్లీప్ అధిపతి ఇషాన్ పరేఖ్ తెలిపారు. నాణ్యమైన నిద్ర ప్రాముఖ్యతను అర్థం చేసుకొని వ్యక్తిగత నిద్ర అలవాట్లను గౌరవించే నీల్ కమల్ స్లీప్‌తో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందని రణ్‌బీర్ కపూర్ పేర్కొన్నారు. ఈ మ్యాట్రెస్‌లు ప్రశాంతమైన నిద్రానుభవాన్ని అందిస్తాయన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	403-00
విజయవాడ	403-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	380-00
వరంగల్	382-00
రిటైల్ ధర	4.40

పన్ను వసూళ్ల లక్ష్యం సాధించిన కేంద్రం!



న్యూఢిల్లీ: ఆర్థిక పురోగతిని ప్రతిబింబిస్తూ కేంద్రం మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను వసూళ్ల లక్ష్యాన్ని దాదాపు సాధించింది. 2024 ఫిబ్రవరి 1న ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన సవరిత అంచనాల ప్రకారం... 2023-24 ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూళ్ల లక్ష్యం రూ.34.37 లక్షల కోట్లు. అత్యున్నత స్థాయి వర్గాల సమాచారం ప్రకారం ఈ వసూళ్లు దాదాపు లక్ష్యానికి చేరువయ్యాయి. ప్రత్యక్ష పన్ను వసూళ్లు (కార్పొరేట్, వ్యక్తిగత పన్నులు) రూ.19.45 లక్షల కోట్లు ఒనగూరగా, రూ. 14.84 పరోక్ష పన్ను వసూళ్లు (జీఎస్‌టీ, కస్టమ్స్, ఎక్సైజ్) జరిగాయి. ఆర్థిక సంవత్సరం పూర్తి లెక్కలు తేలితే లక్ష్య సాధన సాధించినట్లు స్పష్టమవుతుందని ఆ వర్గాలు వెల్లడించాయి. నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు మార్చి 17తో ముగిసిన కాలానికి రూ.18.90 లక్షల కోట్లు. జీఎస్‌టీ వసూళ్లు రికార్డులను సృష్టించిన సంగతి తెలిసిందే.

లక్ష్యం చేరని డిజిన్వెస్ట్‌మెంట్

2023-24లో రూ. 16.507 కోట్లు



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో కేంద్ర ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. పీఎస్‌యూలలో మైనారిటీ వాటాల విక్రయం ద్వారా రూ. 16,507 కోట్లు మాత్రమే సమకూర్చుకోగలిగింది. గతేడాది బడ్జెట్‌లో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ. 51,000 కోట్లను సమీకరించాలని తొలుత ప్రతిపాదించింది. అయితే 2024 ఫిబ్రవరి 1న అంచనాలను రూ. 30,000 కోట్లకు సవరించింది. దీపమ్ వివరాల ప్రకారం మార్చ్31తో ముగిసిన గతేడాది ప్రభుత్వం రూ. 16,507 కోట్లు మాత్రమే సమీకరించింది. 2018-19, 2017-18లలో మాత్రమే ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాలను అందుకోగలిగింది. 2017-18లో బడ్జెట్‌లో ప్రతిపాదించిన రూ. లక్ష కోట్లను మించుతూ ఏకంగా రూ. 1,00,056 కోట్లు సమకూర్చుకుంది. 2018-19లోనూ రూ. 80,000 లక్ష్యాన్ని అధిగమించి రూ. 84,972 కోట్లు అందుకుంది.

తెలుగు రాష్ట్రాల్లో జియోకు కొత్తగా 2.59 లక్షల చందాదారులు



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో జియోకు 2024 జనవరిలో కొత్తగా 2.59 లక్షలకు పైగా చందాదారులు కొత్తగా చేరారు. ట్రాయ్ గణాంకాల ప్రకారం జనవరి లో జియో అత్యధికంగా 2,59,788 మొబైల్ చందాదారులను చేర్చుకుంది. దీంతో జియో కస్టమర్ల సంఖ్య 3.24 కోట్లకు చేరుకుంది. ఇదే నెలలో ఎయిర్‌టెల్ 1.18 లక్షల కొత్త మొబైల్ చందాదారులు చేరారు. మరోవైపు వోడాఐడియా 44,649 మంది సభ్యులను, బీఎస్‌ఎన్‌ఎల్ 16,146 మంది కస్టమర్లను కోల్పోయాయి. గణాంకాల ప్రకారం జనవరి 2024 నాటికి దేశంలో మొత్తం మొబైల్ కస్టమర్ల సంఖ్య 52.67 కోట్లకు చేరుకుంది.

మార్చిలో తయారీకి కొత్త ఆర్డర్ల దన్ను



న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగం మార్చిలో మంచి ఫలితాన్ని నమోదుచేసుకుంది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) ఫిబ్రవరిలో 56.9 వద్ద ఉంటే, మార్చిలో ఏకంగా 16 సంవత్సరాల గరిష్ఠ స్థాయి 59.1కి ఎగసింది. వ్యవస్థలో సానుకూల డిమాండ్, కొత్త ఆర్డర్‌లు, ఉత్పత్తి, ఇన్‌పుట్ స్టాక్‌ల బలమైన వృద్ధిని ఈ ఫలితం ప్రతిబింబిస్తుంది. సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ లోపునకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. గడచిన 33 నెలల ఈ సానుకూలత ఉంది.

ఏఎస్‌ఐసీ చెయిర్‌గా సంగీత జిందాల్



ముంబై: ఏషియా సొసైటీ ఇండియా సెంటర్ (ఏఎస్‌ఐసీ) బోర్డు కొత్త చెయిర్‌గా సంగీతా జిందాల్ ఎన్నికయ్యారు. ఆమె ఎన్నిక ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. దేశీయంగానే కాకుండా దక్షిణాసియాలో సమకాలీన కళల రంగానికి ఆమె సేవలు అందిస్తున్నారని ఏఎస్‌ఐసీ తెలిపింది.

బీఎండబ్ల్యూ, టాటా టెక్ జత

న్యూఢిల్లీ: ఆటో రంగ జర్మన్ దిగ్గజం బీఎండబ్ల్యూ గ్రూప్, దేశీ ప్రొడక్ట్ ఇంజనీరింగ్, డిజిటల్ సర్వీసుల కంపెనీ టాటా టెక్నాలజీస్ చేతులు కలపనున్నాయి. తద్వారా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధిసహా.. దేశీయంగా ఐటీ డెవలప్‌మెంట్ హబ్‌కు తెరతీయనున్నట్లు సంయుక్తంగా వెల్లడించాయి. ఇందుకు భాగస్వామ్య సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశాయి. ప్రణాళికల్లో భాగంగా పుణే, బెంగళూరు, చెన్నైలలో ఐటీ అభివృద్ధి కేంద్రాలను నెలకొల్పనున్నట్లు పేర్కొన్నాయి. బెంగళూరు, పుణేలలో ప్రధాన అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించాయి. చెన్నైలో ఐటీ సొల్యూషన్ల బిజినెస్‌పై దృష్టి కేంద్రీకరించనున్నట్లు పేర్కొన్నాయి. అధీకృత సంస్థల అనుమతుల ఆధారంగా భాగస్వామ్యాన్ని కుదుర్చుకోనున్నట్లు వెల్లడించాయి. జేవీతో ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్‌ను అందించనున్నాయి.

సంయుక్త సంస్థ ఏర్పాటుకు రెడీ



ఒప్పంద కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు

ఎస్‌డీవీ సొల్యూషన్లు

జేవీ ప్రధానంగా బీఎండబ్ల్యూ గ్రూప్ ప్రీమియం వాహనాలకు సాఫ్ట్‌వేర్ ఆధారిత వాహన(ఎస్‌డీవీ) సొల్యూషన్లు సమకూర్చనుంది. అంతేకాకుండా ఐటీ బిజినెస్‌కు డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్లు సైతం అందించనుంది. సుమారు 100 ఇన్నోవేటర్లతో కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు సంయుక్త ప్రకటనలో బీఎండబ్ల్యూ, టాటా టెక్ వెల్లడించాయి. రానున్న కాలంలో వీలైనంత త్వరగా ఈ సంఖ్యను నాలుగంకెలకు పెంచనున్నట్లు తెలియజేశాయి. సాఫ్ట్‌వేర్, ఐటీ కేంద్రాల బీఎండబ్ల్యూ గ్లోబల్ నెట్‌వర్క్‌లో జేవీ భాగంకానున్నట్లు పేర్కొన్నాయి. బీఎండబ్ల్యూ గ్రూప్‌తో చేతులు కలపడం ద్వారా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, డిజిటల్ ఇంజనీరింగ్‌లో కస్టమర్లకు అత్యున్నత సొల్యూషన్లు అందించేందుకు కట్టుబడి ఉన్న విషయాన్ని తెలియజేస్తున్నట్లు టాటా టెక్ సీఈవో, ఎండీ వారెన్ హారిస్ పేర్కొన్నారు. టాటా టెక్‌తో భాగస్వామ్యం ఎస్‌డీవీ విభాగంలో పురోగతికి సహకరించనున్నట్లు బీఎండబ్ల్యూ గ్రూప్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ క్రిస్టోఫ్ గ్రోట్ తెలియజేశారు.

మూడు రోజుల ర్యాలీకి బ్రేక్

ప్రైవేట్ బ్యాంకులు, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ • స్వల్ప నష్టాల ముగింపు



ముంబై: ప్రైవేటు రంగ బ్యాంకులు, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల అంశాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 111 పాయింట్లు నష్టపోయి 73,904 వద్ద స్థిరపడింది. నిఫ్టీ తొమ్మిది పాయింట్లు నష్టపోయి 22,453 వద్ద నిలిచింది. దీంతో సూచీల మూడు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు ఇంట్రాడేలో అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 271 పాయింట్లు పతనమై 73,744 వద్ద కనిష్టాన్ని, నిఫ్టీ 74 పాయింట్లు క్షీణించి 22,388 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చాయి. ఆఖరి గంటలో కన్జ్యూమర్ డ్యూరబుల్స్, సర్వీసెస్, మెటల్, యుటిలిటీ, కమోడిటీ రంగాలకు చెందిన మధ్య, తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీల నష్టాలు కొంత తగ్గాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు వరుసగా 1.28%, 1.14% చొప్పున పెరిగాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు భారీ నష్టాల నుంచి రికవరీ అయ్యాయి. రిటైల్ విభాగాన్ని విభజిస్తుందన్న వార్తలతో ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ షేరు 12% లాభపడి రూ.236 వద్ద ముగిసింది.

ఐపీవోల జోరు

• 2023-24లో 76 కంపెనీల లిస్టింగ్
• రూ. 62,000 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: సెకండరీ మార్కెట్ల జోష్‌తో మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం(2023-24)లో ప్రైమరీ మార్కెట్ సైతం జోరు చూపింది. ప్రధాన విభాగంలో మొత్తం 76 కంపెనీలు ఐపీవోల ద్వారా సుమారు రూ. 62,000 కోట్లు సమీకరించాయి. అంతక్రితం ఏడాది(2022-23)తో పోలిస్తే ఇది 19 శాతం అధికం. ఈ బాటలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25)లోనూ పబ్లిక్ ఇష్యూలకు కంపెనీలు క్యూ కట్టే వీలున్నట్లు స్టాక్ నిపుణులు భావిస్తున్నారు. దేశీయంగా పెట్టుబడుల ప్రవాహం, కార్పొరేట్ సుపరిపాలన, సానుకూల ప్రభుత్వ విధానాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల జోరు తదితర అంశాలు ఇందుకు సహకరించనున్నట్లు పంటోమాత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ గ్రూప్ ఒక నివేదికలో పేర్కొంది. వెరసి ఈ ఏడాది ప్రైమరీ మార్కెట్ ద్వారా రూ. లక్ష కోట్ల సమీకరణకు వీలున్నట్లు పంటోమాత్ క్యాపిటల్ అడ్వయిజర్స్ ఎండీ మహావీర్ లునావత్ అంచనా వేశారు.

గతంలో తక్కువే

పబ్లిక్ ఇష్యూల ద్వారా 2022-23లో 37 కంపెనీలు లిస్టయ్యాయి. తద్వారా ఉమ్మడిగా రూ. 52,115 కోట్లు సమకూర్చుకున్నాయి. కాగా.. గతేడాది విభిన్న రంగాల నుంచి కంపెనీలు ఐపీవోలు చేపట్టాయి. అయితే 2022-23లో 51 శాతం ఆక్రమించిన ఫైనాన్షియల్ రంగం నుంచి రూ. 9,655 కోట్లు మాత్రమే సమీకరించాయి. ఇది మొత్తం నిధుల్లో 20 శాతంకంటే తక్కువే. ఇక ఆధునిక తరం టెక్నాలజీ కంపెనీలలో కేవలం యాత్రా, మామాఎర్త్, జాగిల్ మాత్రమే లిస్టయ్యాయి. తొలి రోజు లిస్టింగ్ లాభాల విషయానికివస్తే.. 2022-23లో 9 శాతంతో పోలిస్తే గతేడాది 29 శాతానికి ఎగశాయి. ఈ బాటలో 70 శాతం అంటే 55 స్టాక్స్ ఇష్యూ ధర కంటే ఎగువనే ట్రేడవుతున్నాయి.

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్‌లో 47 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్(ఐపీపీబీ).. దేశవ్యాప్తంగా ఐపీపీబీ శాఖల్లో ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 47 (యూఆర్-21, ఈడబ్ల్యూఎస్-04, ఓబీసీ-12, ఎస్సీ-07, ఎస్టీ-03).
» **అర్హత:** ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.03.2024 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.30,000.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్/గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.04.2024
» **వెబ్‌సైట్:** www.ippbonline.com

ఎన్‌ఎండీసీ లిమిటెడ్‌లో 193 అప్రెంటిస్‌లు

దంతెవాడ(ఛత్తీస్‌గఢ్)లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌ఎండీసీ), బైలాదిలా ఐరన్ ఓర్ మైన్, కిరాండుల్ కాంప్లెక్స్‌లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 193
» **విభాగాలు:** ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, ఫిట్టర్, వెల్డర్, మెకానిక్ డీజిల్, మెకానిక్ మోటార్ వెహికల్, సీఓపీఏ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్, బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 31.03.2024 నాటికి 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
» **ఇంటర్వ్యూ తేదీలు:** 15.04.2024, 16.04.2024, 18.04.2024, 19.04.2024, 20.04.2024, 21.04.2024, 22.04.2024, 25.04.2024, 26.04.2024.
» **ఇంటర్వ్యూ వేదిక:** బైలా క్లబ్ అండ్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్, బీఐవోఎం, కిరాండుల్ కాంప్లెక్స్, కిరాండుల్, దంతెవాడ జిల్లా, ఛత్తీస్‌గఢ్.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.apprenticeshipindiagov.in

ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్శిటీలో 158 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

ఢిల్లీలోని ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్శిటీలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 158
» **విభాగాల వారీగా ఖాళీలు:** డిజైన్-06, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్-10, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-13, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్-05, ఎకనామిక్స్(యూఎస్ఎంఈ) -04, మేనేజ్‌మెంట్(యూఎస్ఎంఈ)-27, బయోటెక్నాలజీ -09, మెకానికల్ ఇంజనీరింగ్-34, కంప్యూటర్ సైన్స్-ఇంజనీరింగ్-50.
» **అర్హత:** సంబంధిత విభాగాల్లో యూజీ, పీజీ, పీహెచ్‌డీ, స్లెట్/సెట్, యూజీసీ/సీఎస్ఐఆర్/ఐకార్/జీప్యాట్/గేట్/ఐసీఎంఆర్/నెట్-లెక్చర్‌షిప్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులవ్వాలి. బోధన, పరిశోధన అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్, ప్రజెంటేషన్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.04.2024
» **దరఖాస్తు హార్డ్‌కాపీ పోస్టులో పంపేందుకు చివరి తేది:** 24.04.2024.
» **వెబ్‌సైట్:** www.dtu.ac.in

ఎన్‌పీసీఐఎల్‌లో 335 అప్రెంటిస్‌లు


కోటా(రాజస్థాన్)లోని రావత్‌బాటా రాజస్థాన్ సైట్ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్).. అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 335
» **ట్రేడుల వారీగా ఖాళీలు:** ఫిట్టర్-94, ఎలక్ట్రీషియన్-94, ఎలక్ట్రానిక్ మెకానిక్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(సీఓపీఏ), టర్నర్, మెషినిస్ట్, వెల్డర్. -శిక్షణ కాలం: ఒక సంవత్సరం.
» **స్టైపెండ్:** నెలకు రూ.7,700 నుంచి రూ.8,855
» **అర్హత:** సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 14 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఐటీఐ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.04.2024.
» **వెబ్‌సైట్:** https://npcilcareers.co.in

పది తర్వాత.. కెరీర్ ప్లాన్ ఇలా!

టెన్త్.. ప్రతి విద్యార్థి జీవితంలో.. టర్నింగ్ పాయింట్! పదో తరగతి తర్వాత ఏం చేయాలి.. ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలా.. ఉద్యోగం కోసం ప్రయత్నించొచ్చా.. సత్వరం ఉపాధిని అందించే మార్గాలు ఏవి.. ఇలా ఇటీవల టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులకు ఎన్నో సందేహాలు!! ఎక్కువ మంది ఇంటర్‌లో ఎంపీసీ లేదా బైపీసీలో చేరి.. ఇంజనీరింగ్, మెడిసిన్‌లో చేరాలని కలలు కంటున్నారు. వీటితో పాటు పదో తరగతి ఉత్తీర్ణులకు అందుబాటులో ఉన్న ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు.. కోర్సులు, కెరీర్ ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం...

» అందుబాటులో పలు కోర్సులు, ఉపాధి మార్గాలు
» ఎక్కువ మంది తొలి గమ్యం ఇంటర్మీడియెట్
» ఇంజనీరింగ్‌కు మార్గంగా పాలిటెక్నిక్స్
» సత్వర ఉపాధితో ఐటీఐల వైపు మొగ్గు



పదో తరగతి తర్వాత అధిక శాతం మంది ఇంటర్మీడియెట్ వైపు మొగ్గు చూపుతున్నారు. అందులోనూ ఎంపీసీ, బైపీసీల్లో చేరి భవిష్యత్తులో ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సుల్లో ప్రవేశం పొందాలనే ఆలోచనతో ఉంటున్నారు. మరికొంతమంది విద్యార్థులు మాత్రం సత్వరం ఉపాధి కల్పించే ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సు పట్ల ఆసక్తి చూపుతున్నారు.

తొలి గమ్యం.. ఇంటర్

ఇంటర్(ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ)లో ప్రతి గ్రూప్ దేనికదే ప్రత్యేకమైనవి. అత్యధిక శాతం మంది ఎంపీసీలో చేరుతున్నారు. ఆ తర్వాత బైపీసీతోపాటు సీఈసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ వంటి గ్రూప్‌లతోనూ ఉజ్వల అవకాశాలు సొంతం చేసుకునే వీలుంది. అదేవిధంగా టెక్నికల్ స్కిల్స్, వృత్తి నైపుణ్యాలు అందించే ఒకేషనల్ కోర్సుల్లోనూ చేరే వీలుంది.

ఇంజనీరింగ్‌కు కేరాఫ్ ఎంపీసీ

- ఎంపీసీ.. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల కలయికగా ఉండే గ్రూప్ ఇది. ఈ గ్రూప్‌తో ఈఏపీసెట్, జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్, బిట్‌శాట్ వంటి ప్రవేశ పరీక్షల్లో ర్యాంకు సాధించి ఇంజనీరింగ్‌లో కెరీర్‌కు బాటలు వేసుకోవచ్చు. ఎన్‌డీఏ, 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీంల ద్వారా డిఫెన్స్ రంగంలో కెరీర్ ప్రయత్నాలు చేయొచ్చు. వీటితోపాటు భవిష్యత్తులో సైన్స్ రంగంలో స్థిరపడాలనుకుంటే.. బీఎస్సీ, ఆ తర్వాత ఎమ్మెస్సీ, రీసెర్చ్ కోర్సులు చేసే అవకాశం కూడా ఉంది.
- నైపుణ్యాలు: ఎంపీసీతో రాణించేందుకు కంప్యూటేషనల్ స్కిల్స్, న్యూమరికల్ స్కిల్స్ ఉండాలని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతోపాటు మన కళ్ల ముందు కనిపించే గ్యాడ్జెట్స్, వాటి పనితీరును తెలుసుకోవాలనే ఆసక్తి ఉండాలి.

బైపీసీ.. బహుళ అవకాశాలు

- ఎంపీసీ తర్వాత ఎక్కువ మంది ఎంచుకునే గ్రూప్.. బైపీసీ! ఈ గ్రూప్ ఉత్తీర్ణులు జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్-యూజీలో ర్యాంకు ఆధారంగా ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో అడుగుపెట్టొచ్చు. రాష్ట్ర స్థాయిలో ఈఏపీ సెట్(అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్)లో ర్యాంకు సాధించి వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్, ఫార్మసీ వంటి విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీలో చేరే వీలుంది. ఆ తర్వాత పీజీ, పీహెచ్‌డీ చేసే అవకాశముంది. ఇంటర్మీడియెట్ బైపీసీ అర్హతతో బీఎస్సీ (బీజెడ్‌సీ)లో అడుగు పెట్టొచ్చు. ఇప్పుడు బీజెడ్‌సీలోనూ బయో ఇన్ఫర్మాటిక్స్, బయోటెక్, హ్యూమన్ జెనెటిక్స్, జెనెటిక్స్ వంటి వినూత్న సబ్జెక్టులు అందుబాటులోకి వచ్చాయి. వీటిని పూర్తి చేసుకుంటే.. ఫార్మా, లైఫ్ సైన్సెస్ విభాగాల్లో కెరీర్ అవకాశాలు లభిస్తాయి.
- నైపుణ్యాలు: బైపీసీ గ్రూప్‌ను ఎంచుకునే విద్యార్థులకు లైఫ్ సైన్సెస్‌పై సహజ ఆసక్తి ఉండాలి. జీవులు, పరిసరాలు, పర్యావరణంపై ఆసక్తితో పాటు వాటి పట్ల సహానుభూతి(ఎంపతీ) వంటివి ఉంటే మేలు.

సీఈసీ.. కార్పొరేట్ కెరీర్స్

- కార్పొరేట్ రంగంలో కెరీర్ కోరుకునే వారికి చక్కటి మార్గం.. సీఈసీ. కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టులు కలయికగా ఉండే గ్రూప్ ఇది. సీఈసీ విద్యార్థులకు ఉన్నత విద్య పరంగా బీకాం కోర్సు ముఖ్య మార్గంగా నిలుస్తోంది. బీకాం చదువుతూనే చార్టర్డ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటెన్సీ, కంపెనీ సెక్రటరీ వంటి కామర్స్ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసుకోవచ్చు. తద్వారా కంపెనీల్లో ఇంటర్నల్ ఆడిటర్స్, స్టాక్ ఆడిటర్స్, ఫైనాన్షియల్ మేనేజర్స్, అసిస్టెంట్ కంపెనీ సెక్రటరీస్ వంటి వైట్ కాలర్ ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. అదేవిధంగా బ్యాచిలర్ డిగ్రీ తర్వాత.. పీజీ స్థాయిలో ఎంకామ్, ఎంబీఏలో చేరే వీలుంది. ముఖ్యంగా అకౌంటింగ్ రంగంలో రాణించాలనుకునే వారు ఎంబీఏ ఫైనాన్స్ పూర్తి చేసుకోవచ్చు.
- నైపుణ్యాలు: కాలిక్యులేషన్ స్కిల్స్, గణాంకాల విశ్లేషణ, సూక్ష్మ స్థాయి పరిశీలన, వ్యాపార, వాణిజ్యాలపట్ల ఆసక్తి వంటి ఉండాలి.

కాంపిటీటివ్ కింగ్.. హెచ్‌ఈసీ

హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ గ్రూప్ సబ్జెక్టులుగా ఉండే హెచ్‌ఈసీపై పట్టు సాధించడం ద్వారా ఉద్యోగ పరీక్షల్లో విజయం సాధించొచ్చు అనేది నిపుణుల అభిప్రాయం. ముఖ్యంగా సివిల్ సర్వీసెస్, గ్రూప్స్ తదితర ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకున్న వారికి ఈ గ్రూప్ అనుకూలంగా నిలుస్తోంది. ఇటీవల కాలంలో బీఏలోనూ పలు జాబ్ ఓరియెంటెడ్ గ్రూప్ కాంబినేషన్స్ అందుబాటులోకి వస్తున్నాయి. వీటిని పూర్తి చేసుకోవడం ద్వారా ప్రైవేటు రంగంలో కొలువులు దక్కించుకోవచ్చు.

ఇంజనీరింగ్‌కు మార్గం.. పాలిటెక్నిక్

భవిష్యత్తులో ఇంజనీరింగ్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలనుకునే వారికి టెన్త్ తర్వాత అందుబాటులో ఉన్న చక్కటి మార్గం.. పాలిటెక్నిక్ కోర్సులు. మూడు, మూడున్నరేళ్ల వ్యవధి ఉండే ఈ కోర్సులు పూర్తిచేసుకోవడం ద్వారా పరిశ్రమల్లో సూపర్‌వైజర్ స్థాయి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా పాలిటెక్నిక్ డిప్లొమా అభ్యర్థులు ఈసెట్‌లో ర్యాంకుతో నేరుగా బీటెక్ ద్వితీయ సంవత్సరంలో అడుగుపెట్టే అవకాశం కూడా ఉంది.

ఇండస్ట్రీలో ఉపాధికి ఐటీఐ

పదో తరగతి అర్హతగా వృత్తి విద్య శిక్షణతోపాటు స్వయం ఉపాధికి మార్గం.. ఇండస్ట్రియల్ ట్రెనింగ్ సెంటర్స్(ఐటీఐ). నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఒకేషనల్ ట్రెనింగ్ పరిధిలోని ఐటీఐల్లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఫిట్టర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ తదితర పదుల సంఖ్యలో ట్రేడ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సు ఉత్తీర్ణత తర్వాత పారిశ్రామిక సంస్థల్లో టెక్నీషియన్స్‌గా ఉపాధి పొందొచ్చు. అదే విధంగా అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసుకుని ఎన్‌సీవీటీ అందించే సర్టిఫికెట్ పొందితే ఉద్యోగ సాధనలో ప్రాధాన్యం లభిస్తుంది.

గురుకుల కళాశాలలు

- పదో తరగతి తర్వాత ఇంటర్మీడియెట్ స్థాయిలో రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్‌లు చక్కటి వేదికలుగా నిలుస్తున్నాయి. వీటిలో అడుగుపెట్టాలంటే.. రాష్ట్ర స్థాయిలో ఆర్‌జేసీ సెట్‌ల పేరుతో నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి.
- తెలంగాణ రాష్ట్రంలో.. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా టీఎస్‌ఆర్‌జేసీ-సెట్ నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఏపీ ఆర్‌జేసీ సెట్ నిర్వహిస్తారు. ఈ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశం పొందిన వారికి పూర్తి స్థాయి రెసిడెన్షియల్ విధానంలో బోధన ఉంటుంది. నీట్ యూజీ, ఐఐటీ జేఈఈ వంటి వాటికి ప్రత్యేక శిక్షణసైతం లభిస్తుంది.

అగ్రి పాలిటెక్నిక్స్

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రత్యేకంగా అగ్రికల్చర్ పాలిటెక్నిక్స్ ఏర్పాటు చేశారు. వీటిలో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ డిప్లొమా వంటి కోర్సులు అందిస్తున్నారు. ఈ కోర్సులు పూర్తిచేసిన వారికి ఎరువులు, పురుగు మందులు, విత్తన సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

ఒకేషనల్ కోర్సులు

ఇంటర్మీడియెట్ తర్వాత సత్వరం ఉపాధి పొందాలనుకునే వారికి మరో చక్కటి అవకాశం.. ఒకేషనల్ కోర్సులు. ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ షిప్ నుంచి ఆటో మొబైల్ ఇంజనీరింగ్ టెక్నీషియన్ వరకూ...టెక్నికల్, అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో పలు ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఇంటర్మీడియెట్ బోర్డులు.. అగ్రికల్చర్, బిజినెస్ అండ్ కామర్స్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, హోంసైన్స్, హ్యూమానిటీస్, పారా మెడికల్ విభాగాల్లో ఒకేషనల్ కోర్సులను అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేయడం ద్వారా సంబంధిత రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు అందుకోవచ్చు.

ఆసక్తి ప్రధానం

పదో తరగతి తర్వాత కోర్సును ఎంచుకునే ముందు విద్యార్థులు ఆసక్తికి ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. దీంతోపాటు వ్యక్తిగత సామర్థ్యాలపైనా స్పష్టత తెచ్చుకోవాలి. ఇందు కోసం తాము లక్ష్యంగా భావిస్తున్న కోర్సుల స్వరూపం గురించి అవగాహన పెంచుకోవాలి. అవి తమ సామర్థ్యానికి సరితూగుతాయని భావిస్తేనే వాటిలో చేరాలని నిపుణులు సూచిస్తున్నారు.

15లోగా పోస్టల్ బ్యాలెట్ కోసం నమోదు చేసుకోండి

ఉద్యోగులకు ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి సూచన



సాక్షి, అమరావతి: ఎన్నికల విధులు, అత్యవసర సేవల విభాగాల్లో పని చేసే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈసారి ఎన్నికల సంఘం అత్యవసర సేవల విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు కూడా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందన్నారు. విద్యుత్, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, టెలిగ్రామ్, దూరదర్శన్, ఆలిండియా రేడియో, స్టేట్ మిల్క్ యూనియన్, పాలసహకార సంఘాలు, హెల్త్, ఫుడ్ కార్పొరేషన్, ఆర్టీసీ, అగ్నిమాపక, పోలీసు, అంబులెన్స్, షిప్పింగ్, సమాచార శాఖ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది, కవరేజీ కోసం లెటర్లు పొందిన జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం లభించిందన్నారు. వీటిలో విధులు నిర్వర్తించేవారు ఈ నెల 15లోగా పోస్టల్ బ్యాలెట్ కోసం నమోదు చేసుకోవాలని సూచించారు.

ఏపీఎస్ఎస్‌డీసీకి ఐఎస్ఓ గుర్తింపు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టం విభాగంలో ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండరైజేషన్ (ఐఎస్ఓ) 9001 2015 సర్టిఫికెట్ దక్కించుకోవడం ఆనందంగా ఉందని సంస్థ ఎండీ, సీఈఓ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఐఎస్ఓ సర్టిఫికేషన్ రావడం సంస్థకు గర్వకారణమని, ఈ ఘనత సాధించేందుకు కారణమైన సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ మేరకు తాడేపల్లిలోని ఏపీఎస్ఎస్‌డీసీ ప్రధాన కార్యాలయంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, ఎండీ, సీఈవో డాక్టర్ వినోద్ కుమార్ కలిసి ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్ అందుకున్నారు. అనంతరం సురేశ్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థకు ఐఎస్ఓ గుర్తింపు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సర్టిఫికెట్ మరింత బాధ్యత పెంచిందనీ, దాన్ని నిలబెట్టుకునేందుకు మరింత బాగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సర్టిఫికేషన్‌ను హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అందించింది.

ఈ రెండు నెలలూ అగ్నిగుండమే

గత ఏడాది కంటే అధిక ఉష్ణతాపం

- రాష్ట్రంలో సగటు వడగాలులు ఆరు రోజులు
- ఈ సీజన్‌లో అవి నాలుగు రెట్లకు పెరగవచ్చన్న ఐఎండీ
- మూడు వారాల ముందే మొదలైన వడగాలులు
- ఇప్పటికే రాయలసీమలో మండుతున్న ఉష్ణోగ్రతలు
- రేపటి నుంచి కోస్తాంధ్రలోనూ హీట్‌వేవ్స్ ప్రతాపం



సాక్షి, విశాఖపట్నం: వేసవి దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను అట్టుడుకించనుంది. ఈ సీజన్‌లో ఏప్రిల్, మే నెలల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతోపాటు అసాధారణ తాపాన్ని వెదజల్లనుంది. గత ఏడాది ఉష్ణ తీవ్రత అధికంగానే ఉంది. ఈ వేసవిలో అంతకు మించి ఎండలు, వడగాలులకు ఆస్కారం ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాకు వచ్చింది. సాధారణంగా మే నెలలో ఎండలు మండుతాయి. ఆ నెలలోనే ఎక్కువగా వడగాలులూ వీస్తాయి. కానీ.. ఈసారి పరిస్థితి అందుకు భిన్నంగా ఒక నెల ముందుగానే మార్చి మూడో వారం నుంచే ఎండలు విజృంభిస్తున్నాయి. ఎన్నడూ లేనివిధంగా మార్చి నెలాఖరు నుంచే వడగాలులు వీస్తున్నాయి. ఏప్రిల్ ఆరంభం నుంచే మే నెల నాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో పలుచోట్ల 40 నుంచి 44 డిగ్రీలు రికార్డవుతున్నాయి. రానున్న రోజుల్లో ఇవి మరింతగా ఊపందుకోనున్నాయి. ముఖ్యంగా మే నెలలో అగ్నిగుండాన్ని తలపించేలా ఎండలు, వడగాలులు ప్రతాపం చూపనున్నాయి. సాధారణం కంటే 5–8 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదై తీవ్ర వడగాలులకు దారితీయనున్నాయి.

మే నెలలో ఎన్నికల దృష్ట్యా ప్రజలు, నాయకులు వడదెబ్బ బారిన పడకుండా, మరణాలు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేయాలని భారత ఎన్నికల సంఘానికి ఐఎండీ సూచించింది. అంతేకాదు.. తమకున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఏప్రిల్, మే నెలల్లో ఏయే రోజుల్లో ఉష్ణతీవ్రత, వడగాలుల ప్రభావం ఎక్కడ, ఎలా ఉంటుందో ముందుగానే తెలియజేస్తామని కూడా వెల్లడించింది.

పెరగనున్న వడగాలుల రోజులు

మరోవైపు రాష్ట్రంలో ఈ వేసవిలో వడగాలుల రోజులు కూడా పెరగనున్నాయని ఐఎండీ అంచనా వేసింది. రాష్ట్రంలో వేసవి కాలంలో సగటున ఐదు రోజులు వడగాలులు వీస్తాయి. కానీ.. గత ఏడాది జూన్ ఆఖరు వరకు వేసవి సీజన్ కొనసాగడంతో మూడు రెట్ల అధికంగా 17 రోజులు వడగాలులు/తీవ్ర వడగాలుల రోజులు నమోదయ్యాయి. 2020లో మూడు, 2021లో మూడు, 2022లో ఒక్కరోజు చొప్పున వడగాలుల రోజులు రికార్డయ్యాయి. 2019లో మాత్రం అత్యధికంగా 25 రోజులు వడగాలులు వీచాయి. ఈ ఏడాది కూడా సగటు కంటే నాలుగు రెట్లు అధికంగా వడగాలులు వీచేందుకు ఆస్కారం ఉందని ఐఎండీ విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడించింది. ఇదే ఇప్పుడు అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది.

రాయలసీమలో ఉష్ణతీవ్రత

రాష్ట్రంలో వడగాలుల ప్రభావం అప్పుడే మొదలైంది. కోస్తాంధ్ర కంటే రాయలసీమలోనే ఉష్ణతీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. మంగళవారం రాష్ట్రంలోకెల్లా అత్యధికంగా నెల్లూరు జిల్లా కలిగిరిలో 43.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. సాధారణం కంటే ఇది ఐదు డిగ్రీలు అధికం. ఇంకా వగరూర్ (కర్నూలు)లో 43.5, ఒంటిమిట్ట (వైఎస్సార్)లో 43.4, తెరన్నపల్లి (అనంతపురం), ఎం.నెల్లూరు (తిరుపతి), అనుపూర్ (నంద్యాల)లలో 43 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆయా ప్రాంతాల్లో వడగాలులు వీచాయి. ఇంకా మరికొన్ని జిల్లాల్లో 40–42 డిగ్రీల మధ్య పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కోస్తాలోనూ..

రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు పలుచోట్ల 2–3 డిగ్రీలు, అక్కడక్కడ 4–5 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. రాయలసీమతోపాటు కోస్తాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని వెల్లడించింది. అదే సమయంలో వేడి, తేమ, అసౌకర్య వాతావరణం కొనసాగుతుందని పేర్కొంది. ఈ నెల 7వ తేదీ నుంచి గాలిలో మార్పు వల్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు ఆస్కారం ఉందని అమరావతి వాతావరణం కేంద్రం డైరెక్టర్ ఎస్.స్టెల్లా చెప్పారు.

ఫాం–26 తెలుగులోనూ అందుబాటులో ఉంచాలి

- ఆ దిశగా ఈసీని ఆదేశించండి
- హైకోర్టులో డాక్టర్ సామల రమేష్‌బాబు పిల్

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సమర్పించే తమ ఆస్తులు, కేసులకు సంబంధించిన అఫిడవిట్ (ఫాం–26) తెలుగులో కూడా అందుబాటులో ఉంచేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. విజయవాడలోని మాచవరానికి చెందిన తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ సామల రమేష్‌బాబు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. తమకు సంబంధించిన వివరాలన్నింటినీ ప్రజలకు తెలుగులో పత్రికల ద్వారా తెలియజేసేలా అభ్యర్థులను, ఆయా రాజకీయ పార్టీలను ఆదేశించేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని ఆయన తన వ్యాజ్యంలో న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల గురించి తెలుసుకునే హక్కు ఓటర్లకు ఉందన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు సైతం స్పష్టమైన తీర్పునిచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో అత్యధిక మంది ప్రజలకు ఇంగ్లిష్ భాషా పరిజ్ఞానం లేదని, తెలుగు మాత్రమే తెలుసన్నారు. ఫాం–26 ఇంగ్లిష్‌లో ఉంటోందని, దీనివల్ల వారి ఆస్తులు, వారిపై ఉన్న కేసుల గురించి ప్రజలకు తెలుసుకునే అవకాశం ఉండటంలేదన్నారు. తమిళనాడులో ఫాం–26 తమిళంలోనే ఇస్తారని తెలిపారు. తాను ఈ విషయంపై కేంద్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రాలు ఇచ్చానని, ఎన్నికల సంఘం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఈ పరిస్థితుల్లో తాను దాఖలు చేసిన పిల్‌పై జోక్యం చేసుకుని ఫాం–26ను తెలుగులో అందుబాటులో ఉంచేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని ఆయన అభ్యర్థించారు.

ఉద్యోగులపై తప్పుడు ప్రచారమేల?

- తప్పుడు వార్తలు రాస్తున్న పత్రికలపై చర్యలు తీసుకోండి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వినతి



ముఖేష్ కుమార్ మీనాకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

సాక్షి, అమరావతి: ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని వారిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్న కొన్ని పత్రికలు, కొన్ని పార్టీలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కె.వెంకటరామిరెడ్డి, కార్యదర్శి అరవపాల్ మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగ సంఘం నాయకులుగా ఉద్యోగులతో కలిసి వారి సమస్యలపై చర్చించే వెసులుబాటు తమకు ఉంటుందని పేర్కొన్నారు. ఇది తెలుసుకోకుండా ఎన్నికల ప్రవర్తన నియమావళి పేరుతో కొందరు కావాలనే తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత మేము ఎప్పుడూ కూడా ఎక్కడా కూడా ఫలానా నాయకుడికి ఓటెయ్యమని కానీ ఫలానా పార్టీకి మద్దతు ఇవ్వడంగానీ చేయలేదని వారు పేర్కొన్నారు. కొన్ని జిల్లాల్లో ప్రజాప్రతినిధులు కానీ, రాజకీయ నాయకులు కానీ తమ ఇంటికి వచ్చినప్పుడు వారితో మాట్లాడినా ఎన్నిక నియమావళి పేరుతో చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరులో జి.సుబ్బారెడ్డి ఆర్టీసీ ఉద్యోగి తమ బంధువుల ఇంటికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యేకు కాఫీ ఇస్తుంటే ఆ ఫొటో తీసి కొందరు ఫిర్యాదు చేయడంతో అతనిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అంశాలపై అధికారులకు తగిన సూచనలివ్వాలని విజ్ఞప్తి చేశారు.

కడప ఎంపీగా పోటీచేస్తున్నా

- ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల వెల్లడి
- ఐదు లోక్‌సభ సహా 114 అసెంబ్లీ స్థానాలతో తొలి జాబితా విడుదల

వేంపల్లె/సాక్షి, న్యూఢిల్లీ/కడప వైఎస్ఆర్ సర్కిల్: వైఎస్సార్ జిల్లా కడప లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా తాను పోటీచేస్తున్నట్లు పీసీసీ చీఫ్ షర్మిల తెలిపారు. ఈ నిర్ణయం తనకు సులువైంది కాదని, ఇది తమ కుటుంబాన్ని చీలుస్తుందని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్న నిర్ణయమన్నారు. వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలోని వైఎస్సార్ ఘాట్ వద్ద మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఐదు పార్లమెంటు, 114 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్లు షర్మిల వెల్లడించారు. 'జగన్‌మోహన్‌రెడ్డి నా అన్న.. అన్న అంటే నాకు ద్వేషం లేదు' అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా, విభజన హామీలు నెరవేరాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. అనంతరం.. షర్మిల గెలుపొందేలా కడప పార్లమెంటు ప్రజలందరూ ఆమెను ఆశీర్వదించాలని తల్లి వైఎస్ విజయమ్మ కోరారు. వైఎస్సార్ ఘాట్ వద్ద పార్టీ నేతలతో కలిసి షర్మిల, విజయమ్మ వైఎస్సార్‌కు నివాళులర్పించారు. ఆ తర్వాత పార్టీ తరఫున సాయంత్రం కడపలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో షర్మిల పాల్గొన్నారు.

ఐదు లోక్‌సభ అభ్యర్థులు వీరే..

ఇక కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన లోక్‌సభ నియోజకవర్గాల తొలి జాబితాలో కడప నుంచి షర్మిల, రాజమండ్రి గిడుగు రుద్రరాజు, కాకినాడ పళ్లంరాజు, బాపట్ల జేడీ శీలం, కర్నూలు నుంచి రామ్‌పుల్లయ్య యాదవ్ పోటీచేయనున్నట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, 114 మందితో అసెంబ్లీ అభ్యర్థుల తొలి జాబితాను వెల్లడించారు.

పింఛన్లు ఆపి మళ్లీ మొసలికన్నీరెందుకు బాబు?

రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున ఫైర్



సాక్షి,అమరావతి: వలంటీర్ వ్యవస్థపై కత్తి కట్టి పింఛన్లు ఆపించి ఇప్పుడు తగుదునమ్మా అంటూ చంద్రబాబు మొసలికన్నీరు కారుస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మండిపడ్డారు. నిమ్మగడ్డ రమేష్ సహాయంతో పేదలకు పింఛన్లు అందకుండా కుట్రలు పన్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు దిగజారుడు రాజకీయాలతో ప్రజలను నిలువునా ముంచాలని చూస్తున్నారన్నారు. ఎన్నికల కమిషనర్‌గా ఉన్న సమయంలో వైఎస్సార్ సీపీకి బద్ధ విరోధిగా పనిచేసిన నిమ్మగడ్డ రమేష్ దేశంలోనే గొప్ప సంస్కరణగా నిలిచిన వలంటీర్ వ్యవస్థపై కత్తి కట్టడం దారుణమన్నారు. పింఛన్లు పంచకూడదంటూ నిమ్మగడ్డ సహాయంతో కోర్టులు, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి ఆ వ్యవస్థను నిలిపివేశారంటే బాబు ఎంతకు దిగజారారో అర్థం అవుతుందని మంత్రి ఫైర్ అయ్యారు. చేసిందంతా చేసి పింఛన్లు ఎందుకు పంపిణీ చేయలేదంటూ ఎక్స్‌లో మెసేజ్‌లు పెట్టడమేమిటి బాబు అని ఆయన ప్రశ్నించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
బుధవారం ၊ 3 ၊ ఏప్రిల్ ၊ 2024



జిల్లా జడ్జికి సత్కారం

చిలకలపూడి : మచిలీపట్నం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారికను సత్కరించారు.



ఎన్నికల వ్యయ పరిశీలకురాలు రాక

గన్నవరం: రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకురాలు నీనా నిగంకు గన్నవరం విమానాశ్రయంలో మంగళవారం రాత్రి జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ స్వాగతం పలికారు.



టీడీపీ మూకల దాడి

నందిగామలో టీడీపీ మూకల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలను మంగళవారం ఎమ్మెల్సీ మొండితోక అరుణ కుమార్ పరామర్శించారు. -IIలో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహరి (గురు)
విజయవాడ	6.25	4.42
జగ్గయ్యపేట	6.28	4.47
మచిలీపట్నం	6.25	4.40
గుడివాడ	6.25	4.42

ఆయుర్వేదానికి ఆయుష్షు

- ఆయుర్వేద వైద్యాలయాల అభివృద్ధి
- అందుబాటులో అన్ని రకాల మందులు
- ఉచితంగా మందులు పంపిణీ
- రోగులకు పూర్తి స్థాయిలో అవగాహన

పెనుగంచిప్రోలు: ఆయుర్వేద వైద్యం పేదలకు మరింత చేరువ అవుతోంది. కరోనా వంటి విపత్కర పరిస్థితుల తర్వాత ఆయుర్వేదంపై ప్రజల్లో చైతన్యం పెరిగింది. జాతీయ ఆయుష్ మిషన్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణలో ఆయుష్ వైద్య శాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలకు మహర్దశ వచ్చింది. ప్రజలకు కూడా ఈ వైద్యంపై గురి కుదిరింది.

ఉమ్మడి జిల్లాలో...

ఎన్టీఆర్ జిల్లాలో కొణకంచి, అనిగండ్లపాడు, వేదాద్రి, అల్లూరు, నందిగామ, పరిటాల, పెద్దవరం, కొండపల్లి, వెల్లటూరు ఆస్పత్రులతో పాటు విజయవాడలో ఆయుర్వేద కళాశాల, వైద్యశాల ఉన్నాయి. వీటిలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో భాగంగా కొణకంచి, వేదాద్రి, అనిగండ్లపాడు, పరిటాల, పెద్దవరం ఆయుర్వేద ఆస్పత్రులను ఒక్కొక్కదానిని రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఖర్చు చేసి అభివృద్ధి చేశారు. నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా అవసరమైన అన్ని



కొణకంచి ఆయుర్వేద ఆసుపత్రి

రకాల పరికరాలు, సదుపాయాలు కల్పించారు. కృష్ణా జిల్లాలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో భాగంగా కోలవెన్ను, కానుమోలు, తేలప్రోలు, డోకిపర్రు, కాజ, పెదగొన్నూరు, పెనమకూరు ఆయుర్వేద కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నారు. విజయవాడలో పంచకర్మ తో పాటు అన్ని రకాల మందులు, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో నమోదు

రోగుల వివరాలు, మందుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఆయుర్వేద వైద్యశాలకు ప్రభుత్వం ల్యాప్‌టాప్‌ను అందజేసింది. ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వం పరిశీలించి మరిన్ని మందులను అందజేస్తోంది. ఆయుర్వేద వైద్యశాలల్లో ప్రభుత్వం ఒక్కో దానిలో ఇద్దరు యోగా శిక్షకులను నియమించింది. వారిలో ఒకరు పురుషుడు, మరొకరు మహిళ ఉంటారు. వారు వైద్యశాలకు వచ్చే వారితో పాటు గ్రామాల్లోని పాఠశాలల్లో కూడా విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇస్తున్నారు.

రోగులకు అవగాహన

వైద్యం కోసం వచ్చే రోగులకు అవగాహన కల్పించేందుకు ఆస్పత్రి ముందు భాగంలో ఆయుర్వేద మొక్కలు నాటి, వాటి శాస్త్రీయ నామాలతో బోర్డులు ఏర్పాటు చేశారు. వాటి వల్ల కలిగే లాభాలను వివరిస్తున్నారు. దీంతో ఆస్పత్రి ఆవరణలో మంచి వాతావరణం ఏర్పడుతోంది. ఆయుర్వేద ఆస్పత్రుల్లో రోగులకు విశేష సేవలు అందుతుండటంతో చుట్టు పక్కల గ్రామాల వారితో పాటు పక్కన ఉన్న తెలంగాణ గ్రామాల నుంచి కూడా రోగులు వస్తున్నారు.



అనిగండ్లపాడు ఆయుర్వేద ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆయుర్వేద మొక్కలు

మందులు పుష్కలం

ఆయుర్వేద ఆస్పత్రుల్లో సుమారుగా 70 నుంచి 80 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. గతంలో అరకొరగానే మందులు ఉండేవి. కీళ్ల వ్యాధులతో బాధపడేవారికి ఇన్‌ఫ్రా డైట్ అనే పరికరంతో చికిత్స చేస్తూ క్రమేపీ వ్యాధి నివారణకు వైద్యులు కృషి చేస్తున్నారు. మోకాళ్ల నొప్పులు, చర్మవ్యాధులు, మల బద్ధకం, ఆయాసం, నరాల బలహీనత, గ్యాస్, మహిళల గైనిక్ సమస్యలు, జీర్ణాశయ వ్యాధులతో పాటు బీపీ, షుగర్, ఇతర దీర్ఘకాలిక సమస్యలకు కూడా పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు. రోగులకు అవసరమైన మందులు నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా అందుతున్నాయి. వాతావరణ మార్పులకు అనుగుణంగా వచ్చే చర్మవ్యాధులకు అవసరమైన మందులు కూడా అందజేస్తోంది. ప్రతి ఆరు నెలలకు లేదా మెడిసిన్ అయిపోయిన వెంటనే రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల విలువ చేసే మందులను పంపిస్తున్నారు.



కీళ్ల నొప్పులకు ఇన్‌ఫ్రా డైట్ పరికరంతో చికిత్స

రోగుల్లో అవగాహన పెరిగింది



ఆయుర్వేదంపై రోగులకు అవగాహన పెరిగింది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కూడా మందులు అందుబాటులో ఉన్నాయి. అనిగండ్లపాడు ఆస్పత్రిలో పంచకర్మ సేవలు మరో 15 రోజుల్లో అందుబాటులోకి రానున్నాయి. పంచకర్మ అందుబాటులోకి వచ్చాక వామ్టింగ్, విరేచన థెరపీ, వస్తి, నస్యకర్మ, రక్తమోక్షణం ద్వారా పలు వ్యాధులకు థెరపీలు నిర్వహిస్తామన్నారు. వీటికి అవసరమైన వివిధ రకాల ఆయిల్స్ కోసం ఇన్‌డెంట్ పెట్టాం.

-వై.రత్నప్రియదర్శిని,
ఎండీ, ఆయుర్వేద ఆస్పత్రి, అనిగండ్లపాడు

వైద్యసేవలు బాగున్నాయి



గతంలో మా ఆయుర్వేద ఆస్పత్రిలో ఎటువంటి సౌకర్యాలూ ఉండేవి కావు. ఇప్పుడు అన్ని మందులతో పాటు వైద్యులు కూడా అందుబాటులో ఉంటున్నారు. పలు రకాల వ్యాధులకు విస్తృత సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిని అభివృద్ధి చేయడంతో పాటు పరిసరాల్లో వివిధ రకాల ఔషధ మొక్కలు నాటి, వాటి ద్వారా ఆయుర్వేదంపై అవగాహన కల్పిస్తున్నారు. గతంలో రోజుకు ఒకరిద్దరు మాత్రమే రోగులు వచ్చేవారు. ఇప్పుడు 50 మంది వరకు వస్తున్నారు.

- పి.మల్లికార్జునరావు,
నొప్పుల బాధితుడు, అనిగండ్లపాడు

కృష్ణా కలెక్టర్ బదిలీ

- ఎన్నికల సంఘం ఉత్తర్వులు
- ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా జేసీ గీతాంజలిశర్మ



పి. రాజాబాబు



గీతాంజలిశర్మ

చిలకలపూడి: కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు బదిలీ అయ్యారు. ఆయన్ను బదిలీ చేస్తూ భారత ఎన్నికల సంఘం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 2023 ఏప్రిల్ 15వ తేదీన బాధ్యతలు స్వీకరించిన ఆయన ఇప్పటి వరకు సమర్థంగా విధులు నిర్వహించారు. జిల్లాలోని పలు సమస్యలను త్వరితగతిన పరిష్కారానికి ప్రణాళిక రూపొందించి అధికారులను క్షేత్రస్థాయికి పంపి అక్కడికక్కడే పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టారు.

ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా గీతాంజలిశర్మ

కలెక్టర్ పి.రాజాబాబు వెంటనే రిలీవ్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొనటంతో మంగళవారం సాయంత్రం ఆయన రిలీవ్ అయ్యారు. నూతన కలెక్టర్‌ను నియమించే వరకు ఇన్‌చార్జ్ బాధ్యతలు జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మకు అప్పగించారు.

ప్రాంగణ ఎంపికల్లో 50మందికి ఉద్యోగాలు

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం తరపున వంద మందికి పైగా విద్యార్థులు ప్రాంగణ ఎంపికలలో అర్హత సాధించి ఉద్యోగాలు పొందటం చాలా సంతోషంగా ఉందని విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో హెటిరో డ్రగ్స్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఎంపికలో 50 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన వారిని ఉపకులపతి అభినందించి మాట్లాడారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.శోభన్ బాబు మాట్లాడుతూ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

ఆటిజం పిల్లల తల్లిదండ్రులకు అవగాహన



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆటిజంతో పుట్టిన పిల్లల విషయంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని పాత ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలోని జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రంలో పిల్లల తల్లిదండ్రులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ ఆటిజం పిల్లల విషయంలో తల్లిదండ్రులు ఇంటి వద్ద పాటించాల్సిన విధానాలు, మెలకువల గురించి వివరించారు. పిల్లల వైద్యుడు జె.రవితేజ ఆటిజం పిల్లల్లో ముఖ్యంగా కనిపించే లక్షణాలను వివరించారు. పిల్లల మనస్తత్వ నిపుణుడు టి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆటిజం పిల్లల్లో కనిపించే సామాజికపరమైన సవాళ్లు, భావ వ్యక్తీకరణ సేవలు, ప్రవర్తనా లోపాలను ఏ విధంగా ఆ కేంద్రంలో థెరపీల ద్వారా అధిగమిస్తున్నారో వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కార్యక్రమ అధికారి డాక్టర్ జి.మాధవి, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, డాక్టర్ నవీన్, డాక్టర్ పి.దత్త శరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటిజం పిల్లల విషయంలో జాగ్రత్తలను తెలియజేస్తూ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఇంటర్ డిస్ట్రిక్ట్ బోర్డర్ చెక్‌పోస్ట్ ఆకస్మిక తనిఖీ



రామవరప్పాడు: పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుతో కలిసి ఆంధ్రప్రదేశ్ స్పెషల్ జనరల్ ఎలక్షన్ అబ్జర్వర్ రాంమోహన్ మిశ్రా మంగళవారం గూడవల్లిలోని చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని చెక్‌పోస్టుల వద్ద అనుక్షణం అప్రమత్తంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రానున్న ఎన్నికలను శాంతియుత, పారదర్శక వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించే సిబ్బంది భద్రత నిమిత్తం ఏర్పాటు చేసిన చర్యలను వివరించారు. రాత్రి సమయాల్లో తనిఖీలు నిర్వహించే సిబ్బంది ధరించేందుకు రేడియం జాకెట్లు, లైటెనింగ్ బాటన్స్, డ్రాగన్ లైట్స్, బెల్ హెల్లర్స్, కమ్యూనికేషన్, బారికేడింగ్ తదితర ఏర్పాట్లను తెలియజేశారు. సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

నేటి నుంచి సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ

- జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- వికలాంగులు, తీవ్ర అనారోగ్యంతో నడవలేని వారికి ఇంటి వద్దే అందజేత
- మిగతా లబ్ధిదారులందరికీ సచివాలయాల్లో పంపిణీకి ఏర్పాట్లు

గాంధీనగర్: భారత ఎన్నికల సంఘం ఆదేశాలు పాటిస్తూ ఈనెల 3వ తేదీ బుధవారం నుంచి సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. వికలాంగులు, తీవ్రమైన అనారోగ్యం, వీల్‌చైర్‌కు పరిమితమైన వారు, యుద్ధవీరుల కుటుంబాల్లో వృద్ధ వితంతువులకు ఇంటి వద్దే పంపిణీ చేయాలని, మిగిలిన వారికి సమీపంలోని సచివాలయాల వద్ద పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా పింఛన్ల పంపిణీకి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ ఢిల్లీరావు మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టరేట్ నుంచి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పింఛను పంపిణీపై రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు మార్గదర్శకాలను జారీ చేశారన్నారు.



ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి పింఛన్లు పంపిణీ చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వికలాంగులకు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ లేవలేని స్థితిలో ఉన్నవారికి, మంచం పట్టి వీల్‌చైర్‌కు పరిమితమైన వారికి, సైనిక సంక్షేమ పింఛన్లు పొందుతున్న యుద్ధవీరుల వృద్ధ వితంతువులకు వారి ఇంటి వద్దనే పెన్షన్లు అందజేయాలన్నారు. మిగిలిన వారికి సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో అందజేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది మాత్రమే పెన్షన్లు పంపిణీ చేయాలన్నారు. పంపిణీలో ఇతరుల జోక్యం ఉండకూడదన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం రాష్ట్ర ఉన్నతాధికారుల మార్గదర్శకాలు, ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాలన్నారు. విమర్శలకు తావులేకుండా పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేసేలా పర్యవేక్షించాలన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

కండువాలే రక్షణ కవచాలు



మిట్ట మధ్యాహ్నం వేళ భానుడు తన ప్రతాపం చూపుతుంటే పాపం... ఆ విద్యార్థులకు కండువాలే రక్షణ కవచాలయ్యాయి. విజయవాడ బిషప్ అజరయ్య స్కూలుకు చెందిన విద్యార్థులు బడి నుంచి హాస్టల్‌కు వెళుతున్న సమయంలో ఇలా తలపై కండువాలు కప్పుకుని వెళుతున్న దృశ్యాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించింది.

- సనకా లక్ష్మీపవన్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఆపత్కాలంలో అండగా...

- ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఊహించని సాయం
- రైతులకు సంతృప్తికర స్థాయిలో పంట నష్టపరిహారం అందజేత
- ఎన్టీఆర్ జిల్లాలో ఐదేళ్ల కాలంలో రూ.47.77 కోట్లు మంజూరు
- మిచాంగ్ తుపాను బాధిత రైతుల ఖాతాల్లో జమ కానున్న రూ.21.72 కోట్ల నష్ట పరిహారం

రైతు ప్రభుత్వం అని మాటలు చెప్పడమే కాదు చేతల్లో చేసి చూపించింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలిగినా నేనున్నానంటూ అభయహస్తం అందించింది. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రం పెట్టి రైతుకు అన్ని రకాలుగా అండగా ఉంటోంది. అంతేకాదు కాలం కలసిరాక ప్రకృతి ప్రకోపించినా సరే...రైతు పక్షపాతి అయిన సీఎం జగన్ వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకుంటున్నారు.

జి.కొండూరు: ప్రకృతి వైపరీత్యాల వలన రైతులు పంట నష్టపోయినప్పుడు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా కాపాడేందుకు అందించే నష్ట పరిహారం పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం తన విశ్వసనీయతను చాటుకుంది. ఈ ఐదేళ్ల కాలంలో రైతులు నష్టపోయిన ప్రతిసారీ నష్ట తీవ్రతను అంచనా వేసి ఆ సీజన్ ముగిసేలోపే రైతులకు సంతృప్తికర స్థాయిలో నష్టపరిహారం అందజేసింది. వైఎస్సార్ ఇన్‌పుట్ సబ్సిడీ పేరుతో అందించే ఈ నష్ట పరిహారం పంపిణీలో ఎటువంటి వివక్షకు తావులేకుండా ఈ-క్రాప్ నమోదు చేయించిన ప్రతి రైతు, కౌలు రైతుకు నేరుగా వారి ఖాతాల్లోనే పరిహారం నగదు జమచేస్తున్నారు.



తిరువూరు మండలం టేకులపల్లిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావంతో ఎండిపోయిన వరిపైరు(ఫైల్)

జిల్లాలో రూ.47.77 కోట్లు

గత ప్రభుత్వంలో పంట నష్టపోతే పరిహారం అందడానికి సంవత్సరాల కాలం పట్టేది. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఈ ఐదేళ్ల కాలంలో గతం కంటే మిన్నగా ఏ సీజన్‌లో నష్టపోతే ఆ సీజన్ ముగిసే లోగానే పరిహారాన్ని అందజేశారు. ఎన్టీఆర్ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో 2014-18 మధ్య కాలంలో 19,290 మంది రైతులకు రూ.16.20 కోట్లు నష్టపరిహారం అందజేయగా ఈ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2019-24 మధ్య కాలంలో 56,156 మంది రైతులకు 47.77 కోట్లను అందజేశారు. ఇటీవల విడుదల చేసిన మిచాంగ్ తుపాను, కరువు పరిస్థితుల బాధిత రైతుల నష్టపరిహారం త్వరలో రైతుల ఖాతాల్లో జమ కానుంది. ఈ పరిహారం కింద ఎన్టీఆర్ జిల్లాలో 12,929 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యానవన పంటలు నష్టపోయిన 22,451 మంది రైతులకు రూ.21.72 కోట్లు జమ చేయనున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో రైతులకు గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుతాలు అందించిన పంట నష్టపరిహారం మండలాల వారీగా వివరాలు:

మండలం:	2014-18 రైతులు	2014-18 నష్టపరిహారం రూ.	2019-24 రైతులు	2019-24 నష్టపరిహారం రూ.
తిరువూరు	1870	1,14,02,710	4318	3,68,72,908
ఎ కొండూరు	575	29,50,810	3998	1,67,65,910
గంపలగూడెం	6415	4,85,97,095	8047	6,18,25,138
విస్సన్నపేట	863	39,85,570	1341	73,59,560
విజయవాడ అర్బన్	13	1,38,510	102	15,41,180
ఇబ్రహీంపట్నం	1478	99,29,015	4174	4,05,26,945
జి.కొండూరు	1681	2,00,31,235	7029	6,19,71,631
మైలవరం	809	99,11,550	4570	3,18,89,109
రెడ్డిగూడెం	746	24,17,600	1999	1,20,66,925
విజయవాడరూరల్	985	1,06,30,395	4927	6,79,77,200
కంచికచర్ల	1310	1,72,62,580	4947	4,64,16,890
చందర్లపాడు	108	6,85,820	4701	3,57,80,983
వీరులపాడు	560	66,67,810	1928	2,46,70,055
నందిగామ	65	4,21,500	1069	80,98,845
వత్సవాయి	156	10,42,500	742	48,19,750
జగ్గయ్యపేట	1570	1,51,68,390	564	57,89,530
పెనుగంచిప్రోలు	0	0	1449	11338018
నందిగామ	86	7,91,864	251	20,48,123

నష్ట పరిహారం వెంటనే ఇవ్వడం గ్రేట్



రైతులు పంట నష్టపోయినప్పుడు అదే సీజన్‌లో నష్ట పరిహారం అందేలా చేయడంతో రైతులకు చాలా మేలు జరుగుతుంది. గత ప్రభుత్వంలో పంట నష్టం జరిగితే కొందరికే పరిహారం ఇచ్చే వారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ-క్రాప్ నమోదు చేయడం వలన నష్టపోయిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందుతోంది. నాకు గతంలో నష్టపరిహారం అందింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి కూడా ప్రభుత్వం పరిహారం విడుదల చేసింది.

-రమావత్ శ్రీను, రైతు,
మునగపాడు, జి.కొండూరు మండలం

గడప గడపలో వెలుగు

- ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వ కార్యక్రమం
- వార్డులు, గ్రామాల్లో పర్యటించిన ప్రజా ప్రతినిధులు
- విద్యుత్ సమస్యలు చెప్పుకున్న వినియోగదారులు
- వాటిని పరిష్కరించేందుకు రూ.9.35 కోట్లు మంజూరు
- 70 శాతం పనులు పూర్తి చేసిన అధికారులు

సాక్షి, మచిలీపట్నం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో విద్యుత్ శాఖకు సంబంధించి ప్రజలు ఇబ్బందులు పడుతున్న స్థానిక సమస్యలను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఎమ్మెల్యేలు ఆదేశించారు. దీంతో వచ్చిన ఫిర్యాదులు, విన్నపాలను పరిష్కరించేందుకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. వాటిని పరిశీలించిన ప్రభుత్వం అందుకు కావాల్సిన నిధులను మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలకు రూ.9.35 కోట్లు విడుదల చేయడంతో పనులు చేపట్టారు.

చేసిన మేలు వివరించి సమస్యలు తెలుసుకున్న నేతలు

సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు మంజూరైన సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు చేకూర్చిన లబ్ధి మొత్తం, గత ప్రభుత్వం కంటే మిన్నగా తెచ్చిన పథకాలు, అమలులో పారదర్శకత, ఎలాంటి సిఫార్సు లేకుండా అర్హుల ఖాతాలోకి నేరుగా నగదు జమ వంటివి వివరించారు. దీంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇలా జనం చెప్పుకున్న సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలతో పాటు విద్యుత్ శాఖ ఏఈలు ఆయా ప్రాంత లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు హాజరు కావడంతో సమస్య తెలుసుకోవడం, అందుకు అంచనా వేయడం, నిధులు మంజూరు కావడం, పనులు ప్రారంభించి పూర్తి చేయడం ఇలా.. అన్నీ వేగంగా పూర్తయ్యాయి.



రామవరపుమోడి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం (ఫైల్)

విద్యుత్ డివిజన్ల వారీగా చేపట్టిన పనుల వివరాలు

డివిజన్ పేరు	పనులు	నిధులు
మచిలీపట్నం	136	2.07కోట్లు
విజయవాడ టౌన్	37	4.45లక్షలు
గుణదల	82	80.75లక్షలు
విజయవాడ రూరల్	57	1.06కోట్లు
గుడివాడ	122	3.36కోట్లు
నూజివీడు	89	1.55కోట్లు
ఉయ్యూరు	23	45.70లక్షలు
మొత్తం	546	9.35కోట్లు

ఉమ్మడి జిల్లాకు రూ.9.35కోట్లు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి పనుల కోసం వేసి పంపిన అంచనాలకు నిధుల కొరత లేకుండా ప్రభుత్వం మంజూరు చేసింది. సర్కిల్ పరిధిలోని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి వచ్చిన విన్నపాలకు మోక్షం కల్పించేందుకు అధికారులు అంచనాలు తయారు చేశారు. మొత్తం 546 పనులకు రూ.9.35 కోట్లు కావాలని ప్రభుత్వాన్ని కోరడంతో అందుకు తగ్గట్లు నిధులు మంజూరు చేసింది. దీంతో విద్యుత్ లైన్ల ఎత్తు పెంచడం, ప్రమాదకర స్తంభాలు, తీగలు తొలగించడం, ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరు, అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచడం, లో ఓల్టేజీ సమస్య నివారణ వదులుగా కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేయడం, వాటి మధ్య అదనంగా స్తంభం ఏర్పాటు చేయడంతో ఆయా సమస్యలకు పరిష్కారం లభించింది.

క్లుప్తంగా

విజువల్‌ కమ్యూనికేషన్‌తో ఉపాధి అవకాశాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజువల్‌ కమ్యూనికేషన్‌తో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని అతిథులు చెప్పారు. నలంద డిగ్రీ కళాశాల విజువల్‌ కమ్యూనికేషన్‌ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన విజనరీ విస్టాన్‌ 2కే24 మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా క్లే మోడలింగ్‌, షార్ట్‌ఫిల్మ్‌, డ్యాన్స్‌, డ్రామా వంటి పలు అంశాల్లో జరిగిన పోటీల్లో పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కంటెంట్‌ రైటర్‌ అశ్వతి బాలకృష్ణన్‌ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినూత్నంగా ఆలోచించడం, ఫొటోగ్రఫీ, వెబ్‌ డిజైనింగ్‌, మల్టీ మీడియాలలో శిక్షణ పొందితే ఆసక్తి ఉన్న రంగాల్లో కేరీర్‌ను మలచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ ఎం.అనురాధ, విజువల్‌ కమ్యునికేషన్‌ విభాగాధిపతి బి.శ్రీనివాసరావు, ఫిరోజ్‌ఖాన్‌, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్యారమ్స్‌ పోటీలకు వంశీకృష్ణ



విజయవాడస్పోర్ట్స్‌: గ్వాలియర్‌లో జరిగే జాతీయ సీనియర్‌ క్యారమ్స్‌ పోటీలకు విజయవాడ క్రీడాకారుడు ఎ.వంశీకృష్ణారెడ్డి అర్హత సాధించాడు. ఇటీవల జరిగిన రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టులోచోటు దక్కించుకున్నారు. ఈ నెల ఆరు నుంచి పదో తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొనే వంశీకృష్ణను ఎన్టీఆర్‌ జిల్లా క్యారమ్స్‌ అసోసియేషన్‌ కార్యదర్శి జె.మురళీకృష్ణ, కోచ్‌ సంపత్‌కుమార్‌ అభినందించారు.

ఉమ్మడి కృష్ణాలో కాంగ్రెస్‌ అభ్యర్థులు వీరే

చిలకలపూడి(మచిలీపట్నం): ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో 11 నియోజకవర్గాల్లో పోటీ చేసే కాంగ్రెస్‌ అభ్యర్థులను పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మంగళవారం ప్రకటించారు. లాం తాంతియా కుమారి (తిరువూరు (ఎస్సీ)), మరీదు కృష్ణ (నూజివీడు), వడ్డాది గోవిందరావు (గుడివాడ), బొడ్డు నోబుల్‌ (కైకలూరు), శొంఠి నాగరాజు (పెడన), అబ్దుల్‌ మతీన్‌ (మచిలీపట్నం), అందే శ్రీరామ్మూర్తి (అవనిగడ్డ), డీవై దాస్‌ (పామర్రు (ఎస్సీ)), ఎలిసల సుబ్రహ్మణ్యం (పెనమలూరు), బొర్రా కిరణ్‌ (మైలవరం), మందా వజ్రయ్య (నందిగామ (ఎస్సీ))లను ప్రకటించారు.

టీడీపీ మూకల దాడి

- నందిగామలో దారుణం
- వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలపై కవ్వింపు చర్యలు
- ఇద్దరి కార్యకర్తలకు తీవ్రగాయాలు
- ఘటనకు కారకులపై కఠిన చర్యలకు ఎమ్మెల్సీ అరుణకుమార్‌ డిమాండ్‌



నందిగామ ప్రభుత్వాస్పత్రిలో ఖాజాను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్‌

నందిగామ టౌన్‌: నందిగామలో దారుణం చోటు చేసుకొంది. ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలపై టీడీపీ మూకలు దాడి చేశాయి. ప్రశాంతంగా ఉన్న ఎన్టీఆర్‌ జిల్లాలోని నందిగామలో కవ్వింపు చర్యల కారణంగా ఘర్షణ వాతావరణం ఏర్పడటం.. ఓటమి భయంతో ఉన్న తెలుగు తమ్ముళ్లు ఫ్రస్టేషన్‌లో దాడి చేయడంతో వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఎమ్మెల్యే, వైఎస్సార్‌ సీపీ నందిగామ అభ్యర్థి డాక్టర్‌ మొండితోక జగన్‌మోహనరావు పట్టణంలోని 12వ వార్డు పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పథకాలను వివరించి రానున్న ఎన్నికల్లో మద్దతు పలకాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఆ సమయంలో టీడీపీలో క్రియాశీలక నాయకులు నల్లాని కిషోర్‌, నల్లాని నరసింహారావు ఎమ్మెల్యేను, పార్టీ కార్యకర్తలను కులం పేరుతో దూషించి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీనిపై ప్రశ్నించిన పార్టీ నాయకులు, కార్యకర్తలను దుర్భాషలాడటంతో మాటామాటా పెరిగింది. దీంతో టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలు షేక్‌ ఖాజా, వినుకొండ రామారావుకు తీవ్ర గాయాలు కావటంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వారిది నేర చరిత్రే

దాడికి కారకులైన కిషోర్‌, నరసింహారావు నేర చరిత్ర కలిగిన వారేనని ఘర్షణలు, కొట్లాటలు వారికి కొత్తేమీ కాదని పలువురు చెబుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్‌పై సైతం సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారాలు చేయటమే కాకుండా వ్యక్తిగత దూషణలకు సైతం పాల్పడిన ఘటనలు అనేకమున్నాయి. ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండటంతో పథకం ప్రకారం సీసీ కెమెరాలు ఉన్న చోట ఘర్షణ సృష్టించారని స్థానికులు చెబుతున్నారు.



ఏసీపీ రవికిరణ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్‌

కులం పేరుతో దూషిస్తే సహించబోం

అలగాజనం, అలగాజాతి అంటూ కులం పేరుతో దూషిస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ డాక్టర్‌ మొండితోక అరుణకుమార్‌ స్పష్టం చేశారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖాజా, రామారావును ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా అరుణకుమార్‌ మాట్లాడుతూ మమ్మల్ని దూషిస్తే సహించామని మా పార్టీ నాయకులు, కార్యకర్తలను దూషిస్తే సహించబోమని హెచ్చరించారు. భయపెట్టి, గొడవలు సృష్టించి గెలవాలని చూస్తే అందుకు నియోజకవర్గ ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మైనార్టీలను, ఎస్టీలను కులం పేరుతో దూషిస్తే మాజీ ఎమ్మెల్యే అండగా ఉండటం బాధాకరమని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలకు అలగాజనం అవసరం లేదు కానీ వారు వేసే ఓట్లు మాత్రం కావాలని ఎద్దేవా చేశారు.

న్యాయం జరిగే వరకు విశ్రమించం

టీడీపీ నేతల దాడిలో గాయపడిన ఖాజా, రామారావుకు న్యాయం జరిగే వరకు విశ్రమించేది లేదని అరుణకుమార్‌ తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని వారు స్పందించకపోతే ఎస్టీ కమిషన్‌తో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం ఏసీపీ రవికిరణ్‌ను కలిసి దాడి వివరాలను తెలిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతోపాటు చిరుమామిళ్ల చైతన్యకుమార్‌, వైఎస్‌ఎన్‌ ప్రసాద్‌, నెలకుదిటి శివనాగేశ్వరరావు, షేక్‌ కరీముల్లా, దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మలక్‌ బషీర్‌, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సుజనా పెద్ద లాబీయిస్ట్‌..

- ఎంపీగా, కేంద్రమంత్రిగా రాష్ట్రానికి సుజనా ఏమి చేశారో చెప్పాలి
- పేదల ఆత్మగౌరవాన్ని కొనుగోలు చేద్దామనుకుంటున్నారు
- విజయవాడ ఎంపీ కేశినేని నాని

వన్‌టౌన్‌(విజయవాడపశ్చిమ): విజయవాడ పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుజనాచౌదరి పెద్ద లాబీయిస్ట్‌ అని విజయవాడ ఎంపీ, వైఎస్సార్‌ సీపీ పార్లమెంట్‌ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్‌ (నాని) విమర్శించారు. రెండుసార్లు ఎంపీగా, మూడేళ్లు కేంద్ర మంత్రిగా పనిచేసిన సుజనా విజయవాడకు, ఏపీ రాష్ట్రానికి ఏమి మేలు చేశారో చెప్పాలని, అప్పుడే నగరంలో ప్రచారం చేయాలని నాని డిమాండ్‌ చేశారు. వైఎస్సార్‌ సీపీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షేక్‌ ఆసిఫ్‌తో కేశినేని నాని విజయవాడ పాతబస్తీలోని 54వ డివిజన్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ సుజనాచౌదరి.. లోకేష్‌, పవన్‌ కల్యాణ్‌ కాళ్లు పట్టుకుని, మైనార్టీలు , బీసీలను మోసం చేసి ఇక్కడికి బీజేపీ పార్టీ టికెట్‌ కొనుక్కొని విజయవాడకు వచ్చాడన్నారు. మా దగ్గర డబ్బుంది, మేం ఏమి చేసినా చెల్లుతుంది, ప్రత్యేక విమానంలో వచ్చి డబ్బులు పంచితే సరిపోతుందని బీజేపీ నుంచి వచ్చిన వాళ్లు భావిస్తున్నారని ఆరోపించారు. ప్రజల ఆత్మ గౌరవాన్ని, ఆత్మభిమానాన్ని డబ్బులకు తాకట్టు పెట్టేవారు 'పశ్చిమ'లో లేరని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమలో సందులు తెలియవు, ఢిల్లీ నుంచి వచ్చాడని నేను అంటుంటే సుజనాచౌదరి నాకు టెక్నాలజీ తెలుసు అంటున్నారని ఎద్దేవా చేశారు. సుజనాచౌదరి మరోసారి తన గురించి మాట్లాడితే నీ 25 సంవత్సరాల చరిత్ర బయట పెడతానని, నోరు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రపంచంలోనే ఎక్కడాలేని విధంగా గొప్ప సంస్కరణలను తీసుకొచ్చారని వివరించారు. ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలు పేదల జీవితాల్లో అభ్యున్నతిని తీసుకొస్తున్నాయన పేర్కొన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



విజయవాడ 'పశ్చిమ'లో ప్రచారం చేస్తున్న ఎంపీ కేశినేని నాని, షేక్‌ ఆసిఫ్‌, మేయర్‌ భాగ్యలక్ష్మి

ఉచిత పాలిటెక్నిక్‌ కోచింగ్‌

పాయకాపురం(విజయవాడరూరల్‌): పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిటెక్నిక్‌, ఏపీఆర్జేసీకి సంబంధించిన ఉచిత కోచింగ్‌ సెంటర్‌ను మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్‌ హైస్కూల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్‌ అధికారి డాక్టర్‌ మైనం హుస్సేన్‌ మాట్లాడుతూ విద్యార్థులు పదోతరగతి తర్వాత జీవితంలో స్థిరపడడానికి మంచి విద్యను ఎన్నుకోవడానికి పాలిటెక్నిక్‌ ఏపీఆర్జేసీ లాంటి పరీక్షలకు కోచింగ్‌ సెంటర్‌ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మ్యాథమెటిక్స్‌, భౌతికశాస్త్రానికి సంబంధించిన అనేక కాంపిటీటివ్‌ పరీక్షలకు బిట్స్‌ తయారుచేయడంతో మంచి నాలెడ్జి వస్తుందని తెలిపారు. 25 ఏళ్లుగా ఉచితంగా అనేక మంది విద్యార్థులకు ఉచితంగా కోచింగ్‌ ఇస్తున్నామని వివరించారు. ఈ నెల 23వ తేదీ వరకు ఉచిత కోచింగ్‌ సెంటర్‌ పనిచేస్తుందని విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు.

బాలికపై లైంగిక దాడి

పెడన: పట్టణంలోని బాలికపై లైంగికదాడి చేసిన యువకుడిపై పెడన పోలీస్‌ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పెడన పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఏడో వార్డుకు చెందిన ఎండీ హుషీర్‌(21) ఓ బాలికపై లైంగిక దాడి చేశాడు. బాలిక ఫిర్యాదుతో ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్‌ కేసు నమోదు చేశారు. ఘటనపై మచిలీపట్నం డీఎస్పీ అబ్దుల్‌ సుభాని విచారణ చేస్తున్నారు.

డివిజన్‌ పనితీరు భేష్‌

డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్‌



డివిజన్‌ వార్షిక పనితీరుపై వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్‌

రైల్వేస్టేషన్‌(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్‌ అన్ని ప్రధాన రంగాల్లో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించి డివిజన్‌ చరిత్రలోనే అత్యధికంగా స్థూల ఆదాయం రూ. 5,614.13 కోట్లు నమోదు చేసుకోవడం డివిజన్‌కే గర్వకారణం అని డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్‌ సంతోషం వ్యక్తం చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో విజయవాడ డివిజన్‌ పనితీరు, సాధించిన పురోగతిపై డీఆర్‌ఎం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. అందులో ప్రధానంగా సరకు రవాణా ద్వారానే రూ. 4,057.01 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. సరుకు రవాణా 72శాతం, ప్రయాణికుల ఆదాయం 24శాతం, ఇతర మార్గాల ద్వారా 4శాతం వాటా ఉందన్నారు. డివిజన్‌లో కొత్త లైన్ల నిర్మాణాలు, విద్యుదీకరణ పనులు, ఆర్‌ఓబీ, ఆర్‌యూబీ నిర్మాణాలు, డివిజన్లో అమృత్‌ భారత్‌ స్టేషన్‌ పథకంలో భాగంగా 20 రైల్వే స్టేషన్లలో ఆధునీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. రాజమండ్రి, అనకాపల్లి, గుల్లిపాడు, రావికంపాడులలో నాలుగు ఎఫ్‌ఓబీలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. 15 గూడ్స్‌ షెడ్‌ల ఆధునీకరణకు రూ. 150 కోట్లు నిధులకు రైల్వేశాఖ అనుమతులు ఇచ్చిందన్నారు. డివిజన్‌లో ఈ ఏడాది 47 ప్యాసింజర్‌ లిఫ్టులు, 22 ఎస్కలేటర్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. నిరంతరం ఆర్‌పీఎఫ్‌ తనిఖీలతో గంజాయి అక్రమ రవాణపై దృష్టి సారించినట్లు చెప్పారు. పర్యవరణ హితంగా రైల్వే స్టేషన్‌లు, హాస్పటల్స్‌, ట్రైనింగ్‌ సెంటర్లలో నిర్వహణ పనుల కారణంగా విజయవాడ రైల్వేస్టేషన్‌ ప్లాటినం సర్టిఫికెట్‌తో పాటు ఇంధన పొదుపులో వ్యాగన్‌ వర్క్‌షాపు, రైల్వే హాస్పటల్‌, ఈటీటీసీ సెంటర్‌లకు బీఈఈ 5స్టార్‌ రేటింగ్‌ సర్టిఫికెట్లు సాధించినట్లు తెలిపారు.

విద్యార్థుల కల సాకారానికి కృషి

ఎడ్యుకేషనల్‌ స్కాలర్‌షిప్‌లు ప్రకటించిన ఆకాష్‌



ఎడ్యుకేషనల్‌ స్కాలర్‌షిప్స్‌ పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న అగర్వాల్‌ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్యులు, ఇంజినీర్లు కావాలనుకునే విద్యార్థుల కలలను సాకారం చేయడానికి ఆకాష్‌ ఎడ్యుకేషనల్‌ సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ చీఫ్‌ బిజినెస్‌ ఆఫీసర్‌ అనూప్‌ అగర్వాల్‌ చెప్పారు. అందులో భాగంగా 2024 ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న తమ కొత్త సెషన్‌కు విద్యార్థుల కోసం వివిధ స్కాలర్‌షిప్‌లను మంగళవారం ప్రకటించారు. స్కాలర్‌షిప్‌ టెస్ట్‌లో ప్రతిభ చూపిన వారికి ఫౌండేషన్‌ కోర్సుల్లో ప్రవేశానికి 90 శాతం వరకూ స్కాలర్‌షిప్‌ అందించనున్నట్లు తెలిపారు. అమరవీరుల పిల్లలు, రక్షణ సిబ్బంది, తీవ్రవాద ప్రభావిత వ్యక్తుల పిల్లలకు ప్రత్యేక తగ్గింపులను అందిస్తున్నట్లు తెలిపారు. నిర్ణీత పరీక్ష రోజుల్లో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల మధ్యలో ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌ పరీక్షకు హాజరు కావచ్చని, 60 నిమిషాల పాటు పరీక్ష ఉంటుందన్నారు. 8 నుంచి 12వ తరగతి విద్యార్థులు రాయవచ్చని పేర్కొన్నారు. ఆకాష్‌ వెబ్‌సైట్‌లో వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

వైఎస్సార్‌ సీపీకి రెడ్లు అండగా నిలవాలి

ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి



కృష్ణలంక(విజయవాడతూర్పు): వైఎస్సార్‌ సీపీకి రెడ్డి సామాజికవర్గం అండగా నిలవాలని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు వ్యతిరేక శక్తులు ఏకమైన నేపథ్యంలో రెడ్లు ఆయనకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. టీడీపీ రెడ్డి ప్రజాప్రతినిధులను, రెడ్లను విభజించి ఐక్యతను దెబ్బతీసి వైఎస్సార్‌ సీపీని దూరం చేసేందుకు ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అత్యధిక శాతం వైఎస్సార్‌ సీపీకి చెందిన రెడ్డి ఎమ్మెల్యేలను టీడీపీలో చేర్చుకుని టికెట్లు ఇచ్చారని ఆరోపించారు. రెడ్డి సామాజిక వర్గం చంద్రబాబు జిమ్మిక్కులకు లొంగకుండా వైఎస్సార్‌ సీపీకి అండగా ఉండాలని కోరుతూ రెడ్ల ఐక్యతకు విజయవాడ, నెల్లూరు, విశాఖపట్నం, అనంతపురం, కర్నూలు, తిరుపతి, ఒంగోలు తదితర ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఎన్నుకోవాల్సిన అవసరాన్ని సదస్సులో చర్చిస్తామని తెలిపారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రెడ్లకు పోలీసు, రెవిన్యూ, మున్సిపల్‌ తదితర కీలక విభాగాల్లో ప్రాధాన్యత పోస్టులు ఇవ్వకుండా అణచివేయడంతో గత ఎన్నికల్లో టీడీపీ నుంచి ఒక్క రెడ్డి ఎమ్మెల్యే కూడా గెలవలేక పోయాడని పేర్కొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

- పునాదిపాడు ఫ్లైఓవర్‌ వద్ద 2.38 లక్షలు, దావులూరు టోల్‌గేట్‌ వద్ద రూ.2 లక్షలు, బొమ్ములూరు వద్ద 1.87 లక్షల నగదు సీజ్‌
- బిల్లులు లేని రూ.1.50 లక్షల విలువైన రోల్డ్‌గోల్డ్‌ వస్తువులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రోల్డ్‌గోల్డ్‌ వస్తువులు చూపుతున్న ఎస్‌ఐ సందీప్‌

కంకిపాడు: పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేస్తున్నారు. వీటిలో భాగంగా బిల్లులు లేని రోల్డు గోల్డు నగలు, సరైన పత్రాలు లేని రూ. 4.38 లక్షలు నగదు మంగళవారం సీజ్‌ చేశారు. ఎస్‌ఐ డి.సందీప్‌ తెలిపిన వివరాల ప్రకారం డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో కంకిపాడు సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికల బృందంతో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. దావులూరు టోల్‌గేట్‌ వద్ద చేసిన తనిఖీల్లో మచిలీపట్నం నుంచి విజయవాడ వస్తున్న ఓ వాహనాన్ని తనిఖీ చేయగా చేయగా చలమలశెట్టి మంగయ్య రూ.1.50 లక్షలు విలువైన రోల్డ్‌ గోల్డ్‌ నగలు తీసుకువెళ్తున్నట్లు గుర్తించారు. సరైన బిల్లులు లేకపోవటంతో వాటిని సీజ్‌ చేశారు. ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన బొమ్మారెడ్డి సోమశేఖర్‌రెడ్డి సరైన పత్రాలు లేకుండా రూ.2 లక్షలు నగదు తీసుకెళ్లడాన్ని గుర్తించి నగదు సీజ్‌ చేశారు. పునాదిపాడుఫ్లై ఓవర్‌ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఉప్పలూరు గ్రామానికి చెందిన వెంగల శ్రీనివాసరావు అనే వ్యక్తి తన వాహనంలో రూ 2.38 లక్షలు నగదు తరలిస్తున్నట్లు గుర్తించారు. సరైన పత్రాలు చూపకపోవటంతో నగదు సీజ్‌ చేసి ఎన్నికల రిటర్నింగ్‌ అధికారికి అప్పగించారు.

హనుమాన్‌ జంక్షన్‌ రూరల్‌: బొమ్ములూరు చెక్‌పోస్టులో రూ.1,87,300 నగదును పోలీసులు మంగళవారం సీజ్‌ చేశారు. ఇక్కడ జరిగిన వాహన తనిఖీల్లో మూడు వేర్వేరు కార్లలో నగదు పట్టుబడింది. ఆధారాలు లేకుండా నగదు తీసుకెళ్లడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఎస్‌టీ టీం ఇన్‌చార్జి కె.సుజాత, హనుమాన్‌జంక్షన్‌ ఎస్‌ఐ జనార్దన్‌ తెలిపారు.

రేపు కాలువలకు నీరు విడుదల

చిలకలపూడి(మచిలీపట్నం): తాగునీటి అవసరాల కోసం ఈ నెల 4వ తేదీన ప్రకాశం బ్యారేజీ నుంచి కాలువలకు నీరు విడుదల చేస్తున్నారని జిల్లాలోని తాగునీటి చెరువులను నింపేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్‌ పి.రాజాబాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో అధిక ఉష్ణోగ్రతలు, తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య ఏర్పడకుండా కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలన్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి కాలువలకు ఈ నెల 4న నీరు విడుదల చేస్తున్నారని, అవి శివారు ప్రాంతాలకు చేరేటప్పటికి రెండు రోజులు సమయం పడుతుందన్నారు.

అధికారులు తాగునీటి చెరువులు నింపేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తాగునీటేతర అవసరాలకు, ఆక్వా చెరువులకు నీటిని మళ్లించకుండా రెవెన్యూ, పోలీస్‌, ఆర్‌డబ్ల్యూఎస్‌, ఇరిగేషన్‌ అధికారులతో పహారా బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. కాలువలు వదిలిన మొదటి రోజు నుంచే ఇంజిన్లను ఉపయోగించి చెరువులను నింపాలన్నారు. ఏప్రిల్‌, మే నెలల్లో ఎండ వేడిమి, వడగాడ్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

వివాహిత మృతి

పెనమలూరు: తాడిగడపలో ఎలుకల మందు సేవించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత మంగళవారం మృతి చెందింది. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప పద్మజానగర్‌ ప్రాంతంలో సలాది కరుణాసాగర్‌ కుటుంబం నివసిస్తోంది. అతను జంగారెడ్డిగూడెంలో పాలిటెక్నిక్‌ కాలేజీలో అధ్యాపకుడు. అతని భార్య రాధ (50) ప్రైవేట్‌ టీచర్‌గా పని చేసి తర్వాత ఇంట్లోనే ఉంటున్నారు. ఆమె మానసికంగా ఇబ్బంది పడుతూ చికిత్స పొందుతున్నారు. వీరి కుమార్తె గీతాంజలి అహ్మదాబాద్‌లో, కుమారుడు సాయిదీప్‌ విజయవాడలో బీటెక్‌ చదువుతున్నారు. ఇదిలా ఉండగా భర్త కుమార్తెను చూడటానికి అహ్మదాబాద్‌ వెళ్లారు. ఇంట్లో ఉన్న రాధ సోమవారం ఎలుకల మందు తాగడంతో కుమారుడు ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్చాడు. దీనిపై సమాచారం తెలుసుకున్న భర్త ఆస్పత్రికి వచ్చారు. అయితే చికిత్స పొందుతున్న రాధ మంగళవారం మృతి చెందింది. ఘటనపై భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

ఘనంగా అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాలల పుస్తకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థుల చేత పుస్తకాలు చదివించారు. గ్రంథాలయాధికారి రమాదేవి మాట్లాడుతూ చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ మంచి పుస్తకం కొనుక్కో, మంచి పుస్తకం మంచి మిత్రుడు లాంటిది, ఒక మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది అని కందుకూరి వీరేశలింగం చెప్పిన మాటలు విద్యార్థులకు వివరించి పుస్తకం విలువను తెలియజేశారు. 10 మందితో వృథాగా కాలక్షేపం చేసే బదులు ఒంటరిగా కూర్చుని ఒక మంచి పుస్తకం చదవడం మేలన్నారు. పుస్తక పఠనంతో మేధస్సు పెరుగుతుందన్నారు. ఎన్నో విలువైన పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడు మృతి

విజయవాడస్పోర్ట్స్: ఈ నెల ఒకటో తేదీ తెల్లవారు జామున బీఆర్‌టీఎస్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యాచకుడు మృతి చెందినట్లు సూర్యారావుపేట సీఐ వి.దుర్గారావు తెలిపారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో నిద్రిస్తున్న యాచకుడిపై నుంచి గుర్తు తెలియని వాహనం వెళ్లడంతో అతనికి తీవ్రంగా గాయాలయ్యాయన్నారు. ఈ విషయం గమనించిన సమీపంలోని వ్యక్తులు అతన్ని 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారన్నారు. చికిత్స పొందుతూ మంగళవారం యాచకుడు మృతి చెందినట్లు సీఐ వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

6న సంప్రదాయ వస్త్రాలంకరణ పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాఘవయ్య పార్క్ ఎదురుగా గల మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల ఆరో తేదీన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం, సంప్రదాయ వస్త్రాలంకరణ పోటీలు జరగనున్నాయి. శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలుంటాయి. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షురాలు దూపాటి శ్రీదేవి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆరో తేదీ శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి పోటీలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు 9440263055 నంబరును సంప్రదించాలని కోరారు.

కిటకిటలాడిన దాసాంజనేయ స్వామి దేవాలయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షలు ముగియడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకు పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాంగ్ రూట్‌లో నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ ఓ వ్యక్తిని తీవ్రంగా గాయపర్చిన సంఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన దేవరకొండ శివశంకర్ సోమవారం రాత్రి 10 గంటల సమీపంలో ద్విచక్ర వాహనంపై హనుమాన్‌జంక్షన్ వచ్చి తన ఇంటికి తిరిగి వెళ్తుండగా హెచ్ మార్ట్ సమీపంలో రాంగ్ రూట్‌లో అతి వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో శివశంకర్ తలకు బలమైన గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ ఏడీఎల్ జనార్దన్ కేసు నమోదు చేశారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామంలోని చింతపల్లి లక్ష్మికి చెందిన తాటాకుల ఇంటి పైకప్పుపై మంగళవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు మంటలు అదుపు చేసేందుకు యత్నించారు. సమాచారం అందుకున్న హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటిన సంఘటనాస్థలికి చేరుకుని మంటలు అదుపు చేశారు. కాగా, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్లు ఫైర్ సిబ్బంది ప్రాథమికంగా భావిస్తున్నారు. రూ.3 లక్షలు ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.

సంక్షేమం.. సమగ్రం

మారుతున్న పేద కుటుంబ కథా చిత్రం

- ఒక్క తూర్పు నియోజకవర్గంలోనే రూ.924 కోట్లతో సంక్షేమం
- అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు
- పేదల్లో పెరిగిన కొనుగోలు శక్తి



డ్వాక్రా సభ్యులకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎంపీ కేశినేని, దేవినేని అవినాష్(ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు): పేదలు సైతం ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న వారికి దీటుగా జీవించాలనేదే ప్రభుత్వ లక్ష్యం. ఆ లక్ష్యాన్ని నెరవేర్చడంలో కులం, మతం, పార్టీలు చూడలేదు. పేదరికం అనే అర్హతే ప్రామాణికంగా అన్ని కులాలు, మతాల వారికి రాష్ట్రంలో ఐదేళ్ల సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేసింది. అందులో భాగంగా విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఏకంగా రూ. 924 కోట్ల మేర వివిధ పథకాల రూపంలో పేదలకు అందించింది. అంతేకాక ఎలాంటి అవినీతి అక్రమాలు, సిఫార్సులకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తూ నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాల్లోనే ఆ మొత్తాన్ని జమచేశారు. నాలుగేళ్ల పది నెలల్లో వైఎస్సార్ సీపీ పాలనపై ప్రజలు చాలా సంతృప్తికరంగా ఉన్నారు. తమకు మంచి చేసిన వారిని మళ్లీ అధికారంలోకి తీసుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

పింఛన్ పంపిణీపై కుట్ర..

గత ప్రభుత్వంలో పింఛన్ తీసుకునేందుకు అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. డివిజన్ మొత్తానికి ఒక ప్రాంతంలో పంపిణీ చేసే వారు. ఏ తేదీన ఇస్తారో తెలియదు. ఒకవేళ తేదీ తెలిసినా, రెండు, మూడు వందల మంది అక్కడకు వెళ్లి బారులు తీరి నిల్చుంటే, సిబ్బంది తీరిగ్గా వచ్చి పంపిణీ చేసేవారు. దీంతో వృద్ధులు నీరశించి పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. అంతేకాదు కొత్త పింఛన్ మంజూరు చేయాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగితే, వారు దయతలిస్తేనే వచ్చేది. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ వ్యవస్థ ద్వారా మొదటి తేదీనే తెల్లారక ముందే పింఛన్ అందేలా చేశారు. దీనిపైనా చంద్రబాబు కుట్రలు చేసి ఆపించారు.

పిల్లలు విద్యకు దూరం కాకూడదని..

పేద వర్గాలకు చెందిన పిల్లలు కూడా ఉన్నత విద్యావంతులుగా ఎదగాలనే సదుద్దేశంతో అమ్మఒడి పథకాన్ని ప్రవేశ పెట్టారు. ఈ పథకం ద్వారా బడికి పంపిన పిల్లల తల్లులకు ఏటా రూ.15 వేలు వారి బ్యాంకు ఖాతాలోనే జమచేశారు. ఇలా నాలుగేళ్లు విజయవంతంగా అమలు చేశారు. అంతేకాదు వయస్సు 45 ఏళ్లు దాటిన మహిళలకు చేయూత, కాపునేస్తం, డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఆసరా, రుణమాఫీ వంటి అనేక పథకాలు అందించారు. చిరు వ్యాపారులకు జగనన్న తోటు, వైఎస్సార్ బీమా వంటి పథకాలతో పేదల్లో ఆర్థిక శక్తి పెరిగింది. విద్యాదీవెన, వసతి దీవెన, వాహనమిత్ర, లా నేస్తం వంటి పథకాలు అమలు చేశారు. గత ఎన్నికల ముందు చెప్పిన ప్రతి పథకాన్ని అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారు.

ఎంతో మేలు జరిగింది..



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా మా కుటుంబానికి ఎంతో మేలు జరిగింది. మా అబ్బాయికి ఫీజు రీయింబర్స్‌మెంట్, నాకు డ్వాక్రా రుణమాఫీ, ఇంటి స్థలం, చేయూత ద్వారా మా కుటుంబానికి లబ్ధి చేకూరింది. ఎలాంటి సిఫార్సులు లేకుండా వలంటీర్ మా ఇంటికి వచ్చి అర్హతను బట్టి పథకాలు అందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– వంకెల అనితాదేవి, జార్జిపేట

చేసిందే దమ్ముగా చెబుతున్నాం..



నాలుగేళ్ల పది నెలల్లో నియోజకవర్గంలో ఏమి చేశామో అంకెల్తో సహా దమ్ముగా చెప్పగలుగుతున్నాం. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తూర్పు నియోజకవర్గంలో రూ.924 కోట్ల మేర సంక్షేమ పథకాలతో పాటు, రూ.650 కోట్లతో అభివృద్ధి చేశాం. ఎన్నడూ, ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశాం. ఏ ప్రాంతానికి వెళ్లినా అభివృద్ధి కనిపిస్తుంది. టీడీపీలా అసత్య ప్రచారం చేయాల్సిన అవసరం మాకు లేదు.

– దేవినేని అవినాష్, వైఎస్సార్ సీపీ అభ్యర్థి

ఐదేళ్లలో సంక్షేమ పథకాల అమలు ఇలా..

పథకం	లబ్ధిదారుల సంఖ్య	పొందిన మొత్తం రూ.
వైఎస్సార్ పెన్షన్ కానుక	21,536	375.47 కోట్లు
వైఎస్సార్ చేయూత	34,661	81.27 కోట్లు
వైఎస్సార్ ఆసరా	30,602	119.17 కోట్లు
వైఎస్సార్ సున్నావడ్డీ	3,869	20.40 కోట్లు
వైఎస్సార్ బీమా	678	6.39 కోట్లు
జగనన్న తోడు	22,443	22.44 కోట్లు
జగనన్న చేదోడు	9,639	9.64 కోట్లు
వైఎస్సార్ కల్యాణ మస్తు	111	83.25 లక్షలు
అర్చకులు, ఇమామ్, పాస్టర్లకు	30	36 లక్షలు
వైఎస్సార్ కాపునేస్తం	7,651	11.48 కోట్లు
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	4,256	6.39 కోట్లు
వైఎస్సార్ లా నేస్తం	125	1.50 కోట్లు
వైఎస్సార్ నేతన్న నేస్తం	5	1.20 లక్షలు
వైఎస్సార్ వాహనమిత్ర	7,485	7.49 కోట్లు
జగనన్న అమ్మఒడి	20,235	28.33 కోట్లు
జగనన్న విద్యాదీవెన	16,294	35.19 కోట్లు
జగనన్న వసతి దీవెన	18,430	17.85 కోట్లు
వైఎస్సార్ మత్స్యకార భరోసా	114	11.40 లక్షలు
విద్యార్థులకు ట్యాబ్‌లు	2,515	8.30 కోట్లు
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	32,189	67.78 కోట్లు
ఆరోగ్య ఆసరా	2,478	1.22 కోట్లు
సీఎంఆర్ఎఫ్/ఎల్‌ఓసీ	327	8.24 కోట్లు

రేపటి నుంచి స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులను నిర్వహించనున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 తేదీ నుంచి కట్టింగ్ అండ్ టైలరింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, డ్రెస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఏసీ, రిఫ్రిజిరేటర్ మెకానిజం, హోమ్ క్రాఫ్ట్స్, జ్యూస్ అండ్ జామ్ మేకింగ్, టెక్స్‌టైల్ ప్రింటింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్క్ అంశాల్లో శిక్షణ తరగతులు జరుగుతాయని వివరించారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కాని 0866-2470420లో కాని సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

కోడ్ ఉల్లంఘన.. ఇద్దరిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి పవన్‌కల్యాణ్, పోతిన మహేష్ ఫ్లెక్సీలతో సంతకాల సేకరణ చేస్తున్న ఇద్దరిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్రకట్ట రోడ్డు పరిధిలోని ప్రైజర్‌పేట కటికల వారి వీధి వద్ద మల్లికార్జునపేటకు చెందిన బైపు రామకృష్ణ, కేఎల్‌రావునగర్‌కు చెందిన లండా ప్రశాంత్ కలిసి పవన్‌కల్యాణ్, పోతిన మహేష్‌ల ఫ్లెక్సీలతో సంతకాల సేకరణ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకునే సరికి రోడ్డుపై వెళ్లే వారిని ఆపి, ఇద్దరికీ మద్దతుగా సంతకాల సేకరణ చేస్తున్నట్లు టీం సభ్యులు గుర్తించారు. సంతకాల సేకరణ చేస్తున్న వారు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి ఏమైనా అనుమతి తీసుకున్నారా అని ప్రశ్నించారు. అయితే ఎటువంటి అనుమతి తీసుకోలేదని సదరు యువకులు పేర్కొనగా, వారిపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ గణేష్ కేసు నమోదు చేశారు.

వైఎస్సార్ సీపీకే ప్రజల మద్దతు

16వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో దేవినేని అవినాష్



వృద్ధురాలితో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ మెచ్చుకుంటున్నారని విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. మంగళవారం 16వ డివిజన్ కళానగర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్‌తో పాటు 16వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి రాధికలు ఇంటింటికీ వెళ్లి నవరత్నాలు అందిన తీరును స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ అమ్మ ఒడి, చేయూత, ఈబీసీ నేస్తం, పథకాలను అందుకున్నామని ప్రతి ఒక్కరూ స్వయంగా చెబుతున్నారన్నారు. మళ్లీ తమ ఓటు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వేస్తామని సంతోషంగా చెబుతున్నారన్నారు. టీడీపీ నేతలు చేసిన కుట్ర వల్లే నేటికీ అవ్వాతాతలకు పింఛన్ అందలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే స్థానిక నేతల కనుసన్నల్లోనే పథకాలు ఇస్తామని లోకేష్ పేర్కొనడం బాధాకరమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కుల, మతాలకు అతీతంగా పథకాలు అమలు చేసిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ ఏనాడు ప్రజల కష్టాలు తీర్చిన దాఖలాలు లేవని ఆరోపించారు. గతంలో దత్తత తీసుకున్న పాత 14వ డివిజన్ ప్రస్తుతం 15, 16వ డివిజన్‌లలో అభివృద్ధి చేయకుండా ప్రజలను మోసం చేశారు. ఎమ్మెల్యే గద్దే నోరు తెరిస్తే అబద్ధం మాట్లాడుతున్నారన్నారు. తూర్పులో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు ఇవ్వకుండా ప్రజలను నట్టేట ముంచారని దుయ్యబట్టారు. గత ఐదు సంవత్సరాలు ఇళ్లకు పరిమితమైన గద్దె అండ్ పార్టీ ఇప్పుడు ఎన్నికలు వచ్చాయని ఇళ్ల వద్దకు వెళ్లి ఓటు తమ పార్టీకి వేయాలని ప్రదక్షిణలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు బహదూర్, జిల్లా అధ్యక్షుడు ఈశ్వరప్రసాద్, రాధాకృష్ణ, సుబ్బారావు, సుభాషిణి, మాధవి, కొండా, దుర్గారావు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేసిన వారినే ఆదరించండి




ఎస్‌బీహెచ్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని క్రాంతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లుగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మంచి చేస్తున్న వారికే రానున్న ఎన్నికల్లో ఓట్లు వేయాలని వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి అన్నారు. ఆమె మంగళవారం 10వ డివిజన్‌లోని ఎస్‌బీహెచ్ కాలనీ, పీఅండ్‌టీ కాలనీలతో పాటు, 13వ డివిజన్‌లోని కృష్ణనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి పార్లమెంట్ సభ్యుడిగా కేశినేని శ్రీనివాస్, శాసన సభ్యుడిగా దేవినేని అవినాష్ గెలిపించాలని కోరారు.

సుధీర ప్రచారం..

దేవినేని అవినాష్ సతీమణి సుధీర మంగళవారం పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆమె 4వ డివిజన్‌లో గురునానక్‌నగర్‌తో పాటు, 8వ డివిజన్‌లోని రెవెన్యూకాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నిరంతరం అందుబాటులో ఉంటూ, పిలిస్తే పలికే వారికే ఓట్లు వేయాలన్నారు. వారి వెంట 4వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గల్లా రవి, కో ఆప్షన్ సభ్యుడు మునునూరు సుబ్బారావు, 10వ డివిజన్ ఇన్‌చార్జి కరుటూరి హరీష్ తదితరులు ఉన్నారు.

ఆటిజంను ఆరంభ దశలోనే గుర్తించాలి



ఆటిజం గురించి వివరిస్తున్న డాక్టర్ కృష్ణకుమారి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆటిజం అంటే చైల్డ్‌హుడ్ న్యూరో డెవలప్‌మెంటల్ డిజార్డర్ అని దానిని ఆరంభ దశలోనే గుర్తించి చికిత్స ఇవ్వడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ టి. కృష్ణకుమారి అన్నారు. అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ ఆటిజం డే సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది. కృష్ణకుమారి మాట్లాడుతూ ఆటిజం అనేది చిన్నారుల్లో ఏడాదిన్నర నుంచి మూడేళ్లలోపు వయస్సులోనే సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. చిన్నారులు తక్కిన పిల్లలతో కలవకపోవడం, కళ్లలో కళ్లుపెట్టి చూడకపోవడం, స్పీచ్ అండ్ లాంగ్వేజీ సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎప్పటికప్పుడు అన్ని విషయాలు క్షుణంగా పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ స్వీకార్ అండ్ ఉపకార్ స్పీచ్ పెథాలజిస్టు శృతిపాటిల్ చిన్నారుల్లో స్పీచ్ డిలేకు సంబంధించిన వివిధ రకాల అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ప్రత్యేక చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా మజ్జిగ పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేసవి ఎండల్లో దాహార్తులు, పాదచారులకు తమ వంతు సామాజిక బాధ్యతగా మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోరంగి నాగమల్లీశ్వరి, ఎస్‌కే షఫీవుల్లా అన్నారు. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డులో మంగళవారం హెల్పింగ్ ట్రస్ట్ ఆధ్వర్యాన పాదచారులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్న దృష్ట్యా ఎవరికి వారు తమ వంతు బాధ్యతగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి తాగునీరు, మజ్జిగను పంపిణీ చేయాలని సూచించారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ట్రస్ట్ సభ్యులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 1200 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, హేమంతరావు, ఫణి తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పెనమలూరు: ఇద్దరు వ్యక్తులపై కర్రలతో దాడి చేసిన ముగ్గురిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమలాపురం దేవరలంకకు చెందిన రాజ్‌కుమార్ హైదరాబాద్‌లో కబోర్డ్‌ల పని చేస్తాడు. అతని వద్ద అదే గ్రామానికి చెందిన ఓలేటి సతీష్ పని చేసేవాడు. అయితే సతీష్ పని మానివేసి విజయవాడకు వచ్చి రాజ్‌కుమార్ పట్ల చెడుగా ప్రచారం చేయసాగాడు. ఈ విషయం తెలిసిన రాజ్‌కుమార్ ఫోన్‌లో సతీష్‌ను అడుగగా నా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతా చేతనైతే విజయవాడకు వచ్చి మాట్లాడమని అన్నాడు. దీంతో రాజ్‌కుమార్ మంగళగిరి వద్ద ఉన్న మిత్రుడు నరసింహస్వామి వద్దకు వచ్చాడు. ఇద్దరు కలిసి కానూరులో ఉన్న సతీష్ వద్దకు వచ్చారు. రాజ్‌కుమార్ సతీష్‌ను కలిసి ప్రశ్నించటంతో సతీష్, సిద్ధూ, సాయి కర్రలతో రాజ్‌కుమార్, నరసింహస్వామిపై దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన రాజ్‌కుమార్, నరసింహస్వామిలను విజయవాడ జీజీహెచ్‌లో చికిత్సకై చేర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

'పారిజాత పర్వం' అలరిస్తుంది



మాట్లాడుతున్న పారిజాత పర్వం మూవీ హీరో చైతన్యరావు, చిత్రంలో హీరోయిన్ శ్రద్ధాదాస్

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలో పారిజాత పర్వం చిత్ర యూనిట్ మంగళవారం సందడి చేసింది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఓ హోటల్లో చిత్ర యూనిట్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో చైతన్యరావు మాట్లాడుతూ కిడ్నాప్ కామెడీ డ్రామాతో పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమన్నారు. ఒక కిడ్నాప్ ఇతివృత్తంగా ఈ చిత్రం సాగుతుందని, ప్రముఖ నటులు సునీల్ ఈ చిత్రంలో ఒక మంచి పాత్రలో కనబడతారని, ఆయన పాత్ర ఈ చిత్రానికి హైలైట్ గా ఉంటుందని వివరించారు. హీరోయిన్ శ్రద్ధాదాస్ పలు క్యారెక్టర్లలో నటించిందని ఈ చిత్రంలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చెప్పారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 19న థియేటర్లలో రిలీజ్ కానుందని ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని ఆయన కోరారు. హీరోయిన్ శ్రద్ధ దాస్ మాట్లాడుతూ కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయన్నారు. అనంతరం ప్రముఖ కమెడియన్ వైవా హర్ష మాట్లాడుతూ ఈ చిత్రంలో వచ్చే హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతగానో నవ్విస్తాయని తెలిపారు. దర్శకుడు సంతోష్ కంభంపాటి మాట్లాడుతూ గతంలో ఎన్నో కిడ్నాప్ కామెడీ చిత్రాలు వచ్చాయని ఈ చిత్రం పూర్తి స్థాయి భిన్నంగా ఉంటుందన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలి



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ పెద్దిరాజు

గన్నవరం: ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించాలని ట్రాఫిక్ సీఐ వాసా పెద్దిరాజు సూచించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ.. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించరాదన్నారు. ఆటోలను రద్దీ ప్రాంతాల్లో కాకుండా నిర్ణీత ప్రదేశాల్లో మాత్రమే నిలుపుకోవాలని సూచించారు. లైసెన్స్ లేకుండా డ్రైవర్లు ఆటోలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ రహదారులపై అడ్డదిడ్డంగా ఆటోలను నిలిపిన, రాంగ్ రూట్‌లో నడిపిన జరిమానాలు విధిస్తామన్నారు. పరిమితికి మించిన వేగంతో ఆటోలను నడపడం ప్రమాదకరమని తెలిపారు. ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన మల్లిశెట్టి అనూష బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచ హారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నృత్య ప్రదర్శన జరిగింది. పలు కీర్తనలకు చిన్నారులు అద్భుతంగా నృత్య ప్రదర్శన ఇవ్వగా, అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు వారికి ప్రసాదాలను అందజేశారు.

ఎన్నికల్లో మద్యం పంపిణీకి స్వస్తి పలకాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులు ఉచితంగా మద్యం పంపిణీకి స్వస్తి పలికి ఓటర్లు, కార్యకర్తలు, యువతను కాపాడాలని సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం 'స్వేచ్ఛాయుత ఎన్నికలు–మద్యం ప్రభావం–నియంత్రణ మన ముందున్న సవాళ్లు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో ఉచితంగా మద్యం పంపిణీ వల్ల యువతకు మద్యం అలవాటు అవుతుందన్నారు. అభ్యర్థులు ఖర్చు పెట్టే వ్యయంలో 25శాతం మద్యం పంపిణీకే కేటాయిస్తున్నారని తెలిపారు. తాగుడు తప్పు అనే భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మద్య నిషేధం కన్న నియంత్రణ ఆచరణ సాధ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం మద్యంపై జాతీయ విధానాన్ని ప్రకటించాలని కోరారు. సమావేశంలో జాతీయ మహిళా సమాఖ్య నేత అక్కినేని వనజ, పీవోడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.పద్మ, గద్దె అనురాధ, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'నా దేహం నా ఇష్టం. నాకు ఇష్టమైనవి తింటాను'... అనుకోవడంలో ఇతరులకు ఎటువంటి అభ్యంతరమూ ఉండాల్సిన అవసరం లేదు. కానీ సమాజంలో గౌరవంగా జీవించాలంటే మనం తినే ఆహారం ఆరోగ్యకరంగా ఉండాలి. వినడానికి విచిత్రంగా ఉన్నా సరే ఇది నిజం. ప్రతి ఒక్కరూ 'పోషకాహారం తీసుకోవాలి, దేహానికి అవసరమైనంత మాత్రమే తీసుకోవాలి. దానికి తగినట్లు వ్యాయామం చేయాలి'... దైనందిన జీవితం ఇలా క్రమబద్ధంగా ఉన్న వ్యక్తి ఆలోచనలు ఆరోగ్యకరంగా ఉంటాయి. ప్రవర్తన కూడా గౌరవపూర్వకంగా ఉంటుంది. స్థూలంగా చెప్పినా సూక్ష్మంగా చెప్పినా, విషయం ఏమిటంటే... ఆరోగ్యకరమైన దేహం ఆరోగ్యకరంగా ఆలోచిస్తుంది. మానసిక ఆరోగ్యంలో అపసవ్యతలు తలెత్తాయంటే అవి కేవలం మానసికం మాత్రమే కాదు, అసలైన సమస్య దేహంలోనే ఉంటుంది. దేహానికి అందుతున్న ఆహారంలోనే ఉంటుంది... అన్నారు హెల్త్ సైకాలజిస్ట్ సుస్మితా గుప్తా.


ప్రతీకాత్మక చిత్రం

ఆకలికి అలవాటుకి తేడా ఉంది

ఇదో మైండ్‌గేమ్!

''సమాజంలో మంచి వ్యక్తిగా చలామణి కావాలంటే మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యం. మానసిక ఆరోగ్యం మీద మన అలవాట్లు తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తాయి. మనకు తెలియకుండా చేసే పొరపాటు ఏమిటంటే 'ఆకలి- అలవాటు' మధ్య తేడా గుర్తించకపోవడం. ఆకలి లేకపోయినా అలవాటుగా తినడం, ఒత్తిడిలో ఉన్నప్పుడు దాన్నుంచి తప్పించుకోవడానికి ఆహారాన్ని ఆశ్రయించడం అనే దురలవాటు ఎప్పటి నుంచో ఉంది, కానీ ఇటీవల ఎక్కువైంది. దైనందిన జీవితంలో ఒత్తిడి ఎక్కువైంది, జిహ్వను సంతృప్తి పరుచుకోవడానికి జంక్‌ఫుడ్ మీదకు మనసు మళ్లడం అనేది కూడా మన జీవనశైలిలో భాగమైపోయింది. నిజానికి మన మెదడు మనతో గేమ్ ఆడుతుంటుంది. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని తెలిసినప్పటికీ మనసు జంక్‌ఫుడ్ మీదకు మళ్లిస్తుంది. ఇదెలాగంటే... రేపటి నుంచి వ్యాయామం మొదలు పెట్టాలని నిర్ణయం తీసుకుని అలారం పెట్టుకుంటాం. అలారం మోగినప్పుడు ఆపేసి మళ్లీ నిద్రపోతాం. మన జీవనశైలికి అనుగుణంగా మన మెదడులో మ్యాపింగ్ జరిగిపోయి ఉంటుంది. దాని నుంచి బయటపడడానికి మెదడు ఇష్టపడదు. ఆ కంఫర్ట్ జోన్ నుంచి మనల్ని కూడా బయటకు రానివ్వదు. అలాంటప్పుడు మనం మెదడు మాటను పెడచెవిన పెట్టడమే పరిష్కారం. మనల్ని మనం దురలవాట్ల నుంచి బయటేసుకోవాలంటే ఆ ప్రయత్నంలో మనల్ని వెనక్కి లాగే మెదడు చెప్పే మాటను వినకూడదు.

ఆహారం- మానసిక అనారోగ్యం!

మనం అలవాటుగా నిత్యం జంక్‌ఫుడ్‌తో పొట్టను నింపేస్తుంటే దేహం శక్తిహీనమవుతూ ఉంటుంది. అలసటతోపాటు ప్రతిదానికీ చిరాకు, ఆందోళన, ఆవేశపడడం వంటి లక్షణాలు తోడవుతాయి. మెదడు నుంచి నాడీ వ్యవస్థ ద్వారా దేహభాగాలకు అందాల్సిన సంకేతాల్లో అపసవ్యతలు తలెత్తుతాయి. ఒక విషయానికి సక్రమంగా ప్రతిస్పందించాల్సిన సందర్భంలో విపరీతంగా స్పందించడం వంటి మార్పులు కనిపిస్తాయి. మానవ సంబంధాలు దెబ్బతింటాయి. మానసిక సమస్యలు తీవ్రరూపం దాల్చినప్పుడు మాత్రమే మానసిక వైద్యుని సంప్రదిస్తుంటాం. ప్రతి ఒక్కరిలో సమస్య అంతటి స్థాయి తీవ్రతకు దారితీయదు. కానీ మధ్యస్థ దశ ఎక్కువ మందిలో కనిపిస్తుంటుంది. ఈ సమస్యకు వైద్యం... మనం మంచి ఆహారం తీసుకోవడమే. బ్రెయిన్ మనతో ఆడుకుంటుంది, మనం బ్రెయిన్‌ని మన అధీనంలో ఉంచుకోగలగాలి. అదే దేహానికి-మెదడుకు సమగ్రమైన ఆరోగ్యం. మనం ఏమి తింటున్నామో దానిని బట్టి మనం ఏమిటో చెప్పవచ్చు. ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారంలోకి తీసుకువెళ్లగలిగితే సమాజం ఎదుర్కొంటున్న అనేక మానసిక రుగ్మతలను నివారించవచ్చు. ఆరోగ్యకరమైన బంధాలతో అందమైన సమాజాన్ని నిర్మించడానికి నా వంతుగా చేస్తున్న ప్రయత్నమే ఇది'' అన్నారు హెల్త్ సైకాలజిస్ట్ సుస్మితాగుప్తా.

– వాకా మంజులారెడ్డి,
'సాక్షి' ఫీచర్స్ ప్రతినిధి

వార్ధక్యం పొంచి ఉంటుంది

బాడీ-మైండ్‌ని కలిపి ఒక యూనిట్‌గా పరిగణించాలి. ఒకటి ప్రమాదంలో పడితే రెండవది కూడా ప్రమాదంలో పడుతుంది. దేహం సమతుల ఆరోగ్యంతో ఉన్నప్పుడే మెదడు కూడా సంపూర్ణారోగ్యంతో ఉంటుంది. దేహానికి సంతులిత ఆహారం అందనప్పుడు తలెత్తే సమస్యలు మానసిక అపసవ్యతలు మాత్రమే కాదు వార్ధక్యం కూడా. త్వరగా వయసు మీద పడుతున్న వారిలో దేహానికి పోషకాహారం తగిన మోతాదులో అందకపోవడంతోపాటు చిన్న చిన్న మానసిక రుగ్మతలతో సతమతమైన నేపథ్యం కనిపించి తీరుతుంది. ఇది అంతర్జాతీయంగా నిర్వహించిన అధ్యయనం. జంక్‌ఫుడ్ కారణంగా ఎదురయ్యే సమస్య స్థూలకాయం మాత్రమే కాదు మానసిక అనారోగ్యాలు కూడా. దేహం లోపల ఇన్‌ఫ్లమేటరీ కండిషన్‌కు దారి తీస్తుంది. అది దేహం వార్ధక్యం బారిన పడడానికి తొలి దశ.

– సుస్మితా గుప్తా,
హెల్త్ సైకాలజిస్ట్, ద క్యూర్ స్పేస్



మీరు ఆర్థిక అక్షరాస్యులేనా?!

'భారతీయ స్త్రీలు ఆర్థికంగా అక్షరాస్యులు కాకపోవడానికి ప్రధాన కారణం పితృస్వామ్యమే' అంటోంది గ్లోబల్ సర్వే స్టాండర్డ్ అండ్ పూర్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్. ఆర్థిక భద్రత, ఆర్థిక అక్షరాస్యత స్త్రీకి ఎంత అవసరమో తెలుసుకుంటే ఆమె పురోభివృద్ధిలో మరిన్ని మంచిమార్పులు చోటుచేసుకుంటాయన్నది అక్షర సత్యం.


ప్రతీకాత్మక చిత్రం

సంపాదనలో నేటితరం మహిళలూ తమ సత్తాను చూపుతున్నారు. వృత్తి, ఉద్యోగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. అక్షరాస్యతలోనూ ముందడుగు వేస్తున్నారు. అయితే, ఆర్థిక అక్షరాస్యతలో మాత్రం మహిళ వెనకంజలోనే ఉందని గ్లోబల్ ఫైనాన్షియల్ లిటరసీ బారోమీటర్ సర్వే స్పష్టం చేస్తోంది. 28 దేశాలలో నిర్వహించిన ఈ సర్వేలో (స్త్రీ-పురుషులు ఇద్దరినీ కలిపి) భారతదేశం 23వ స్థానంలో ఉంది. కేవలం 35 శాతం మంది మాత్రమే ఆర్థిక అక్షరాస్యులుగా ఉంటే, 65 శాతం మందికి ఆర్థిక అవగాహన తక్కువ. ఇందులోనూ మహిళలు మరింతగా వెనకబడి ఉన్నారు అని తెలియజేసింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికీ వందకోట్ల కంటే ఎక్కువ మంది మహిళలు సొంత బ్యాంకు ఖాతా కూడా లేనివారున్నారు.

భావోద్వేగాలతో ఆట

తరచూ భర్తలు తమ భార్యలతో 'నేను సంపాదిస్తున్నాను కాబట్టి నువ్వు సంపాదించాల్సిన అవసరం ఏముంది? ఇంటిని, పిల్లలను నిర్లక్ష్యం చేసినట్టే అవుతుంది' అనే ఎమోషనల్ స్ట్రాటజీలతో మహిళలు ఇరుక్కుంటున్నారు. దీంతో మహిళలు క్రమంగా ఒంటరిగా, నిస్సహాయంగా మారుతుంటారు. దురదృష్టం ఏమిటంటే 'ప్రేమ' అనే పేరుతో జరిగే ఆర్థిక దుర్వినియోగాన్ని మహిళలు గుర్తించలేకపోతున్నారు. ఆర్థిక భద్రత లేకపోవడంతో స్త్రీలు తమకి నప్పని సంబంధాలలోనూ సర్దుబాటు చేసుకుంటూ జీవించాల్సి వస్తుంది. చెడు సంబంధాలలోకి వెళుతుంటారు. డబ్బును పొదుపు చేసి పెట్టుబడులు పెట్టడానికి బదులు, ఆమె కుటుంబం కోసం తనను తాను త్యాగం చేసుకుంటుంది. చివరకు అదే కుటుంబంలోని వ్యక్తులు లేదా పిల్లలు స్త్రీల మీద ఆర్థిక ఒత్తిడిని తీసుకువస్తున్నారు. మహిళల ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా గృహహింసను తగ్గించవచ్చని 'రైట్స్ ఆఫ్ ఈక్వాలిటీ' అనే సంస్థ 'ది ఎకనామిక్ అబ్యూజ్ అండ్ ది ఇంపార్టెన్స్ ఆఫ్ ఫైనాన్షియల్ లిటరీ ఆఫ్ ఉమెన్' నివేదికలో పేర్కొంది.

నిర్మాణాన్ని అర్థం చేసుకోవాలి

కుటుంబం ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో సాధారణంగా మహిళలు ఉండరు. లక్ష్మి ఒక సాధారణ గృహిణి. ఇప్పటికీ బ్యాంకు ఖాతా తెరవడానికి, కేవైసీ చేయడానికి భర్తతో కలిసే బ్యాంకుకు వెళుతుంది. ఆర్థికవిషయాలు అంటే ఆమెకు ఒక విధమైన భయం. సొంతంగా ఎప్పుడూ ప్రయత్నం కూడా చేయదు. ఇలాంటి గృహలక్ష్ములు మన దేశంలో ఎంతోమంది ఉన్నారు. ఉమ ఉద్యోగం చేస్తుంది. కానీ, ఆమె ఏటీఎం కార్డ్ భర్త వద్ద ఉంటుంది. పాస్‌వర్డ్ లాంటివి ఆమె స్వయంగా రూపొందించదు. అవన్నీ ఆమె భర్త చేస్తాడు. ఉద్యోగం చేస్తున్నా కూడా ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక స్వేచ్ఛ లేని ఇలాంటి మహిళలు కోట్లాదిమంది ఉన్నారు.

షాపింగ్‌లో సమస్య లేదు

'ఆర్థిక అక్షరాస్యత అంటే బ్యాంకుకు వెళ్లడం, అకౌంట్ ఓపెన్ చేయడం, చిన్న చిన్న లావాదేవీలు చేయడం అనుకోవాలా?!' అనే ప్రశ్న ఉదయించకమానదు. అయితే, 'ఇండియన్ ఉమెన్ అండ్ ఫైనాన్షియల్ ఫిట్‌నెస్' రచయిత సునీల్ గాంధీ మాట్లాడుతూ 'చాలా మంది మహిళలకు మొబైల్ యాప్‌లో షాపింగ్ చేయడం, క్యాబ్ బుక్ చేసుకోవడంలో ఎటువంటి సమస్య ఉండటం లేదు. అయితే, తమ సొంత బ్యాంకు ఖాతాను నిర్వహించడంలో లేదా ఆన్‌లైన్ లావాదేవీలు, పెట్టుబడుల పట్ల మాత్రం చాలా అసౌకర్యంగా ఉంటున్నారని చెబుతున్నారు. 'ఆమె బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉండాలి. ఎందుకంటే, డబ్బు లావాదేవీలు, వడ్డీలు, చక్రవడ్డీల ఉచ్చులో చిక్కుకోకూడదు అని పురుషులు భావిస్తారు. ఆమె కూడా ఏదైనా పథకంలో పెట్టుబడి పెట్టడానికి, ఈఎమ్‌ఐ కట్టడానికి, ఆస్తిలో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపదు. వ్యక్తిగత ఫైనాన్స్, జ్ఞానం, నైపుణ్యాలు, వంటి ఆర్థిక సమాచారం ఉన్నవారు తమ డబ్బుకు సంబంధించి సొంతంగా నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం ఉన్నవారు ఆర్థికంగా అక్షరాస్యులు' అని సునీల్ గాంధీ వివరిస్తున్నారు.

మహిళలను నియంత్రించే ఆయుధం

ఉద్దేశపూర్వకంగానే మహిళలకు 'ఆర్థిక స్వేచ్ఛ' ఇవ్వడం లేదు. కుటుంబంలోని మగవారే దీనిని అడ్డుకుంటున్నారు. భారతీయ స్త్రీలు ఇంటిని చూసుకుంటారు. పురుషులు సంపాదిస్తారు. దీంతో 'తమకు ఏం అవసరమో పురుషులే చూసుకుంటారు' అనే ఆలోచన స్త్రీలను ఆర్థిక స్వేచ్ఛకు దూరం చేస్తుంది. చేతిలో డబ్బు, దానిని ఖర్చు చేసే హక్కు పురుషులకు ఉండటం మహిళలను నియంత్రించే ఆయుధంగా మారింది.

– గీతికా చంద్ర,
'ఫైనాన్స్ బేసిక్స్ ఫర్ ఉమెన్'
రచయిత్రి

కొట్టకుండా వేధింపులు

'నేను సంపాదిస్తున్నాను. నా సంపాదనతో ఇల్లు నడుస్తోంది. నేను సంపాదించకపోతే కుటుంబం దిక్కులేనిది అవుతుంది. నేను సంపాదిస్తున్నాను కాబట్టి నా ఇష్టం మేరకు అన్నీ నడవాలి' ఈ తరహా ఆలోచన పురుషుల్లో పెరిగి మహిళలపై వేధింపులకు కారణమవుతోంది. 95 శాతం గృహహింస కేసుల్లో డబ్బు ప్రధానపాత్ర పోషిస్తోంది. చాలా మంది మహిళలు ఈ విధమైన ఆర్థిక వేధింపులకు గురవుతున్నారు.

– సీమీ వినాయక్,
సైకాలజిస్ట్

అవగాహనకు మార్గాలు..

- ఆర్థికంగా అక్షరాస్యత ఉన్న మహిళలకు డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది, వేటికి ఎంత ఖర్చు అవుతుంది, ఎంత దుర్వినియోగం అవుతుంది అనే విషయాల పట్ల అవగాహన ఉండాలి. అంతేకాదు, ఏ పథకాల్లో డబ్బు ఉంచడం ప్రయోజనకరం... వంటి అంశాలపై దృష్టి పెట్టడం వల్ల మార్కెట్‌లో ఆర్థిక కదలిక ఏమిటో తెలుస్తుంది.
- ఫిక్స్‌డ్ డిపాజిట్స్, స్కీమ్‌లు, నాన్-డీమ్యాట్ ఇన్వెస్ట్‌మెంట్స్, మ్యూచువల్ ఫండ్స్, హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ గురించి అవగాహన పెంచుకోవాలి.
- మహిళలు తమ భర్త ఎక్కడ పెట్టుబడి పెడుతున్నారో తప్పక తెలుసుకోవాలి.
- ఏయే రుణాలు తీసుకుంటున్నారు, వాటి కాలపరిమితి ఎంత, వడ్డీ ఎంత అనేది తెలుసుకోవాలి.
- ప్రస్తుతం చాలా లావాదేవీలు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో మహిళలు ఆన్‌లైన్ లావాదేవీల మొత్తం ప్రక్రియను తెలుసుకోవాలి.
- మ్యూచువల్ ఫండ్స్, షేర్లు, బ్యాంకులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్టాఫీస్, జీవిత బీమాలో పెట్టుబడి పెట్టినట్లయితే ఎప్పుడూ కంబైన్డ్‌గా చేయడం మంచిది. నామినీలో మీ పేరు ఉందో లేదో చెక్ చేయాలి. మీ సొంత బ్యాంకు ఖాతా వివరాలను ఎల్లప్పుడూ అప్‌డేట్‌లో ఉంచండి.

అన్నదానం, వస్త్రదానం, విద్యాదానం... ఇలా మన సంస్కృతిలో దానగుణానికి విశేష గౌరవం ఉంది. అయితే భువనేశ్వర్‌కు చెందిన హరిప్రియ నాయక్ ప్రచారం చేసేది మాత్రం 'శిరోజాల దానం'. 'మీరు దానం చేసే శిరోజాల పేద కేన్సర్ పేషెంట్ల ముఖంలో చిరునవ్వు తీసుకొస్తుంది' అంటుందామె. సేకరించిన జుట్టుతో విగ్గులు తయారు చేయించి పంచుతున్న హరిప్రియ నాయక్ అనేక ప్రశంసలు పొందుతోంది.

సేవ


శిరోజాల దాతలతో ప్రియానాయక్

శిరోజాలు దానం చేయండి

కేన్సర్‌తో పోరాడి గెలవడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తారు. చాలా మంది గెలుస్తారు. అయితే దిగువ మధ్యతరగతి స్త్రీలు, పేద స్త్రీలు ఈ విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారు. కేన్సర్ చికిత్స సమయంలో కిమోథెరపీ వల్ల జుట్టు రాలిపోతుంది. ఆ సమయంలో శిరోముండనం కూడా చేయించుకోవాల్సి వస్తుంది. స్తోమత కలిగిన వర్గాల స్త్రీలు తిరిగి పూర్తి జుట్టు వచ్చేవరకూ విగ్గులు ధరిస్తారు. కాని పేద వర్గాల స్త్రీలకు ఆ అవకాశం ఉండదు. వారి కోసం, వారి ఆత్మవిశ్వాసం కోసం ఉచితంగా విగ్గులు ఏర్పాటు చేస్తోంది హరిప్రియ నాయక్. 'శిరోజాల దానం ఇవాళ్టి అవసరం' అంటుందామె.

సామాజిక సేవ

ఒడిశాలోని ఖుర్దా జిల్లాకు చెందిన 32 ఏళ్ల హరిప్రియ నాయక్ సామాజిక సేవారంగంలో పని చేస్తోంది. 'ఒకసారి నేను కీమోథెరపీ వల్ల జుట్టు కోల్పోయిన పేదస్త్రీలను చూశాను. వారు ఇంటినుంచి బయటకు రావడానికే సిగ్గుపడుతున్నారు. కేన్సర్‌తో పోరాడే సమయంలో మానసికంగా, శారీరకంగా గట్టిగా ఉండాలి. మానసికంగా కుచించుకుపోతే కష్టం. స్త్రీలు జుట్టును ఇష్టపడతారు. వారికి సరైన విగ్గు ఇవ్వగలిగితే ఆత్మవిశ్వాసం వస్తుందని పనిలోకి దిగాను' అంటుంది హరిప్రియ నాయక్. ఆమె 2021లో 'మిషన్ స్మైల్ ఫర్ ది కేన్సర్ ఫైటర్స్' పేరుతో ఒక కార్యక్రమాన్ని శిరోజాల సేకరణ కోసం మొదలుపెట్టింది. శిరోజాల దానం కోసం ప్రచారం కొనసాగించింది.


ప్రియానాయక్

9 మంది సాయం ఒకరికి మేలు

'సింథటిక్ విగ్గులు త్వరగా పాడవుతాయి. వాటివల్ల చర్మ సంబంధ ఇబ్బందులు వస్తాయి. అదే సహజమైన జుట్టుతో చేసిన విగ్గులు మన్నికగా ఉంటాయి. ఇందు కోసం ఎవరైనా సరే శిరోజాలు ఇవ్వొచ్చు. కాని 12 అంగుళాల కంటే ఎక్కువ పొడవు ఉన్నప్పుడే అవి ఉపయోగపడతాయి. 9 మంది ఇచ్చిన జుట్టుతో ఒక్క విగ్గు తయారవుతుంది. మా ప్రచారం ఒడిస్సాలో మాత్రమే కాదు జార్ఖండ్‌లో కూడా కొనసాగుతోంది. ఒక ఆరేళ్ల పాప మాకు శిరోజాలు ఇవ్వడం ఒక రికార్డు' అంటుంది హరిప్రియ నాయక్.

హెయిర్ డొనేషన్ ఒడిశా

'హెయిర్ డొనేషన్ ఒడిశా' పేరుతో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తుంది హరిప్రియ నాయక్. వాలెంటీర్లు పని చేసే వారిని ఆహ్వానిస్తుంది. ఇప్పటికి 150 మంది వాలెంటీర్లు ఆమెతోపాటు పని చేస్తున్నారు. శిరోజాలు దానం చేసే వారి నుంచి వాటిని సేకరించి హైదరాబాదులోని 'హైదరాబాద్ హెయిర్ డొనేషన్ ఫర్ కేన్సర్ పేషెంట్స్' సంస్థకు పంపుతారు. అది ఉచితంగా విగ్గులు తయారు చేసి ఇస్తుంది. వాటిని కేన్సర్ ఫైటర్స్‌కు అందజేస్తారు.

'నా జుట్టు తగినంత పెరిగిన ప్రతిసారీ నేను దానం చేస్తుంటాను. మీరు కూడా చేయండి. ఇది కూడా పుణ్యకార్యమే' అంటుంది హరిప్రియ నాయక్.

యూత్ పల్స్

J బ్యూటీకి జై కొడుతున్నారు!



చర్మం జిడ్డుగా లేకుండా ఉండడానికి ఏంచేయాలి? కంటి కింద నల్ల వలయాలను ఎలా తప్పించాలి? ఎండ నుంచి చర్మాన్ని ఎలా రక్షించుకోవాలి? చర్మం మెరవాలంటే ఏం చేయాలి? చర్మసంరక్షణ నుంచి సౌందర్యం వరకు సందేహాల సముద్రంలో ఈదులాడుతున్న యువతరానికి నిన్నా మొన్నటి వరకు 'కె-బ్యూటీ' లేదా కొరియన్ బ్యూటీ చుక్కానిగా కనిపించింది. అయితే ఇప్పుడు యూత్ దృష్టి జె-బ్యూటీ(జపనీస్ బ్యూటీ)పై మళ్లింది. ఇది జపాన్ బ్యూటీ బ్రాండ్‌ల మార్కెటింగ్ మాయాజాలమా? సహజమైన పరిణామమా? అనే చర్చను పక్కనపెడితే 'జె-బ్యూటీ'లోని సహజత్వాన్ని, వాబీ-సాబీ తత్వాన్ని యువతరం బాగా ఇష్టపడుతోంది...

మృదువైన చర్మం కోసం కలలు కనే యువతరానికి చిరపరిచితమైన ట్రెండ్ కె-బ్యూటీ(కొరియన్-బ్యూటీ) బ్యూటీ ఇండస్ట్రీపై భారీ ప్రభావాన్ని చూపించింది. మైండ్-బాగ్లింగ్ ప్రొడక్ట్స్, మల్టీ-స్టెప్ రొటీన్స్‌తో 'కె-బ్యూటీ' గ్లోబల్ సెన్సేషన్‌గా నిలిచింది. యువ ప్రపంచాన్ని అమితంగా ఆకట్టుకుంది.

తాజా విషయానికి వస్తే 'జె-బ్యూటీ' లేదా జపనీస్ బ్యూటీ యువతరం ఫేవరెట్‌గా మారింది. 'పవర్‌ఫుల్ సిస్టర్ ఆఫ్ కె-బ్యూటీ' గా పేరు తెచ్చుకున్న 'జె-బ్యూటీ' కె-బ్యూటీని అధిగమించేలా దూసుకుపోతోంది. ఇండియన్ ఇన్‌ఫ్లూయెన్సర్లతో కలిసి జపనీస్ బ్యూటీ బ్రాండ్‌లు కలిసి పనిచేయడం కూడా మన దేశంలో 'జె-బ్యూటీ' పాపులారిటీకి కారణం అయింది.

'జె-బ్యూటీ'కి ఎందుకు ఇంత పాపులారిటీ వచ్చింది... అనే విషయానికి వస్తే... నిపుణుల మాటల్లో చెప్పాలంటే...'జె-బ్యూటీ'లోని ప్రధాన ఆకర్షణ సింప్లిసిటీ, ఎఫెక్టివ్‌నెస్. 'ప్రివెన్షన్ రాదర్ దేన్ కరెక్షన్'

తత్వంతో కూడిన ఈ విధానం హ్యాపీగా, హెల్తీగా ఉండేలా చర్మ సంరక్షణతోపాటు పర్యావరణ ఒత్తిళ్ల నుంచి రక్షణకు ప్రాధాన్యత ఇస్తుంది, గ్రీన్ టీ, రైస్ బ్రాన్, సీవీడ్‌లాంటి పొటెంట్ ఇన్‌గ్రేడియెంట్స్ 'జె-బ్యూటీ'లో భాగం అయ్యాయి.

'ఘుమఘుమలతో కూడిన ఖరీదైన వంటకాల కంటే సాదాసీదా పప్పన్నం ఎంచుకోవడం లాంటిదే జె-బ్యూటీ. దీనిపై జపనీస్ తత్వం వాబీ-సాబీ ప్రభావం ఉంది. ఇంపర్‌ఫెక్షన్, సింప్లిసిటీ నుంచి అందాన్ని దర్శించడమే వాబీ -సాబీ తత్వం. జె-బ్యూటీ ప్రాథమికంగా రెండు విషయాలపై దృష్టి పెడుతుంది. వర్తమానంలో చర్మ సౌందర్యం. రెండోది భవిష్యత్తులో చర్మ సమస్యలు రాకుండా నివారించడం' అంటుంది ముంబైకి చెందిన డెర్మటాలజిస్ట్, కాస్మెటాలజిస్ట్ డాక్టర్ శిఖా షా.

జపనీస్ కల్చర్ అండ్ లైఫ్‌స్టైల్‌పై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెరగడం కూడా మన దేశంలో 'జె-బ్యూటీ'పై ఆసక్తి కలిగించే కారణాలలో ఒకటి.

'ఆరోగ్యకరమైన, ప్రకాశవంతమైన చర్మం కోసం 11-12 స్టెప్ స్కిన్‌కేర్ రొటిన్ అవసరం అనే అపోహను జె- బ్యూటీ బ్రేక్ చేసింది' అంటుంది డాక్టర్ మోనికా బాంబ్రూ.

'కె-బ్యూటీ'తో పోల్చితే 'జె-బ్యూటీ'ని ప్రత్యేకంగా ఉంచుతున్నదేమిటి? అనే విషయానికి వస్తే...

చర్మసంరక్షణ విషయంలో రెండిటికీ పేరు ఉన్నప్పటికీ వాటి విధానాలు, తత్వం వేరు. 'కె-బ్యూటీ' అనేది ఇన్నోవేషన్, ఎక్స్‌పెరిమెంటేషన్‌పై దృష్టి పెడుతుంది. మల్టీ-స్టెప్ రొటిన్స్, ట్రెండ్-డ్రివన్ ఫార్ములేషన్స్ ఉంటాయి. ఇక 'జె-బ్యూటీ' అనేది సింప్లిసిటీ, మినిమలిజం, సహజపదార్థాలపై దృష్టి పెడుతుంది.

'జె-బ్యూటీకి తిరుగులేదు' అని అంటుంది ముంబైకి చెందిన అద్విక శ్రీవాస్తవ. 'జె-బ్యూటీ'పై కొండంత ఇష్టం లోనూ ఆచితూచి ఆలోచించే వారు లేకపోలేదు. ఇందుకు ఉదాహరణ బెంగళూరుకు చెందిన చైత్ర.

'కె-బ్యూటీతో పోల్చితే జె-బ్యూటీ ఆసక్తికరంగా అనిపిస్తుంది. అలా అని వేలంవెర్రిగా జె-బ్యూటీ ప్రాడక్ట్స్ కొనాలనుకోవడం లేదు. జె-బ్యూటీ గురించి మరిన్ని విషయాలు తెలుసుకోవాలనుకుంటున్నాను' అంటుంది చైత్ర.

క్లీన్ బ్యూటీ ట్రెండ్

గతంలో పోల్చితే జపనీస్ బ్యూటీ కంపెనీలపై యువత ఆసక్తి పెరిగింది. దీనికి అనుగుణంగా మార్కెటింగ్ వ్యూహాలు మారుతున్నాయి...అంటుంది గ్లోబల్ డేటా రిపోర్ట్. 'కె-బ్యూటీ అనేది ట్రెండీ ఇన్‌గ్రేడియెంట్స్, ఆకర్షణీయమైన ప్యాకింగ్, క్విక్ రిజల్ట్‌కు ప్రాధాన్యత ఇస్తుంటే జె-బ్యూటీ ఇందుకు భిన్నంగా సహజమైన పదార్థాలతో శాశ్వత ప్రభావంపై దృష్టి పెడుతుంది' అంటున్నాడు 'గ్లోబల్ డేటా' కన్స్యూమర్ అనలిస్ట్ మణి భూషణ్ శుక్లా. 'సహజ' 'సేంద్రియ' 'అలెర్జీరహిత' మాటలతో 'జె-బ్యూటీ' 'క్లీన్ బ్యూటీ' ట్రెండ్‌గా పేరు తెచ్చుకుంది.